

మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.11.2025
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



అన్నుల మిన్న


# మిసిమి

చింతనాత్మక సారస్వతం





మాసపత్రిక, డిసెంబర్, 2025 ₹ 50/-

ISSN 2454–4329



నెమలి చెలి



డూయోమో మిలన్ చర్చిలో

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 36 సంచిక 12

డిసెంబర్ - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

Published by

BAPANNA ALAPATI

1-1-60/5, R.T.C. 'X' Roads,
Hyderabad - 500 020.
Ph. 040-27645536.

Editor: V. ASWINI KUMAR
Ph: 994 951 6567

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

LCCN 91-903060

PEER REVIEWED

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com
YouTube Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## డిసెంబర్ నెల సూచికలు...




ది మడోన్నా ఆఫ్ ది రోజరీ



బంకిమ్ చంద్ర ఛటర్జీ


**మిసిమి** డైరీ : ఎ.కె. / సి.ఎస్. ఆర్. ... 3
వందేమాతరం మార్మిక శక్తి : ప్రొ. వై. పార్థసారధి ... 5
జీవన మకరందం : డా. కంఠంనేని రవీంద్ర రావు ... 10
ఆనందం : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 11
సీమ భారతం : యన్. విజయరాఘవ రెడ్డి ... 17
దేశ దేశాల్లో క్రిస్మస్ : టి.వి. ప్రసాద్ ... 21
దేవులపల్లి రామానుజరావు : డా.జి. వెంకట లక్ష్మి ... 26
లుంబిని : ఆలూరి ఉషారాణి ... 30
చిరస్మరణీయం–నార్వే దేశం : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు...35
మనకాలపు కాళిదాసు : సి.యస్.రాంబాబు... 41
నాటకమే నిత్యానందం : బి.వి. అప్పారావు ... 42
నిశ్శబ్ద మరణం : బుక్కే ధనక నాయక్ ... 47
భర్తృహరి : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ...51
లలితసంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 52
ఇద్దరు గొప్పకథకుల కవిత్వం : ఎస్. హనుమంతరావు ... 55
అభ్యుదయ సాహిత్యవిమర్శకుడు : ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ... 58
దక్షిణాపథాన నాయకరాజుల ప్రస్థానం : డా. సగిలి సుధారాణి ... 62
జీవకోటి మనుగడకు మూలాధారం : ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు ... 64
సాహిత్యంలో మృత్యుఘంటికలు : ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి ... 69
బిహారీలాల్ విహంగావలోకనం : కోడూరి పుల్లారెడ్డి ... 71
బోంబే జర్నల్ : అశ్వినీకుమార్ ... 74
అహింస : దాదా హయత్ : రాజా ... 76
పంచవటి : సి.యస్.ఆర్. ... 77
చదవండి : **మిసిమి** ... 78



### అట్టమీది బొమ్మలు




వెన్నెల బొమ్మ



నెమలి చెలి



దూయెా మిలన్ చర్చిలో



అన్నుల మిన్న

## తెలుగు రచయితలను ఏకం చేసేలా సాహిత్య ఉత్సవాలుండాలి

*తెలుగు సాహిత్యం విచిత్రమైనది. సాహిత్యం ఇక్కడ వర్గ ప్రతినిధిగా మారిపోయింది. ఒక వర్గం వారికి మరో వర్గం వారంటే పడనట్టే సాహిత్యంలో కూడా ఎవరి దుకాణం వారిది అన్నట్టు! ప్రతి భాషలోనూ ఉంటుందేమో, ఏమో? తెలుగులో మాత్రం ఇది ప్రస్ఫుటం. ఇక్కడ పద్య కవులకు, వచన కవులకు మధ్య గోడలు కట్టేశారు. వాద వివాదాలే ప్రచారంగా సాగుతున్న నేటి రచనాసరళి రచయితలను దూరం చేసింది. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే ఇలా పాయలు పాయలుగా ప్రవహిస్తున్న తెలుగు సాహిత్యంలో అక్టోబరు 25న ఒక ఉత్సవం జరిగింది. అది ఛాయా రిసోర్స్ సెంటర్ వారు నిర్వహించిన ఛాయా సాహిత్య ఉత్సవం లేదా ఛాయా లిటరరీ ఫెస్టివల్. మనకు కొద్ది సంవత్సరాలుగా జనవరి మాసంలో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ జరుగుతోంది కానీ, దాని నిర్దేశిత లక్ష్యాలు వేరు. హాజరయ్యే సాహిత్య జీవులు వేరు. అదే అక్టోబర్ 25న జరిగిన ఛాయా వారి సాహిత్యోత్సవానికీ స్ఫూర్తి, ప్రేరణ గత రెండు సంవత్సరాలుగా బెంగుళూరులో జరుగుతున్న బుక్ బ్రహ్మ ఫెస్టివల్. అక్కడకు వెళ్లిన సంపాదక, పాత్రికేయ మిత్రులు డా. కె.శ్రీనివాస్ **మిసిమి**కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అలాంటి ఫెస్టివల్ ఇక్కడ కూడా జరగాలని ఆకాంక్షించారు. మొత్తానికి ఆయన కోరుకున్నట్టు ఒకరోజు పండుగ నిర్వహించారు. ఆయనే ఈ ఫెస్టివల్‌కు డైరెక్టర్ కూడా. ఎవరిని పిలవాలి, ఏఏ అంశాలు చేర్చాలి అనే వాటికి ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కార్యక్రమం ఫైనలైజ్ చేసింది, కృష్ణమోహన్ సారథ్యంలో – అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వేదికగా మారింది. అది విశాలమైన కేంపస్ కాబట్టి, నిర్దిష్టంగా ఎక్కడ ఈ సమావేశాలు జరుగుతున్నాయో గుర్తుల ద్వారా చూపిస్తే దారి వెతుక్కోవటం సులభమయ్యేది. ఇదెందుకు చెప్పాల్సి వచ్చిందంటే మేము అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి వెళ్ళినప్పుడు, వెతుక్కునేందుకు సమయం పట్టింది కాబట్టి.*

*ఒక పక్కన ఆవిష్కరణలు, ఇంకోపక్క ప్రసంగాలు, చర్చలు పెట్టుకున్నారు. ఎప్పుడు ఏది జరుగుతుందో ఒక షెడ్యూల్ అందరికీ ఇచ్చి ఉంటే బావుండేది. ఎలాగో మెయిల్ రిజిస్ట్రేషన్ పెట్టారు కాబట్టి, ముందే ఆ మెయిల్‌కు పంపించేస్తే సౌకర్యంగా ఉండేది. మేము చూసిన ఒక పుస్తక ఆవిష్కరణ – ఇది కురుమల వర్గం వారి చరిత్ర – పరిశోధక పుస్తకం – రచయిత – గైడ్ – వైస్‌ఛాన్స్‌లర్ చక్రపాణి అందరూ మాట్లాడారు – ఇలాంటివి మరిన్ని రావాలని! ప్రస్తుతం తెలుగు సాహిత్యంలోని పెద్దవారుగా పిలవబడేవారు ఇక్కడ కనిపించలేదు. తెలుగులో కొన్ని వెబ్ పత్రికలు కూడా వస్తున్నాయి. కొంతమంది అనుభవం ఉన్న సంపాదకులు ఉన్నారు. వారందరికీ కాస్త సమయం కల్పించి ఉంటే బావుండేది. మొదటి ఉత్సవం కాబట్టి ఇలాంటి లోటు పాట్లు ఉంటాయి. ఉదాహరణకు ఒకచోట తెలుగు నాటకంపై చర్చ జరుగుతోంది. ఆ సమన్వయకర్తకు, నాటక ప్రయోక్త దెంచనాల శ్రీనివాస్ గురించి అంతగా తెలియదు. ఒకరి గురించి చెప్పి మరొకటి గురించి చెప్పకపోతే ఎలా. అందుకని దెంచనాల శ్రీనివాస్ తన గురించి తానే చెప్పుకోవాల్సి వచ్చింది. ఆయన చెబుతుంటే సమన్వయకర్త అడ్డుపడటం ఆయన్నే కాదు, ప్రేక్షకులు కూడా ఇబ్బందికి గురయ్యారు. సమన్వయకర్తగా నాటక రంగానికి చెందిన వారిని పిలవటం అవసరమని నిర్వాహకులు తెలుసుకోవాలి! లోగిలి, ముంగిలి, కితాబ్, ముచ్చట (నాలుగు వేదికల ద్వారా ఆనాటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈసారి అందరికీ షెడ్యూలు ముందే అందేవిధంగా ఏర్పాటు చేస్తే బావుంటుంది. కథా రచయితలు ఉణుదుర్తి సుధాకర్, ఖదీర్ బాబు, కవి ప్రసాదమూర్తి వంటి వారనేకమంది ప్రసంగించారు. వారు మాట్లాడే సమయం చాలామందికి తెలియదు. మధ్యాహ్నం ఉందని వారు చెప్పినప్పుడు తెలిసింది. ఏ ఉత్సవం వలన అయినా ప్రయోజనం ఏమిటంటే, అశ్విని గారు ఎప్పుడూ చెప్తుంటారు పదిమంది పాతమిత్రులు, సహరచయితలు కలుసుకోగలం–అని! అనేకమంది ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా పుస్తకాలు కొనుక్కోగలిగారు. ఒకటి మాత్రం గుర్తించాల్సిందేమిటంటే కేవలం వామపక్ష భావజాలం, దళిత, మైనారిటీ*

వాదాలకు సంబంధించిన వారినే కాకుండా తెలుగు సాహిత్యంలో ఉన్నవారందరికీ భాగస్వామ్యం కల్పిస్తే మరింత అర్థవంతంగా ఇలాంటి సాహిత్య సంబరాలు, ఉత్సవాలు జరుగుతాయి. **మిసిమి** వంటి పత్రికలు సారస్వత, భాషా, చరిత్ర, సాహిత్యాలకు సేవ చేస్తున్నాయి. **పాలపిట్ట,** తెలంగాణ సాహిత్యంపై ఫోకస్ పెడుతుంది. **మనసు ఫౌండేషన్** వారు తెలుగు సాహిత్యాన్ని లక్షల పేజీలు స్కాన్ చేసి ఓపెన్ వెబ్‌సైట్‌లో పెడుతున్నారు. ప్రముఖుల సర్వసమగ్ర సాహిత్యాన్ని ప్రచురిస్తున్నారు – ఇలా అందరినీ కలుపుకుని సాగితే ఆ ఉత్సవాలకు మిగిలిన సాహిత్య సభలకు కొంత తేడా కనిపిస్తుంది. ఇది నిర్వాహకులు గమనిస్తే బావుంటుంది..

ఏమైనా మొదటి ఛాయా సాహిత్య ఉత్సవం ఒక చక్కని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించింది. (వాతావరణం కూడా ఒక కారణం) మొదటి ప్రయత్నం విజయవంతమైంది. దీన్ని రెండు రోజులకు విస్తరించి, ప్రాతినిధ్య పరిధి పెంచితే మరింతగా ప్రయోజనం నెరవేరుతుంది. బయట ఊళ్ళనుంచి కూడా చాలామంది కవులు, రచయితలు వచ్చి ఛాయా సాహితీ ఉత్సవాన్ని విజయవంతం చేయటం విశేషం.

– – – –

**ఆ**రోజు ఛాయా చిత్రానికి – అదేనండి సాహిత్య ఉత్సవానికి వెళ్లాము కదా! – అక్కడ చాలామంది – మిత్రులు – సాహిత్య జీవులు కలిసి కుశలమాడుకున్నాము. చివరికి వాన చినుకులా రాలి – వరదలా మారింది – సుబ్రహ్మణ్య–సుధారాణి గార్లు వద్దన్నా వినకుండా మమ్మల్ని – ఆశ్రమంలో దింపి – దారిలో బోల్డు కబుర్లు చెప్పుకున్నాం – అయిష్టంగానే వెళ్లారు. ఆ తర్వాత అశ్విని గారు క్యాబ్ బుక్ చేశారు. వచ్చేది చౌదరి గారు – జాగ్రత్తగా మాట్లాడండి అని నవ్వుతూ చెప్పి సాగనంపారు – అదీ సంగతి.

**క్యాబ్ కథలు**

**ఒ**క వర్షం వేళ మధ్యాహ్నం పూట కొండాపూర్ సి.ఆర్.ఫౌండేషన్ నుంచి కొల్లూరు రావటం కోసం ర్యాపిడో క్యాబ్‌లో వస్తున్నాను.. వర్షం జోరుగా పడుతోంది. మా వాహన చోదకుల పేరు శ్రీనివాస చౌదరి.. యధావిధిగా పలకరించాను.. భాష చూస్తే హైదరాబాద్ యాస కనిపిస్తోంది. పూర్వీకులు విజయవాడ వారనిపించి అదే విషయం అడిగాను.. కాదు సర్ .. మాది ఒంగోలు.. నేనిక్కడే పెరిగానని చెప్పాడాయన. మీరు ఇలా క్యాబ్ నడపటం పైనే పూర్తిగా ఆధారపడ్డారా అని ఓ అసంబద్ధ ప్రశ్న వేశాను. మిత్రుడు దిమ్మతిరిగే సమాధానం చెప్పాడు.ఆ సమాధానంలో రెండు టిప్పర్లు, మూడు కార్లు నడుపుతున్నాడని తెలిసింది. ఈ కారు తానే వాడుకుంటాడని అవసరాన్ని బట్టి క్యాబ్‌గా మార్చుకుంటాడని తెలిసింది. చిన్నప్పటినుంచి మోటార్ రంగమే అంటే అర్థం ఇదని తెలుసుకోలేక పోయాను.

కొన్నాళ్ళు ఓల్వో బస్ నడిపానని తెలియచేశాడు ఆ మిత్రుడు.. పనిలో పనిగా కర్నూలు సమీపంలో జరిగిన వోల్వో స్లీపర్ బస్ ప్రమాదం అతనే ప్రస్తావించాడు.. అతను చెప్పిన అంశంలో ఒకటేమిటంటే వోల్వో కంపెనీ వాళ్ళు సేఫ్టీ గురించి చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. డ్రైవర్‌కు మూడు నెలలపాటు శిక్షణ ఇస్తారనేది ఒక విషయమైతే.. మరొకవిషయం. వోల్వో బస్సు ఎమర్జెన్సీ బ్రేక్ వేస్తే ఎక్కడుంటే అక్కడే ఆగిపోతుంది అనేది ఆ రోజు ప్రమాదం జరిగినప్పుడు, ఆ డ్రైవర్ బస్సును ఆపి, ఒకసారి కిందికి దిగి చూసుంటే పరిస్థితి అర్థమయ్యేదని మిత్రుడు బాధపడుతూ చెప్పాడు.. అట్లా మూడొందల మీటర్ల పాటు బండిని నడిపించటం తప్పు, పాసింజర్ల సేఫ్టీ ఆలోచించాల్సింది అనేది అతని పాయింట్.. వెనక ఇంకో బస్ వస్తుందని అనుకుంటే పక్కకు బండి తీసి ఆపి ఉండాల్సిందనేది చౌదరి చెప్పిన మరో మాట.. ఒక్కోసారి దగ్గరకు వస్తే కానీ ఏమున్నది అనేది కనిపించదన్న మాట నిజమే అంటారాయన.

తను ఒకసారి ఓల్వో బస్ నడుపుతుంటే, ఒక బాతుల గుంపు అడ్డు వచ్చిందని, ఆపాలని చూస్తే వెనక మరో బస్ వస్తోందని, బ్రేక్ వేయటం కుదరలేదని..దానివలన కొన్ని బాతులు మరణించాయని.. కానీ వెనక బస్ వచ్చి గుద్దకుండా చూశాను అనేది మిత్రుడు చెప్పిన పాయింట్.. సరే ఇప్పుడు కర్నూలు బస్ ప్రమాదం కారణం తెలిసింది.. మరి ఆ డ్రైవర్‌కు సేఫ్టీ ట్రైనింగ్ అవ్వలేదా అని అనుమానం వస్తోంది.. మేము ఆ వర్షంలో, కొత్తపేట ఫ్లైఓవర్ అంటే ఏ.ఎమ్.బి థియేటర్ దగ్గరి ఫ్లైఓవర్ పక్కనుంచి వెళుతుంటే ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది వర్షం వలన.. సార్.. ఇక్కడ ఫ్లై ఓవర్ ఉన్నా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది.. ఎవరైనా అంత సన్నగా ఫ్లైఓవర్ వేస్తారా, అలాగే ఫ్లైఓవర్ వన్ వే గా వేస్తే ఎవరికి సర్ ఉపయోగం.. వేసేదేదో వెడల్పుగా వేసి టూ వే చేసుంటే అందరికీ లాభం కదా..వేసిన తర్వాత అన్నా మార్చే ప్రయత్నం చేసుండాల్సిందంటే ఆశ్చర్యంగా చూశాను.. కాసేపు టూవే గా నడిపిస్తారు..ఫ్లై ఓవర్ ఇరుకు గా ఉండటంతో పైన కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది అని అతనంటే నిజమే కదా అనిపించింది.

ఎప్పుడూ డ్రైవర్లు కష్టాల్లో ఉంటారని అనుకోవటం కాదు.. వాళ్ళకి సరైన ఆలోచనా ధోరణి కూడా ఉంటుందని మనంతెలుసుకోవాలని ఆ రోజు నేను తెలుసుకున్నాను .. క్యాబ్ దిగుతూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పి ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చి నా అజ్ఞానాన్ని వదుల్చుకున్నాను.

**- ఎ.కె / సి.యస్.ఆర్.**

# వందేమాతరం మార్మిక శక్తి

– ప్రొ. వై. పార్థసారధి



బంకిమ్‌చంద్ర ఛటర్జీ

ఆనందమఠం, బంకిమ్‌చంద్ర ఛటర్జీ ఆనాటి సామాజిక అవసరాల రీత్యా, అననుకూల కాల పరిస్థితులలో రాసిన సాహిత్య, రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక, కాలాతీత నవల. భారతదేశంలో మొఘల్ పాలన క్షీణించి, బ్రిటిష్ వారు పూర్తిగా అధికారంలోకి రాని నేపథ్యం. 1770లలో బెంగాల్‌లో ఏర్పడిన ఘోర కరువు, దాని తదనంతర పరిస్థితులు, ప్రజలలో ఉన్న నిరాశ, నిస్ప్రహలు, సన్యాసుల తిరుగుబాట్లు, పోరాటాల పూర్వరంగంలో ఉద్భవించిన ఒక చారిత్రక, ప్రతీకాత్మక కథనం.

- నిమ్న కులాల వారు, అడవిలో నివసించేవారు కుక్కలు, ఎలుకలు, పిల్లులను తినడం ప్రారంభించారు. తెలియని ప్రదేశాలకు పారిపోయిన వారు ఆకలితో అక్కడే చనిపోగా, పారిపోని వారు తినరానిది తిని లేదా ఏమీ తినక చావు బారిన పడ్డారు.
- జనం బాధపడుతున్నారు, కాని రాజు మాత్రం పన్నులు పూర్తిగా వసూలు చేశాడు. పన్ను చెల్లించ వలసి రావడంతో ప్రజలు ఒక్కపూటే భోజనం చేశారు. జనం ఆకలితో అలమటిస్తున్నప్పుడు కూడా, రాజు రెవెన్యూ అధికారి మహమ్మద్ రేజాఖాన్, తన ప్రాధాన్యత చూపాలని పన్నులను 10శాతం పెంచాడు. ఫలితంగా బెంగాల్ అంతా దుఃఖంతో, ఆక్రోశాలతో నిండిపోయింది.
- ఈ కరువు కారణంగా దాదాపు 1 కోటి మంది మరణించినట్లు అంచనా. అంటే అప్పటి బెంగాల్ జనాభా 3 కోట్లలో ప్రతి ముగ్గురిలో ఒకరు మరణించినట్లు. అంత ప్రకృతి విపత్తు జరిగినా పాలనలో ఉన్న రాజు, పరిపాలకులుగా వున్న ఈస్టిండియా కంపెనీ కరువు ముందు ఎంత పన్ను వసూలు చేసిందో ఆ ఏడాది కూడా అంతే వసూలు చేసింది.
- బెంగాల్ ప్రజలు సిరాజ్–ఉద్–దౌలాను ఇష్టపడ్డారు, కాని అతని మంత్రి మీర్ జాఫర్‌ను ద్వేషించారు. మీర్‌జాఫర్ తన రాజుకు ద్రోహం చేసి, రాబర్ట్ క్లైవ్‌తో కలసి రాజును ఓడించాడు. క్లైవ్ సిరాజ్–ఉద్–దౌలాను ఓడించింది మీర్ జాఫర్ ద్రోహం వల్లనే అనే విషయం చరిత్రలో నిక్షిప్తమై వున్న సత్యం.
- మీర్ జాఫర్ దుర్వినియోగ పాలనకు, అతనితో కలసి ఈస్టిండియా అధికారులు వారన్ హేస్టింగ్స్ – అతని సైన్యాధికారి థామస్‌కు వ్యతిరేకంగా, సన్యాసులంతా ఆనందమఠంలో ఒక సంఘంగా ఏర్పడి, బ్రిటిష్ వ్యాపారులను దోచుకుని ఆయుధాలు సేకరించి తిరుగుబాటు చేస్తారు.
- అక్కడి బెంగాలి వీరులు అసాధారణ శక్తియుక్తులు కలిగిన వారు కాదు. ఓడించబడలేని వారు కాదు. నిజానికి ఆనందమఠంలో సన్యాసుల విజయం ఎక్కువ కాలం నిలువదు. కొద్దికాలంలోనే ఆంగ్లేయులు వారిపై దాడి చేసి వారి భూమిని ఆక్రమించుకుంటారు. ఇదీ మొత్తంగా కథ.

చరిత్రలో అనేక గ్రంథాలు, నవలలు శతాబ్దాలుగా గుర్తించబడి మెప్పు పొంది, ప్రజల జీవన స్రవంతిలో నిరంతరరాయంగా కొనసాగుతున్నాయి. కాని బంకిమ్‌చంద్ర ఛటర్జీ ఆనందమఠం ఎంతగా ప్రాచుర్యం పొందిందో, అంతగా చర్చించబడింది, విమర్శించబడింది, వ్యతిరేకించ బడింది కూడా. ఇందుకు ఒక ప్రధాన కారణం అందులోని వందేమాతరం గేయం.

### వందేమాతరం

కొన్ని పద బంధాలకు మాయాజాల శక్తి ఉన్నట్లు అనిపిస్తుంది. కొన్ని గీతాలు అనిర్వచనీయ ఆనందాన్ని, ఉత్తేజాన్ని కలిగిస్తాయి. బంకిమ్‌చంద్ర ఛటర్జీ వందేమాతరంలోని

'సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్య శ్యామలం మాతరం' అయినా, ఇక్బాల్

*'సారే జహా సే అచ్ఛా హిందుస్తాన్ హమారా,*
*హమ్ బుల్ బులేన్ హై ఇస్‌కి యే గులిస్తాన్ హమారా!'*

వీటి శబ్దాలు హృదయాన్ని తట్టి లేపి దేశభక్తి భావాన్ని నింపుతాయి. భారతీయ సమాజంలోని కొందరిలో బంకిమ్ ఒక సంప్రదాయ నిబద్ధత కల హిందువై, ముస్లింలను ద్వేషించే హిందూమతవాదుల సంఘానికి నాయకత్వం వహించే విధంగా *ఆనందమఠం* నవలను, వందేమాతర గీతాన్ని రచించాడనే భావన ఉంది. ఆయనను విమర్శించే వారికి వివరణ ఇవ్వాలని కాక, బంకిమ్‌చంద్ర ఛటర్జీకి సమాజం, మతంపై ఉన్న దృక్కోణాన్ని అర్థం చేసుకోకుండా *ఆనందమఠం* నవలలోని ఆయన సందేశాన్ని సరిగా అర్థం చేసుకోలేం.

తన రచనలలో బంకిమ్ ఇస్లాంను గౌరవంతో ప్రస్థావించాడు. రాజసింహ నవలలో వ్యక్తీకరించిన భావం.

- హిందువుగా ఉండడం అంటే మంచి మనిషిగా ఉండడమని, ముస్లింగా ఉండడం చెడు మనిషి అనే భావన తప్పు. ఇరు సమాజాల్లో మంచి, చెడు వ్యక్తులు వుంటారు. ఎవరైనా తమ గుణాలతో పాటు ధర్మాన్ని కలిగి వుంటే వాడు గొప్పవాడు. అతను హిందువో, ముస్లిమో కానక్కరలేదు.

  నవాబు విఫల పాలనకు, బ్రిటిష్ అధికారుల దోపిడీలకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టిన సన్యాసులు ఉత్తేజంతో పాడుకున్న గీతం 'వందేమాతరం'.

**చారిత్రక నేపథ్యం**

ముర్షిదాబాద్‌కు చెందిన కిషన్ చంద్ భాగత్ చేసిన విశేష పరిశోధన ప్రకారం, బ్రిటిష్ అధికారులతో వివాదాల తరువాత బంకిమ్, లాల్‌గోలాలోని రావు జోగింద్ర నారాయణ్ వద్ద ఉన్న సమయంలో ఆనందమఠం రచనకు అంకురార్పణ జరిగింది. భాగత్ ప్రకారం *వందేమాతరం* గీతం తొలి పంక్తులను బంకిమ్, లాల్‌గోలా రాజకుటుంబ గురువు కాళిబ్రహ్మ భట్టాచార్య కుటుంబం వద్ద ఉన్న ఒక పుస్తకం నుండి తీసుకున్నారని భావిస్తున్నారు.

దేశమంతా సంచలనం సృష్టించబడిన మహదేవ్ బలవంత్ ఫడ్కే జీవితం ప్రేరణతో ఈ నవల వ్రాయబడిందని చిత్తరంజన్ బందోపాధ్యాయ తన పరిశోధనలో తెలిపారు. ఫడ్కే 1879లో అరణ్యంలోని గిరిజనులతో కూడిన ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసి, ఆయుధాలను సమకూర్చుకుని, విదేశీ పాలనకు వ్యతిరేకంగా, ఖజా ట్రెజరీపై దాడి చేయాలని ప్రయత్నించారు. బంకిమ్ *ఆనందమఠం* కోసం ది అనాల్స్ ఆఫ్ రూరల్ బెంగాల్ (1868) గ్రంథం నుండి సమాచారాన్ని సేకరించానని చెప్పుకున్నప్పటికి, నవలలో చారిత్రక వ్యక్తులు వాస్తవం అయినా, ఈ నవల చరిత్రను పూర్తిగా అనుసరించి రాసింది కాదు. బంకిమ్ తన రచనలలో అనేకసార్లు మరాఠాలు, రాజపుత్రులు, సిక్కులు వారి ధైర్య సాహసాలను ప్రశంసించాడు. ఆయన ప్రముఖ నవల దుర్గేష్ నందినిలో అక్బర్ కాలంనాటి పరిస్థితులు, మాన్‌సింగ్ కుమారుడైన జగజీత్ సింగ్‌ను పఠాను యువరాణి ఆయేషా కాపాడి, ఆరాధించడం వంటివి అనేక కథలలో గమనిస్తే, ఆయన ముస్లిం వ్యతిరేక రచనలు చేసినట్లు చెప్పలేము.

ఆయన చివరి మూడు నవలలు *ఆనందమఠం* (1882), *దేవీ చౌధురాణి* (1884), *సీతారాం* (1887) లలో ప్రధానంగా బెంగాలి పాత్రల శక్తిని, ధైర్యాన్ని చిత్రించాడు. సాధారణ బెంగాలీలలో దేశభక్తి, ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించడానికి అలాంటి పాత్రలను ప్రదర్శించడం ఉపయోగకరమని ఆయన విశ్వసించాడు.

*ఆనందమఠం* బంకిమ్ జీవిత చరిత్ర కాదు. ఒక కాల్పనిక నవల. శతాబ్దాలుగా, ముఖ్యంగా అరణ్య ప్రాంతాలు ఉన్న బెంగాల్‌లో కాళీ, దుర్గా దేవతలు ఎంతో ఆదరణ పొందినవారు. కథ అటవీ ప్రాంతాలలో సాగడం వలన సన్యాసులు తమ దేశానికి ప్రాతినిధ్యం చేసే దేవతగా దుర్గా స్వరూపాన్ని ఊహించుకున్నారు. వాస్తవానికి అడవి ప్రాంతాల్లో దేవి, దుర్గ ఆధ్వర్యంలో ఒక విప్లవ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనను తరువాత శ్రీ అరవిందో తన *భవాని మందిరం* గ్రంథంలో ప్రతిపాదించారు కూడా.

అసలు బంకిమ్ దుర్గా లేదా కాళి భక్తుడు కాదు. ఆయన సనాతన బ్రాహ్మణ సంప్రదాయం నుండి విడివడి గౌడీయ వైష్ణవం వైపు, ప్రత్యేకించి కృష్ణ భక్తుడిగా మారాడు. ఉపనిషత్తులలోని సాంఖ్య దర్శనాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి. బెంగాల్‌లోని *తంత్ర* ప్రభావాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. ఆనందమఠంలోని దుర్గ, కాళి దేవతలు కేవలం హింసాయుత, రక్తసిక్త ఆరాధన కోరుకునే దేవతలు

మాత్రమే కాక, మరోవైపు తల్లి ప్రేమకు ప్రతిరూపాలు. అందుకే నవలలోని పాత్రలు కాళీమాతను తల్లిగా, దేశమాతగా ఊహించుకున్నాయి. బంకిమ్ హిందూ సైనికత్వాన్ని ప్రోత్సహించాలని ఆనందమఠం రాస్తే, కథను సన్యాసుల విజయంతో ముగించేవాడు, కాని ఆయన అలా చేయలేదు. సన్యాసుల విజయం తర్వాత ఒక ఆలోచింప జేసే ముగింపును జోడించాడు.

**వందేమాతర గీతం రాజకీయ ప్రయాణం**

ఆనందమఠం నవలలో 1882లో రాయబడిన వందేమాతరం, బంకిమ్ మరణించిన తరువాత మొదటి సారిగా రవీంద్రనాథ్ ఠాగూర్‌తో స్వరపరచబడి 1896లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఠాగూర్ ద్వారా ఆలపించబడింది. తదనంతరం 1905 బెంగాల్ విభజన కాలంలో అపారమైన ప్రజాదరణ పొందింది. ముస్లింలీగ్, హిందూ మహాసభ ఏర్పడడంతో, సామాజిక విభజన పెరిగిన కొద్దీ, ఈ గీతం వివాదాలలోకి లాగబడింది. అపుడు మహాత్మాగాంధి తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు.

*"చిన్నప్పుడు, నాకు ఆనందమఠం గాని, దాని అమర రచయిత బంకిమ్ గాని తెలియదు. వందేమాతరం నా హృదయాన్ని కట్టిపడేసింది. నా అంతరాళాన్ని కదిలించింది. స్వచ్ఛమైన జాతీయ భావానికి ప్రతీకగా నిలచింది. ఇపుడు కాలం చీకటిలోకి జారిపోయింది. మిశ్రమ సమూహంలో వందేమాతరం పాడాలా వద్దా అనే విషయంపై గొడవకు నేను సిద్ధంగా లేను".*

1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ఒక ఉప సంఘాన్ని మౌలానా ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, ఆచార్య నరేంద్రదేవ్‌లతో ఏర్పాటు చేసింది. వీరు రవీంద్రనాథ్ ఠాగూర్‌తో సంప్రదించి, వందేమాతరంను జాతీయ గీతంగా చేయడానికి ఇది అనుకూలమా కాదా అనే ప్రశ్నను పరిశీలించారు.

ఠాగూర్ తన అభిప్రాయాన్ని నెహ్రూకు రాసిన లేఖలో ఇలా వ్యక్తపరచాడు.

*"వందేమాతరం పాట మొదటి భాగంలో కనిపించే మృదుత్వం, భక్తి, మన తల్లి భూమి సౌందర్యం, కరుణామయతను ప్రశంసించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. అందువలన, నేను ఆ మొదటి భాగాన్ని మిగతా కవితా భాగాల నుండి, అలాగే అది ఉన్న నవలలోని భావాల నుండి వేరు చేయడంలో ఎలాంటి ఇబ్బంది అనిపించలేదు. నా తండ్రి నేర్పిన ఏక దైవ సిద్ధాంతాల ప్రభావంతో, మిగిలిన భావాలతో నేను ఏకీభవించలేక పోయాను". ఠాగూర్ అభిప్రాయం ప్రకారం ఉపసంఘం ఈ తీర్మానం చేసింది.*

''జాతీయ సమావేశాలలో వందేమాతరం పాడినప్పుడు కేవలం మొదటి రెండు చరణాలనే పాడాలి. నిర్వాహకులకు, దీని స్థానంలో లేదా దీని తర్వాత అనుచితం కాని ఇతర పాటను పాడే స్వేచ్ఛా ఉండాలి".

ఫలితంగా వందేమాతరంకు జాతీయ పాట హోదా ఇవ్వబడింది గాని జాతీయగానంగా గుర్తింపు ఇవ్వబడలేదు. బెంగాల్‌కు చెందిన ముస్లిం పండితుడు రెజీల్ కరీమ్ బంకిమ్ చంద్రుడి వందేమాతరంను బలంగా సమర్థించాడు. 1937లోని ఈ వివాదం ముస్లింలను స్వాతంత్ర్య ఉద్యమం నుండి దూరం చేయడానికి జరిగిన రాజకీయ కుట్ర అని, సాహిత్యాన్ని రాజకీయ తగాదాలలోకి లాగడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డాడు. ఈ గీతాన్ని సరైన భావంతో స్వీకరిస్తే, నిశ్శబ్దులకు మాటను, భయపడే వారికి ధైర్యాన్ని ఇస్తుంది, కాబట్టి దీనిని విస్తృత మనసుతో అంగీకరించడం తెలివైన నిర్ణయం అని ప్రకటించాడు.

**బ్రిటిష్ అనుకూల ధోరణి - పూర్వాపరాలు**

ఆనందమఠం నవల ముగింపులో బ్రిటిష్ అనుకూల ధోరణి, బ్రిటిష్ వారిని అంగీకరించవలసిన అవసరాన్ని చెప్పిన పద్ధతి కొంత విమర్శలకు, గందరగోళానికి దారితీసిందనడంలో సందేహం లేదు. నవల చివరి అధ్యాయంలో వైద్యుడు సత్యానంద్‌కు చేసిన హితబోధ.

"నిరుత్సాహ పడవద్దు. జరుగుతున్నది శ్రేయస్కరం. ఆర్యధర్మ పునరుద్ధరణకు, మొదట ఈ దేశాన్ని ఇంగ్లీష్ వారు పాలించాలి. ఆర్యధర్మం అంటే మూడు కోట్ల దేవతల పూజ కాదు. నిజమైన హిందూ ధర్మం జ్ఞానం మీద ఆధారపడి వుంటుంది, కర్మకాండలపై కాదు. జ్ఞానం రెండు రకాలు – బాహ్యజ్ఞానం (విజ్ఞానం) అంతఃజ్ఞానం. అంతః జ్ఞానం పెరగాలంటే ముందు బాహ్యజ్ఞానం పెరగాలి. మనం ఆ జ్ఞానాన్ని కోల్పోవడంతో ఆర్య ధర్మం నశించింది. ఇప్పుడు ఆ జ్ఞానాన్ని విదేశాల నుండి నేర్చుకోవాలి. ఇంగ్లీష్ వారు ఆ జ్ఞానంలో నిపుణులు. కాబట్టి వారిని అంగీకరించాలి. వారి విద్య మనకు విజ్ఞానాన్ని ఇస్తుంది. అది మన ఆత్మజ్ఞానానికి దారి తీస్తుంది. ఆర్య ధర్మానికి వున్న అడ్డంకులు తొలగిపోతాయి. హిందువులు మళ్ళీ జ్ఞానం, నీతి, శక్తిలో

గొప్పవారు అయ్యేవరకు బ్రిటన్ పాలన నిలుస్తుంది. కాబట్టి యుద్ధం చేయడం కాక, జ్ఞాన మార్గాన్ని ఎంచుకో!"

ఈ వాక్యాలు అప్పటి చదువుకున్న హిందువుల ఆధునిక, ప్రగతిశీల దృక్కోణాన్ని ప్రతిబింబిస్తాయి. పాశ్చాత్య విజ్ఞానాన్ని అంగీకరించి, సత్యాన్వేషణలో దానిని ఉపయోగించుకోవాలనే భావం మొత్తం నవలలో కూడా అంతర్లీనంగా కనిపిస్తుంది.

మరొక కోణం నుండి చూస్తే, బంకిమ్ బ్రిటీష్ పాలనలో పనిచేసిన మొదటి బెంగాలి డిప్యూటి మెజిస్ట్రేట్ అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుంటే, బంకిమ్ చైతన్య పూర్వకంగా కాని లేదా చైతన్య రహితంగా కాని బ్రిటిష్ వారిని అంగీకరించడం జరిగిందని చెప్పుకోవలసి వుంటుంది. బంకిమ్ బ్రిటిష్ పాలనలో 15 పైగా జిల్లాలు, ఉపవిభాగాలు, పట్టణాలలో పనిచేశారు. తన ఉద్యోగ జీవితంలో 1873-1882 మధ్య బ్రిటిష్ వారితో ఘర్షణలు పడ్డాడు. ఆనందమఠం విషయంలో కూడా సీనియర్ అధికారుల నుండి సమస్యలు వస్తాయని బంకిమ్ ముందే ఊహించాడు. ఆ సమస్యల నివారణకు బ్రహ్మ సమాజ సంస్కర్త కేశబ్ చంద్రసేన్‌ను సంప్రదించి, రెండవ ముద్రణకు ముందుమాట రాయమని బంకిమ్ కోరాడు. చివరకు కేశబ్ తమ్ముడు ముందుమాట రాయగా, కేశబ్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఆనందమఠం దేశభక్తి గ్రంథం తప్ప, అలజడి సృష్టించే గ్రంథం కాదని ఉత్తరం రాశాడు.

భారతదేశం ఒకవైపు సంప్రదాయ హిందువులు, మరోవైపు గుడ్డిగా పాశ్చాత్య సంస్కృతిని అనుకరించే సంస్కర్తల మధ్య విభేదం ఉందని గుర్తించిన బంకిమ్ ఈ రెండూ తప్పే అన్నాడు. భారతదేశం తన సంప్రదాయాల నుండి, అలాగే పాశ్చాత్య ఆలోచనలనుండి ఉత్తమమైన దానిని ఎంచుకుని తీసుకోవాలి. అందుకే ఆనందమఠం నవల, సామాజిక, సాంస్కృతిక పరిసరాల ప్రభావంతో సమకాలీనులలో తగ్గిపోతున్న సామూహిక భాగస్వామ్యతను పెంచడానికి, లొంగి ఉండే అధీనత నుండి విముక్తి కలిగించడానికి రూపొందబడిన చారిత్రక అంశాలపై నిర్మించిన కాల్పనిక గ్రంథం. ఏ రచనైనా, దాని వెనుకవున్న విస్తృత పరిస్థితుల సమూహాన్ని వాస్తవ దృష్టితో పరిశీలించినపుడే, ఆ రచనకు సంబంధించిన అదనపు అర్థాలను ఆకళింపు చేసుకోగలం.

**బంకిమ్ వ్యక్తిగత సంక్లిష్ట జీవితం**

బంకిమ్‌చంద్ర ఛటోపాధ్యాయ 1838 జూన్ 26న కోల్‌కతా సమీపంలోని కంతలపారా గ్రామంలో, యాదవచంద్ర, దుర్గాసుందరిల ముగ్గురు కుమారులలో రెండవ వానిగా జన్మించారు. విద్యాభ్యాసం ఆంగ్ల కాన్వెంట్‌లో, తదనంతరం కోల్‌కతా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ చదివిన తొలి ఇద్దరిలో ఒకరిగా నిలచారు. ప్రభుత్వంలో డిప్యూటి కలెక్టర్, డిప్యూటి మెజిస్ట్రేట్‌గా 33 సంవత్సరాలు సేవలందించి, అనేకసార్లు బ్రిటిష్ అధికారులతో సంఘర్షణలు పడి, 1891లో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి, 1894లో తన 56వ ఏట మరణించారు. ఆయనతో అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికి బ్రిటిష్ అధికారులు ఆయనలోని నిజాయితీని, నిబద్ధతను గుర్తించి, అనేక బిరుదులు ప్రదానం చేశారు.

అప్పటికి ప్రబలంగా వున్న బాల్యవివాహ పద్ధతిలో, 11 ఏళ్ల వయస్సులో 5 సంవత్సరాల బాలికను వివాహం చేసుకున్నప్పటికి, భార్య చిన్న వయస్సులోనే మరణించడంతో రాజ్యలక్ష్మీదేవితో రెండవ వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు జన్మించగా, చిన్న కుమార్తె వివాహానంతరం ఆత్మహత్య చేసుకోవడం బంకిమ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కొన్ని వ్యక్తిగత లేఖలలో పెద్ద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం చాలా ఇబ్బందిగా ఉండేదని రాసుకున్నారు.

బంకిమ్ అత్యుత్తమ నవలా రచయిత, కవి మాత్రమే కాక తన కాలపు ప్రముఖ మేధావులలో అగ్రస్థానాన వున్నారు. అనేక పత్రికలలో రాజకీయాలు, ఆర్థికశాస్త్రం, సమాజశాస్త్రం, మతం, తత్త్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రంపై ఆలోచనాత్మక వ్యాసాలు రాయడంతో పాటు, చాలా పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఆయన రచనాశైలి గాఢంగా ఉన్నప్పటికి, సులువుగా అర్థమవుతుంది. ఒకవైపు తీవ్ర భావాలను తెలుపుతూనే, మరోవైపు అపరాధ పరిశోధనా కథలు, చందమామ వంటి కథల సంఘటనలు కొనసాగడం ఆశ్చర్యకరంగా వుంటుంది. ప్రతి నవల ఒక సామాజిక అంశాన్ని, సాంస్కృతిక చారిత్రక పరిస్థితుల నేపథ్యంలో వివరణాత్మకంగా బెంగాలి సంస్కృతిని ప్రతిబింబిస్తూ కొనసాగుతుంది. అందుకే ఆయనను సాహిత్య సామ్రాట్‌గా పిలుస్తారు.

*దుర్గేశ్‌నందిని, కపాల కుండల, ఇందిర, మంజుల, సీతారామ్, మృణాళిని, రాజసింహ, దేవి చౌధురాణి* వంటి పదహారు నవలలు ఆయన కలం నుండి వెలువడ్డాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క సాహిత్య ఆణిముత్యం. రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన తొలి నవల *బౌఠాకు రాణిర్ హాట్*‌కు బంకిం ప్రశంసా పత్రాన్ని పంపారు. సత్యం, అసత్యం అన్న భారతీయ భావనలను ఆంగ్లంలోకి కూర్చి అర్థం చేసుకోవడం మన సృజనాత్మకతకు, పురోగతికి అడ్డంకి అని వివరిస్తూ – భారతీయ ప్రాచీన భావనలో సత్యం అంటే కేవలం నిజం కాదు; తన మాటను నిలబెట్టుకోవడం; వాగ్దానాన్ని పాటించడం కూడా సత్యంలో భాగమే – అని ఠాగూర్‌కు వివరించిన పద్ధతి ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. అందుకు బంకిమ్ మహాభారతంలోని కృష్ణ–అర్జున–ధర్మరాజ సంవాదాన్ని ముందుకు తెస్తాడు.

భారతీయ మేధోమార్పు ప్రక్రియలో బెంగాలి సాహిత్యం అగ్రభాగాన నిలుస్తుంది. నవల, నాటకం, గేయం మొదలైన విశ్వసాహిత్యం బెంగాల్ గడ్డపై ఆధునిక ధోరణులతో ఉద్భవించింది. ఈ మొత్తంలో బెంగాల్‌కే కాక దేశం మొత్తానికి బంకిమ్ రచనలు ప్రేరణలు కలిగించాయి. అందుకే సుదిప్తా కవిరాజ్ భారతీయ మేధోమార్పు ప్రక్రియలో బంకిమ్ బాబును కేంద్రస్థానంలో ఉంచి, ఆయనను స్థిరమైన సంప్రదాయ వాదిగా కాక, ఆధునిక భారతీయ ఆలోచనలకు సృజనాత్మకమైన, అంతర్గత సంఘర్షణ కలిగిన చురుకైన, మతపర, జాతీయ వాది అని ప్రకటించారు. బంకిం అంటే బెంగాలీలో వంగిన వాడు అని అర్థం. ఆయన శరీరం కొంచెం వంగి వుండడానికి కారణం ఏమంటే, ఆయన శ్రీరామకృష్ణ పరమహంసతో నవ్వుతూ, సరదాగా, బ్రిటిష్ అధికారులు వారి బూట్లతో తన్నుకుంటూ వంగదీశారని జవాబు చెప్పారు. నిజమే ఆయన మరణించిన తరువాత గానం చేయబడిన వందేమాతరం వల్ల కూడా ఆయనను వంచే ప్రయత్నాలు ఎన్ని చేసినా, ఆ గీతం ప్రజల జీవనంలో, సంస్కృతిలో, ఆలోచనలలోకి ప్రవహించి వందేమాతరం, మనదే రాజ్యం అంటూ కోటి కోటి గొంతుకులతో మార్మోగి స్వరాజ్యం సాధించి, జాతీయ పాటగా కొనసాగుతోంది. ఆనందమఠంలోని ఆ గేయం...

మేము సంతానం – ఎవరి సంతానం?
మాత సంతానం.
మాకు దేశం తప్ప ఇంకొక తల్లి తెలియదు.
మా మాత జన్మభూమి.
మాకు మరొక తల్లి, తండ్రి, భార్య పిల్లలు లేరు.
ఇల్లు, వాకిలి లేదు. మాకు సర్వమూ దేశమాతే!
సుజల, సుఫల మలయజ శీతల
సస్యశ్యామల అయిన మాతే మాకు సర్వస్వం.

**వందేమాతరం... వందేమాతరం**
**సుజలాం సుఫలాం మలయజ శీతలాం**
**సస్య శ్యామలాం మాతరం ॥వందేమాతరం॥**

**శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం**
**పుల్లకుసుమితద్రుమదళశోభినీం**
**సుహాసినీం సుమధుర భాషిణీం**
**సుఖదాం, వరదాం మాతరం ॥వందేమాతరం॥**

**సప్తకోటి కంఠ కలకల నినాద కరాళే,**
**ద్విసప్తకోటి భుజైర్ధృత ఖర కరవాలే,**
**అబలా కేనో మా! ఏతో బలే!**
**బహుబల ధారిణీం నమామి తారిణీం,**
**రిపుదళ వారిణీం మాతరం! ॥వందేమాతరం॥**

**తుమీ విద్యా, తుమీ ధర్మ**
**తుమీ హృదీ, తుమీ మర్మ,**
**త్వం హి ప్రాణాః శరీరే!**
**బహుతే తుమీ మాం శక్తి**
**హృదయే తుమీ మాం భక్తి**
**తోమారయి ప్రాప్తి మాగఢం మందిరే మందిరే!**
**త్వహిం దుర్గా దశప్రహర ధారిణీమ్**
**కమల కమల దళ విహారిణీమ్**
**వాణీ విద్యాదాయిని నమామి త్వాం**
**నమామి కమలాం అమలాం అతులాం**
**సుజలాం సుఫలాం మాతరం ॥వందేమాతరం॥**


**వందేమాతరం.. వందేమాతరం..**
**శ్యామలాం సరళాం సుస్మితాం భాషిణీం**
**ధరణీం భరణీం మాతరమ్ ॥ ॥వందేమాతరం॥**

*'ఒక పుస్తకానికి నిజమైన పరీక్ష ఏమంటే, అది సమకాలీనుల చప్పట్ల రూపంలో కాక – దానిలోని సత్యం, భావం మనిషి హృదయాలను తాకి – రచయిత మరణించిన తరువాత కూడా జన జీవనంలో కొనసాగగలగడమే'* – నెహ్రూ.

**ప్రొఫెసర్ వై. పార్థసారథి**
ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 9000438090

# జీవన మకరందం

- నీవు తలచుకుంటే – ఏ వనమైనా నీకు స్వర్గతుల్యమే.
- దుఃఖం వున్నచోటే – పవిత్రమైన ప్రదేశం!
- దుఃఖమే నీకు జ్ఞానోదయానికి మార్గం.
- సమాజాన్ని విమర్శించకు – అందులో భాగం కాలేనివాళ్లే – ఆపని చేస్తారు.
- ఏ వాదాలు – పిడివాదాలు – బ్రతుకంత గొప్పవి కావు.
- విద్యయే వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.
- సూర్యోదయంలో స్వర్ణం వున్నది.
- పూజింపబడడం కంటే ప్రేమించబడటం మేలు!
- వయసుతోపాటే స్నేహితులు మారుతుంటారు.
- నిన్ను నువ్వు నమ్మితే – ఏ కార్యాన్నయినా సాధించగలవు!
- పెద్దలు 'అనుభవం' అని చెప్పేది – వారు చేసిన తప్పులకు మారు పేరు!
- అసంతృప్తే – తిరుగుబాటుకు – అభ్యుదయానికి తొలి అడుగు.
- ప్రేమించకుండా వుండటం కంటే – ప్రేమించి విఫలమవటం మంచిది.
- మహానగరం – నీ దగ్గర ఎంత డబ్బుంది అని అడుగుతుంది.
  పట్టణం – నీకు పనిపాటలు వచ్చా అని అడుగుతుంది.
  పల్లె – నీ తల్లితండ్రులు ఎవరని ఆరాతీస్తుంది! (బాల్జాక్).
- యుద్ధమంటే – శాస్త్రజ్ఞుల మేధ – శ్రామికుల శ్రమ.
  ప్రజల సొమ్ము – ఇవన్నీ వృథా అయితేనే యుద్ధం జరుగుతుంది.
  ప్రాణ నష్టం మాత్రమే కనపడుతుంది.
- ప్రతి వ్యక్తి జీవితంలో కొంత శూన్యం ఏర్పడుతుంది.
  అక్కడే స్వప్నాలు నిర్మించబడతాయి. కలలు లేని నిద్ర – స్వప్నాలు లేని జీవితం వృథా.
- ఇప్పటి రచయితలు – తమకు తెలియని విషయాన్ని, తమకు లేని అనుభవాన్ని
  ఇతరులకు చెప్పాలని తాపత్రయపడుతున్నారు.
- అనేక వస్తువులను మనం పోగొట్టుకున్న తర్వాతే వాటి విలువను గుర్తిస్తాం.
- సంతానం కోసం కాకపోతే పెళ్లి మానుకో (గాంధి)
- ధనికులు ఇతరుల్ని అసహ్యించుకుంటారు.
  బుద్ధిమంతులు తమని తాము అసహ్యించుకుంటారు.



\- ఆస్కార్ వైల్డ్

**జ్ఞాపకాలం**
(డా. కంఠంనేని రవీంద్ర డైరీ)

# ఆనందం

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

"**అం**దమే ఆనందం, ఆనందమే జీవితమకరందం; ఆనందం, పరమానందం, బాలకృష్ణుని లీలలు గాంచిన భక్త కోటులకు బ్రహ్మానందం; ఆనందమానందమాయే, మది ఆశల నందనమాయే ". ఇవన్నీ తెలుగునాట బహుళ ప్రచారం పొందిన తెలుగు సినీగీతాలు. ఆ విధంగా మనలో ఎందరో ఆనందులు, పరమానందులు, బ్రహ్మానందులు, ఆత్మానందులు ఉన్నారు. పేరుతోపాటుగా జీవితంలో ఆనందం ఉన్నదా? ఉంటే ఏ రూపంలో ఉండి ఉంటుంది? అసలు 'ఆనందానికి' ఏమైనా అర్థం ఉన్నదా? ఆనందానికి మూలం లేదా మూలపదార్థం ఏది? దానిలో దశలు ఏమైనా ఉన్నాయా? స్వల్పానందం, బ్రహ్మానందం, ఆత్మానందం వంటివి ఏ విధంగా ఉంటాయి? వీటిని ఏ విధంగా నిర్వచించగలుగుతాము, అనుభవించ గలుగుతాము? ఆనందం ఎక్కడ పుట్టి, ఎక్కడ, ఎప్పుడు ఆవిరైపోతుంది? అసలు ఆనందానికి కొలమానం ఏదైనా ఉన్నదా? ఆనందానికి హద్దులు ఏమైనా ఉన్నాయా? వంటి ప్రశ్నలు, సందేహాలు, మానవులకు కలగడం సహజం. జీవం ఉన్న ప్రతి ప్రాణికి అనుభవంలోనికి వచ్చేవి బాధ లేదా సంతోషం; వీటినే సుఖదుఃఖాలుగా చెప్పుకోవచ్చు. సుఖం, సంతోషం, ఆనందం మొదలైన పదాలను ఇక్కడ సమాంతరంగా పరిగణించి ఉపయోగించడం జరిగింది. అటుపైన సంధించుకొన్న ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ క్రమంలో దిగువన పేర్కొన్న నాలుగు దృక్కోణాలను ప్రతిపాదించి, విపులంగా చర్చించే ప్రయత్నం చేయడం జరిగింది.

1. జీవశాస్త్రపరంగా (ఇందులో నాడీశాస్త్రం, నరాల శాస్త్రం, శరీర శాస్త్రం, వైద్య శాస్త్రం వంటివి అన్నీ కలిపి)
2. మానసిక శాస్త్ర పరంగా (ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం ఆధారంగా)
3. తత్త్వశాస్త్రం (తాత్త్విక ఆలోచనలు ఆధారంగా)
4. ఆధ్యాత్మిక సారస్వతం (ప్రవచనాలు, ప్రబోధాలు ఆధారంగా)

**జీవశాస్త్రం-ఆనందం :** మొదటగా ఆనందం యొక్క గుట్టుమట్టులను జీవశాస్త్ర పరంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తాను. మానవుని శారీరక నిర్మాణంలో అనేక అంశాలు అంతర్భాగంగా ఉన్నాయి. వీనిలో మెదడు, నరాలు, గుండె, జీర్ణవ్యవస్థ, నాడీవ్యవస్థ ముఖ్యమైనవి. ఇవన్నీ కూడా అంతర్గతంగాను, బహిర్గతంగాను ఏర్పడే ఉద్దీపనలకు ప్రతిస్పందిస్తాయి. ఈ ఉద్దీపన మానవుని భౌతిక, రసాయన ప్రక్రియలకు కారణభూతమవుతాయి. వీటికి మానవుని యొక్క అయిదు ఇంద్రియ అవయవాలు సాధనాలుగా ఉంటాయి. అవి : కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, మరియు చర్మము. వీటి ద్వారా మనిషి భౌతిక విషయాలను గమనంలోనికి తెచ్చుకొని, అనుభవిస్తాడు. వీటికితోడుగా ప్రోటీన్ల రూపంలో ఉండే అనేక గ్రాహకాలు ఈ ప్రకియను మరింత ఉద్దీపనం చేస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇవి మనిషిలో అంతర్గతంగాను, బహిర్గతం గాను ఏర్పడే ప్రక్రియలకు సెన్సార్ల మాదిరి వ్యవహరిస్తాయి. వీనితోపాటుగా నరాల చివరన ఉండే నోకిగ్రాహకాలు ఉద్దీపనలకు సంబంధించిన సంకేతాలను మెదడుకు అందిస్తుంటాయి. ఈ మొత్తంలో మెదడు పాత్ర కీలకమైనది. ఉద్దీపన అన్నది ఏ మూలం నుండి వచ్చినా దానిని వడపోసి ప్రతిస్పందన ఇంద్రియాల ద్వారా వ్యక్తమయ్యేటట్లు చేస్తుంది. జీవశాస్త్రం ప్రకారం మెదడులో గల అమిగ్దల, పల్లిడం, న్యూక్లియస్ ఎకుంబెన్స్, వివిధ రకాలైన కార్టెక్స్ వంటి భాగాలు ముఖ్యమైనవి. ఇవి మనిషికి సుఖ, దుఃఖాలను కలుగజేస్తాయి. పరిశోధనల ప్రకారం మెదడులోని కొన్ని భాగాలు సంతోషానికి, కొన్ని భాగాలు బాధకు ప్రతిస్పందిస్తాయి. అలాగని ఇది స్పష్టమైన విభజన రేఖ అనుకోరాదు. వాటి మధ్యన సంబంధ బాంధవ్యాలు ఉంటాయని పరిశోధకులు వెల్లడిచేసారు. ఈ సందర్భంలో మెదడులో అంతర్భాగంగా ఉండే 'డోపమైన్' యొక్క పాత్ర విశేషమైనది. ఇది నరాలకు, మెదడుకు మధ్యన ట్రాన్స్‌మీటర్‌గా పనిచేసి, మనిషి యొక్క ఉద్దీపనను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మానవునికి సంతోషాన్ని కలిగించడంలో ఇది ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆల్కహాల్, స్టెరాయిడ్స్ వంటివి తీసుకొన్న వారు ఈ డోపమైన్ ద్వారా ఉద్దీపన పొంది సంతోషాన్ని ప్రకటిస్తారు. వారి ప్రవర్తనలో కూడా మార్పు వస్తుంది. సమర్థత పెరుగుతుంది. అందుచేతనే ఆటగాళ్ళు అధిక సమర్థత కోసం డోపమైన్‌పై పనిచేసే కొన్ని రకాల మందులను వినియోగిస్తారు. అందుచేత వీటిని

నియంత్రించడం కోసంగాను 'డోపింగ్ పరీక్ష'లను నిర్వహించి అర్హతను నిర్ణయిస్తారు. ఈ రకమైన చర్యల ద్వారా ఏర్పడే దుష్పరిణామేమంటే, సదరు వ్యక్తి 'డోపమైన్'ను ప్రభావితం చేసే ఉత్పత్తులకు బానిసగా మారి, జీవితాన్ని కోల్పోవచ్చు. కాబట్టి ఈ మొత్తం ప్రక్రియపై జాగ్రత్త వహించాలి.

ఇక దుఃఖము, బాధ, వేదన, విషయానికి వస్తే మానవుని శరీరానికి ఏ గాయమైనా అది బాధ కలిగిస్తుంది. ఇంద్రియ అవయవాల లోపం వల్ల కూడా బాధ ఏర్పడుతుంది. అందుచేత వీరికి ప్రత్యేకమైన వసతుల కల్పన ద్వారా వేదనను తగ్గించే ఏర్పాటు చేయబడుతుంటుంది. క్రీస్తుపూర్వం 100 సంవత్సరాల క్రితం చైనాలో పుట్టిన 'అక్యుపంక్చర్' అనే వైద్యవిధానం శరీరంలో ఉన్న నాడీ మండల వ్యవస్థను సరిదిద్దడం ద్వారా 'రోగి యొక్క వేదన'ను తగ్గించే ప్రయత్నం చేస్తారు. సూదిని ఉపయోగించి రోగి యొక్క నాడీ వ్యవస్థను తాకుతారు. ఇది బాధను తగ్గించగలుగుతుందని నమ్మకం. ప్రస్తుతానికి ఇది ప్రధాన రోగ నిరోధక పద్ధతిగా అమలులో లేనప్పటికీ, ఒక ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతిగా కొనసాగుతున్నది. దీనితోపాటు నొప్పి నివారణా కేంద్రాలు అనేకమైన ఇతర పద్ధతులను అనుసరిస్తుంటాయి. వాటిలో ముఖ్యమైనవి : యోగా, మెడిటేషన్, ఫిజియోథెరపి, విద్యుత్త రంగాలను ఉపయోగించడం. ప్రకృతి వైద్యం ద్వారా పాటించే నొప్పి నివారణా మార్గాలు వేరుగా ఉంటాయి. కేరళ ఈ తరహా వైద్యశాలలకు పెట్టింది పేరు. ఈ పద్ధతులన్నీ కూడా మానవుని భౌతిక వేదన నుండి దూరం చేసే ప్రక్రియలుగా చెప్పవచ్చు.

**మనస్తత్వ శాస్త్రం–ఆనందం :** ధనాత్మకమైనటువంటి సంతోషం, ఆనందం; రుణాత్మకమైన బాధ, నిరాశ, నిస్పృహ వంటి ప్రేరణలు మానవుని యొక్క మానసిక స్థితి వలన ఏర్పడతాయని మనస్తత్వ లేదా మనోవిశ్లేషణ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. భౌతికంగా సక్రమంగా ఉన్నప్పటికినీ, కొద్ది మంది మానసికంగా వేదనను అనుభవిస్తుంటారు. ఈ విధమైన మనోక్లేశాన్ని పరిహరిస్తే తప్ప, ఆనందం సాధ్యం కాదు. ఈ శాస్త్రానికి ఆద్యుడైనటువంటి సిగ్మండ్ ఫ్రాయిడ్ యొక్క ప్రతిపాదనల ప్రకారం మానవుని యొక్క మెదడు మూడు భాగాలుగా ఉంటుంది. అవి : ఇద్, ఈగో, సూపర్ ఈగో. ఈ మూడు భాగాల మధ్యన ఉండే సంబంధ బాంధవ్యాలే మనిషి యొక్క ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి.

ఈ మూడింటిలో 'ఇద్' అనేది మానవునికి సహజంగా ఉండే ఆదిమ ప్రేరకాలు ద్వారా ఏర్పడుతుంది. దీనినే ప్రవృత్తి లేదా సహజజ్ఞానం అని కూడా అంటారు. మనిషి బాలుడుగా గాని, బాలికగా గాని జన్మించగానే తల్లి కోసం వెదకడం, పాల కోసం ఆరాటపడడం, వంటి వాటిని సహజాత లక్షణాలుగా చెప్పవచ్చు. పక్షులు కిలకిల రావాలు చేయడం, పులి గాండ్రించడం పుట్టుకతో వచ్చే సహజ లక్షణంగా గమనించాలి. మానవునికి ఉండే సహజ ప్రేరకాలైన లైంగిక వాంఛ, విచ్ఛిన్నకర ధోరణి, స్వార్థపరత్వం ఈ ఇద్ నుండే పుడతాయి. ఇది నిరంతరం ఆనందాన్ని కోరుకుంటుంది. ఉచ్చ నీచాలతో, తప్పు, ఒప్పులతో దీనికి సంబంధం లేదు. ఇంద్రియానుభవమే దీని పరమావధిగా ఉంటుంది. వాంఛించిన దానిని ఏ విధంగానైనా పొందడానికి ఇది ప్రేరేపిస్తుంది. అందుచేతనే మానవుని దుర్గుణాలకు, చెడు అలవాట్లకు 'ఇద్' యే కారణమని ఫ్రాయిడ్ నిశ్చితాభిప్రాయం. ఆల్కహాల్ సేవించడం, పొగత్రాగడం, వ్యభిచారం చేయడం, అశ్లీల దృశ్యాలు చూడడం వంటివన్నీ దీని ప్రేరేపితాలే. దీని యొక్క తీవ్రతను ఎక్కువగా అనుభవిస్తున్న వ్యక్తి, సామాజిక కట్టుబాట్లను కూడా లెక్క చేయడు. ఇద్ ప్రేరణ ఎంత బలంగా ఉంటే, అంత విపరీత ధోరణి వ్యక్తమవుతుంది. మనదేశ రాజధాని ఢిల్లీలో జరిగిన 'నిర్భయ' ఉదంతాన్ని గమనిస్తే, ఇటువంటి వ్యక్తులు కూడా ఈ సమాజంలో ఉంటారా అనిపిస్తుంది. కాని అదే నిజం. సమాజమే నిజాన్ని అంగీకరించడంలో వెనుకంజ వేస్తున్నది.

'ఇద్' యొక్క స్వభావం ఎల్లప్పుడూ ఆనందాన్ని కోరుకోవడమే. దీనిలో ఉన్న మరోక పార్శ్వం, ఆనందాన్ని మంచి పనులు చేయడం ద్వారా పొందడమా లేక చెడ్డ పనులు ద్వారా సాధించడమా అన్నది, 'ఇద్'కు ఈ మీమాంస లేదు. ఏ విధంగానైనా ఇంద్రియాలను తృప్తిపరచడమే. కొందరు వ్యక్తులు హింస ద్వారా ఆనందం పొందుతారంటే అతిశయోక్తి కాదేమో! నేర ప్రవృత్తికి, ప్రేరణకు 'ఇద్' కారణమని చెప్పవచ్చు. నేరచరిత్రలను అధ్యయనం చేసినట్లయితే, కొన్ని నేరాలు బలమైన కారణం లేకుండానే, యాదృచ్ఛికంగా, కేవలం ఆనందం కోసం జరుగుతున్నట్లు గమనించవచ్చు. వ్యక్తులలో నేర ప్రవృత్తిని అరికట్టాలంటే 'ఇద్' యొక్క ప్రేరణను తగ్గించగల మార్గాలను అన్వేషించాలి.

16వ శతాబ్దంలో గొప్ప రాజనీతి శాస్త్రజ్ఞుడుగా పేరుగాంచిన ఇటలీకి చెందిన నికోలో మెకియవిల్లి తన

రాజకుమారుడు (1532) అనే గ్రంథంలో మానవ నైజాన్ని గూర్చి చక్కని విశ్లేషణ చేసాడు. ఇతని దృక్కోణంలో మానవులు స్వార్థపరులు, అవకాశవాదులు. మనిషి స్వభావమే ప్రతికూలం, ఇతరులను వంచించి ఆనందం పొందడమే నైజం. స్వలాభం కోసం ఏ పనైనా చేస్తాడు. అంతిమంగా ఇతను చెప్పదగినది 'మనిషికి, జంతువుకు తేడా అంతంత మాత్రమే'; నైజం పరంగా మహాభారత యుద్ధానికి కారకుడైన దుర్యోధనుని ప్రవృత్తిని లోతుగా విశ్లేషిస్తే మనకు కనపడేది అతని యొక్క దుష్టస్వభావమే. యుద్ధం మొత్తం కురువంశ పతనానికి దారి తీస్తుందని తెలిసినా దుర్యోధనుడు వెనకకు తగ్గలేదు. నేటి ఉగ్రవాదుల, విధ్వంసకారుల మనస్తత్వానికి, దీనికి పెద్ద తేడా కనపడదు. దీనిని ప్రతికూల స్వభావంతో ఆనందించడంగా భావించాలి.

మెదడులో ఉన్న మిగిలిన రెండు భాగాలైన ఈగో, సూపర్ ఈగోల స్వభావాన్ని విశ్లేషిద్దాం. మానవుని మెదడులో ఉన్న 'ఈగో' అన్నది చాలా చైతన్యం కలిగి ఉంటుంది. ఇది ఎల్లప్పుడు స్పృహలో ఉంటుంది. ఇది మంచి, చెడులను బేరీజు వేసుకుంటూ, సమాజం ఆమోదించిన ప్రవర్తనను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంది. మనిషి యొక్క వ్యక్తిత్వానికి సంబంధించిన నిర్ణయాలు చేయడంలో దీనిది కీలకపాత్ర. మెదడులో మరొక భాగమైన 'సూపర్ ఈగో' నైతికతకు సంబంధించిన ఆలోచనలను ప్రేరేపిస్తుంది. 'ఈగో' అన్నది 'ఇద్' యొక్క ప్రతికూల ధోరణిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తుంది.

పైన ఉదహరించిన మూడు భాగాలతోపాటు, మెదడులో ఉపచేతన అనే భాగం మరొకటి ఉంటుందని, ఇది మనిషి యొక్క నిర్ణయాలను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నాడు. మెదడుకు సంబంధించి, మానవుని నిర్ణయాత్మక శక్తికి సంబంధించి 'ఉపచేతన' యొక్క ఉనికిని గుర్తించడం మనస్తత్వ శాస్త్రంలో ఒక పెద్ద ముందడుగు, లేదా వ్యక్తీకరణ. ఆపైన ఫ్రాయిడ్ మరొక విషయాన్ని కూడా బయలుపరిచినాడు. అదేమంటే, మనిషి మెదడులో చేతనంగా ఉండే భాగం చాలా తక్కువని, అచేతనంగా ఉండే భాగం ఎక్కువని పేర్కొన్నాడు. ఫ్రాయిడ్ ఉద్దేశ్యంలో మనిషి మెదడు మొత్తాన్ని ఒక మంచు కొండతో పోలిస్తే, చైతన్యం కలిగి ఉండే భాగం కేవలం ఒక చిన్న మొన. ప్రపంచం మొత్తం మీద ప్రస్తుతం ప్రబలి ఉన్న విధ్వంసకర ధోరణులను గమనిస్తే, వ్యక్తులపైన 'ఇద్' యొక్క ప్రబావం గణనీయంగానే ఉన్నదని స్పష్టమవుతుంది. మనుషులు మానవబాంబులుగా మారడానికి వెనుకాడడం లేదంటే, ఈ పరిస్థితిని మనం ఏ విధంగా అర్థం చేసుకోగలుగుతాము? నేటికీ దేశాల మధ్య యుద్ధాలు, జననష్టం, మారణకాండ ఏ మాత్రం సమసి పోవడం లేదు.

గొప్ప నాటక రచయితగా పేరుగాంచిన విలియం షేక్స్పియర్ తన నాటకాలలో అనేక పాత్రల సృష్టి ద్వారా మానవ నైజాన్ని ఎత్తి చూపాడు. ఏ మిడ్ సమ్మర్స్ నైట్ డ్రీమ్ అన్న నాటకంలో హెలెన్ పాత్ర ద్వారా మనుషులపై ఇద్, ఈగో, సూపర్ ఈగోల ప్రభావం ఏ విధంగా ఉంటుందో చక్కగా విశ్లేషించాడు. అట్లే జులియస్ సీజర్ నాటకంలో బ్రూటస్ పాత్ర, సీజర్‌ను అంతమొందించడానికి ఏ విధంగా పథక రచన చేస్తుందో గమనిస్తే, మానవ నైజం యొక్క వికృత రూపం తేటతెల్లమవుతుంది. ఇటువంటివే అనేక పాత్రల సృష్టి ద్వారా మానవ స్వభావాన్ని విడమరిచి చెప్పాడు. ఆ విధంగా షేక్స్పియర్‌ను ఒక గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్తగా పరిగణించవచ్చు. మానవుని 'ప్రతికూల ఆనందం' వైపునకు కాకుండా ధనాత్మక ఆనందం వైపు మళ్ళించగల మార్గాలు ఈ శాస్త్ర పరంగా అన్వేషించడం చెప్పదగినది.

**తత్త్వశాస్త్రం–ఆనందం :** మానవుడు జిజ్ఞాసపరుడు. కేవలం ఎల్లప్పుడూ భౌతిక ఆనందాన్ని మాత్రమే కోరుకోడు. అప్పుడప్పుడు తన చుట్టూ ఉన్న పరిసరాలను, సంభవించే పరిణామాలను ఆసక్తితో గమనిస్తూ, కొన్ని మౌలిక ప్రశ్నలకు జవాబులు వెతికే ప్రయత్నం చేస్తాడు. వాటిలో కొన్నింటిని ఈ విధంగా చెప్పవచ్చు. తాను ఎవరు? తన ఉనికి ఏమిటి? జ్ఞానం అంటే ఏది, జీవితానికి అర్థం లేదా పరమార్థం ఏదైనా ఉన్నదా? మనిషి ప్రవర్తనను నిర్ణయించే అంశాలేమిటి? నీతి నియమాలు ఎటువంటివి? సత్యం అంటే ఏది? దానిని ఏ విధంగా తెలుసుకోగలము? ఇత్యాది అనేక ప్రశ్నలకు సమాధానంగా తత్త్వశాస్త్రం పుట్టిందని చెప్పవచ్చు. తర్కము, నీతి, విజ్ఞానము మరియు వాస్తవికత, తత్త్వశాస్త్రంలో ముఖ్యమైన భాగాలు. వాటి యొక్క మూలతత్త్వాన్ని గురించి చర్చ చేసేదే తత్త్వశాస్త్రం అని చెప్పవచ్చు. ఈ అంశాలపై మానవుడు ఏర్పరుచుకున్న అవగాహన అతని యొక్క నడవడికను ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు 'నీతి' అనే అంశాన్ని గమనంలోనికి తీసుకుంటే ప్రతి వ్యక్తి నీతిమంతుడై ఉండాలి. ఆ విధంగా ఉన్నప్పుడే సమాజం యొక్క మనుగడ కొనసాగుతుంది. అయితే నీతి అంటే ఏది, దానిలోని అంతర్భాగాలు ఏవి, వాటిని వ్యక్తి ఏ విధంగా పాటించాలి? అన్న విషయాలను తత్త్వశాస్త్రం తెలియజేస్తుంది. అయితే సమాజంలోని వ్యక్తులందరు ఎందువల్ల నీతిమంతులుగా లేరు?

వారందరు నీతిమంతులుగా ఉండాలంటే ఏ విధమైన 'నియమావళి' లేదా నిబంధనలు ఏర్పరచి, అమలు చేయాలి? అది ఎవరి బాధ్యత? వంటి విషయాలు చర్చకు వస్తాయి. ఇదే విధమైన చర్చ తత్త్వశాస్త్రంలోని అంతర్భాగాలైనటువంటి అన్ని ఇతర అంశాలకు వర్తిస్తుంది.

మూల విషయమైన 'ఆనందానికి' సంబంధించిన చర్చకు మళ్ళితే, తత్త్వశాస్త్రానికి ఆనందానికి మధ్య గల సంబంధం ఏమిటి? తత్త్వశాస్త్రాన్ని అధ్యయనం చేసిన ప్రతివారు, ఆనందం అనుభవించగలుగుతారా? దీనికి సంబంధించి ప్రాథమిక ప్రతిపాదనలు ఏమిటి? అన్న విషయాలపరంగా చర్చను కొనసాగిద్దాం. తత్త్వశాస్త్రపరంగా ఆనందం లేదా వేదనకు సంబంధించి రెండు ముఖ్య ప్రతిపాదనలు ఉన్నాయి. అవి : 1. సుఖప్రవృత్తి 2. ప్రయోజనవాదం.

**సుఖప్రవృత్తి :** ఇది నీతి సిద్ధాంతం పై ఆధారపడి ఉంది. కోరికలను తీర్చుకోవడమే ఇందులోని మూలసూత్రం. మానవుడు ఆశించదగిన పరమోత్తమ మంచి అదే. అందుచేత ఈ సిద్ధాంతం మానవ చర్యలన్నింటికి ఈ ప్రవృత్తి ఆధారం అని చెబుతుంది. వేదన అన్నది అన్ని వేళల విసర్జించదగినది. దీనిలో మరల నాలుగు వైఖరులున్నాయి. అవి :

**1. మానసిక సుఖప్రవృత్తి :** సహజంగాను, స్వభావరీత్యా మానవులు సుఖాన్ని గరిష్టం చేసుకోవడానికి, వేదనను కనిష్టం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అందులో భాగంగా, సహజంగానే స్వార్థపరులుగా ఉంటారు. తమ సుఖాన్ని అధికం చేసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తారు.

**2. నీతివంతమైన సుఖప్రవృత్తి :** దీని ప్రకారం మానవుడు తన సుఖాన్ని అధికం చేసుకోవడానికి ప్రయత్నించినా అది నీతివంతంగా ఉండాలని చెప్తుంది. అయితే మానవ ప్రవర్తనలో నీతికి ఉన్న స్థానం ఎంత, అందరూ నీతివంతంగా తమ సుఖాన్ని ఆశించి ఆ విధంగా ప్రవర్తిస్తే, సమాజంలో మనం గమనించే లేదా అనుభవించే విచ్ఛిన్నకర ధోరణులు ఎందుకు ఏర్పడతాయి అన్నది ప్రశ్న. ఈ దృక్పథం సామాజిక శాస్త్రవేత్తలకు, మానసిక శాస్త్రవేత్తలకు రుచించదు. వీరి ప్రకారం మానవులలో ప్రతికూల ధోరణులు లేదా స్వభావమే ఎక్కువ. ఆ సందర్భంలో నైతికతకు చోటు ఎక్కడ ఉంది? కాబట్టి దీనినొక ఆశావహ సిద్ధాంతంగా పేర్కొన్నారు.

**3.అహంభావపూరిత సుఖప్రవృత్తి :** ఈ దృక్పథం ప్రకారం మానవులు తమ సుఖ ప్రవృత్తికి సంబంధించిన క్రియలను వాటి ప్రాధాన్యతపరంగా అమర్చుకొని, అధిక సుఖం ఇచ్చే క్రియల నుండి తక్కువ సుఖం అందించే క్రియలుగా రూపొందించుకోవాలి. ఆ ప్రాధాన్యతల ఆధారంగా సుఖ ప్రవృత్తిని పెంపు చేసుకోవచ్చు. ఉదాహరణకు, ప్రతి వ్యక్తి ఒక మంచి ఉద్యోగము, ఎక్కువ జీతము, మంచి ఇల్లు, అనుకూలవతి అయిన భార్య ఉండాలని ఆశించడం నీతివంతమైనదే కదా! అని ఈ దృక్పథం చెప్తుంది.

**4. పరోపకార సంబంధమైన సుఖప్రవృత్తి :** ఇది పరోపకారం లేదా నిస్వార్థతను, సుఖప్రవృత్తిని కలిపి చూస్తుంది. దీని ప్రకారం సుఖమంటే ప్రజల సుఖమే. ప్రజలందరి ఆనందం కోసం ప్రయత్నించడమే ఇది ఇచ్చే సందేశం. ఇది ఎంతవరకు సాధ్యపడుతుంది? సహజంగా మానవుడు స్వార్థపరుడైన సందర్భంలో అదే అతని నిజమైన స్వాభావిక లక్షణంగా భావింప బడుతున్నపుడు, నిస్వార్థత అన్న భావన ఎక్కడ ఉన్నది వంటి వాదన సర్వసాధారణం. దీనికి ఉదాహరణగా ఒక సిపాయి యొక్క త్యాగం ఉటంకించబడింది. సిపాయి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి మిగిలిన ప్రజలకు భద్రత కల్పించడం అనేది నిస్వార్థ చర్యగా భావించాలి. మొత్తంగా సుఖప్రవృత్తి అనే భావన నీతివంతమైన చర్యలతోనే ముడిపడి ఉంది. అనైతిక సుఖాన్ని కోరుకోవడం అనే ప్రసక్తి ఇందులో లేదు. కావున దీనినొక ఆశావహ, సంపూర్ణ సిద్ధాంతంగా చెప్పవచ్చు.

ఇదే సందర్భంలో ఒమర్ ఖయ్యామ్ అనే పర్షియన్ తత్త్వవేత్త, కవి సుఖప్రవృత్తికి సంబంధించి, ప్రస్తుత కాలాన్ని మాత్రమే గమనంలోనికి తీసుకోవాలని, గతించిన కాలాన్ని గురించి గాని, రాబోయే కాలాన్ని గురించి గాని విచారించనవసరం లేదని పేర్కొంటాడు. ఏదైతే నీకు అందుబాటులో ఉంటుందో దానిని అనుభవించి, సుఖాన్ని అధికం చేసుకోవచ్చునని ఈయన తెలియజేస్తాడు. దీనిలో అందమైన ప్రవృత్తి, మంచి స్నేహితులతో కాలక్షేపం, మద్యం వంటివి ఉన్నాయి. చాలా మంది దీనిని తప్పుగా అర్థం చేసుకొని, ఖయ్యూమ్ అనైతిక ప్రవర్తనను ప్రోత్సహించాడనడం సరికాదు. నైతికంగా, పరిధుల మధ్యనే ఈ వ్యాపకం కొనసాగాలని తెలియజేసాడు. 'అతి సర్వత్రా వర్జయేత్' అన్న సూక్తి ఇందులో భాగమే.

**ప్రయోజనవాద సిద్ధాంతం :** సమాజంలో ఎక్కువ మందికి ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా మానవుల చర్యలు ఉండాలని ఈ సిద్ధాంతం చెప్తుంది. ఇది కూడా నైతిక ప్రవర్తననే సమర్థిస్తుంది. అయితే ఈ సిద్ధాంతం ప్రకారం మనిషి యొక్క ఆశయం ఆధారంగా కాకుండా అతను నిర్వర్తించిన క్రియలు, వాటి పర్యవసానంగా నైతికతను లేదా అనైతికతను లేదా మంచి, చెడులను గుర్తించాలని

తెలియజేస్తుంది. క్రీస్తుశకం 19వ శతాబ్దంలో వెలుగులోనికి వచ్చిన ఈ భావనకు జె. బెన్‌థామ్, జె.ఎస్. మిల్‌లు ఆద్యులు. ఈ సిద్ధాంతంలో ముఖ్యంగా సమాజంలోని వ్యక్తులందరికి ప్రయోజనం ఏ విధంగా చేకూరుతుంది? దానిని ద్విగుణీకృతం చేయడం ఎలా? అన్న వానిపైనే చర్చ ఉంటుంది. ఇది మంచి, చెడులను సహేతుకంగా విశ్లేషిస్తుంది. ఈ విశ్లేషణా పద్ధతిని బెన్‌థామ్ సంఖ్యాపరంగా మదింపు చేసి, కార్యకలపాల ద్వారా ఏర్పడే ప్రయోజనాన్ని, దుష్ఫలితాన్ని లెక్కలతో వివరించాడు. దాని ప్రకారం ఎక్కువ మందికి, ఎక్కువ ప్రయోజనం కలిగిందా లేదా అన్నది చూడవచ్చుననేది అతని అభిప్రాయం. అంతిమంగా ఈ భావన ఆధారంగా అధిక ఆనందం అనే సూత్రాన్ని ప్రతిపాదించాడు. జె.ఎస్. మిల్ ఈ సూత్రాన్ని, 'అర్థశాస్త్రం'తో రంగరించి ఈ భావనను మరింత మెరుగుపరిచాడు.

**అధ్యాత్మిక సారస్వతం–ఆనందం :** హిందూ వాఙ్మయం వేదాలతో మొదలై ఉపనిషత్తులు, ఐతిహాసాలు, పురాణాలు వంటి సారస్వతం బయలు వెడలింది. దీని ప్రకారం ఆనందం లేదా దుఃఖం ఈశ్వరుడు, దేహం, ఆత్మ వంటి అంశాల చుట్టూ తిరుగుతుంటాయి. మనిషి యొక్క ఉనికి, మనుగడకు, మోక్షానికి ఈశ్వరుడు కారణభూతుడు. ఇతనే బ్రహ్మం లేదా పరమాత్మ. సృష్టి, స్థితిలయాలకు కారణం. బ్రహ్మం తనకు తాను ముందుగా సృష్టించుకొని, ఆ పైన జీవ సృష్టి చేసాడు. అతనే సృష్టిని నిర్వహిస్తూ, మానవులకు అనేక అవస్థలను కలిగిస్తాడు. మొత్తం హిందూ సారస్వతంలో ఉపనిషత్తులకు ఎనలేని స్థానం ఉన్నది. సృష్టికార్యాన్ని, ఆత్మకు–పరమాత్మకు మధ్యన ఉన్న సంబంధాన్ని, ఆత్మ–పరమాత్మలో ఐక్యం చెందడానికి అనుసరించవలసిన పద్ధతులను ఉపనిషత్తులు విడమరచి చెప్తాయి.

ఉపనిషత్తుల ప్రకారం మానవుడు ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం (మేధస్సు) కలిగి ఉంటాడు. ఇవి సందర్భాన్ని బట్టి, వ్యక్తి యొక్క ఉపాసనను బట్టి స్థూల, సూక్ష్మ రూపాలలో వ్యక్తీకరించబడుతుంటాయి. ఇవే మానవుడు సుఖ, దుఃఖాలు అనుభవించడానికి కారణభూత మవుతాయి. ఐదు జ్ఞానేంద్రియాలు అంటే చర్మం, కన్ను, నాలుక, చెవి, ముక్కు, ఐదు కర్మేంద్రియాలు అనగా వాక్కు, పాణి (చేయి), పాదం, పాయువు, ఉపస్థ (జననేంద్రియం), పంచప్రాణాలనగా ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము మరియు సమాన వాయువులు. అందుచేతనే ప్రాణాన్ని వాయవుతో లేదా ఊపిరితో పోలుస్తారు. ప్రాణం పోవడమంటే ఊపిరి ఆగిపోవడమే. ఇవే మానవుని యొక్క ఆనందమయ లేదా దుఃఖమయ స్థితికి కారణమవుతాయి. వీటి యొక్క ప్రభావం మానవుడు అనుభవించే స్థితిని బట్టి ఉంటుంది.

ఆ విధంగా చూచినప్పుడు మనిషి మొత్తంగా మూడు స్థితులను అనుభవిస్తాడు. అవి : జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తావస్థ. మానవుడు ఒక్కొక్క స్థితిలో ఒక్కొక్క అనుభవాన్ని పొందుతాడు. మొదటి స్థితిలో కర్మేంద్రియాల ద్వారా ఆనందాన్ని లేదా వేదనను అనుభవిస్తాడు. దీనినే మానవుని యొక్క స్థూల శరీరంగా చెప్తారు. జాగ్రదావస్థ అంటే మెళకువగా ఉండడం. భౌతిక ప్రపంచమంతా దీని చుట్టూనే తిరుగుతుంటుంది. రెండవది స్వప్నావస్థ. దీనినే 'తైజస' స్థితి అని కూడా అంటారు. ఈ స్థితిలో మనిషి యొక్క ఇంద్రియాలు క్రియాశీలకంగా ఉండవు. ఒక్క మనసు మాత్రమే చైతన్యంగా ఉండి, ఊహాలోకాన్ని దర్శిస్తుంది. బాహ్య ప్రపంచంతో మనిషికి ఏర్పడిన సంబంధం, అనుభవాలు, ఆలోచనలు అన్ని కలగలిపి 'కలలరూపం'లో ప్రత్యక్షమవుతాయి. ఈ స్థితిలో ఆనందాన్ని లేదా దుఃఖాన్ని మనస్సు అనుభవిస్తుంది. ఇక మూడవ స్థితియైన సుషుప్తావస్థలో ఇంద్రియాలు, మనస్సు కూడా నిష్క్రియా స్థితిలోనికి జారుకుంటాయి. ఒక్క చైతన్యం మాత్రమే క్రియాశీలకంగా ఉంటుంది. ఇది కూడా నశిస్తే, మానవుడు అచేతనంగా మృత్యువు ఒడిలోకి జారినట్లుగా అవుతుంది. అయితే ఇక్కడ గమనించవలసినది ఈ చేతననే ఆత్మ అని, దానికి నశింపు లేదని, అది దేహాన్ని ఆశ్రయించి ఉంటుందని చెప్పబడింది. ఎప్పుడు దేహం శిథిలావస్థకు చేరుకొంటుందో అప్పుడు ఆత్మ వేరొక దేహాన్ని ఆశ్రయిస్తుంది. కాబట్టి దేహానికి ఆనందం కలిగించడం కంటే ఆత్మకు ఆనందం కలిగించడం చెప్పదగిన విషయం. ఆనందం యొక్క స్వభావాన్ని చాందోగ్య ఉపనిషత్తు ఈ క్రింది వాక్యాల రూపంలో తెలియజేసింది.

- ఆనందం ఈ సృష్టిలోని భాగం కాని, దాని యొక్క లక్షణం కాని కాదు. అది సర్వవ్యాపకమైనది.
- ఆనందం బాహ్యప్రపంచంలో గాని, శరీరంలోగాని, మనస్సులో గాని లేదు. అది స్వతంత్రమైనది.
- సృష్టిలో ఆనందానికి మూలం 'భూమి' మాత్రమే. సత్ లేదా సత్యం యొక్క జ్ఞానమే భూమి. అదే బ్రహ్మంగా చెప్పబడుతున్నది. ఈ బ్రహ్మమే జగత్తులో అనేక రూపాలతో భాసిల్లుతున్నాడు. ఈ విధంగా

తెలుసుకొన్న వ్యక్తి ప్రపంచంలోని అన్ని ఆనందాలను పొందగలుగుతాడు.

- అశాశ్వతమైన వస్తువులలో ఆనందం లేదు. శాశ్వతమైనది ఆత్మ ఒక్కటే. దాని ద్వారానే ఆనందం పొందగలం. అదియే ఆత్మానందంగా చెప్పబడింది.

ఈ విధమైన ఆత్మకు సంబంధించి హైందవంలో మూడు చింతనాత్మక ధోరణులు ఉన్నాయి. అవి : ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము. మొదటి భావన ప్రకారం ఆత్మ, పరమాత్మ రెండూ వేరు, వేరుగా ఉన్నాయి. ఆత్మ, పరమాత్మను చేరే మార్గాన్ని ఇది సూచిస్తుంది. రెండవది అద్వైతము. దీని ప్రకారం ఆత్మ, పరమాత్మ రెండూ వేరు, వేరుగా లేవు. ఆత్మయే పరమాత్మ. రెండూ ఒక్కటే. 'అహం బ్రహ్మాస్మి' అన్నది దీని విశేష వాక్యం. ఇక మూడవదైన విశిష్టాద్వైతం ఈశ్వరుని ఏకత్వాన్ని తెలియజేస్తుంది. దీని ప్రకారం జీవులందరు బ్రహ్మం యొక్క ప్రతిరూపాలే. 'తత్త్వమసి' అన్నది దీని విశేష వాక్యం. 'అదే నీవు' అయి ఉన్నావు. భావన ఏదైనా ఆత్మకు ఆనందం కలిగించడమే తెలుసుకోదగినది, చెప్పదగినది. ఈ సందర్భంలోనే 'అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు శ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభుపాద ఒక చక్కని ఉదాహరణను ఇవ్వడం జరిగింది. పంజరంలో ఒక పక్షి పెట్టబడినది అనుకొందాం. మనం రోజూ శ్రద్ధతో పంజరాన్ని చక్కగా తుడుస్తూ, పక్షికి మాత్రం ఏ ఆహారం ఇవ్వకపోతే, అది ఏ విధంగా ఆనందించగలుగుతుంది, ఆనందించలేదు. ఇక్కడ మనం భౌతిక దేహాన్ని ఆత్మకు పంజరంగాను, పక్షిని ఆత్మగాను గమనించాలి. కాబట్టి కేవలం దేహాన్ని పోషిస్తే ఆనందం ఏర్పడదు. కాబట్టి ఆత్మకు ఆనందం కలిగించడం ద్వారానే వ్యక్తి నిజమైన ఆనందాన్ని పొందగలడు.

ఆత్మకు ఆనందం కలిగించే అంశానికి సంబంధించి ఉపనిషత్తులు 'ఉపాసనమార్గాన్ని' బోధిస్తాయి. ఇక్కడ 'ఉపాసన' అంటే ఒక విధమైన పూజాప్రక్రియ లేదా ధ్యాన ప్రక్రియ. ఒక కోరికను తీర్చుకోవడం కోసం గాని, దైవాన్ని గూర్చిన చింతనను పెంపొందించుకోవడం కోసం గాని ఈ ఉపాసన ప్రక్రియను అవలంభించవచ్చు. పతాక స్థాయిలో ఆత్మకు ఆనందాన్ని కలిగించడం అంటే బ్రహ్మాన్ని చేరుకోవడమే. దీనికిగాను ఉపనిషత్తులలో రెండు మార్గాలు చెప్పబడ్డాయి. అవి : సగుణ బ్రహ్మ ఉపాసన, నిర్గుణ బ్రహ్మ ఉపాసన. మొదటి పద్ధతిలో బ్రహ్మాన్ని చేరుకొనే ప్రయత్నంగా బ్రహ్మం యొక్క గుణాలను ఉపాసించడం లేదా ఆవాహన చేయడం. అవి ఏవనగా సత్యము, న్యాయము, పవిత్రత, క్షమ మొదలైనవి. జగత్తు మొత్తం సగుణ బ్రహ్మంలోనే ఇమిడి ఉన్నదనే జ్ఞానం కలిగి ఉండడం. ఈ విధమైన సగుణ బ్రహ్మం పాపరహితుడు, వృద్ధాప్యం లేనివాడు, మరణం లేనివాడు, ఆకలి లేనివాడు, శోకం లేదా విచారం లేనివాడు, దాహం వేయని వాడు, ఎల్లప్పుడూ సత్యమైన లేదా న్యాయమైన కోరికలు మాత్రమే కలిగి ఉంటాడు.

నిర్గుణ బ్రహ్మ ఉపాసనలో బ్రహ్మంకు ఒక రూపం లేదని, ప్రత్యేకమైన లక్షణాలు ఏమీ లేవని, అతను విశ్వం మొత్తంలో వ్యాపించి ఉన్నాడని తెలుసుకోవడం. ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు మానవుడు అనుభవించే జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తావస్థలను దాటి నాల్గవదైన 'ఉత్తమపురుష' దశను చేరుకోవడం నిర్గుణ బ్రహ్మ ఉపాసన యొక్క లక్ష్యం. దీనినే అంతిమదశ అయిన 'తురీయావస్థ'గా పేర్కొంటారు. అంటే జీవాత్మ- పరమాత్మలో కలసిపోయే దశ అని చెప్పవచ్చు. ఈ స్థితిలోనే ఆత్మానందం లేదా బ్రహ్మానందం కలుగుతాయని చెప్పబడింది.

**ముగింపు :** ఎన్ని దృక్కోణాల నుండి విశ్లేషించినా, ఆనందాన్ని ఎన్ని నామాలతో వ్యవహరించినా, అది క్షణికము లేదా స్వల్పకాలికము. ముఖ్యముగా ఇంద్రియముల ద్వారా కలిగే ఆనందం క్షణభంగురము. దాని యొక్క తీవ్రతను బట్టి స్వల్పానందం, పరమానందం, బ్రహ్మానందమని ఎన్ని స్థాయిలలో గణించినా, ఆ అనుభవము దీర్ఘం కాజాలదు. అందుచేతనే ఆధ్యాత్మిక పరంగా ప్రతి వ్యక్తి శాశ్వతమైన 'ఆత్మానందం' సాధించే దిశగా సాధన సాగించాలని చెప్పబడింది. ఇది కేవలం వ్యక్తి యొక్క విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిపరంగానైనా, దైవపరంగానైనా, విశ్వాసంతో చేపట్టిన ప్రతి పని ఫలితాన్ని చేకూరుస్తుంది. ఆనందానికి ప్రతిగా ఉండే దుఃఖము, బాధ, వేదన, దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉండడం విచారకరం. ముఖ్యంగా భౌతిక దేహానికి సంబంధించిన లోటుపాట్లు, అనారోగ్యం వంటి అంశాలపరంగా ఏర్పడే వేదనను పరిహరించడం కష్టంగా తోస్తుంది. అయినప్పటికీ, అసాధ్యం కాదు. ఈ విషయాలనన్నింటిని గమనంలోనికి తీసుకొని మానవుడు తన జీవితాన్ని ఆనందమయం చేసుకుంటాడని ఆశిద్దాం.

**ఆచార్య కోదాటి వియ్యన్నరావు**
పూర్వ ఉపకులపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.
గుంటూరు, ఫోన్ : 7093260655.

# సీమ భారతం

## రాయలసీమ గుండెచప్పుడు

**– యన్. విజయరాఘవ రెడ్డి**

సాహిత్యం అంటే కేవలం అక్షరాల సమాహారం కాదుబీ అది మానవ జీవన సత్యాల ఆవిష్కరణ. అక్షరాలు కేవలం రాయబడవు, అవి సమాజపు హృదయస్పందనను పలికిస్తాయి. జీవన విరహం, కష్టాలు, కన్నీళ్లు, చిరునవ్వులు, పోరాటాలు all woven into a timeless fabric of words అవి పాఠకుని మనసులో శాశ్వత ప్రతిధ్వనిలా నిలుస్తాయి.సరిగ్గా ఈ శక్తి వల్లే, ఒక రచయిత సృష్టించినది కేవలం తన వ్యక్తిగత' ఆత్మకథ'గా మిగలకుండా, యావత్ ఒక సమాజపు, ఒక ప్రాంతపు ఆత్మగాథ'గా పరిణతి చెందుతుంది.

ఈ అద్భుతమైన సత్యానికి సజీవ నిదర్శనం పులికంటి కృష్ణారెడ్డి గారి "సీమభారతం". ఇది కేవలం రాయలసీమ జీవిత చిత్రణ కాదు. ఆ నేల కన్నీళ్లను, పోరాటాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తూ, రాయలసీమ ఆత్మగాథగా నిలిచింది. ఈ రచన ఇంతటి సార్వజనీనతను సంతరించు కోవడానికి కారణం-ఆవిష్కర్త కృష్ణారెడ్డి గారి ప్రతిభ మరియు నిజాయితీ. ప్రాంతం ఏదైనా, మానవ స్వభావం, బతుకు పోరాటం ఒకటే కదా! మనిషి అనుభవాలు, కన్నీళ్ల, ఆలోచనలు ప్రపంచంలో ఎక్కడివారికైనా ఉమ్మడిగానే ఉంటాయి. అందుకే, ఏ గొప్ప సాహిత్యమైనా తన స్థానిక ప్రాంతపు మూలాల నుంచి ఉద్భవించి, చివరకు విశ్వాన్ని తాకుతుంది. 'సీమభారతం'లో కనిపించే కరువు, వలస, నిస్సహాయత, ఆశ... ఇవన్నీ సీమకు మాత్రమే పరిమితమైనవి కావు. ఇవి మానవజాతి ఎదుర్కొనే సార్వత్రిక సమస్యలు. అందువల్లే, ఈ రచన స్థానిక అంశాలతో మొదలై, అంతర్జాతీయ మానవీయ స్పర్శను అందించి, పాఠకుడిని కదిలించి, తనలో లీనం చేసుకుంటుంది. ఇది ఒక అద్భుతమైన సాహిత్య నిదర్శనం, రాయలసీమ మాండలికంలో రాసినా, ప్రపంచ మానవుడి హృదయ స్పందనను ప్రతిధ్వనించే అక్షర శిఖరం!

సీమ భారతంకు జీవం పోసింది, దాన్ని నిత్యనూతనం చేసింది మాండలికం:

'నాలుగ్గాళ్ళ మండపం' రచనకు ప్రధాన బలం, దాని ఆత్మ-రాయలసీమ మాండలికపు అపారశక్తి. ఈ మూడువందల పేజీల సీమ ఆత్మకథను ఆ మాండలికంలో చదవడం అనేది మొదట్లో ఒక సవాలుగా అనిపించవచ్చు. పరిచయం లేని పదాలు, యాస మనకు కొంత కష్టం కలిగించినా, ఒక్కసారి రచయిత సృష్టించిన ఆ లోతైన జీవితంలోకి ప్రవేశిస్తే, మనం ఇక బయటికి రాలేం. ఆ పదాల ప్రవాహం, ఆ ఉద్వేగం, ఆ జీవన లయ పాఠకుడిని క్రమంగా తనలో లీనం చేసుకుంటుంది. అది మన భాష కాకపోయినా, మెల్లిగా మన భాషనే మనం చదువుతున్నట్లుగా అనుభూతి చెందుతాం. ఇక్కడ పులికంటి కృష్ణారెడ్డి సాధించిన విజయం అసాధారణమైనది. మాండలికాన్ని కేవలం వినోదం కోసమో, పేరు కోసమో, విభిన్నంగా ఉండడం కోసమో వాడలేదు. ఆయన మాండలికాన్ని ఆ ప్రాంతపు జీవితానికి స్వరాక్షర రూపంగా మలిచాడు. అంటే, ఆ భాష ఆ నేల మీద నడిచే మనిషి యొక్క ఆవేశాన్ని, ఆనందాన్ని, కష్టాన్ని, ప్రేమను, దుఃఖాన్ని-అన్ని రసాలనూ, జీవితపు అన్ని కోణాలనూ-తనలో నిబిడీకృతం చేసుకుంది.

పులికంటి 'ప్రమాణభాష' అనే మిథ్యలోకి పోకుండా, ఇక్కడి జనజీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా, కలుషితం కాకుండా చిత్రించాడు. ఆయన ఏమాత్రం ఆ భాషా మూలాలను విస్మరించి, ప్రమాణ భాషను వాడి ఉన్నా, ఈ రచన 'చరిత్రహీనం' అయ్యేదిబీ దాని సహజత్వం దెబ్బతినేది. మాండలికాన్ని పూర్తిగా రక్తి కట్టించడం వల్లనే 'సీమభారతం' ప్రముఖ భాషా శాస్త్రవేత్త, ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు అన్నట్లు "మాండలికంలో మహాభారతం" అయింది. ఇతర ప్రాంతాల పాఠకులకు కూడా రాయల

సీమ మాండలికంలోని సౌందర్యం, శక్తి, సహజత్వం ఎటువంటిదో తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఒక ప్రామాణిక గ్రంథంగా మిగిలిపోయింది. ఆ యాసలోనే సీమ గుండె చప్పుడు వినిపించింది.

'సీమభారతం' రాయలసీమ మాండలికంలో రాసినా, అది స్థానికతలో ఇరుక్కుపోలేదు. ఆ మాండలికంలోని పదాలు మట్టివాసనలాగానే హృదయానికి దగ్గరగా తగులుతాయి. వాటి వెనక దాగి ఉన్న మానవ భావోద్వేగాలు భూభాగాల సరిహద్దులు దాటిపోతాయి. మాటల వలయం ఎంత చిన్నదైనా, వాటి వెనకనున్న భావజాలం అంతులేని విశ్వాన్ని తాకగలదని ఈ రచన నిరూపించింది.

కృష్ణారెడ్డి గారు ఉపయోగించిన రాయలసీమ మాండలికం కృతికి కొత్త అందం ఇచ్చింది. అది కేవలం ప్రాంతీయ భాష కాదుబీ పాఠకుని హృదయాన్ని తాకే జీవన గీతం.ఆ మాండలికంలోని పదాలు మట్టి వాసనలాగా, చెమట వాసనలాగా పాఠకుడి మనసులో నిలిచిపోతాయి. సాదాసీదా భాషలోనే లోతైన మానవ భావాలను వ్యక్తపరచగలిగిన శైలి ఈ రచనను విశిష్టంగా నిలబెట్టింది.

**నాలుగ్గాళ్ళ మండపం: గుండెచప్పుళ్లకు కేంద్రబిందువు :** సీమభారతంలో గుండెచప్పుళ్లకు కేంద్రబిందువైన 'నాలుగ్గాళ్ళ మండపం' కేవలం తిరుపతిలో నాలుగు దారుల కూడలిలో ఉన్న పాతరాతి కట్టడం మాత్రమే కాదు. ఇది యావత్ రాయలసీమ బతుకు పోరాటానికి, కన్నీళ్లకు కేంద్రస్థానం. ఈ మండపం ఒక సహజ వేదికు అన్నదానాలైనా, సామాజిక చర్చలైనా, కానుకల వేలమైనా, నిరాహారదీక్షలైనా ఇక్కడి నుంచే మొదలవుతాయి. అయితే, దీని అసలైన ప్రాముఖ్యత మరొకటి ఉంది: రాయలసీమ నలుమూలల నుంచి కరువుకు, దారిద్ర్యానికి చిక్కిన బాధితులు, పొట్టచేత పట్టుకొని వచ్చిన నిరుపేదలు ఇక్కడ గుమిగూడే అడ్డా ఇది. దారిద్ర్యంలో కూరుకుపోయిన ఆ జనసమూహం యొక్క ఆశలు, ఆవేదనలు ఈ మండపం నుంచే వినిపిస్తాయి.

అటువంటి గుండెచప్పుళ్లకు కూతవేటు దూరంలోనే రచయిత పులికంటి కృష్ణారెడ్డి నివాసం ఉంది. అందుకే ఆయన తన ఇల్లు, ఈ మండపం కేంద్రంగా సీమ బతుకులను నిశితంగా పరిశీలించారు. ఈ మండపం నుంచే ఆయన రాయలసీమ గుండెకోతను అక్షరాలుగా మలిచారు.

**సీమ భారతం : హృదయవిదారక దృశ్యకావ్యం :** పులికంటి తన కలంలో కేవలం వ్యవసాయం, రైతు బతుకులకే పరిమితం కాలేదు. ఆయన ఆ నేలమీది సమస్త జీవన కోణాల్ని లోతుగా పరిశీలించారు. ఆయన ఆవిష్కరించిన 'సీమభారతం' ఎంత హృదయవిదారకంగా ఉంటుందంటే:

- **కరువు, నీటి కటకట:** తాగడానికి నీళ్లు లేక, సేద్యానికి ఉరువులు లేక తరతరాలుగా కొనసాగుతున్న దైన్యం.
- **పశువుల మరణం:** మేత లేక పశువులు కటకటలాడి, చివరకు కసాయి కత్తికి బలైపోవడం.
- **మానవ వలస :** బతుకులేక, దిక్కుతోచక ప్రజలు గుంపులు గుంపులుగా వలసపోవడం. పెద్ద రైతులు సైతం కూలీలుగా మారిపోవడం.
- **మహిళల దైన్యం :** అత్యంత దారుణంగా, బతుకులీడ్చుకు రావడం కోసం ఆడవాళ్లు తమను తాము అంగడిసరుకుగా మార్చుకొని, భయంకరమైన ఎయిడ్స్‌తో తిరిగి రావడం.

**పాత్రల లోతు – మానవ స్వభావ ప్రతిబింబం** 'నాలుగ్గాళ్ళ మండపం'లో పాత్రలు కేవలం కల్పనలో సృష్టించబడిన ప్రతిరూపాలు కావు. అవి రాయలసీమ పల్లెలలో నడిచే నిజజీవిత మనుషుల వలే అనిపిస్తాయి.

**రైతు పాత్రలు:** ఆకలితో పోరాడుతూ కూడా మట్టి వదలని గుణం.

**వలస కార్మికులు:** జీవనోపాధి కోసం ఊరు వదిలి వెళ్ళిన నిస్సహాయత.


**మహిళలు :** ఇంటి బాధ్యతలతో పాటు సమాజపు ఒత్తిడులు భరించిన లోతైన వేదన. ప్రతి పాత్ర వెనక ఒక మానవ మనసు ఉంది. పాఠకుడు వాటిని చదువుతున్నప్పుడు తానూ ఆ పాత్రలో భాగమైపోతాడు. ఇది కేవలం ఒక కరువు గాథ కాదు, తరాల తరబడి కొనసాగుతున్న దైన్యం, గుండెకోత యొక్క అక్షరరూపం. "బాదలు పడేవాడికే బాదంటే తెలిసింది. బయటుండి బడాయి కొట్టేవాళ్లకేం తెలిసింది?" అంటూ ఆవేదన చెందే పులికంటి, కన్నీరు కార్చే నెమలికి వేటగాడి ముద్దు దేనికి అన్నట్లుగా, బయటివారికి ఈ కష్టాలు అర్థం కావని ఘాటుగా

ప్రశ్నిస్తాడు. అయితే, ఆయన ఆవేదన కేవలం నిరాశతో ముగియదు. “ఈ ఏడువు ఎవరికి వినిపిస్తుంది? ఎవరికి తీరిక ఉంటుంది?” అని ప్రశ్నించినా, “మన ఏడుపు మనం ఏడుస్తూ ఉంటే, ఎప్పటికో ఒకప్పటికి కడుపుకు కూడు తినే మహన్నబావుడు ఎవడో ఒకడు కలగజేసుకోకుండా పోతాడా?” అనే ఆశను బలంగా వ్యక్తం చేస్తాడు.

ఈ మండపంలో గుమిగూడిన కన్నీళ్లే ‘ సీమభారతం’ ద్వారా విశ్వానికి వినిపించాయి. ‘సీమభారతం’ యొక్క అంతర్గత నిర్మాణ శిల్పం, రచనా ప్రణాళిక పాఠకుడిని ఎంతగానో ఆకట్టుకునే అంశాలు.

**అసామాన్య సృష్టి నిర్మాణం :** అనుభవ మాలిక సీమభారతం ఉద్భవించింది ‘ఆంధ్రప్రభ’ వారపత్రికలో పులికంటి కృష్ణారెడ్డి గారు రాసిన ‘ నాలుగ్గాళ్ళ మండపం ‘కాలమ్’ పరంపరగా. కేవలం 57 భాగాల ఈ రచనను పైపైన చూస్తే కథల్లాగా అనిపిస్తాయి, కానీ అవి పూర్తిగా కల్పిత కథలు కావు. వీటిని ‘అనుభవ మాలిక’గా పేర్కొనడమే సరైనది. రచయిత తన జీవితంలో చూసిన, అనుభవించిన, లోతుగా చింతన చేసిన సామాజిక వాస్తవాల హారాన్ని ఇందులో గుచ్చారు. ఈ రచనకు పునాది కేవలం వ్యక్తిగత ఇష్టాయిష్టాలు కాదుబీ ఒక స్థిరమైన, లోతైన సామాజిక దృక్పథం. పులికంటి తన దృక్పథాన్ని ఎక్కడా దాచుకోలేదు. ఆయన దృష్టిలో ‘మనిషిని మనిషిగా ప్రేమించడం’ అనేదే ఏకైక సిద్ధాంతం. తనకు ‘యిజాలు’ తెలియవని, ‘వాదాలు’ తెలియవని, ఆ వాదాల పదును కేవలం పెదాల వరకే పరిమితం అని తన అనుభవం నేర్పిందని బలంగా నమ్ముతాడు. ఈ నిష్కల్మషమైన, మానవీయ దృక్పథమే ఈ అనుభవ మాలికకు ఆత్మగా నిలిచింది.

**పాత్రలు-వ్యాఖ్యాతలు-నిర్మాణ శిల్పం :** సీమ భారతం రచన నిర్మాణం అత్యంత అసామాన్యమైనది, పకడ్బందీగా ఉంటుంది. ప్రతి కథనం ఒక సన్నివేశంతో ప్రారంభమై, కథకుడు ఇతర పాత్రలతో జరిపే సంభాషణ ద్వారా ముందుకు సాగుతుంది. ఆ తర్వాత, ఆ సంభాషణల సారాన్ని బట్టి, కథకుడి అంతర్మథనం మొదలవుతుంది. ఈ మానసిక సంఘర్షణ, చింతన పాఠకుడిని ఆలోచింప జేస్తాయి. ఈ రచనలో రెండు ముఖ్యమైన వ్యాఖ్యాత పాత్రలు మనకు కనిపిస్తాయి :



- **బాశాలి (రచయిత భార్య) :** ఈ పాత్ర రచయిత సాంసారిక జీవితాన్ని, అతని వ్యక్తిగత అనుభవాలను ప్రతిబింబిస్తుంది.
- **ముత్తారెడ్డన్న :** ఈయన మండపం దగ్గర కనిపించే, విదురుడు లాంటి వివేకవంతుడైన పాత్ర. ఈయన సామాజిక జీవితానికి, సామాజిక చింతనకు వ్యాఖ్యాతగా నిలుస్తాడు.

ముత్తారెడ్డన్న పాత్ర ఈ నిర్మాణ శిల్పంలో అత్యంత కీలకం. ప్రతి కథనం ముగింపులో, ముత్తారెడ్డి చేసే వ్యాఖ్యలు రచయిత సంఘర్షణకు ‘బ్రేక్’ వేస్తాయి. అవి కథకుడి అంతర్మథనాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చి, అతను ‘రిఫైన్’ అయిన విషయాన్ని తెలియజేసే ఒక శక్తిమంతమైన ‘సూక్తిలాంటి’ వాక్యంలా పనిచేస్తాయి. అదెలాగంటే... రచయిత మానసిక సంఘర్షణ ఒక ప్రవాహం అయితే, ముత్తారెడ్డి మాటలు ఆ ప్రవాహాన్ని ఒక కాలువలా మలచి, పాఠకుడికి స్పష్టమైన సందేశాన్ని అందిస్తాయి. ఈ అద్భుతమైన, పకడ్బందీ నిర్మాణ శిల్పమే ‘ సీమభారతం’ను కేవలం కాలమ్స్ సంకలనం కాకుండా, ఒక సమగ్రమైన, అసామాన్య సృష్టిగా నిలిపింది.

పులికంటి కృష్ణారెడ్డి కలం రాయలసీమకు దక్కిన సాహితీ వరం. ఆయన అక్షరం పట్టిన క్షణం నుంచి, ఆ కరువు నేల యొక్క నిరంతర గుండెచప్పుళ్లు తెలుగు సాహిత్యంలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఆయన దృష్టి కేవలం కరువు పడిన నేల మీదో, ఒకే ఒక కోణం మీదో నిలవలేదు. ఆయన సీమ జీవితపు సప్తవర్ణాలను, అన్ని కోణాలనూ నిశితంగా సూక్ష్మంగా పరిశీలించి, మన ముందుంచారు. ‘సీమ భారతం’ కేవలం సమకాలీన సామాజిక చిత్రం మాత్రమే కాదు. ఇందులో చారిత్రక ఘనత వహించిన స్వాతంత్ర్య వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి వంటి శిఖర సమానమైన పాత్రలు ఒకవైపు కనిపిస్తాయి. అదే సమయంలో, అత్యంత దయనీయమైన బతుకుల్ని ఈడ్చిన అంబోదల గిడ్డడు వంటి గజదొంగల గాథలు కూడా

కదిలిస్తాయి. ఇవి అట్టడుగు జీవన చిత్రాలు. అంతేకాదు, ఇంట్లో కనిపించే సాధారణమైన తల్లి, అక్క వంటి పాత్రల అనుభూతులు, కన్నీళ్లు కూడా ఇందులో సజీవంగా చిత్రించబడ్డాయి. ఈ వివిధ రకాల పాత్రల సమూహమే రాయలసీమ జీవన నాటకానికి వేదిక. కరువుకు, దారిద్ర్యానికి తట్టుకొని బతుకులీడ్చుకొస్తున్న సీమ ప్రజల ఉమ్మడి గుండెచప్పుళ్లే ఈ 'సీమభారతం'కు అసలైన కథాంశం. ఈ కథాంశం ఒక ప్రాంతం గుండెను చీల్చి, లోపల ఉన్న నిజాల్ని బయటపెట్టింది.

సీమ భారతం 'ఒక ప్రాంతపు వాస్తవాన్ని చూపడమే కాదు, సమాజంలోని అసమానతలను, అన్యాయాలను ప్రశ్నిస్తుంది. రైతు కష్టాలను పట్టించుకోని రాజకీయ వ్యవస్థపై ఇది మౌన నిరసన. పేదరికాన్ని వారసత్వంగా మోసుకుంటున్న వర్గాల జీవన గాథను ఇది వెలుగులోకి తెచ్చింది. సమాజంలో నడుస్తున్న దోపిడీ ధోరణులను పాఠకుడి దృష్టికి తీసుకొచ్చింది.

**ప్రాంతీయతలో దాగున్న విశ్వమానవత్వం :** పులికంటి ఒక అపూర్వమైన సత్యాన్ని గ్రహించారు: తన మూలాల్ని పట్టుకోకుండా విశ్వాన్ని తాకడం సాధ్యం కాదు. ఒక ప్రాంతపు భాష, జీవనశైలి, సంస్కృతిని నిజాయితీగా, లోతుగా అర్థం చేసుకుంటేనే, మనం అంతర్జాతీయ మానవులం కాగలం. ఈ సత్యాన్ని పూర్తిగా ఒడిసి పట్టుకున్నారు గనుకనే, ఆయన 'ప్రమాణ భాష' కోసం పరితపించకుండా, సీమ మాండలికపు అసలు సౌందర్యంలోనే అక్షరాలు పేర్చారు. ఈ మాండలికపు ఆత్మలోనే విశ్వమానవుడి కన్నీటిని, సార్వజనీనమైన ఆవేదనను చూపించి, భాషా హద్దుల్ని చెరిపేశారు.

ఒక ప్రాంతపు కథను విశ్వజనీన కథగా మార్చగల శక్తి రచయితలోని నిజాయితీ మరియు అసామాన్య ప్రతిభ. కృష్ణారెడ్డి గారి కలం ఆ నేలలోని వాస్తవాలను కేవలం వర్ణించలేదు, వాటిలోని మానవ హృదయాన్ని తాకే భావోద్వేగాలను వెలికి తీసింది. మాండలికంలో రాసినా, ఆ మాండలికం పాఠకుడి మనసులోని హృదయ స్పందనగా మిగిలింది. స్థానిక సమస్యలతో ప్రారంభమైన ఈ రచన, మానవజాతి సార్వత్రిక వేదనలను, ఆశలను ప్రతిధ్వనించింది.

ఈ మూడువందల పేజీల రాయలసీమ ఆత్మగాథను, ఆ సహజసిద్ధమైన మాండలికపు ప్రవాహంలో చదవడం అనేది ఆరంభంలో ఒక చిన్న అడ్డంకే కావచ్చు. కానీ ఒక్కసారి ఆ జీవన నదిలో ప్రవేశించామా-మనం ఇక ఒడ్డుకు రాలేం. ఆ యాస, ఆ ఉద్వేగం మనల్ని పూర్తిగా లీనం చేసి, క్రమంగా మనం మన సొంత భాషనే చదువుతున్నామన్న అనుభూతిని ఇస్తుంది.

సీమభారతం'లోని కరువు, వలస, ఆకలి, ఆశలు ఇవి కేవలం సీమ సమస్యలు కాదు. ఆఫ్రికాలోనూ కనిపించే దృశ్యాలు, లాటిన్ అమెరికా రైతు వేదనలు, ఆసియా దేశాల కార్మికుల పోరాటలు అన్నీ ఇందులో ప్రతిధ్వనిస్తాయి. ఇది స్థానికం నుంచి అంతర్జాతీయ మానవ అనుభవాలకు ఎదిగిన సాహిత్య శిఖరం. 'సీమభారతం' ఒక ప్రాంతపు ఆత్మకథగా ప్రారంభమై, విశ్వజనీన మానవ అనుభవాల ప్రతీకగా నిలిచింది. పాత్రల లోతు, మాండలిక సౌందర్యం, ప్రతీకల గాఢత,

**సామాజిక విమర్శ :** ఈ అన్ని అంశాల సమ్మేళనం దానిని శాశ్వత సాహిత్య కృతిగా నిలబెట్టాయి. అందుకే, పులికంటి కృష్ణారెడ్డి గారి ఈ రచన కేవలం రాయలసీమ మట్టి వాసన మాత్రమే కాదు, ప్రపంచ మానవుని హృదయ స్పందన. తన ప్రాంతం నుంచి ఉద్భవించిన ఏ గొప్ప సాహిత్యమైనా విశ్వానికి నివేదన అవుతుంది. ఈ సూత్రానికి 'సీమభారతం' ఒక తిరుగులేని, శక్తివంతమైన, కాలాతీతమైన దృష్టాంతం. ఈ రచన రాయలసీమకు దక్కిన ఒక శాశ్వత సాహిత్య స్మారక చిహ్నం. ఇది ఒక పుస్తకం కాదు, అది రాయలసీమ నేలకు దక్కిన అక్షర గౌరవం, తరగని జీవన నివేదన.

జీవమున్న పాత్రలు, మాతృభాష మధురిమను గుప్పించే మాండలికం, అగాధమైన ప్రతీకాత్మకత, నిశితమైన సామాజిక విశ్లేషణ వీటి సమ్మేళనం వల్ల 'సీమ భారతం' భౌగోళిక సరిహద్దులను చెరిపివేసి, మానవజాతి అంతరాత్మకు అద్దం పట్టే విశ్వజనీన గ్రంథంగా విరాజిల్లుతుంది.

“ఏ గొప్ప సాహిత్యమయినా, అది తన నేల నుండే పుట్టినా, అంతిమంగా అది విశ్వానికే వారసత్వం” అనే కాలాతీత సత్యాన్ని 'సీమ భారతం' పదేపదే ధృవీకరిస్తుంది.

**యన్. విజయరాఘవ రెడ్డి**
విశ్రాంత ఆకాశవాణి అధికారి,
రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ : 9441239803

# దేశ దేశాల్లో క్రిస్‌మస్

*– టి.వి. ప్రసాద్*

ప్రతి సంవత్సరం డిశంబర్ 25న జరుపుకునే క్రీస్తు పుట్టుకను గుర్తు చేసుకునే పండగరోజే క్రిస్మస్. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో బిలియన్ల సంఖ్యలో క్రైస్తవులు, క్రైస్తవేతరులు క్రిస్మస్ వేడుకలు జరుపు కుంటారు. క్రైస్ట్–మాస్ క్రిస్మస్‌గా, X–మాస్‌గా మారింది. ఇది క్రైస్తవమతానికీ, సంస్కృతికి మాత్రమే పరిమితం కాదు – ఇతర మతస్తులకు, ఇతర సంస్కృతుల వారికీ క్రిస్మస్ పెద్ద పండుగే! క్రిస్మస్ క్రైస్తవుల ఆశలు, ఆకాంక్షలు, కోరికలు, ప్రేమ, దయ మొదలైన మంచి లక్షణాలకు ప్రతీక. ఇతరులకు బంధుమిత్రుల కలయికకు, ఆనందోత్సాహాలకు విందువినోదాలకు, వేడుకలకు వేదిక. లక్ష్యం ఏదైనా ఉల్లాసం, ఉత్సాహం క్రిస్మస్ లక్షణం. అందుకే దీనిని మెర్రీ క్రిస్మస్ అనీ అంటారు.

క్రిస్మస్ ప్రపంచ దేశాల పండుగగా మారడం వెనక చరిత్ర చాలా గొప్పది. క్రైస్తవ మత పునాదులు క్రీస్తు పుట్టిన తర్వాత మొదటి 100 సంవత్సరాలలో యూదుశాఖగా మొదలవడంలో కన్పిస్తాయి. నజరత్ జీసస్ జీవితం, బోధనలు, మరణం, పునరుద్ధరణపై కేంద్రీకృతమైంది. దేవదూతల యుగంలో జీసస్ ఆరోహణ తర్వాత పీటర్, పాల్, ఇతరులు వారి శిష్యులు జీసస్ సందేశాన్ని వ్యాప్తి చేశారు. పెంటెకోస్ట్ నాడు పరిశుద్ధాత్మ దిగిరావడాన్ని చర్చి పుట్టుకకు నాందిగా భావిస్తారు. అనంతరం క్రైస్తవ మతం యూదు మతం నుండి వేరువడి ప్రత్యేక మతంగా స్థాపించ బడింది. 313లో మిలన్ శాసనం అధికారిక హింసను అణచివేసి వేదాంత వివాదాలను పరిష్కరించడానికి 'నైసిల్' మండలిని యేర్పాటు చేసింది. 4వ శతాబ్దపు చివర్లో థియోడోసియస్ చక్రవర్తి ఆధ్వర్యంలో చర్చి (రోమన్ కాథలిక్) రోమన్ సామ్రాజ్య అధికారిక మతంగా మారింది. 5–16 శతాబ్దాల్లో మతసంస్కరణలు చోటు చేసుకున్నాయి. చర్చి నిర్మాణం, క్రైస్తవకళ, శైలులు, మతధర్మశాస్త్రం మున్నగు విషయాల్లో మార్పులు జరిగాయి. బైజాంటైన్, బరోక్ శైలులు క్రైస్తవకళను ప్రభావితం చేశాయి.

**చిత్రాలలో క్రీస్తు :** ప్రారంభ క్రైస్తవ యుగంలో మొదలైన క్రీస్తు చిత్రణ కాలక్రమంలో వివిధ శైలుల్లో, వివిధ కాలాల్లో, వివిధ చిత్రకారుల కుంచెల్లో ప్రామాణికతను సంతరించుకుంది. క్రీస్తు చిత్రాల్లో క్రైస్తవ ధర్మశాస్త్ర (థియాలజీ) ప్రభావం ప్రముఖంగా కన్పిస్తుంది. అనంతర చిత్రకారులు తమ సంస్కృతులకు అనుగుణంగా క్రీస్తును రూపొందించారు. ఆరవ శతాబ్దంలో క్రీస్తును రారాజుగా విశ్వపాలకునిగా, రక్షకునిగా స్థిరీకరించారు – బైజాంటైన్ శైలీ చిత్రాల నాటికి క్రీస్తు రూపానికి ప్రామాణికత ఏర్పడగా, పునరుజ్జీవన దశలో డావించీ, కారవాజియో లాంటి చిత్రకారులు క్రీస్తు ముఖంలో భావోద్రేకాలను చూపుతూ వాస్తవికతకు ప్రాణం పోశారు. అనంతర కళోద్యమాల ప్రతినిధులు విలియం హోల్‌మన్ హంట్, సాల్వడార్ డాలీలు అసాధారణ ప్రతీకలతో క్రీస్తుకు అధిభౌతిక రూపకల్పన చేశారు.

**తొలిదశ క్రైస్తవం :** 4వ శతాబ్దానికి ముందు హీబ్రూ (జూడాయిజం)లో విగ్రహాలు చెక్కడం, రూపొందించడం నిషేధం. తొలితరం క్రైస్తవులు ఈ విధమైన నిబంధన నతిక్రమించి క్రీస్తుకు రూపాన్ని యివ్వడం మొదలు పెట్టారు. వాటిలో రోమన్ ప్రభావం – గడ్డం లేని, పొట్టి జుట్టుతో, వొదులుగా వుండే ట్యూనిక్ ధరించిన రోమన్ శైలీ చిత్రాలు కన్పిస్తాయి.

బైజాంటైన్, మధ్యయుగాల నాటి క్రీస్తు చిత్రాల్లో క్రీస్తును విశ్వపాలకునిగా, భుజాలను తాకే పొడవైన నల్ల జుట్టు, గడ్డంతో క్రీస్తు రూపానికి ప్రామాణికతను చేకూర్చారు. శిలువ వేయబడిన క్రీస్తు ముఖాన్ని, బైబిలోలోని వివిధ సంఘటనలను చిత్రించడం ద్వారా కళాకారులు క్రీస్తు జీవితానికి, మహిమలకు దృశ్యరూపం కల్పించారు. ప్రాచీనకాలం నుండి నేటివరకు క్రీస్తు చిత్రాల్లో వివిధ సంస్కృతుల ప్రభావం, శైలిలో కూడా భిన్నత్వం కన్పిస్తుంది.

**క్రీస్తు చిత్రాలు :** 14–17 శతాబ్దాల్లో క్రీస్తు చిత్రాల్లో దైవిక లక్షణాల స్థానంలో మానవత్వపు లక్షణాలతో వాస్తవికత కన్పించడం ఇంకో మార్పు. డావించీ 'దలాస్ట్ సప్పర్' ఇందుకు చక్కని ఉదాహరణ. ఐసెన్ హెయిమ్ ఆల్టర్ పీస్ మేథిస్ గ్రూనెవాల్ట్ చిత్రం (1512–1516) శిలువ



చివరి తీర్పు మైఖేలేంజెలో చిత్రం

వేయబడిన క్రీస్తు ముఖంలోని బాధకు, భావోద్రేకాలకు ప్రసిద్ధిగాంచింది. ఎల్‌గ్రెకో శిలువను మోస్తున్న క్రీస్తు (1580) చిత్రం మేనరిజం లక్షణాలకు, అతిశయోక్తికి ప్రతినిధి. ఆధునిక, వర్తమాన కాల పెయింటర్లలో యూజీన్ డెల్‌క్రా, క్రైస్ట్ ఆన్ ద సీ ఆఫ్ గెలీలీలో నూతనత్వం చూపించగా, తర్వాత వచ్చిన చిత్రాల్లో నిర్దిష్టతకు ప్రాధాన్యత నివ్వడం గమనించవచ్చు. వార్నర్ సాల్మన్ క్రీస్తు తలను మాత్రమే చిత్రించి అనేక ప్రతులతో క్రీస్తు రూపానికి విస్తృత గుర్తింపుకు కారకుడయ్యాడు.

క్రీస్తును పాంటో క్రేటర్‌గా, దేవుని కుమారునిగా, రక్షకునిగా ప్రతిమా శాస్త్రానికి అనుగుణంగా ఆయాసోఫియా , ఇస్తాన్‌బుల్ చర్చిలో చిత్రించబడింది (537). డావించీ చిత్రం సాల్వేటర్ ముండి (1499-50) ద లాస్ట్ సప్పర్ చిత్రాలు సాంస్కృతిక ప్రతీకలు. రినైజాన్స్ కాలపు దుస్తుల్లో కన్పించే క్రీస్తు చిత్రం 450.3 మిలియన్ డాలర్లకు అమ్ముడు పోవడం ప్రపంచ రికార్డు. మెఖలేంజిలో (1536-1541) చివరి తీర్పు చిత్రం సిస్టెయిన్ ఛాపెల్‌పై కప్పులో చిత్రించబడి సాటిలేని చిత్రరాజం. భారీ సంక్లిష్ట కుడ్యచిత్రాన్ని పోప్ జూలియన్ 11 చిత్రింపజేసాడు. గెట్టీ మ్యూజియంలోని లక్షన్నర క్రీస్తు చిత్రాలు 'గెటీ ఇమేజెస్' హైరిజల్యూషన్ ఫోటోలు, విశ్వసనీయ వీడియోలు కళాప్రియులకు, పరిశోధకులకు మిక్కిలి ఉపయోగకరం.

**మేరీమాత చిత్రాలు :** రోమన్ కాథలిక్ సాంప్రదాయం, క్రిస్టియన్ ఆర్ట్‌లో మేరి జీసస్‌కు తల్లి: ఆమెకున్న అనేక పేర్లలో మడోనా ఒకటి. మేరీ చారిత్రక, బైబిల్ వ్యక్తి. శిల్ప, చిత్ర కళలో చారిత్రక కథనాల్లో మేరీ కన్య బాలయేసుతో కన్పిస్తుంది. మేరిమాత, మేరీకన్య, దబెస్ట్ మదర్, అవర్ లేడీ, మడోనా పేర్లన్నీ బైబిల్‌లో ఉటంకించిన, క్రైస్తవానికి కేంద్రకమైన మేరీ రూపానికి చెందినవే. వర్జిన్ మేరీ నజారత్‌కు చెందిన యూదు వనిత. జోసఫ్ భార్య, జీసస్ జనని, క్రైస్తవంలో ప్రముఖ వ్యక్తి. క్రైస్తవ మతంలోని సాంప్రదాయ, సనాతన కాథలిక్, ఇవాంజలికల్, లూథరన్, సంస్కరించబడిన ఆంగ్లికన్ మెథడిస్ట్, బాప్టిస్టులాంటి భిన్నశాఖలు మేరీని జీసస్ తల్లిగా నమ్ముతాయి. బైబిల్‌లోని మాథ్యూ, లూక్, గాస్పెల్స్ మేరీని వర్జిన్ (కన్య)గా, పవిత్రాత్మ ద్వారా జీసస్‌కు తల్లిగా ఎన్నుకోబడిందని చెబుతాయి. ఆ తర్వాత మేరీ జీవితాన్ని గురించిన ప్రస్తావనలు బైబిల్‌లో కన్పించవు. భూమిమీద తన పని పూర్తి కాగానే ఆమె స్వర్గం చేరుకుందని (అజంప్షన్) నమ్ముతారు. క్రైస్తవమత తొలి దశ నుండి మేరీ అత్యంత పవిత్రమైన, గొప్ప సెయింట్‌గా గౌరవప్రదమైన స్థానాన్ని పొందింది.

**మడోనా:** మడోనా పద బంధం ఇటలీ సంస్కృతిలో గౌరవప్రదమైన పిలుపు. ఇది మా-డోనా మాటల నుండి పుట్టింది, అర్థం మై లేడీ. ఉన్నత వర్గ స్త్రీలని మడోనాగా సంబోధించడంలో మర్యాద పాటించబడుతుంది. తర్వాత కాలంలో మేరీకి ఇది ప్రత్యామ్నాయంగా మారిపోయింది. క్రైస్తవ చిత్రకళలో మేరీ ప్రాధాన్యతను 'అవర్ లేడీ' అనడంతో గుర్తింపు ఇనుమడించింది. మడోనా - బిడ్డ చిత్రాలు 16వ శతాబ్దం నుండి క్రీస్తు చిత్రాలకన్నా ఎక్కువగా కన్పిస్తాయి. మడోనా చిత్రాలున్న ప్రదేశాలనుబట్టి వాటికి ద లేడీ ఆఫ్ లోరెటో, అవర్ లేడీ అఫ్ ఫాతిమా లాంటి పేర్లు పుట్టాయి. మడోనా బిడ్డ పెయింటింగుల్లో వివరణ కన్నా భక్తి భావానికి ప్రాధాన్యత ఎక్కువ. సాధారణంగా పసిబాలుడు, తల్లి చిత్రీకరణతోబాటు మడోనా ఒక్కరైనే చూపించిన చిత్రాలూ అనేకం కన్పిస్తాయి. 3-6 శతాబ్దాల్లో బైజాంటైన్ చిత్రకళలో సింహాసనం మీద బిడ్డను ఎత్తుకుని కూర్చున్న మడోనా చిత్రాలది చర్చిలలో ప్రత్యేకస్థానం. చర్చి తూర్పు గోడమీద క్రీస్తు బొమ్మ కింద మడోనా చిత్రం, చర్చిలో ప్రార్థన చేసే క్రైస్తవులకు, క్రీస్తుకు అనుసంధానంగా వుంటుంది. మైఖలేంజిలో మడోనా బిడ్డ పాలరాతి శిల్పం (1503-1505)లో మేరీ పవిత్రకన్య చేతుల్లోని బిడ్డను చిరునవ్వులతో చూస్తూ ఉంటుంది. ఇది బ్రూజెస్ చర్చి ఆఫ్ అవర్ లేడీలో గొప్ప ఆకర్షణ. ఎలిజబెతా సిరా నీ మడోనా బిడ్డ చిత్రాన్ని ప్రత్యేకంగా చెప్పుకుంటారు. బిడ్డను తన్మయత్వంతో చూస్తున్న మడోనాకు సాటి రాగల చిత్రం ఇంకొకటి కన్పించదు. ప్రజల్లో మడోనా పట్ల పవిత్ర భావాన్ని పెంపొం దించడం కోసం థియోలాజికల్ (ధర్మ



మడోనా, బిడ్డ

శాస్త్ర) ప్రాధాన్యతను వెనక్కునెట్టి మడోనాను అందంగా, అమాయకంగా, నిర్మలంగా చూపించే ప్రయత్నాలూ జరిగాయి. 17వ శతాబ్దం తర్వాత మడోనా చిత్రాల్లో మరో మార్పు, దివి నుండి దిగి వస్తున్న పిన్నవయసు మేరీని చిత్రించడం చూస్తాము. కారవాజియో 'ద మడోనా ఆఫ్ ద రోజరీ' చాలా ప్రసిద్ధ చిత్రం. మారుతున్న కాలానికి అనుగుణంగా మేరీ, క్రీస్తుల చిత్రాల్లో ఆబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ లక్షణాలు కనబడతాయి. క్రీస్తు, మేరీ, మడోనా – బిడ్డల నేపథ్యంతో క్రిస్మస్ ప్రాధాన్యతను తెలుసుకుందాం.

**క్రిస్మస్ పండుగ మూలాలు :** పేగన్ పండుగల్లో కన్పిస్తాయి. పేగన్లు జరుపుకునే వింటర్ సోల్ స్టిస్ (మన దక్షిణాయనం లాంటిది) వేడుకల నుండి పుట్టి ఉండవచ్చు. ఋతు క్రమాన్ని, ప్రకృతిలో వచ్చే సహజ మార్పులను, అది ప్రసాదించే పంట ఫలాలను గౌరవించడం కోసం వేడుకలు జరుపుకునేవారు. (మన దగ్గిర జనవరిలో సంక్రాంతి – పంటల పండుగను జరుపుకుంటాము) నాలుగవ శతాబ్దపు రోమన్ చర్చి నిర్ణయం ప్రకారం క్రిస్మస్ పండుగను డిశంబర్ 25న జరుపుకుంటారు. క్రైస్తవ మతేతరులు పేగన్లు జరుపుకునే పండుగలను తక్కువ చేయడం క్రిస్మస్ ఉద్దేశం కావచ్చు. క్రైస్తవ ఆచారాలకు మూలాలన్నీ పేగన్ ఆచారాలలో కన్నిస్తాయి, ఐనా క్రిస్మస్ జరుపుకోవడంలో క్రీస్తు జననానిదే ప్రముఖస్థానం.

క్రిస్మస్‌ను ప్రపంచంలోని 160కి పైగా దేశాలు జరుపుకుంటాయి. క్రైస్తవ మత దేశాల్లో ఇది మత ప్రాధాన్యతను కలిగి వుంటే మిగతా దేశాల్లో దీన్ని మతరహిత లౌకిక (సెక్యులర్) పండుగగా జరుపుకుంటారు. మత, రాజకీయ కారణాల వల్ల కొన్ని దేశాల్లో క్రిస్మస్‌ను జరుపుకోరు. చైనా జపాన్ లాంటి దేశాల్లో దీన్ని సాంస్కృతిక వేడుకగా, వ్యాపారాభివృద్ధికి వేదికగా ఉపయోగించుకుంటారు. అలంకరణలు, బహుమతులు యిచ్చివుచ్చుకోవడాలు, బంధుమిత్రుల సమావేశాలు, విందులు, వినోదాలతో సంబరాలు చేసుకుంటారు. జూలియన్ కేలండర్‌ను అనుసరించేవారు క్రిస్మస్‌ను జనవరి 7వతేదీని జరుపుకోవడం (జార్జియా) ప్రత్యేకత. ఉత్తరకొరియా, సౌదీ అరేబియా, సోమాలియాల్లో క్రిస్మస్ జరుపు కోవడం నిషేధం, పబ్లిక్ హాలిడే కూడా ఉండదు. ఇష్టమైన వారు ఇండ్లలో జరుపుకుంటారు.

క్రిస్మస్‌ను వివిధ దేశాల్లో వివిధ పేర్లతో – నోయల్, నేటివిటీ, కోలెడా, బోరోదిన్‌గా సంబరాలు చేసుకుంటారు. క్రైస్తవమత దేశాల్లో చర్చీలు ప్రార్థనలు (సర్వీసెస్), భక్తిగీతాలు (కారల్స్), సంగీతం, క్రిస్మస్ చెట్లు, విందులతో కళకళలాడుతుంటాయి. క్రిస్మస్‌ను జర్మనీలో వేయినాక్ట్‌మన్ అనీ, రష్యాలో డెడ్ మెరోజ్, బ్రెజిల్‌లో పాపాయ్ నోయెల్, ఇటలీలో బేబూనటాలే, జపాన్‌లో హోటీ షో, ఇంగ్లండ్‌లో ఫాదర్స్‌క్రైస్ట్ అని అంటారు. దివ్యశుభాకార్యం, మహా భాగ్యం, దివ్యారాధన, పవిత్ర భోజనం మొదలైన కార్యక్రమాలు క్రిస్మస్‌లో భాగం. చాలా ప్రపంచ దేశాల్లో క్రిస్మస్ పబ్లిక్ హాలిడే. హాలిడే అనే మాట హోలీడే నుండి పుట్టింది. చాలా దేశాలు క్రిస్మస్‌ను డిశంబర్ 25న జరుపుకుంటే జర్మనీ, స్వీడన్, చెక్ రిపబ్లిక్‌లు డిశంబర్ 24న (క్రిస్మస్ ఈవ్), రష్యా ఉక్రెయిన్లు జనవరి 7న, ఆర్మేనియా లెబనాన్‌లు జనవరి 6న జరుపుతూంటాయి. వారు అనుసరించే కాలండర్ అందుకు కారణం. క్రిస్మస్ సాంప్రదాయ వేడుకల్లో–క్రిస్మిస్ ట్రీ, శాంటాక్లాజ్ బహుమతులు, గ్రీటింగ్ కార్డులు, విందుభోజనం, సంగీతం, కారల్స్, అలంకరణ, లైటింగ్‌లది ప్రముఖ పాత్ర.

**క్రిస్మస్ ట్రీ :** క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ, క్రైస్తవేతరుల యిండ్లలో సాధారణంగా కనిపించేది క్రిస్ మస్‌ట్రీ. ఫర్ చెట్టు కొమ్మలతో పొడవైన త్రిభుజాకారంలో నిర్మిస్తారు. దీన్ని రంగుల విద్యుద్దీపాలతో, తళుకు బెళుకుల రిబ్బన్లతో, చమ్కీలతో, ఏపిల్స్‌తో చెట్టు కొన మీద పెద్ద నక్షత్రంతో అలంకరిస్తారు. చెట్టు నిత్య హరితానికి, ఆశలకు, సంతోషానికి ప్రతీక. విద్యుద్దీపాల అలంకరణ రాబోయే చీకటి చలి రోజుల్లో వెలుగులు నింపుతుందని నమ్ముతారు. కొనన అమర్చిన నక్షత్రం – జీసస్ పునరుద్ధానానికి గుర్తు, సంతోషం, కుటుంబ కలయికల సంకేతం. చెట్లకుండే సూదుల్లాంటి ఆకులు శిలువ మీది క్రీస్తు తలపైని ముళ్ళ కిరీటాన్ని గుర్తుచేస్తాయి.

**మెర్రీ క్రిస్మస్ చారిత్రక మూలాలు :** 19వ శతాబ్దపు చార్లెస్ డికెన్స్ నవల 'ఏ క్రిస్మస్ కారల్' వల్ల ఈ ప్రయోగానికి ప్రచారం వచ్చింది. 'మెర్రీ' అంటే ఉత్సాహం, అవధులులేని సంతోషం అని అర్థం. హేపీ అంటే తృప్తి ఆనందాల దశ. మెర్రీలో చురుకుదనం, అల్లరితనం, విందు వినోదాలు, ఆటపాటలు ఇమిడి వుంటాయి. అర్థంలో దాదాపు రెండూ ఒక్కటే కానీ దీన్ని అమెరికాలో మెర్రీ క్రిస్మస్ అనీ యుకెలో హేపీ క్రిస్మస్ అనీ అంటారు. గ్రీటింగ్ కార్డులమీద 'మెర్రీ క్రిస్మస్' అనే ఉంటుంది.

**క్రిస్మస్ కారల్స్ :** క్రైస్తవ భక్తి గీతాలతో, సంగీత విభావరులతో క్రిస్మస్ పండుగ మారుమోగిపోతుంది. చర్చీలలో అర్ధరాత్రి ప్రార్థనలు జరుగుతాయి.

**బంధుమిత్రుల సమాగమాలు :** ఎక్కడెక్కడో వున్న కుటుంబ సభ్యులు క్రిస్మస్‌కు ఒకచోట కలుసుకోవడం, విందు వినోదాలతో పండగ జరుపుకోవడం ఆచారం. టర్కీ (సీమకోడి), మల్డ్ బీర్, వైన్‌తో విందుచేసుకుంటారు. మల్డ్ బీర్ / వైన్‌ను సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా వేడిచేసి తయారుచేస్తారు.

**శాంటాక్లాజ్ :** క్రైస్తవంతో ముడి పడి వున్న ప్రాచీన వ్యక్తి. పిల్లల నెంత అలరిస్తాడో, అంతగా పెద్దలకు పనిపెడతాడు, పిల్లల కోర్కెలను పెద్దల ద్వారా తీర్చే అతి ముఖ్యమైన పాత్ర శాంటాది. ఇవ్వడంలో వున్న గొప్పతనానికి ప్రతీక. క్రిస్మస్ వేడుకల్లో పిల్లలు, బాలబాలికలు అమితంగా యిష్టపడే కీలకమైన పాత్ర. శాంటా పేరు వినగానే వారికి బహుమతులు, మాయాలోకం, సంతోష సమయాలు గుర్తుకొస్తాయి. శాంటా క్లాజ్ ద్వారా పిల్లల ఊహాశక్తిని పెంచేది, కోరిన కోరికలు తీర్చేది పెద్దవారే. ఇంటిపైన వుండే చిమ్నీ గొట్టం ద్వారా ఇంట్లోకి ప్రవేశించి, ఫైర్ ప్లేస్ పక్కన వేలాడ దీసిన స్టాకింగ్స్‌లో బహుమతులు ఉంచి వెళ్తాడని పిల్లలు నమ్ముతారు. ఈ ప్రాచీన వ్యక్తి మతాతీతంగా పిల్లలందరికీ అభిమానపాత్రుడు, శాంటాక్లాజ్ రూపం, వేషం–తెల్లటి గడ్డం, మీసాలు, ఎర్ర టోపీ, సూటు, పెద్ద బెల్టుతో పొట్టిగా, లావుగా వుల్లాసంగా వుంటుంది. శాంటాక్లాజ్ నివాసం నార్వేలోని రోవానీమ అనే ఊరు. రెయిన్ డీర్‌లాగే మంచుపై జారే స్లెయ్‌లో విహరించే శాంటాక్లాజ్‌ను చూడాలన్నా, ఎల్ఫ్‌పాఠశాలను సందర్శించాలన్నా ఇక్కడే సాధ్యమౌతుంది. క్రిస్మస్ సీజన్‌లో ఇక్కడి పోస్టాఫీస్‌లో రోజూ మిలియన్ లేఖల బట్వాడా జరుగుతుంది. శాంటా అడ్రస్–శాంటాక్లాజ్, నార్త్ పోల్ Ho Ho Ho కెనడా. శాంటాక్లాజ్‌కు రాసే లేఖలకు పోస్టేజీ వుండదు. 30 భాషల్లో బ్రెయిలీతో కలిపి డిశంబర్ 16వ తేదీ వరకు శాంటాకు రాసే లేఖలకు క్రిస్మస్‌నాటికి జవాబు వస్తుంది.

**బహుమతులు :** క్రిస్మస్‌కు బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం అన్ని దేశాల్లో ప్రచలితంగా వున్న ఆచారం. రాబోయే చలికాలానికి పనికొచ్చే ఉన్ని దుస్తుల నుండి, మగ్గులు, కాఫీ కప్పుల వరకు ఎన్నెనో బహుమతులు యిచ్చిపుచ్చుకోవడం జరుగుతుంది. అవసరానికి పనికొచ్చేవి, ధరించడానికి అనువైనవి, చదువుకోవడానికి పనికొచ్చేవి, పని (ముట్లు) కొచ్చేవిగా వుంటాయి. గిఫ్ట్ కార్డులు, నగదు రూపంలో డబ్బు ఇవ్వడం కూడా సాధారణం, ఏ టు జెడ్ (A-Z) వరకు పేరును బట్టి అక్షరాలు చెక్కిన లాకెట్లు కూడా బహుమతుల్లో భాగమే. ఓ హెన్రీ (ద గిఫ్ట్ ఆఫ్ ద మాగీ) (1905) కథ క్రిస్మస్ బహుమతి ప్రాముఖ్యతను తెలియజేసే ప్రపంచ ప్రఖ్యాత చిన్న కథ. ఇవేగాక విద్యుద్దీప కాంతులు, భవనాల, చర్చీల దీపాలంకరణలు, ప్రతి క్రిస్టియన్ ఇంటిముందు లైటింగ్ అమర్చిన నక్షత్రాలు, విందు వినోదాలు, క్రిస్మస్ ఆచారాల్లో ముఖ్యమైన ఆకర్షణలు.

**దేశ విదేశాల్లో క్రిస్మస్ వేడుకలు :** క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకునే దేశాలు పర్యాటకులను ఆకర్షించే మార్కెట్లకు, సాంప్రదాయ ఆహార, పిండివంటలకు, అందమైన హేమంత ప్రకృతికి నిలయాలు. వీటిని సందర్శించడం, క్రిస్మస్‌ను గడపడం వారికి వేరే లోకంలో విహరించడంతో సమానం. అలాంటి కొన్ని దేశాలు, వాటి విశేషాలు.

**స్ట్రాస్ బర్గ్ – ఫ్రాన్స్ :** 1570 నుండి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జరుపుకుంటూ యూరప్‌కంతటికీ ఆకర్షణీయమైన కలల పట్టణం స్ట్రాస్‌బర్గ్. పద్మవ్యూహం లాంటి వీధులు, అందమైన భవనాలు, గుండ్రాళ్లు పరచిన నడవలతో చాలా పెద్ద క్రిస్మస్ ట్రీలు, దీపాలంకరణతో మిరుమిట్లు గొల్పే వీధులతో జానపద కథల్లోంచి ఊడిపడినట్లుంటుంది. ప్రఖ్యాత క్రిస్మస్ మార్కెట్లతో ప్రపంచ క్రిస్మస్ రాజధానిగా పేరుగాంచింది.

**లాప్ లాండ్ – ఫిన్లాండ్ :** శాంటాక్లాజ్ వూరు, రకరకాల సాంప్రదాయ వంటకాలకు ఇండ్లలో తయారు చేసే బీరు, వైన్‌లకు ప్రసిద్ధి. డిన్నర్ తర్వాత శాంటా క్లాజ్ ఇక్కడి బాలబాలికలను కలిసి వారి కోరికలను తీర్చిన తర్వాతనే ప్రపంచ బాలబాలికల కోరికలు తీర్చడానికి బయలు దేరతాడు. ఇంకెక్కడా కన్పించని 'వింటర్ ప్రకృతి దృశ్యాలకు' ఖ్యాతి గాంచింది. సంవత్సరంలోని అతి తక్కువ

రెండుంబావు గంటల పగటి సమయాన్ని మంచుతో కప్పబడిన చెట్లు, ఇండ్లు, రోడ్లు సున్నా డిగ్రీకు తక్కువ ఉష్ణోగ్రతలో క్రిస్మస్ జరుపుకోవడం ఇక్కడి వింత అనుభవం.

**ఎడిన్ బరో – స్కాట్లాండ్ :** అసలే అందమైన రాజధాని నగరం, ఆపైన క్రిస్మస్ పండుగ వాతావరణం. డిశంబర్ నెలంతా మార్కెట్లతో, వినోద కాలక్షేపాలతో ప్రత్యేకంగా తయారుచేసిన మల్డ్ వైన్‌లో మునిగి తేలుతుంది. స్కాట్ మాన్యుమెంట్, ప్రిన్సెస్ స్ట్రీట్ గార్డెన్స్ విద్యుత్ దీపాల అలంకరణలతో మహానందడిగా వుంటాయి. ముందుగా బుక్ చేసుకోకుంటే తప్ప ఇక్కడ హొటళ్ళలో బస దొరకడం కష్టం.

**హ్యూ ఇష్ టెన్ బోస్క్ – జపాన్ :** నాగసాకి ప్రాంతంలో వున్న ఇది డచ్ పట్టణ శైలిలో నిర్మించిన థీం పార్క్. గాలిమరలు, కాలువలు, రంగురంగుల ట్యూలిప్ పూలతోటలతో క్రిస్మస్ నాటికి అందంగా ముస్తాబవుతుంది. 13 మిలియన్ లైట్ల మిరుమిట్లు, 15 మీటర్ల ఎత్తైన క్రిస్మస్ ట్రీ ఇక్కడి ఆకర్షణలు. కుటుంబాల కంటే జంటలు ఎక్కువగా పాల్గొనే లౌకిక వేడుక. ఇది కూడా అతిపెద్ద క్రిస్మస్  మార్కెట్‌కు కేంద్రం.

**ప్రాగ్– చెక్ రిపబ్లిక్ :** అందమైన 'రొమాంటిక్' నగరంలో క్రిస్మస్ నెల రోజుల వేడుక. ఇంకెక్కడా చూడలేని గోథిక్ నిర్మాణాలను ఇక్కడ చూడవచ్చు. ఓల్డ్ టౌన్ స్క్వేర్‌లో ప్రతిష్ఠించే క్రిస్మస్ ట్రీ, మంచు దుప్పటి కప్పుకున్న, విద్యుద్దీపాలంకరణలో మెరిసే కాబుల్డ్ వీధులు – అంతా పండుగ వాతావరణంలో నగర సందర్శన చేయడం ఇక్కడ ఆకర్షణలు.

**స్పెయిన్ బిగ్ లాటరీ :** క్రిస్మస్ సందర్భంగా స్పెయిన్ దేశంలో డిశంబర్ 20న జరిగే అతిపెద్ద లాటరీ ఈవెంటు. ఈ లాటరీలో విజేతలకు 2.7 బలియన్ యూరోలు బహుమతిగా యిస్తారు. ఎల్‌గార్డోగా పిలువబడే ఈ సంఘటన అక్కడి క్రిస్మస్‌లో శాశ్వత భాగంగా కలిసి పోయింది. 18 డిశంబర్ 1812లో 400,000 యూరోలతో మొదలైన లాటరీ ప్రస్తుతానికి 2.7 బిలియన్ యూరోల మొత్తంతో ప్రపంచంలో అతిపెద్ద లాటరీగా పేరుగాంచింది. ఇది ప్రభుత్వ ఆధ్వర్యంలో నడవడం కూడా విశేషమే. ప్రతి లక్ష టిక్కెట్లలో తప్పనిసరిగా ఒక్క విజేత చొప్పున చాలామంది బహుమతులందుకుంటారు.

**ఫిలిప్పీన్స్ :** ఫిలిప్పీన్స్‌లో క్రిస్మస్‌ను నాలుగు నెలలు – సెప్టెంబర్ 1 నుండి జనవరి 1 వరకు జరుపుకుంటారు. అలంకరణలు, సంగీతంతో క్రిస్మస్ వేడుకలు మొదలవుతాయి. బెర్లిన్, బ్లాక్‌ఫారెస్ట్–జర్మనీ, రేక్జావిక్ – ఐస్‌లాండ్ రాజధాని, హాంకాంగ్–చైనా, లండన్– ఇంగ్లండ్, సింగపూర్ మొదలైన నగరాలు క్రిస్మస్ సంబరాలకు, ఆయాదేశాల సంస్కృతీ సాంప్రదాయాల ప్రదర్శనలకు, సాంప్రదాయ వంటలకు ప్రసిద్ధి గాంచినవి. ప్రపంచ పర్యాటకులకు వినోదాన్ని పంచడంలో వీటిది అగ్రస్థానం,

**క్రిస్మస్ సందేశం :** ప్రపంచవ్యాప్తంగా ప్రేమ, కరుణను పంచడం, సాంప్రదాయాలను సృష్టించడం, మధురమైన జ్ఞాపకాలను పెంచడం, పంచడం, కుటుంబ బంధాన్ని పటిష్టం చేయడం, చీకటి రోజుల్లో, మనసుల్లో కాంతిని నింపడం, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించడం, శాంతి ఐకమత్యాన్ని పెంపొందించడం, వ్యాపారాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక ఉద్దీపన కలగించడం క్రిస్మస్ సాధించే గొప్ప విజయం. అంతిమంగా ప్రపంచమంతటా సంతోషాన్ని నింపడం దీని ముఖ్యసందేశం.

**క్రిస్మస్‌ను గురించిన మరికొన్ని విశేషాలు :** ♦ క్రీస్తు జననం యుగ విభజన చేయడానికి ఉపయోగపడింది. క్రీస్తు పూర్వాన్ని బిసి అనీ, క్రీస్తు తర్వాతి కాలాన్ని ఎసి అనీ విభజన చేయడం జరిగింది. క్రైస్తవంపై నమ్మకం లేనివారు, శాస్త్రజ్ఞులు కాలాన్ని బిసిఇ (బిఫోర్ కామన్ ఎరా) అనీ, సిఇ (కామన్ ఎరా) అనీ, సామాన్య /సాధారణ యుగానికి ముందు, సామాన్యయుగం అని రాస్తారు. 15వ శతాబ్దం ఎసి అన్నా 15 సెంట్ .సిఇ అన్నా ఒకటే. ♦ దేశ భాషా, సంస్కృతుల కతీతంగా ప్రపంచమంతటా జరుపుకునే పండుగ నూతన సంవత్సరం తర్వాతి స్థానం క్రిస్మస్‌ది. ♦ ఖురాన్ క్రీస్తును అరబిక్‌లో ఈసాగా, ప్రవక్తగా గౌరవిస్తుంది, కానీ క్రీస్తు దైవత్వాన్ని అంగీకరించదు. ♦ క్రిస్మస్ జరుపుకున్న మొట్టమొదటి దేశం రోమ్. (డిశంబర్ 25 336 సిఇ). **బైబిల్‌లో మొదటి క్రిస్మస్‌ను గురించి ఏ సమాచారం లేదు.** కానీ జీసస్ జన్మదినాన్ని జరుపుకున్నట్లు తెలుస్తుంది. ♦ ఇంగ్లండ్‌లో "రాయల్ ఫామిలీ" హేపీ క్రిస్మస్ అనడం వల్ల ఇంగ్లండ్, ఐరోపా దేశాల్లో హేపీ క్రిస్మస్ అంటారు. ♦ ఇండియానా – పెన్సిల్వేనియాను క్రిస్మస్‌ట్రీ రాజధాని అంటారు. లక్షలాది క్రిస్మస్ ట్రీలను పెంచి అమెరికాలోని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ♦ ఇటీవలి కాలంలో క్రిస్మస్‌కు స్మార్ట్‌ఫోన్లు బహుమతిగా యివ్వడం మామూలయింది!

**తంగెడ విశ్వేశ్వర ప్రసాద్**
(టి.వి.ప్రసాద్), రిటైర్డ్ ప్రిన్సిపాల్.
హైదరాబాద్, ఫోన్ నెం. 7981398250

# దేవులపల్లి రామానుజరావు భాషాసేవ

– *డా.జి. వెంకట లక్ష్మి*

**ఏ ప్రపుల్ల పుష్పంబుల ఈశ్వరునకు**
**పూజ సేసితినో ఏను పూర్వమందు**
**కలదయేని పునర్జన్మ కలుగు గాక**
**మధుర మధురమైన తెలుగు మాతృభాష"**– అంటూ తెలుగు భాష ఔన్నత్యానికి తగు సేవచేసన్తా తనకు గల భాషాభిమానాన్ని చాటుకున్నారు దేవులపల్లి రామానుజరావు గారు. అంతేకాదు తెలుగు భాషా సంస్కృతులకు తన చేతనైనంత సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో జీవితాన్నంతా భాషా వికాసానికే ధారపోసిన ధన్య జీవి ఆయన. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం, ప్రయత్నిస్తే సులభంగా మంచి ఉద్యోగం దొరికే అవకాశం, న్యాయవాద వృత్తిని చేపట్టినా పుష్కలంగా డబ్బు సంపాదించే సదుపాయం... ఇన్ని అవకాశాలున్నా, అన్నీ వదులుకొని దేశ సేవ, భాషా సేవ చేయాలన్న ఉత్సాహంతో, సమున్నత ఆశయంతో ముందడుగు వేశారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, రాజా రామేశ్వరరావు, నరోత్తమరెడ్డి వంటి మిత్రుల ప్రోద్బలం, సహకారం రామానుజరావు గారిని భాషా, సాంస్కృతిక రంగాల వైపు దారి మళ్లించింది. నా యాభై ఎనిమిది సంవత్సరాల వయసులో ముప్పై ఆరు సంవత్సరాల ప్రజాహిత జీవనంలో అత్యధిక సమయాన్ని తెలుగు భాషా సేవకు వినియోగించినందు వల్ల.... అంటూ దేవులపల్లి రామానుజారావు "నా రేడియో ప్రసంగాలులో చెప్పుకున్నమాటలు అక్షర సత్యాలు.

డా. దేవులపల్లి రామానుజరావు గారి భాషా సేవను సౌలభ్యం కోసం ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించుకోవచ్చు. అవి (1) వివిధ సాహిత్య, సాంస్కృతిక సంస్థల నిర్వాహకుడిగా (2) పత్రిక సంపాదకుడిగా (3) ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బోధనా భాషగా తెలుగు అమలుకు కృషి చేయడం. ఒక్కో అంశం వివరంగా పరిశీలిద్దాం.

**సంస్థల నిర్వాహకునిగా.....** భాష–ఏ దేశంలోనైనా, ఏ సమాజంలోనైనా భావ వ్యక్తీకరణకు, జాతి వికాసానికి వాహిక. కానీ నిజాం పాలన క్రింద ఉన్న నాటి తెలంగాణ ప్రాంత ప్రజల్లో మాతృభాషా వికాసం శూన్యం. సాహిత్య సభలు జరపాలన్నా, గ్రంథాలయాలు నడపాలన్నా, పత్రికలు నిర్వహించాలన్నా ... ఇలా ప్రజల వికాసానికి మేలు చేసే ఏ పని చేయాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతి పొందడం తప్పని సరి. విద్యా వనస్థలో తెలుగు భాషకు స్థానమే లేని రోజులవి. కనీసం ప్రాథమిక విద్యను కూడా మాతృభాషలో చదువు కోలేని పరిస్థితి. చివరకు "ఆంధ్ర" అనే పదమే ప్రభుత్వానికి కంటకంగా మారిన నేపథ్యంలో ఎన్ని నిర్బంధాలు విధించినప్పటికి హైదరాబాద్ రాష్ట్ర ప్రజల్లో జాతీయ భావాలు క్రమంగా వ్యాప్తి చెందాయి. ఈ జాతీయతా భావనలో నుంచి పుట్టినవే భాషా సాంస్కృతిక ఉద్యమాలు. ఈ ఊపులోనే తెలుగు నాట గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది.. 1901లో హైదరాబాద్‌లో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారి ప్రోత్సాహంతో శ్రీ కృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయం స్థాపితమైంది. మునగాల రాజావారు, రావిచెట్టు రంగారావు గార్ల సహాయంతో క్రమక్రమంగా అభివృద్ధి చెంది తెలుగు ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు. విశ్వనాథ సత్యనారాయణ, మల్లంపల్లి సోమశేఖర శర్మ, శివశంకర స్వామి వంటి ఎందరో కవి పండితుల ఉపన్యాసాలను భాషా నిలయంలో వినే



దేవులపల్లి రామానుజరావు

అవకాశం రామానుజరావు గారికి దక్కింది. మాడపాటి హనుమంతరావు గారి కృషి, సురవరం ప్రతాపరెడ్డి, ఆది రాజు వీరభద్రరావు వంటి పండితులు, దేశాభిమానుల తోడ్పాటుతో శ్రీ కృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయం అభివృద్ధి చెందింది కానీ అది నేటిదాకా నిలదొక్కు కోవడంలో దేవులపల్లి రామానుజ రావుగారి కృషి మరవ లేనిది. భాషా నిలయం రజతోత్సవాలు విజయవంతం కావడంలోనూ రామానుజా రావుగారు కృషి చేశారు. తరువాత రామానుజరావు గారు వరంగల్ శబ్దాను శాసన గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉన్న సమయంలో 1944లో రజతోత్సవాల సభ నిర్వహించే అవకాశం కలిగింది. కార్యదర్శిగా "శబ్దాను శాసన గ్రంథాలయం" అభివృద్ధికి ఎంతో కృషి చేశారు రామానుజరావు గారు. 1946లో నల్లగొండ జిల్లా చండూరులో జరిగిన "సాహితీ మేఖల" దశమ వార్షికోత్స సభ రామానుజరావు గారి అధ్యక్షతన జరిగింది. తెలంగాణ అంతటికి ఏదైనా ఒక సాహిత్య సాంస్కృతిక సంస్థ ఉండాలన్న ప్రబలమైన కోరిక ఆనాటి రచయితలు, పండితుల్లో వ్యాపించి వుంది. 1943 మే నెలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపనతో ఆ కోరిక నెరవేరింది. మొదటి అధ్యక్షులుగా లోకనంది శంకర నారాయణరావు వ్యవహరించారు. తర్వాతి అధ్యక్షులు సురవరం ప్రతాపరెడ్డి గారు. వీరు అధ్యక్షులుగా ఉన్న ఆ సమయంలోనే 1944లో "పరిషత్తు" మొదటి వార్షికోత్సవ సభలు వరంగల్లో మూడు రోజుల పాటు జరిగాయి. ఈ సమావేశాల్లోనే రామానుజారావు గారు అత్యంత చిన్న వయస్సులో పరిషత్తు కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఈ సభల సందర్భంగా తెలంగాణలోని ప్రాచీన వాఙ్మయాన్ని, ఆధునిక వాఙ్మయాన్ని వివరించే పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. అలా కార్యవర్గ సభ్యుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి 1947 నుండి 1952 వరకు ఉపాధ్యక్షుడిగా, 1954 నుండి 1962 వరకు అధ్యక్షుడిగా భాషా సారస్వత సేవలు కొనసాగించారు. పరిషత్తు నిర్వహించే పరీక్షలకు గుర్తింపు రావడం, ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, విశారద పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను మాధ్యమిక పాఠశాలల్లో తెలుగు పండితులుగా నియమిస్తుండటం జరిగింది. ఈ విధంగా పరిషత్తు పరీక్షల పుణ్యమా అని వందలాది మందికి ఉపాధ్యాయ పదవులు దక్కుతుండటంతో ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య నానాటికి పెరిగింది. ఈనాటి వరకు సుమారు 150,000 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. కొన్ని వేలమందికి ఉపాధి లభించింది. క్రమంగా పండిత శిక్షణ కళాశాల నిర్వహణ బాధ్యతను కూడా పరిషత్తు చేపట్టి దేశానికి, భాషకు, ప్రభుత్వానికి కావలసిన అవసరాలను తీర్చింది. అంతటితో ఆగక ప్రచురణల బాధ్యతను కూడా చేపట్టింది. సురవరం ప్రతాపరెడ్డి గారి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర"ను తొలి సారిగా ప్రకటించింది పరిషత్తే. స్త్రీల పాటలు, పల్లె పదాలు మొదలైన జానపద సాహిత్యాన్ని మూడు సంపుటాలుగా ప్రకటించింది పరిషత్తు. తెలుగు భారతం, భాగవతం పైన లబ్ధప్రతిష్ఠులైన పండితుల చేత ప్రామాణికమైన ఉపన్యాసాలు ఇప్పించి వాటిని గ్రంథస్థం చేసింది పరిషత్తు. ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద జాబితానే అవుతుంది. ఈ విధంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు శాఖోపశాఖలుగా విస్తరించి, రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా పరీక్షల నిర్వహణ, ఉత్తమ శ్రేణి ప్రచురణలు, సాహిత్య సమావేశాల ఏర్పాటులో రామానుజ రావు గారి కృషి గణనీయమైంది. వారి మాటల్లోనే చెప్పాలంటే "పరిషత్తు వికాసానికి జీవితంలో అత్యధిక భాగాన్ని వినియోగించిన సంతృప్తి నాకున్నది. ఇంటిలోని వ్యవసాయాన్ని విస్మరించి, సులభంగా సాధించగలిగిన ఉద్యోగాల జోలికి పోక, అనుకూలంగా అవలంబించగలిగిన న్యాయవాద వృత్తిని గూర్చి శ్రద్ధ వహించక, యీ విధంగా సారస్వత పరిషత్తును ప్రారంభించి పూర్తిగా సాహిత్య , సాంస్కృతిక కార్యక్రమాల్లో మునిగిపోయాను" అంటారు.

దేవులపల్లి రామానుజ రావు గారు 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ కార్యదర్శిగా నియమితులై దాదాపు 22 సంవత్సరాల పాటు అకాడమీ పరంగా భాషా- సాహిత్య వికాసాలకు ఎనలేని తోడ్పాటు నందించారు. 1979లో అకాడెమీ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. వీరి హయాంలో అకాడెమీ సుమారు 300 గ్రంథాలను ప్రచురించి, అనేక సమావేశాలను

నిర్వహించింది. అదేవిధంగా రానుజరావు గారు తెలుగు అకాడెమీ స్థాపితమైన నాటి నుంచి సభ్యుడిగా ఉండి మాతృ భాషలో విశ్వ విద్యాలయ స్థాయి విద్యార్థుల వరకు పాఠ్య గ్రంథాల రచన, రూపకల్పనలో ప్రత్యక్షంగా సేవలందించారు. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు కోశాధికారిగా వ్యవహరించి తెలుగు భాషా సంస్కృతులను ప్రపంచానికి చాటి చెప్పారు.

**సంపాదకుడిగా ..** దేవులపల్లి రామానుజ రావు గారి మొదటి వ్యాసం గోలకొండ పత్రికలో ప్రచురితమైంది. వరంగల్‌లో ఉండగా సురవరం ప్రతాపరెడ్డి గారి పిలుపు మేరకు, మాడపాటి హనుమంత రావు. రాజారామేశ్వర రావు, నరోత్తమ రెడ్డి గార్ల ప్రోత్సాహంతో సుమారు 20 సంవత్సరాల పాటు గోలకొండ పత్రికకు సంపాదకీయాలు రాసి, సంపాదక కార్యకలాపాలను పర్యవేక్షించారు. తెలంగాణలో సాహిత్య పత్రికలు లేని లోటు తీర్చాలన్న సంకల్పంతో 1946 ప్రాంతంలో 'శోభ' అనే సాహిత్య మాస పత్రికను ప్రారంభించారు – ఆనాటి పరిస్థితుల్లో ఆ పత్రికను ఒక సంవత్సరం పాటు నడిపి ఆపేశారు. తిరిగి 1950లో గోలకొండ ప్రచురణల పక్షాన "శోభ" పత్రిక మరో సంవత్సరం నడిచి ఆగిపోయింది. సురవరం, బూర్గుల రామకృష్ణారావు గార్ల వ్యాసాల్ని 'శోభ ' పత్రికలో ప్రచురించేవారు. యువకవి దాశరథి తొలి రచనలు కూడా "శోభ"లోనే ప్రచురితమైనాయి. కాళోజీ నారాయణ రావు కవితలు, పొట్లపల్లి రామారావు, భాస్కర భట్ల కృష్ణారావు, నందగిరి ఇందిరా దేవి, బూర్గుల రంగనాధ రావు, వెల్దుర్తి మాణిక్య రావు, ధరణికోట శ్రీనివాసులు మొదలైన వారి ఎందరో రచనలు "శోభ"లో ప్రచురితమైనాయనడంలో అతిశయోక్తి లేదు. ఆ రోజుల్లో పత్రికలు నిర్వహించడమంటే ప్రాణాలకు తెగించి పోరాడటమన్నట్లు. ఎన్నో నిర్బంధాలు, ఆంక్షల నడుమ కూడా రామానుజరావుగారు పత్రికల ద్వారా భాషా సాంస్కృతిక సేవకు ఉద్యమించారు. గురజాడ శత వార్షికోత్సవ సంచిక (1962–64)కు సంపాదకుడుగా వ్యవహరించారు. 1960–61లో టాగూరు శత వార్షికోత్సవ సంచికకు సంపాదకుడుగా వ్యవహరించారు. 1981లో రెండవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచికకు సంపాదకుడుగా ఉండి భాషా సాంస్కృతిక వికాసానికి తన వంతు కృషి చేశారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు గారిలోని తెలుగు భాషా పిపాసను గూర్చి తెలంగాణాలో తెలుగు దీపం ఆరిపోకూడదనే ఆశయంతో, భాషా స్రవంతి ఇంకిపోరాదనే తపనతో భాషాభివృద్ధి ఉద్యమంలో పాల్గొన్నారు అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారి అభిప్రాయం.

**ఉస్మానియాలో తెలుగు భాష అమలుకు :** నాటి నిజాం పాలనలో పాలకుల భాషకున్న ప్రాముఖ్యం ప్రజల భాషకు లేదు. మాతృభాషలో విద్యాబోధన ఉత్త కల్పన గానే మిగిలింది. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రాథమిక దశ నుంచి అత్యున్నత దశ వరకు బోధనా మాధ్యమంగా ఉర్దూ భాషకే పట్టం కట్టారు. తెలుగు, మరాఠి, కన్నడలు కనీసం ద్వితీయ భాషలుగా కూడా అమలు కాలేదు. 1948లో పోలీసు యాక్షన్ తర్వాత 1949లో తూప్రాన్‌లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సభల్లో మాతృ భాషలోనే విద్యాబోధన జరగాలని, విశ్వవిద్యాలయ స్థాయి ఇంటర్, డిగ్రీ తరగతుల్లో తెలుగు, మరాఠీ, కన్నడలు ద్వితీయ భాషలుగా ఉండాలని, పాలనలో ప్రజల భాషకు సముచిత స్థానం కల్పించాలని తీర్మానం చేయడం జరిగింది. ఈ తీర్మానాలను అమలు జరిపించడానికి ఆచార్య తనికెళ్ళ వీరభద్రుడు గారి నాయకత్వంలో రామానుజ రావు గారు కార్యదర్శిగా, మాడపాటి హనుమంతరావు గారు సభ్యులుగా ఒక సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం పక్షాన రామానుజరావు గారి కృషి ఫలితంగా మెట్రిక్యులేషన్ వరకు బోధనా మాధ్యమంగా తెలుగు అమలుకు అంగీకరించిన ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మాత్రం ఈ పని అంత సులువుగా జరగకపోవడంతో ఈ సంఘం రాష్ట్రపతిని కలిసి వినతి పత్రాలిచ్చి, ఎంతో పోరాటం చేశాక కానీ ప్రజల భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడలకు ద్వితీయ భాషల స్థానం కల్పించడం జరిగింది. ముందుగా బి.ఏ, బి.కామ్ తరగతులకు, ఆ తర్వాత బి.ఎస్.సి తరగతులకు బోధనా మాధ్యమంగా తెలుగు, మరాఠీ, కన్నడలు ప్రవేశ పెట్టబడ్డాయి. తర్వాత నాటి ఉపాధ్యక్షులు నవాబ్ అలీ యావర్ జంగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలన్న ప్రతిపాదనను కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిన

సందర్భంలో రామానుజరావు గారు కార్యదర్శిగా ఉన్న సంఘం చూపిన చొరవ, తెగువ వల్ల కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఇందుకోసం వీరు నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గారిని, విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారిని కలిసి తమ వాదనలు వినిపించి, ఆమోదింప జేసేలా విస్తృత ప్రయత్నం చేశారు రామానుజరావు గారు. ప్రజల భాషకు, ప్రజా ఉద్యమానికి కలిగిన గొప్ప విజయంగా దీన్ని భావించవచ్చు.

ఈ విధంగా దేవులపల్లి రామానుజ రావు గారు దాదాపు 40 సంవత్సరాల పాటు తెలుగు భాషా సంస్కతుల వికాసంలో పూర్తి సమయాన్ని వినియోగించి యధాశక్తి కృషి చేశారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, శబ్దానుశాసన గ్రంథాలయం వంటి సాంస్కృతిక, సాహిత్య సంస్థలు నిలదొక్కుకుని నేటి వరకూ కూడా భాషా సాంస్కృతిక కార్యక్రమాల విస్తరణలో, సేవలో పాలుపంచుకుంటున్నాయంటే అది దేవులపల్లి రామానుజరావు వంటి మహానుభావుల చలవే. తన నలభై ఏళ్ళ భాషా–సాంస్కృతిక సేవలో ఆయనకు సహకారం అందించని ప్రముఖులు, కవి, పండిత, రచయిత లోకం ఎవరూ లేరంటే అది అతిశయోక్తి కాదు. వారి సహకారాన్ని ప్రోత్సాహాన్ని ఆయన ఎప్పుడూ మరువలేదు. సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా స్మరించుకునే మహోన్నత వ్యక్తిత్వం వారిది. తన "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" అన్న గ్రంథంలో ప్రతి ఒక్కరినీ, ప్రతి సంస్థతో తన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వాటిని పదిల పర్చుకున్నారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు గారి విలక్షణ మూర్తిమత్వాన్ని గూర్చి "మల్లంపల్లి వారి సాహితీ వ్యక్తిత్వం, కొమర్రాజు వారి శాస్త్రీయ దృక్పథం, మాడపాటి వారి వాస్తవ విశ్లేషణ ప్రవృత్తి కలిసి జాలువారాయి" అని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు ప్రకటించారు.

**డా.జి. వెంకట లక్ష్మి**
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
హయత్ నగర్ , ఫోన్ : 99490 59179.

## ఏమో...గుర్రం ఎగురావచ్చు

**రా**పిడో, ఉబెర్ బైక్ రైడ్ తో ఒక లాభం ఉంది. డ్రైవ్ చేసే కేప్టెన్‌తో సంభాషణకు పూనుకోవడం సులభం. ఒకొక్కరిది ఒకో రకమైన అనుభవం. ఇది మనకు ఆటోలో కానీ, క్యాబ్‌లో కానీ వీలుపడదు. అలాంటి ఒక అనుభవం మీతో షేర్ చేసుకుంటాను. నార్సింగ్ నుంచి నా గమ్యం చేరటం కోసం ర్యాపిడో స్కూటీ బుక్ చేశాను. స్కూటీ, బైక్ రైడ్ కన్నా ఓ పది రూపాయలు పెచ్చు. దానితోపాటు వీరి దుస్తులు, మాట కొంచెం ఆధునికంగా ఉంటాయి. అలాంటి ఓ కుర్రాడు కొంచెం వెయిట్ చేశాక వచ్చాడు. మన కోడ్ చెప్పి రైడ్ మొదలవగానే మాటలు కలిపాను. పాతికేళ్ళుంటాయేమో. పేరు కల్యాణ్ అని చెప్పాడు. పార్ట్ టైమా అని అడిగాను. "నాట్ ఎగ్జాట్లీసర్" అనగానే అలెర్ట్ అయ్యాను. "మూడేళ్ళపాటు క్లౌడ్ ఇంజనీర్‌గా చేశాను సర్. కొన్ని హెల్త్ ఇష్యూలు వొచ్చి ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. మధ్యలో కొన్నాళ్ళు టీచింగ్ చేశాను. అది వీలుగా లేకపోవటంతో మళ్ళీ రాపిడోకి వచ్చాను". "మళ్ళీ రావటమేమిటి" అన్నాను. "కొవిడ్ టైంలో ఫాదర్ ది ప్రైవేటు ఉద్యోగం.. చాలా మంది లానే మా ఫాదర్ జాబ్ పోయింది సర్. అప్పుడు కొన్ని నెలలు నడిపాను సర్. కానీ అప్పటికీ ఇప్పటికీ ఓ తేడా ఉంది. అప్పుడు బి.టెక్ చదువుతుండే వాడిని.. బైక్ కేప్టెన్‌గా లైఫ్ లీడ్ చేయటమేమిటన్న ఫీలింగ్ ఉండేది.. కొంచెం ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉండేది" అన్నాడు..

"మరిప్పుడు" అన్నాను. "మళ్ళీ గ్యాప్ రావటం, బి.టెక్ పూర్తయ్యాక ఉద్యోగం, చేయలేక మానేయటం ఇవన్నీ మార్చాయి సర్. మధ్యలో చదివిన భగవద్గీత, భాగవతం నా యాటిట్యూడ్‌ను ఫైన్ ట్యూన్ చేశాయి.. ఇప్పుడు అలాంటి గిల్ట్ ఏమీ లేదు. నా పనేదో నేను చేసుకుంటున్నాను. అదనంగా ఈవినింగ్ ట్యూషన్లు పెట్టుకున్నాను.." కానీ ఎంత కాలమిలా అంటే "లైఫ్ ఇలా ఎంత కాలం తీసికెళితే అలా సర్.. సారీ సార్ జస్ట్ జోకింగ్.. అలోపతీ, ఆయుర్వేద, హెూమియో, యునాని డాక్టర్ల దగ్గరకు వెళ్ళాను. యునానీతో కొంచెం బెటర్‌గా ఉన్నాను.." ఈలోగా నేను చేరాల్సిన గమ్యస్థానం వచ్చేసింది.. నిజానికి ఎగ్రిగేటర్ యాప్స్ ఎంతో కొంత మార్పే కాదు, ఆలోచనల్లో మార్పు తెస్తున్నాయి.. మంచి భవిష్యత్తు ఇస్తాయా.. ఏమో గుర్రం ఎగురావచ్చు..

ఆల్ ది బెస్ట్ చెప్పి యుపిఐ పేమెంట్ చేస్తూ అదనంగా ఇవ్వబోతుంటే షాకిచ్చాడు కల్యాణ్.

**- సి.యస్. ఆర్**

# లుంబిని

– ఆలూరి ఉషారాణి



లుంబిని, నేపాల్

గడచిన రెండున్నర – మూడు వేల సంవత్సరాల చారిత్రక యుగంలో ప్రపంచంలోని అందరు విద్వాంసులు, జ్ఞాన పండితులు, తాత్త్వికులు బుద్ధుడిని సర్వశ్రేష్ఠ పురుషుడిగా అభిప్రాయపడ్డారు. తనకి తానుగా బుద్ధుడు తనని ఎప్పుడూ ఎవ్వరి అవతారంగా ప్రకటించుకోలేదు. ఆయనకి సంబంధించిన అత్యంత గౌరవనీయమైన విషయం ద్విపదోత్తముడు (సమంతభద్ర, సర్వతోభద్ర) మరియు శ్రేష్ఠమైన పురుషుడిగా అంగీకరించబడటమే. ఆ కాలంలో సాధు మహాపురుషులని భాషాపరంగా గౌరవసూచకంగా భగవాన్ అనే పదాన్ని వాడుతుండేవారు. బుద్ధుని ధర్మంలో, తత్త్వంలో జడవాదాన్ని సమర్థించక పోవటం సరైనది; అట్లే సృష్టికర్త ఈశ్వరుడు అనటానికి అస్సలు అవకాశమే లేదనేది కూడా స్పష్టమే. (జడవాదం – చైతన్యం యొక్క అస్థిత్వాన్ని అంగీకరించదు. నిర్జీవ లేదా శాశ్వతంలో వచ్చే మార్పులే చైతన్యం అని అంగీకరిస్తుంది.) చాలామంది అనేస్తున్నట్లుగా బుద్ధుడు ఈ విషయంలో మౌనంగా లేడు. సృష్టికర్తని సూటిగానే అంగీకరించలేదు. మనం బుద్ధుని తత్త్వాన్ని తీసుకుంటే దాంట్లో చాలా గంభీరమైన యదార్థాలను ప్రతిపాదించాడని తెలుస్తుంది. రెండున్నర వేల సంవత్సరాల క్రితం కాలంతో పోల్చుకుంటే నేటి ఆధునిక శాస్త్రీయ యుగానికి అవి చాలా తగినట్లుగా ఉన్నాయని అర్థమవుతుంది. ఆ కాలంలోనే బుద్ధుడు ఆధునిక శాస్త్రీయ యదార్థాలను ప్రకటించే ప్రయత్నం చేశాడనేది దీని అర్థం కాదు. ఏ మినహాయింపు లేకుండా వాస్తవంగా అస్థిత్వంలో ఉండే వస్తువులు / పదార్థాలు అన్నీ అశాశ్వితాలే లేదా క్షణక్షణము నశిస్తాయని చెప్పటం చాలా గంభీరమైన తత్త్వం. నేటి ప్రపంచ శాస్త్రీయ విజ్ఞానం యొక్క పూర్తి సమర్థన దీనికి లభించింది. అదేవిధంగా కార్య–కారణ సిద్ధాంతానికి సంబంధించి – ఒక అచల (స్థిర) కారణంలో జరిగే విచ్ఛిన్న–కలయికలే కార్యరూపంలో ఫలిస్తాయనేది అంగీకరించకుండా దాని స్థానంలో ప్రతీత్య సముత్పాదాన్ని అంగీకరించటం కూడా అత్యంత గంభీరమైన సత్యము. అంటే కార్యానికి సంబంధించిన ఏ రూపంలోనూ కారణం ఉండలేదు. కార్యమనేది కారణం లేదా కారణాల పైపై పరివర్తన మాత్రమే కాదు. ఇది దాని స్వభావంలో పూర్తిగా పరివర్తనము. కారణమనేది వాస్తవంగా మరో వస్తువు. మరియు కార్యమనేది పూర్తిగా కొత్త వస్తువు. కారణమనేది గతించి–నష్టపోయి–లుప్తమయిన తరువాతనే కార్యము ఉత్పన్నమౌతుంది. ఇదే రెండిటి మధ్య సంబంధము. కారణం ఏవిధంగానైతే క్షణిక అస్థిత్వం కలిగి ఉన్నదో, కార్యము కూడా అటువంటిదే. మరి ఈ విధంగా లుప్తమవుతూ – ఉత్పన్నమవుతూ ఉండే కార్య–కారణాల గొలుసు చర్యలు విశ్వంలోని అన్ని వస్తువులలో వ్యాపించి ఉన్నాయి. ఏ ఒక్కటీ ఈ నియమానికి మినహాయింపు కాదు. ఆత్మని శాశ్వతమైనదిగా, అతీతమైనదిగా, అపరివర్తన శీలమైనదిగా ఆనాడు మరియు నేటికి కూడా విశ్వసిస్తున్నారు కాబట్టే బుద్ధుడు ఆత్మని అంగీకరించటానికి నిరాకరించాడు. అందుకే బుద్ధుని తత్త్వాన్ని అనాత్మవాదం అంటారు. చైతన్యము లేదా విజ్ఞానాన్ని బుద్ధుడు అంగీకరిస్తాడు, తిరస్కరించడు. ఉపనిషత్తులు మరియు ఇతర వైచారికుల ఆత్మవాదం స్థానంలో బుద్ధుడు తన తత్త్వానికి అనాత్మవాదం అనే పేరు ఉండనిచ్చాడు.

బుద్ధుని తత్త్వం గురించి చెప్పటం కోసం కాదు, బుద్ధుని తత్త్వం ఎంత గంభీరమైన వాస్తవికత అనేది చూపించటం కోసమే మన ప్రయత్నం. ఆయనలో ఉన్న ఉదారత్వం, సహిష్ణుత, ప్రతి ప్రాణి పట్ల దయా హృదయం మరియు సానుభూతి గురించి చెప్పాల్సిన అవసరమే లేదు.

ఈ విషయంలో కూడా ఆయన మానవజాతికి సంబంధించిన అందరు పురుషరత్నాలలోకి సర్వశ్రేష్ఠుడు. బుద్ధుడు నిజంగానే సర్వతోభద్రుడు, సమంతభద్రుడు. ఆయన వ్యక్తిత్వాన్ని గురించి ఏ కోణం నుంచి ఆలోచించినా కానీ వాటిలో శ్రేష్ఠత్వమే కనిపిస్తుంది. తన రెండున్నర వేల సంవత్సరాల చారిత్రక అస్థిత్వంలో ప్రపంచంలోని ఎందరు కవులు-కళాకారులను ఆయన ప్రభావితం చేయలేదు? బౌద్ధధర్మం విస్తృతంగా వ్యాపించిన దేశాలలోనే కాకుండా 16వ శతాబ్దపు యూరప్ కవులు-కళాకారులు మరియు దార్శనికులని కూడా, వారిలోని శిఖర పురుషులని బుద్ధుడు ప్రభావితం చేయడాన్ని చూస్తాము. అపరిచితులు, తెలియనివాళ్ళు కూడా బుద్ధుడికి శ్రద్ధాసుమాలను అర్పిస్తుంటే, రక్త-మాంస సంబంధం ఉన్న భారతీయులం కదా మనం. ఆ మహాపురుషుడిపై అభిమానం లేని అభాగ్యుడైన భారతీయుడు ఎవరుంటారు?

ప్రస్తుత రక్తరంజిత యుద్ధభూమి కొరియాకి చెందిన వర్జ పర్వతాలలో 1934లో నేను తిరిగాను. మన హిమాలయ పర్వతాలలో ఉన్న ఎన్నో పర్వతాలలాగానే ఇవి కూడా సర్వశ్రేష్ఠ ప్రాకృతిక సౌందర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. నాలుగు వైపులా దేవదారు వనాలు వ్యాపించి ఉన్నాయి. హిమాలయ ఉత్తుంగ శిఖరాలు, మంచు పర్వతాల లోటు ఇక్కడ కనిపిస్తున్నది. తమ విహారాలను, మఠాలను స్థాపించటానికి ప్రాకృతిక సౌందర్య స్థానాలను ఎన్నుకోవటంలో బౌద్ధ సాధువులు అన్నిచోట్లా, ఎల్లప్పుడూ అద్వితీయంగా ఉండేవారు. కొరియా వర్జ పర్వతాలలో చాలా బౌద్ధ విహారాలు ఉన్నాయి. వాటిలో కొన్ని భారత్‌లో సముద్రగుప్తుడు, చంద్రగుప్తుడు పరిపాలించిన కాలం నాటివి. ఆ కాలానికి చెందిన అన్ని వస్తువులు ప్రస్తుతానికి ఈ విహారాలలో లేవు కానీ కళాత్మకమైన, అందమైన ఎన్నో చిహ్నాలు, గుర్తులు ఇప్పటికీ సంరక్షితంగా ఉన్నాయి. కొనసాగుతున్న ఈ యుద్ధ రాక్షసి విచక్షణారహిత తుపాకీ కాల్పుల ముట్టడిలో ఈ అపురూప నిధుల పరిస్థితి ఏమవుతుందో? ఇక్కడ ఒక ప్రాచీన విహారానికి నేను వెళ్ళినప్పుడు తేనెతో చేసిన షరబత్‌తో భిక్షువులు నాకు స్వాగతం పలికారు. భిక్షు అతిథులకు మొదట ఇలానే గౌరవిస్తామని చెప్పారు. ఒక సిక్కు సోదరుడి సంతకం చేసిన ఒక పొడుగైన కాగితాన్ని కూడా చూపించారు. బుద్ధుడి జన్మభూమి భారత్ పట్ల వాళ్ళకి గౌరవం ఉన్నందుకు ఒక భారతీయుడి చేతి వ్రాతని తీసుకొని దాన్ని సురక్షితంగా ఉంచటం వాళ్ళకి సంతోషకరమైన విషయం. ఆ సిక్కు సజ్జనుడు తన సంతకం ఉర్దూలో చేశాడా లేక గురుముఖిలోనా అనేది గుర్తుకు రావటం లేదు. అతనికి బుద్ధుని పేరు తప్ప ఇంకేమీ తెలియదేమో అనిపించింది. బుద్ధుని మార్గాన్ని అనుసరించేవారూ, లేదా బుద్ధుని అనుయాయులుగా చెప్పబడేవారు ప్రపంచంలోని అన్ని మూలలకూ వ్యాపించి ఉన్నారు. బుద్ధుడి జీవితంతో సంబంధం ఉన్న వస్తువులు / విషయాల పట్ల అపారమైన గౌరవం వారిలో ఉన్నది. అందుకే బుద్ధుడి అగ్రశ్రావుల, ప్రముఖ శిష్యుల, సారిపుత్రుల మరియు యోథల్యాయన్‌ల పవిత్ర అస్థికలు చేరుకున్న ప్రతిచోట వాటి దర్శనార్థం ఈమధ్య కాలంలో అపారమైన ప్రజలు ఉప్పొంగారు.

ఆ మహాపురుషుని జన్మభూమి లుంబిని. బైకాల్ సరస్సు నుండి వాలీ దాకా మరియు భారత్ నుండి జపాన్ దాకా వ్యాపించిన బుద్ధుని పేరు ప్రతిష్ఠలను చూసి గత శతాబ్దంలో ఎందరో పశ్చిమ చరిత్రకారులు బుద్ధుడు వాస్తవిక పురుషుడు కాదేమోనని ఆలోచించేవారు. అంతేకాదు, సూర్యదేవుడి కావ్యమయ కల్పన కావచ్చు అనుకునేవారు. ఇటువంటి భావాలు ఆ సమయంలో చాలా గంభీరంగా రాతలల్లో కనిపిస్తూ, మాటలల్లో వినిపిస్తూ ఉండేవి. కాని ఒకదాని తరువాత ఒకటిగా ఈ భూమి లేచి నిలబడి సాక్ష్మివ్వటం ప్రారంభించింది. సిద్ధార్థ గౌతముడు బుద్ధత్వ ప్రాప్తి కోసం తన వజ్రసంకల్పంతో ఎప్పుడైతే వజ్రాసనం వేశాడో లేదా గొప్ప జ్ఞానం యొక్క లోతైన వివేచనని (జ్ఞానాన్ని) అనుసంధానించటం (వెతకటం) మొదలుపెట్టాడో ఆ సమయంలో కూడా ఆయన కుడిచేతి వ్రేళ్ళు భూమి స్పర్శ ఆకృతిలో ఉన్నాయి. అవి ఈ భూమిని తన వజ్రసంకల్పం యొక్క సాక్షిని చేసి ఉంటాయి. బుద్ధుడు ఏ సూర్యుడో మరే ఇతర దేవత యొక్క కల్పనో కాదనీ, ఈ భూమి మీదనే జన్మించాడనీ, మరియు ప్రజలు ఆయనను చూశారనీ, కృతార్థులై ఆయన ఉపదేశాలు విన్నారనీ ఈ భూమి సాక్ష్మివ్వటం ప్రారంభించింది. ఎన్నో శతాబ్దాలుగా లుంబిని దట్టమైన అడవులతో కప్పబడింది. 20వ శతాబ్దారంభంలో చుట్టుముట్టు పొలాలూ గ్రామాలూ ఏర్పడినప్పటికీ ఇప్పటికి కూడా చుట్టుముట్టు గ్రామాల ఎన్నో తరాల ప్రజలకి లుంబిని ఇంకా అపరిచిత ప్రదేశమే. ఆ ప్రజలు లుంబినిని "రుమ్మిన్‌దయి" అంటున్నారు. కనీసం ఈ పేరుతోనైనా

పాత సాంప్రదాయం ఇంకా కొనసాగుతున్నదని అర్థమవుతున్నది. బహుశా మధ్యప్రదేశ్ మరియు తరాయి ప్రాంతంలో బౌద్ధులు లేకపోయినప్పటికీ ఈ దారులల్లో ఉన్న అడవులని నరుక్కుంటూ, బాటలు వేసుకుంటూ నేపాల్ నుంచి బౌద్ధులు అప్పుడప్పుడు ఇక్కడికి వస్తుండేవారేమో. వారు చెప్పగా విని వారి నుండి ఇక్కడి ప్రజలు 'రుమ్మిన్' పేరుని గుర్తుంచుకున్నారేమో. కానీ 'రుమ్మిన్‌దయి' పేరుతో ప్రజలు ఇక్కడ చేస్తున్న పూజలకీ, బుద్ధుని జన్మస్థానం లేదా బుద్ధుని ధర్మంతో సంబంధం ఉండే అవకాశం లేదు. 1920లో నేను మొట్టమొదటగా లుంబినిని దర్శించటానికి వెళ్ళాను. ఇక్కడ ఒక అశోక స్థంభాన్ని చాలాకాలం క్రితమే విద్వాంసులు చూశారు. తన అభిషేకం అయిన 20 సంవత్సరాలకి ప్రియదర్శి రాజా అశోకుడు బుద్ధుని గౌరవార్థం స్వయంగా ఇక్కడికి వచ్చి ఈ పవిత్ర స్థానానికి కానుక రూపంలో లుంబిని గ్రామాన్ని ఇచ్చాడని ఆ చెక్కబడిన శాసనం మనకి చెబుతున్నది.

పరమ అహింసా అవతారుడు బుద్ధుని జన్మస్థానం ఈ విధంగా స్పష్టపరచబడినప్పటికీ ఈ చుట్టుపట్ల ప్రజలు ఇప్పటికీ 'రుమ్మిన్‌దయి' కోసం కోళ్ళు, మేకలు బలి ఇస్తారు. 1920 వసంతమాసపు ఆ దృశ్యం నేటికి కూడా నాకు బాగా గుర్తుండిపోయింది. ధాన్యపు పంట ఎక్కువగా పండి కోతలు అయిపోయిన కారణంగా నాలుగువైపులా పసుపుపచ్చ సమతల భూమి కనిపించింది. అశోక స్థంభానికి పక్కనే ఒక ధృఢమైన పురాతన చిన్న మందిరం ఉంది. దాని లోపల చాలా పెద్ద రాతి విగ్రహం ఉంది. పురాతన ఆ చారిత్రక మందిరానికి బహుశా ఎప్పుడో నిప్పు అంటుకున్న కారణంగా ఆ విగ్రహం ముందుభాగంలోని చాలా భాగం ఊడిపోయింది. కొంచెమే ఆ పొడవైన గీతల ద్వారా విగ్రహం ఆకృతి అర్థమవుతున్నది. ప్రజలు ఈ విగ్రహాన్నే 'రుమ్మిన్‌దయి'గా భావిస్తున్నారు. గుడి బయట ఒక పురాతన రావిచెట్టు దగ్గర బలి ఇవ్వబడుతుంది. పక్కనే ఉన్న చిన్న గుండంలో నీళ్ళు లేవు. ఆ గుండానికి చెందిన ఒక గోడ మీద ప్రాచీన అడవి అవశేషంగా ఇప్పటికీ అడవి ముళ్ళ పొదలు ఉన్నాయి. కొన్ని అడవి తీగలు కూడా ఉన్నాయి. దీని పక్కనే ఇప్పటికీ ఒక చిన్న నది ప్రవహిస్తున్నది. అంతటి మహాపురుషుడి జన్మస్థానం ఈ పరిస్థితిలో ఉంటే ఏ సహృదయుడికైనా బాధ అనిపిస్తుంది. నేనైతే ఆ మహాపురుషుడి పరమ భక్తుడిని. దొంగలు ఎత్తుకుపోయే లాంటి ఏ వస్తువు ఆ దేవీ మందిరంలో లేవు. పక్కనే ఉన్న ఒక గ్రామం నుండి పూజారి వచ్చి రోజూ పూజ చేసి వెళ్ళిపోతుంటాడు. నాకున్న శ్రద్ధాభక్తి అనుసారం నేను కూడా ఆ పుణ్యస్థానాన్ని పూజించి పూజారితోపాటు అక్కడున్న ఒకరిద్దరికి ఆ ప్రదేశానికి సంబంధించి కొన్ని విషయాలు చెప్పాను. నేడు లుంబిని ఉన్న ప్రాంతంలోని ప్రజలందరికీ ఆ పవిత్ర స్థానం గురించి తెలుసు మరియు బర్మా, భూటాన్ లేదా చైనా వాళ్ళ దేవుడిగా అనకుండా మా బుద్ధ భగవానుడి జన్మభూమి అని అది కూడా ఎంతో గౌరవంగా అంటారు.

నేను నవాగఢ్ రోడ్ స్టేషన్ నుండి వెళ్ళాను. ప్రజల్ని అడుగుతూ మధ్యాహ్నం కంటే ముందే భగవాన్‌పూర్‌కి చేరుకున్నాను. భగవాన్‌పూర్‌లో ఒకప్పుడు నేపాల్ కచేరీ (న్యాయస్థానం) ఉండేది. ఆ కాలంలో ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులు మరియు గోర్ఖా సైనికులు కూడా అక్కడ ఉండేవారు. కానీ చాలా సంవత్సరాల క్రితమే భగవాన్‌పూర్ ఆ అధికారం నుంచి వంచించబడినప్పటి నుండి లక్ష్మి అక్కడ అలుగుతోంది. పాత కచేరీకి సంబంధించి ఒకటి రెండు ఇళ్ళు ఇప్పటికి కూడా ఉన్నాయి. లేకపోతే అది ఒక మామూలు రైతుల గ్రామం. అక్కడ ఒక నేపాలీ బ్రాహ్మణుడు, ఒక వైష్ణవీ సాధునీ కలిశారు. భోజన సమయం. ఎప్పుడైతే వాళ్ళు పట్టు పట్టారో – అరచేతి భిక్ష, చెట్ల వాసం చేసే నాలాంటి మనిషి ఎలా కాదనగలడు. ఆపై ఎండ కూడా సుర్రుమంటోంది. 'రుమ్మిన్‌దయి' లుంబిని అక్కడి నుంచి చాలా దూరం లేదు కానీ కొంచెం చల్లబడ్డాక పోతేనే మంచిదని జనాలతో మాట్లాడుతుంటే అర్థమయింది. 4 గంటల సమయంలో నేను ఒక్కడినే నడుచుకుంటూ, ప్రతి అడుగుకీ చుట్టూ ఉన్న భూమిని పరిశీలిస్తూ లుంబినికి చేరుకున్నాను. అక్కడ నేను చూసిన దృశ్యాన్ని పైన మీకు వివరించాను.

బుద్ధుని గౌరవ స్థంభాన్ని (శిలాశాసనాన్ని) లుంబిని ఒక్కటే తనలో ఉంచుకోలేదు. గడచిన శతాబ్దం మధ్య వరకూ దట్టమైన అడవితో కప్పబడిన శాక్యుల భూమిలో అడుగడుగునా పాత విధ్వంశావశేషాలు దొరుకుతాయి. ఇదే భూమిలో లుంబిని నుంచి అతి దగ్గరలో ఉన్న పిపరహావాలో మానవ బుద్ధుని అస్థిత్వానికి సంబంధించిన రెండవ అత్యంత అద్భుత ప్రమాణమైన శిలాశాసనం దొరికింది. ఆ స్థూపంలోనే బుద్ధుని పవిత్ర అస్థికలను అతని శాక్యులు అక్కడ ఉంచారని ఆ శిలాశాసనం ద్వారా అర్థమైంది. పిపరహావాకి చెందిన ఈ శిలాశాసనం భారత్‌కి

చెందిన అతి ప్రాచీన వర్ణమాల బ్రాహ్మీకి చెందిన అతి ప్రాచీన రూపంగా అంగీకరించబడుతున్నది. పిపరహవాలో ఒక ధనిక గృహస్తుని ఇంట్లో ఆ రాత్రి ఉన్నాను. అక్కడి పెద్ద పెద్ద ఇటుకల పురాతన ఇళ్ళ పునాదులను ఆయన నాకు చూపించారు. తిరోలకోట ఇప్పటికీ ఒక పురాతన నగరము మరియు కోట. దీని అవశేషాలు బాణగంగా నది ఒడ్డున ఉన్నాయి. దీన్నే కపిలవస్తు అంటారు. నిజం కావచ్చు కానీ భూమి లేచి తనకు తానుగా సాక్షం ఇవ్వనంతవరకూ ఇది రూఢీ చేయటం కూడా కష్టమే. తిరౌరా నుండి కొంచెం దూరంగా బిగలిహవా వుంది. అక్కడ కూడా ఒక విరిగిన అశోక స్థంభము, అశోక లిపి ఉన్నది.

తథాగతుని జన్మభూమి, బాల్య మరియు కిశోరావస్థలో అద్భుతమైన ఆటభూమిగా ఉన్న లుంబిని ఈరోజు అంధకారంలో లేకపోయినప్పటికీ, వీటి ప్రాచీన చరిత్రకి సంబంధించిన ఎన్నో చారిత్రక అంశాలు మనకు సంస్కృతము, పాలీ, టిబెట్, చైనా మొదలైన ప్రపంచంలోని ఎన్నో భాషల్లో లభ్యమౌతున్నప్పటికీ, ఈ భూమికి సంబంధించిన ఎంతో చరిత్ర ఇంకా ఈ భూమి గర్భంలోనే దాగి ఉన్నది. చాలా కాలంగా ఉపేక్షించబడిన స్థలంగా ఇప్పటి లుంబిని లేదు. లుంబినికి నా మొదటి యాత్ర తరువాత ఎన్నో సంవత్సరాలకి, కానీ నేటికి చాలా ముందే, చుట్టుపట్ల ప్రదేశాలని సరిచేసి అలంకరించే ప్రయత్నం చేయబడింది. ఐతే సందర్శనార్థం వచ్చే దేశ విదేశీ సందర్శకులకు అక్కడ సరైన వసతి, భోజన సదుపాయాలు లభించక యాత్రికులకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఉండేది. పక్క గ్రామానికి చెందిన చౌదరి గారు అక్కడికి వచ్చిపోయే అతిథులకు, యాత్రికులకు ఎన్నో సంవత్సరాల నుండి స్వచ్ఛందంగా ఆతిథ్యమిస్తుండేవారు. మూడవసారి నేను లుంబినిని సందర్శించినప్పుడు చౌదరిగారు నన్ను తమ ఇంటికి తీసుకెళ్ళారు. అతిథులకి టీ ఇవ్వటమనేది అప్పటికి అంతగా ఆచారంగా మారలేదు. అతిథుల కోసం చౌదరిగారు చైనా మట్టితో చేసిన టీ కప్పులు, ట్రే లాంటివి ఉంచుకున్నారు. ఆరోజుల్లో ఉన్న ఆచారం ప్రకారం చైనా మట్టితో చేసిన పాత్రలను కూడా మామూలు మట్టితో చేసినవిగా భావించి ఒక్కసారి వాడిన తరువాత మన దగ్గర చాలామంది పడేసేవారు. "మీరు బౌద్ధులు. కప్పులో టీ తాగటానికి మీకు అభ్యంతరం ఉండదు కదా" అని సంకోచిస్తూనే చౌదరిగారు నన్ను అడిగారు. నాకేం అభ్యంతరం ఉంటుంది. ఇప్పుడు లుంబినికి వచ్చిపోయే వాళ్ళకి వసతి సౌకర్యాలు ఉన్నాయి. ఈమాత్రం చేస్తేనే మనం లుంబిని రుణం తీర్చుకున్నట్లేనా?

లుంబిని మానవజాతి యొక్క సర్వశ్రేష్ఠ పురుషుడి జన్మస్థానం. దానికి అనుగుణంగానే ఆ ప్రదేశం ఉండాలి. నేపాల్ ప్రభుత్వమూ మరియు ధర్మోదయ సభ వారు ఆ వైపుగా శ్రద్ధ పెట్టటం హర్షించదగ్గ విషయం. నేపాల్ ప్రభుత్వం దృష్టి అటువైపు పోకుంటే చాలా ఆశ్చర్యకరమైన విషయం అయ్యేది. ఇటువంటి పవిత్ర మరియు చారిత్రిక కార్యంలో భాగస్వామిని కావటానికి అనుకోకుండా నాకు అవకాశం లభించింది. ఇది పారుతున్న గంగలో స్నానం చేయటం లాంటిది. లుంబినిలో వేగిచెట్ల వనం ఉండేది. వేగి చెట్లు, చిన్న మొక్కలు తెచ్చిపెట్టి లుంబిని వేగిచెట్ల వనాన్ని పునరుజ్జీవితం చేయించటం చాలా మంచి విషయం. కానీ దీనికంటే ముందు పురాతాత్విక పద్ధతిలో ఆ చుట్టుపట్ల భూమిని తవ్వటం అత్యవసరమైన విషయం. ఒకసారి నేపాల్ ప్రభుత్వం వైపునుండి ఇక్కడ కొంత పని జరిగింది. చాలా ప్రదేశాలని కొంచెం తవ్వారు కానీ అది మొత్తం అనుభవం లేని పద్ధతిలోనే జరిగింది. అక్కడ కుషాణుల కాలానికి చెందిన విగ్రహ ఖండాలు లభించాయి. కానీ ఎవరు ఎంత లోతు నుంచి తీశారు, ఏ ప్రదేశం నుండి తీశారు మొదలైన వాటిపట్ల శ్రద్ధ పెట్టకుండా అన్నిటినీ తవ్వి ఒక దగ్గర కుప్ప పెట్టారు. ఆ సమయంలో తవ్వకాలలో బయటపడిన వస్తువులను ఇప్పుడు ఎక్కడన్నా సురక్షితంగా ఉంచారా? లేదా? అనేది కూడా తెలియదు.

లుంబిని మరియు దాని చుట్టుపట్ల ఉన్న శాక్యుల భూమి నుండి బయటపడే పురాతత్వ సామాగ్రి-విగ్రహాలు, ఇటుకలు, అధికార పత్రాలు (అభిలేఖలు), నాణాలు మొదలైనవాటికి ఒక వస్తు సంగ్రహాలయం ఉండాలి. కనీసంగా మొదట ప్రారంభిస్తే క్రమంగా అది అభివృద్ధి చెందుతుందనటానికి ఎటువంటి సందేహమూ అవసరం లేదు. లుంబినిలో ఒక మంచి విద్యాలయం ఉండాలి. దీనిలో ప్రాచీన విద్యను అధ్యయనం చేయటానికి ఒక ప్రత్యేక ఏర్పాటు ఉండాలి. ఇప్పటికి కూడా పాలీ, సంస్కృత భాషలపై పట్టు ఉన్న మన భిక్షువులలో ఈ విషయం పట్ల అభిరుచి ఉండేవారికి కొదవ లేదు. పాలీ, సంస్కృతాలతోపాటుగా మెల్లమెల్లగా టిబెట్ మరియు చైనా భాషలూ, సాహిత్యాన్నీ చదవటం, నేర్పించటానికి సంబంధించి కూడా అక్కడ ఏర్పాట్లు చేయబడాలి.

విద్యాలయంతోపాటుగా ఒక మంచి లైబ్రరీ ఉండాలని చెప్పాల్సిన అవసరం లేదు. లైబ్రరీకి పుస్తకాల, గ్రంథాల సంగ్రహణ అంత కష్టమేమీ కాదు. టిబెట్ కంజూర్ మరియు తంజూర్‌కి చెందిన దాదాపు పదివేల గ్రంథాలయితే టిబెట్ నుండి దానం రూపంలో లభించవచ్చు. కేవలం మనం కోరుకుంటున్నామని ప్రకటిస్తే చాలు లుంబిని కోసం చైనా త్రిపిటికాలు దానం చేస్తుంది. శ్యామ్ మరియు బ్రాహ్మీ లిపిలో పాలీ త్రిపిటికలు మరియు పాలీ సాహిత్యం కూడా తేలికగానే దొరుకుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే సంగ్రహాలయం, విద్యాలయం మరియు గ్రంథాలయంతో లుంబినిని సుశోభితం చేయటం అన్నిటికంటే మొదటి పని. వీటిని ఉంచటానికి ఇంకా భిక్షువులు, కొందరు విద్యార్థులు ఉండటానికి ముందుగా ఇళ్ళు అవసరం అవుతాయి. ఇళ్ళ నిర్మాణానికి ప్లాను, ప్రణాళికలు పెద్దగా ఉండాలనటంలో అభ్యంతరం లేదు కానీ ఇటుకలు, సున్నం పేరు మీద ముందుగానే చాలా రూపాయలు ఖర్చు పెట్టకూడదు.

ఆసియాలోని మొత్తం బౌద్ధ విహారాలు మానసిక రోగుల చికిత్సాలయాలుగా ఉండటం మాత్రమే కాకుండా శారీరక రోగులకు కూడా అక్కడ చికిత్స లభిస్తుండేది. ఈ కర్తవ్యానికి గుర్తుగా చాలా విహారాలు తమ వద్ద బుద్ధుడిని భైషజ్య గురు (ఔషధ గురువు) పేరుతో స్థాపించారు. టిబెట్, జపాన్ మరియు ఇండోచైనాలలో భైషజ్యగురు రూపంలో ఎన్నో ప్రాచీన సుందర విగ్రహాలు లభిస్తాయి. వాటిలో పద్మాసనంలో ఉన్న బుద్ధుని ఒక చేతిలో ఔషధానికి గుర్తుగా కరక్కాయలు ఉంటాయి. చికిత్సతో పాటుగా ఆయుర్వేద అధ్యయనము మరియు ప్రయోగానికి నెమ్మది నెమ్మదిగా ఏర్పాట్లు చేయగలిగితే ఆ ప్రదేశము భైషజ్యగురు జన్మస్థానానికి తగినట్లుగా సంపూర్ణంగా ఉంటుంది.

భారత నవ పునరుజ్జీవనంతోపాటుగా ప్రజల దృష్టిని లుంబిని తనవైపు ఆకర్షింపచేసుకోవటం లుంబినికే కాదు మన అదృష్టాన్ని తట్టిలేపే మహదావకాశం కూడా. లుంబిని లేదా శాక్యదేశ చరిత్ర పశ్చిమ నేపాల్ యొక్క పర్వత ప్రాంతంతో చాలా గాఢమైన, సన్నిహితమైన సంబంధం ఉన్నది. మొదటగా ఈ భూమిలో మొత్తం హిమాలయాల వైపు 'కిరాత' ప్రజలు ఉండేవారు. కిరాత చాలా వీరత్వంతో కూడిన సంపన్న జాతి. కాశ్మీర్ దగ్గరనుండి అస్సాం దాకా ఒకప్పుడు ఈ జాతి ప్రాబల్యం ఉండేది. కానీ వీళ్ళ హద్దు అక్కడికే పరిమితం కాలేదు. ఇండోనేషియా, కంబోడియా, థాయ్, కేరన్ మొదలైన జాతులు ఈ కిరాత జాతి శాఖలే. వీరిలో లింబు, రాఈ, సువార్, నెవార్, గురూంగ్, మగర్ మొదలైనవి సమ్మిళితంగా ఉన్నాయి. మగర్ – గురూంగ్ భూమిలో అత్యాచారాలకు గురై, మరియు తమ గణరాజ్యాలు విచ్ఛిన్నమైనాక చాలామంది శాక్యులు, కాలేయులు, కుశీనారులు, అనుపీయ మొదలైన గణతంత్రులు అక్కడ నుండి పారిపోయి శరణార్థులయినారు. ఇవన్నీ తొమ్మిది మల్ల గణాలకు చెందినవి. అందుకనే వీళ్ళు అక్కడికి వెళ్ళి మల్ల బిరుదును ప్రచారంలోకి తెచ్చారు. ఈ మధ్యకాలం దాకా నేపాల్‌కు చెందిన చాలా ప్రదేశాలలో 'మల్ల' అనేది గౌరవనీయమైన బిరుదుగా ఉన్నది. శాక్యమల్లుల ప్రథమ ప్రవాసము మరియు లుంబినికి ఉత్తరం వైపున ఉండే పర్వత ప్రాంత ప్రజల సంస్కృతిని అధ్యయనం చేయటానికి లుంబినికి సంబంధించిన పై విధమైన కార్యరూపం ప్రకాశ స్థంభం లాంటిది.

**ఆలూరి ఉషారాణి**
బౌద్ధ సాహిత్య పరిశోధకులు,
ఫోన్ : 7207775713

**(ఆంగ్లమూలం : రాహుల్ సాంకృత్యాయన్)**

## కమ్మతెమ్మెర

మాన్యులు అశ్వినీ కుమార్ గారికి వందనం




**మిసిమి** నవంబర్ సంచిక 2 కాపీలు స్పీడ్‌తో పోస్ట్ ద్వారా ఇప్పుడే అందాయి. "అనాటి బెజవాడ జ్ఞాపకాలు" వ్యాసాన్ని చక్కని శ్రీ దుర్గమ్మ, తదితర ఫోటోలతో అలంకరించి , యధాతథంగా ప్రచురించి నా ఉత్సాహాన్ని, రచనాశక్తిని ప్రోత్సహించిన మీకు కృతజ్ఞతాపుర్వక అభివందనం? నిరాఘాటంగా 36 సంవత్సరాలుగా **మిసిమి** ప్రచురిస్తూ చింతనాత్మక సారస్వత యజ్ఞాన్ని కొనసాగిస్తున్న చక్రవర్తి పోషకులు అలపాటి వారి వంశీయులకు, విశిష్ట సంపాదక బాధ్యతను మీరు చేపట్టి సమర్థవంతముగా నిర్వహిస్తున్న మీకు అసంఖ్యాక అభినందనలు. నా వంటి పాఠకులకు ఎంతో మానసిక పరిపుష్టినిస్తున్న **మిసిమి** మహత్తర కానుక అని నిత్యభావన. **మిసిమి** కుటుంబానికి హృదయపూర్వక అభినందనలు. శుభమస్తు.

**- రాయవరపు సత్యనారాయణ**

# చిరస్మరణీయం నార్వే

ఆంగ్లం – డా. నిమ్మగడ్డ శేషగిరి రావు

తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ



ఫిన్స్ రైల్వే స్టేషన్

ఫ్లామ్ పర్వత మార్గపు రైల్వే లైను, మిర్డాల్‌తో ఆగిపోతుంది. మిర్డాల్ సముద్ర మట్టం నుండి 866 మీటర్లు ఎత్తులో ఉంటుంది. ఓస్లో వెళ్ళాలంటే అక్కడ దిగిపోయి, బర్గెన్ నుండి ఓస్లో వరకు వెళ్ళే ప్రధాన రైలు మార్గం మీద ప్రయాణం చేయవలసి ఉంటుంది. ఈ రైలు మార్గం 100 సంవత్సరాల నాటిది. 1909వ సంవత్సర కాలానికి ఇటువంటి రైలు మార్గం నిర్మించటమంటే అప్పటికి అదొక గొప్ప విషయమే. మిర్డాల్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంది. ఈ రోజు ఉదయం నేను ఈ రైలు మార్గంలోనే ప్రయాణం చేశాను. కానీ ఫ్లామ్ వెళ్ళటం కోసం, వోస్‌లో దిగిపోయి బస్, ఫెర్రీల మీద ప్రయాణం చేసి, అందమైన ఫీయోర్డ్‌లను దాటుకుంటూ, త్రికోణ మార్గంలో సుదీర్ఘ ప్రయాణం చేసి మళ్ళీ, మిర్డాల్ వద్ద అదే రైలు మార్గంలో కలిశాను. ఈ ప్రధాన రైలు మార్గంలో నేను చూడనిదల్లా, వోస్ నుండి మిర్డాల్ వరకు ఉన్న రైలు మార్గంలో దృశ్యాలు. కానీ కొంచెం ఎక్కువ సమయం పట్టినా, ఫ్లామ్ రైలు మార్గం అందించిన అనుభవం మరువలేనిది.

మిర్డాల్ రైల్వే స్టేషన్ చుట్టు పక్కల అక్కడక్కడా కరగిపోతున్న తెలి మంచు, పరచిన తెల్ల దుప్పటి ముక్కల్లా కనపడుతోంది. అక్కడి నుండి రైలు మరో 400 మీటర్ల ఎత్తుకు ఎగబ్రాకుతూ ఆ లైనులో అత్యధిక ఎత్తులో (సముద్ర మట్టం నుండి 1222 మీ) ఉన్న ఫిన్సా స్టేషన్ చేరుకుంది. అక్కడున్న రైల్వే ఉద్యోగులు చెప్పిన దాని ప్రకారం ఇంత ఎత్తులో ఉన్న రైల్వే స్టేషన్, ఉత్తర ఐరోపాలో మరొకటి లేదు. ఫిన్సా ఒక స్కీ రిసార్ట్. అక్కడ కనుచూపుమేరా, వెండి రజను ఆరబోసినట్లు తెల్లని మంచుతో మెరిసిపోతోంది. సూర్య కాంతి వెచ్చబడుతున్న కొద్దీ, కరిగిన మంచు.. సన్నటి ధారలుగా, పాయలుగా, జలపాతాలై పిల్ల కాలువలుగా, హిమ నదాలుగా..నిర్మలమైన సౌందర్యంతో.. వివిధ రూపాలలో మనసును తాకుతూనే ఉంది. ఇంతకుముందు ఫియోర్డ్‌లలోకి జాలువారుతూ నాకు కనిపించిన అసంఖ్యాక నీటి తెరల ఆవిర్భావం, వాటి పూర్వోత్తరాలు ఇప్పుడు ఇంకా బాగా అవగతమయ్యాయి. నార్వేలో మాత్రమే కనిపించిన ఫియోర్డ్ సంహిత దృశ్యం నాకు కలిగించిన అనుభూతి వర్ణనాతీతం. అవి కలిగించిన 'మైమరపు'ను వర్ణించటానికి 'ఫియోర్డాతిరేకం' లాంటి క్రొత్త పద ప్రయోగాలు చేయాలేమో.

రైలులో నేను కూర్చున్న టేబుల్‌కు అటు వైపు ఒక అమెరికన్ జంట ఉన్నారు. ఆండీ, ఫ్రీడా ఇద్దరూ 70ల వయసులో ఉన్నట్లున్నారు. ఆండీ హాస్పిటల్ నిర్వహణ విభాగంలో పని చేశాడట. ఫ్రీడా సోషియాలజీ అధ్యాపకురాలుగా పనిచేసేదట. వాళ్ళు నార్వే రావటం ఇది మూడోసారట. అన్నిసార్లు రావటానికి ఇక్కడ అంతగా వాళ్ళను ఆకర్షించినదేమిటని అడిగాను. ఆండీ పూర్వీకులు నార్వే సంబంధీకులట. అతను చెప్పిన దాని ప్రకారం 1825–1925 మధ్య 800,000 మంది నార్వే వారు యు.ఎస్.ఎ.కు వలస వెళ్లారట. ప్రస్తుతం 1.5% అమెరికన్ల పూర్వీకులు నార్వే నుండి వచ్చినవారని అంచనా. మొత్తం జనాభాలో ఎక్కువ శాతం యు.ఎస్.ఎ.కు తరలివెళ్ళిన దేశాలలో నార్వే కంటే ముందున్నది ఒక్క ఐర్లాండ్ మాత్రమే. నార్వే సంతతి వారు ప్రధానంగా, అమెరికా లోని మిన్నెసోట ప్రాంతం లో స్థిరపడ్డారు. ఇక్కడ వీరి సంఖ్య ఒక మిలియన్ పైనే.

ఆ కాలంలో నాసిగా ఉన్న నార్వే ఆర్థిక పరిస్థితి, అమెరికాలో ఉవ్విళ్ళూరించే అవకాశాల దృష్ట్యా

ఈ సామూహిక ప్రవాస ప్రవాహం జరిగిందట. ప్రస్తుత పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉండటం గురించి ఫ్రీడా మాట్లాడింది. జీవన ప్రమాణాలకు సంబంధించిన ఏ సూచిక తీసుకున్నా, ఇప్పుడు నార్వే మొదటి అయిదు స్థానాలలో ఉంటూ వస్తోంది. మానవ వనరుల పరిణతి సూచీలలో, నార్వే అమెరికా కంటే ముందుందనటంలో సందేహం లేదు. నార్వేలో తలసరి ఆదాయం, అమెరికన్ల కంటే ఎక్కువ. కొన్ని ట్రిలియన్ల ఋణ భారం మోస్తున్న అమెరికన్ ఆర్థిక వ్యవస్థ అవస్థ, అంతే మొత్తంలో నార్వే వారి జాతీయ మిగులు ఆస్థి గురించి ఫ్రీడా మాట్లాడినప్పుడు, నేను హాస్యంగా, వాళ్ళ పూర్వీకులు నార్వేలోనే ఉండి ఉంటే వారికి బాగుండేదేమో అన్నాను. దానికి ఫ్రీడా వెంటనే 'నిజమే' అన్నది, కానీ ఆండీ మాత్రం ఒప్పుకున్నట్లు కనపడలేదు.

నార్వే ప్రశాంతమైన, అందమైన దేశమని, అక్కడి గాలి కాలుష్య రహితమని, నేర ప్రవృత్తి చాలా తక్కువనీ, ఇక్కడ చక్కని వైద్య సదుపాయాలున్నాయని ఫ్రీడా పొగుడుతూ ఉంటే, అదంతా అక్కడి ప్రభుత్వం ప్రజల గోళ్ళు ఊడగొట్టి వసూలు చేసే పన్ను అని, ఇక్కడ అన్నీ విపరీతమైన ఖరీదులుగా ఉన్నాయనీ ఆండీ వాపోయాడు. ఇక్కడున్న జీవనశైలి అందుకోవటానికి, ఆ మాత్రం అసౌకర్యం భరించవచ్చని ఫ్రీడా తేల్చి చెప్పింది. చివరికి ఆండీకి కూడా ఒప్పుకోక తప్పలేదు. వారిద్దరి వాగ్యుద్ధాన్ని విని నేను నవ్వుకోవటమే కాకుండా, ఫ్రీడా మాటల గురించి మరింత తెలుసుకోవాలని అనుకున్నాను.

చాలా కాలంగా హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ (హెచ్. డి. ఐ) ప్రకారం ఇచ్చే ర్యాంకులలో నార్వే ఉన్నత స్థానంలో ఉంది. ఈ ఇండెక్స్.. తలసరి ఆదాయంతో పాటు, ఆరోగ్యం, ఆయుర్ధాయం, విద్య, విజ్ఞానం, జీవన స్థాయి మొదలైన అంశాలని కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. అంటే ఇక్కడి ప్రజలు కేవలం ధనవంతులుగా మాత్రమే కాకుండా, విద్యావంతులు, ఆరోగ్యవంతులుగా దీర్ఘాయుష్షుతో, సుఖ సంతోషాలతో జీవిస్తారని అర్థం చేసుకోవచ్చు. ఆనందభరిత జీవితం, ప్రజాస్వామిక విధానాలు, వార్తా ప్రసార మాధ్యమాల స్వతంత్రత, సామాజిక న్యాయం, పరిపుష్టత, మొదలైన విషయాల సూచీలన్నిటి దృష్ట్యా కూడా నార్వే ఎంతో ఉన్నత స్థాయిలో ఉంది. వీటన్నిటితో పాటు, కాలుష్య రహిత వాతావరణం, స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రజల కోసం నడిచే పారదర్శక రాజకీయ వ్యవస్థ... ఇదంతా సాధించిన దేశం నిజంగానే గొప్పదేశమని ఒప్పుకోక తప్పదు.

నేను కూర్చున్న టేబుల్‌కు అవతలివైపు, భారతీయులులా కనపడుతున్న దంపతులు, వారితో పాటు మరొక వ్యక్తి చాలా సుదీర్ఘ సంభాషణలో ఉన్నారు. నేను కూడా వారితో మాటలు కలిపాను. అనుకోకుండా.. మేమంతా ఒకే వృత్తిలో ఉన్న వారిమని తెలిసింది. 60వ పడి చివరిలో ఉన్నట్లున్న దంపతులు దీపక్, ఆషా. వాళ్ళిద్దరూ పుణెలో పనిచేసిన విశ్రాంత వైద్యులు. చిన్న వయసులో ఉన్న వ్యక్తి, థియాగో రోబర్టో మెలో.. బ్రెజిల్ నుండి వచ్చిన డాక్టరు.

సాధారణంగా ఒకే వృత్తిలో ఉన్న వారు కలసినప్పుడు, వారి వృత్తిలో కష్ట సుఖాలు చెప్పుకోవటమే సరిపోతుంది. ఇప్పుడు కూడా అంతే అయింది. చివరిగా మేము అనుకున్నదేమంటే, ఏ దేశమేగినా, వృత్తి పరమైన సమస్యలు ఒక్కలాగే ఉంటాయని. ముఖ్యంగా వైద్య సేవలో ఉన్నవారికి, తక్కువ వనరులతో ఎక్కువమందికి ఉన్నత స్థాయి సేవలు అందించ వలసి రావటం ఒక సవాల్.

కాసేపటికి ముచ్చట్లు మా ప్రయాణాల మీదికి మళ్ళాయి. థియాగో తాను వెళ్ళిన నాలుగు రోజుల మాచు పిచు పర్వతారోహణ గురించి చెప్పాడు. బ్రెజిల్, ఇంకా మధ్య అమెరికా, దక్షిణ అమెరికాల పర్యాటనలో ఉపయోగపడే వివరాలను అతని నుండి తెలుసుకున్నాను.

దీపక్, ఆషా లు అనుభవజ్ఞులైన పర్యాటకులు. భారత దేశంలో వారి పర్యటనల విశేషాలను మాతో పంచుకున్నారు. థియాగో రైలు మార్గాన భారత దేశాన్ని చుట్టి రావాలను కుంటున్నాడు. ఈ మధ్య బాగా ఆకట్టుకుంటున్న సుందర మార్గాల రైలు ప్రయాణాల విశేషాలు, ప్రభుత్వ పర్యాటక శాఖలు నడుపుతున్న హెరిటేజ్ రైళ్లు, వీటిలో భాగమైన డార్జీలింగ్, ఊటీ, సిమ్లా లాంటి ప్రదేశాలలో ప్రత్యేకంగా నడుపుతున్న చిన్నసైజురైళ్ళ గురించి ఒక గంట సేపు మాట్లాడుకున్నాము. 'మీరు డార్జీలింగ్ వెళ్లారా?' అని అడిగినప్పుడు ముక్త కంఠంతో వాళ్ళిద్దరూ, 'అక్కడికి మాత్రం వెళ్ళకండి. అదొక మురికి ప్రదేశం' అని హెచ్చరించారు. దీపక్, ఆషాలు సగర్వంగా, వారి ఒక్కగానొక్క కొడుకు పిల్లలైన, తమ మనుమడు, మనుమరాళ్ళ ఫోటోలను మాకు చూపించారు. వారి కుమారుడు, వృత్తి పరంగా వారి అడుగు జాడలలో నడవక పోయినా, గృహ నిర్మాణ రంగంలో విజయ వంతమైన వ్యాపారంలో ఉన్నాడని సంతోషంగా చెప్పారు. ఆ తరువాత వాళ్ళబ్బాయి ఫోటో చూపించినప్పుడు, బాగా పెద్దది చేయటం వలన అతని ప్రక్కనున్న వ్యక్తి కనపడలేదు. అతనెవరని నేను అడగటంతో, దీపక్ నవ్వి, అతనిని చూపించాడు. అది డొనాల్డ్ ట్రంప్.



ఓస్లో సిటి

ఈ ప్రయాణంలో నేను చూసిన అతి సుందర భూలోక దృశ్యాలు ఒక ఎత్తైతే, వివిధ దేశస్థులతో పరిచయం, వారితో ముచ్చట్లు... మరొక ఎత్తు. రెండూ మన మానసిక పరిధులను విస్తృతం చేసేవే. ప్రయాణాల పర్యవసానాలే. దాదాపు అయిదు గంటల ప్రయాణం తరువాత ఓస్లో చేరుకున్నాను. అక్కడ నా హొటల్ పేరు సిటీ బాక్స్. అక్కడికి ఎట్లా వెళ్ళాలి అని సమాచార కేంద్రంలో ఉన్న వ్యక్తిని అడిగాను. ఒక మ్యాప్ తీసి అందులో నా హొటల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తు పెట్టి, అది 15 నిముషాల నడక దూరంలో ఉందని చెప్పి, నేను అలసటగా ఉంటే, టాక్సీ తీసుకోమని, లేకపోతే ట్రామ్‌లో వెళ్ళమని అతను సూచించాడు. ట్రామ్ నెంబర్ కూడా ఇచ్చాడు. ట్రామ్ ఎక్కి, నా హొటల్‌కు వెళ్ళటం చాలా తేలికగా జరిగిపోయింది. నేను సహాయం అడిగిన ప్రతివారూ చాలా మర్యాదగా ఉన్నారు. నాకు ఆ దేశం మీద గౌరవం అంతకంతకూ పెరుగుతోంది. మరుసటి రోజు.. ఈరోజు నార్వేలో నా చివరి రోజు. ఓస్లో తిరిగి చూడటానికి ఆరోజంతా ఉంది. నా హొటల్ సిటీ బాక్స్, ఆ నగరం మధ్యలో, చూడవలసిన విశేషాలకు వెళ్ళడానికి వీలుగా ఉంది. నిన్నంతా, తిరగటంలో పడి, సరైన భోజనం గురించి పట్టించుకోలేదు. ఈ రోజు లేచే సరికి ఆకలి జ్ఞాపకం వచ్చి, త్వరగా బయలుదేరిపోయాను. చాలా కెఫేలు ఇంకా తెరవనే లేదు. కార్ల్ జోహాన్స్ గేట్ వద్ద, పార్లమెంటు భవనం దగ్గరలో ఒక మంచి బేకరీ కనిపించింది. కాఫీ, దాల్చిన చెక్క పొడితో కలిపి చేసిన ఒక బన్‌తో, బ్రేక్ ఫాస్ట్ కానిచ్చాను.

నగరం మెల్లగా మేలుకొంటోంది. ఎనిమిది గంటలయ్యే సరికి ఊరు ప్రాణం పోసుకుని, ఇది మరో ఐరోపా నగరమన్నట్లు తయారయ్యింది. బర్గెన్, స్టవంగాలు అవటానికి రెండవ, నాల్గవ పెద్ద నగరాలైనప్పటికీ.. వాటికీ ఓస్లోకు పోలికే లేదు. ఆ రెండు నగరాలు ఎంతో ప్రశాంతంగా ఉన్నాయి. ఓస్లో.. ప్రశాంత సాగరపు ఒడ్డున ఉన్న, గలాభా నగరం. కాఫీ పడటంతో పుంజుకున్న శక్తితో, రోడ్డు పట్టాను. దోవలో దాటిన యూనివర్సిటీ భవనపు ముఖద్వారం, గ్రీసులోని పార్థెనాన్ మాదిరిగా ఉంది. ఆ రోడ్డు చివరన ఉన్న ఒక చక్కని పార్కులో రాయల్ ప్యాలెస్ ఉంది. బ్రిటన్‌లోలానే నార్వేలో కూడా రాజ్యాంగ బద్ధమైన రాచరికం నడుస్తుంది. రెండు దేశాల రాజ వంశీకులు సంబంధీకులు. ఒకే పూర్వీకుల సంతతి వారు. మొదటి ప్రపంచ యుద్ధంలో నార్వే తటస్థంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీ వారి దురాక్రమణకు గురయిన నేపథ్యంలో రాజ వంశీకులు, బ్రిటన్‌కు తరలి పోయారు. ఆ కష్ట కాలంలో బాసటగా నిలిచినందుకు, కృతజ్ఞతగా, నార్వే ప్రతి సంవత్సరం యునైటెడ్ కింగ్డంకు ఒక క్రిస్మస్ ట్రీని పంపుతుంది. దీనిని, ఒక సంప్రదాయంగా లండన్‌లోని ట్రఫాల్కర్ స్క్వేర్‌లో ప్రతిష్ఠించుతారు. ఇక్కడ నేను ముఖ్యంగా చూడాలనుకున్నవి రెండే రెండు. ఒకటి నోబెల్ పీస్ సెంటర్. రెండవది ఓస్లో టౌన్ హాల్. ఇక్కడే ప్రతి శిశిర ఋతువులో, నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలకు అందించబడుతుంది.

ఆల్ఫ్రెడ్ నోబెల్ (1833-1896), డైనమైట్, బలిస్టైట్ వంటి ప్రేలుడు పదార్థాలను కనుగొన్న శాస్త్రవేత్త. స్వీడన్‌కు చెందిన వాడు. ఆయుధాల తయారీ కర్మాగారమైన ఎ.బి. బోఫోర్స్ అనే కంపెనీ అధినేత కూడా. ఒక సాధారణ ఉక్కు కర్మాగారాన్ని, ఫిరంగులు, ఇతరత్రా విస్ఫోటక ఆయుధాల తయారీలో ప్రముఖంగా నిలబెట్టినవాడు. అతను తన జీవితంలో వివాహం చేసుకోలేదు. అతను ఆర్జించిన అంతులేని సంపదకు వారసులే లేరు. దానిని సద్వినియోగం చేయాలనుకుని, తన యావదాస్తినీ ఒక ట్రస్ట్‌కు ఇచ్చేశాడు. అతని వీలునామా ప్రకారం ఈ ట్రస్టు, అతని ఆస్తి మొత్తాన్ని మదుపుచేసి, ఒక సంవత్సరంలో వచ్చిన ఆదాయాన్ని, మరుసటి సంవత్సరం అయిదు భాగాలుగా విభజించి, వాటిని అయిదు రంగాలలో మానవ జాతికి విశేషమైన మేలు చేసిన వారికి బహుమతిగా ఇవ్వాలని నిర్దేశించాడు. అతను ఎంచుకున్న నాలుగు రంగాలు, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్య శాస్త్రం, సాహిత్యం. ఈ రంగాలలో విశేషకృషి చేసిన వారిని ఎంపిక చేసే బాధ్యత స్వీడన్ దేశంలోని సంస్థలకు ఇవ్వబడింది. కానీ డైనమైట్ కనిపెట్టిన వ్యక్తికి ప్రపంచ శాంతి గురించిన

వేదన ఉన్నట్లుంది. అయిదో బహుమతిని ప్రపంచ శాంతి కోసం కృషి చేసిన వారికి ఇవ్వవలసిందిగా కోరుకున్నాడు. దీనికి అర్హులైన వారిని ఎంపిక చేసే పని మాత్రం నార్వే వారికి ఒప్పచెప్పబడింది. ఈ బహుమతులు స్కాండినవియా దేశస్థులకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా అర్హులైన వారికి ఇవ్వవలసిందిగా అతను కోరుకున్నాడు. ఇది జరిగి వంద సంవత్సరాలకు పైనే అయింది. 1901 నుండి నిరాఘాటంగా ఉన్నతోన్నతి సాధించిన వారి కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు ఇవ్వబడుతూనే ఉన్నాయి. నోబెల్ బహుమతి గ్రహీతగా గుర్తింపు జన్మ సార్థకతకు చిహ్నంగా భావించబడుతుందనటంలో అతిశయోక్తి లేదు. 1969వ సంవత్సరంలో ఆర్థిక రంగంలో విశేష కృషి చేసిన వారిని కూడా నోబెల్ ఫౌండేషన్ గుర్తించటం మొదలు పెట్టింది. ఈ బహుమతుల గ్రహీతలను, నోబెల్ లారియేట్స్ అని సంబోధిస్తారు.

ఇక్కడ నాకొక అనుమానం వచ్చింది. మిగతా అన్ని అవార్డులకు గ్రహీతలను ఎంపిక చేసే పని స్వీడన్ వారికి ఒప్పచెప్పి, శాంతి బహుమతికి ఎంపిక చేసే బాధ్యత మాత్రం నార్వే వారికి ఇవ్వటం ఏమిటని? అక్కడ పని చేస్తున్న సిబ్బందిలో ఒకామెను ఇదే అడిగాను. తనకు తెలియదంటూనే, బహుశా అతనికి తనదేశం వారికంటే, నార్వే దేశస్థుల మీద నమ్మకం ఎక్కువేమోనని నవ్వుతూ చెప్పింది. ఇది నాకు వింతగానే అనిపించింది. కానీ ఆ కాలంలో అతని స్వీయానుభవం ఏమిటో మనకు తెలియదు కదా!! ఏమైనా ఇటువంటి విషయాలలో, నార్వే నిష్పాక్షికంగా, నిర్ద్వంద్వంగా ఉంటుందనుకోవటానికి ఇదొక ఆస్కారం కల్పించింది. అతని జీవిత కాలంలో నార్వే స్వీడన్‌ల మధ్య రాజకీయ పొత్తు ఉండేది. రెండు దేశాలకు సమానమైన ప్రాధాన్యత ఇవ్వటం కోసం కూడా ఇట్లా జరిగివుండవచ్చు. ప్రతి సంవత్సరం, అక్టోబర్ నెలలో ఈ అవార్డు గ్రహీతల ప్రకటన కోసం ప్రపంచం ఎదురు చూస్తూ ఉంటుంది. నా చిన్నప్పటి నుండి, వార్తా పత్రికలను క్షుణ్ణంగా చదివే అలవాటు ఉండటంతో, ఎదురు చూసే వారిలో నేను కూడా ఉండే వాడిని. అయితే ఎల్లప్పుడూ అందర్నీ సంతోష పెట్టటం అసాధ్యమవటం వల్లనో ఏమో, ఈ బహుమతి గ్రహీతల పేర్లు వెలువడిన వెనువెంటనే, మాధ్యమాలలో, ఈ ఎంపిక వెనుక పక్షపాత ధోరణులు చోటు చేసుకుంటున్నాయని, ఇదివరకటిలాగా అర్హత ప్రధానంగా ఉండటం లేదని.. చాలా విమర్శలు గుప్పించ బడేవి. 1937–47 మధ్య కాలంలో మహాత్మాగాంధీ పేరు అయిదు సార్లు శాంతి బహుమతికి ప్రస్తావించబడింది. 1948లో గాంధీజీ హత్యకు గురయ్యాడు. ఆ సంవత్సరం నోబెల్ శాంతి బహుమతి ఎవరికీ ఇవ్వకపోవటానికి.. అర్హులైనవారు అప్పటికి జీవించి ఉన్నవారిలో లేరు అని తెలుపబడింది. అంటే పరోక్షంగా మహాత్మా గాంధీ అర్హత సూచించబడిందనుకోవాలి.

20వ శతాబ్దంలో, శాంతి కాముకునిగా గుర్తింపుకు గాంధీజీ కంటే అర్హులు ఎవరు? ప్రపంచ శాంతి కోసం ఆయన చేసిన విశేష కృషి ప్రపంచ వ్యాప్తంగా అనుసరణీయమయింది. అహింసాత్మక విధానాలలో స్వాతంత్ర్య సముపార్జన సాధ్యమని ప్రపంచానికి చూపించిన మహాత్ముడు గాంధీజీ. ఆయన చూపించిన దోవలో నడచిన నాయకులు, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ (జూ). వీరికి నోబెల్ శాంతి బహుమతి ఇచ్చి, గాంధీజీకి ఇవ్వకపోవటం నార్వే నోబెల్ కమిటీ పారదర్శకత మీద ఒక మచ్చ. 2006 వ సంవత్సరంలో ఈ కమిటీ సెక్రెటరీ, 106 సంవత్సరాల కమిటీ చరిత్రలో ఇదొక సవరించుకోలేని తప్పిదంగా పరిగణించాడు.

2009లో అమెరికన్ ప్రెసిడెంట్‌గా పదవి స్వీకరించిన ఎనిమిదిన్నర నెలలలోనే, బారక్ ఒబామాను శాంతి బహుమతి గ్రహీతగా ప్రకటించినప్పుడు, అతనితో సహా ప్రపంచం ఆశ్చర్య పడింది. ఎందుకంటే అప్పటి వరకు ఈ దిశగా అతను చేసిన ప్రయత్నంగాని, సాధించిన విజయాలు కానీ ఏమీ లేవు. పైగా ఆఫ్ఘనిస్తాన్, లిబియా లలో జరిగిన రక్తపాతానికి పరోక్ష ప్రేరేపణ అతను తీసుకున్న నిర్ణయాలే. అవేమీ శాంతి కాముక చర్యలు కావు. మొదటి 60 సంవత్సరాలలో, నోబెల్ లారియేట్స్ ప్రధానంగా ఐరోపా లేదా, ఉత్తర అమెరికా వారు. ఈ సంప్రదాయానికి విరుద్ధంగా, 1913లో సాహిత్య రంగంలో నోబెల్ బహుమతి భారతీయుడైన రవీంద్రనాథ్ ఠాగోర్‌కు ప్రదానం చేయబడింది. గీతాంజలి కావ్య రచనకు అతనికి ఇంతటి గౌరవం దక్కింది. మొట్ట మొదటిసారిగా నోబెల్ శాంతి బహుమతి దక్కించుకున్న ఆసియా వ్యక్తి, వియత్నామ్ కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన లె డుక్ థో. 1969–1973ల మధ్య, వియత్నామ్ యుద్ధం ఆపటానికి అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ అయిన హెన్రీ కిస్సింజర్తో అతను జరిపిన శాంతి సంప్రదింపులకు, కృషికి గుర్తింపుగా తీసుకున్న నిర్ణయం ఇది. అయితే ఈ సంధి షరతులు చాలాసార్లు అతిక్రమించ బడటంతో, లె డుక్ థో ఈ బహుమానాన్ని తిరస్కరించాడు.

ప్రపంచంలోనే అత్యున్నతమైన గుర్తింపుగా పరిగణింపబడే నోబెల్ బహుమానాన్ని తిరస్కరించిన వారు ఇంకా కూడా లేకపోలేదు. 1964లో జీన్ పాల్ సార్త్రే అనే రచయిత, సామాజిక తత్వవేత్త ..తనకు సంస్థాగతమైన గుర్తింపులేవీ అవసరం లేదంటూ.. తనకు ఇవ్వబడిన నోబెల్ బహుమానాన్ని తిరస్కరించాడు. ఇదిట్లా ఉండగా, 2014లో, 17 సంవత్సరాల వయసులోనే నోబెల్ శాంతి బహుమతి దక్కిన మలాలా యూసఫ్జాయి అనే పాకిస్తానీ సాహసికురాలి జన్మ ధన్యం. నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలను ఎంపిక చేసే అయిదుగురు కమిటీ సభ్యులను నార్వే పార్లమెంటు నియమిస్తుంది. దేశవిదేశాలలో ప్రభుత్వాలు, అసెంబ్లీలు, కోర్టులు, యూనివర్సిటీ ఆధ్యాపకులు, అంతకు ముందు ఈ పురస్కారం పొందిన వారు.. అర్హులైన వారి పేర్లను ప్రతిపాదించవచ్చు. దాఖలు అయిన పత్రాలను పరిశీలించిన తరువాత, ఈ అయిదుగురి సభ్యులలో ఎక్కువ మంది వోటు పొందిన వారిని గ్రహీతలుగా ప్రకటిస్తారు. ఒకసారి ప్రకటన చేసిన తరువాత, ఈ నిర్ణయం మీద వాద ప్రతివాదాలకు ఆస్కారం లేదు. అది తుది నిర్ణయం. కొన్ని వందల ప్రతిపాదనల నుండి ఒక్కరిని ఎంపిక చేయటం అంత తేలికైన విషయం కాదు. చాలాసార్లు వాదోపవాదాలు ఎగసిపడుతూ ఉంటాయి. అందుకే అన్నివిధాలా నిష్ణాతులైన వారినే సభ్యులుగా నియమించడం జరుగుతుంది.

ప్యాలెస్, సిటీ హాల్ చూసిన తరువాత, ఓస్లో నగర వీధులలో తిరిగి చూస్తూ, నార్వేలో చూడవలసిన ప్రదేశాలలో ఒకటైన ఫ్రోగ్నర్ పార్క్ చేరుకున్నాను. ఈ పార్క్‌కు నియమిత వేళలేమీ లేకపోవటంతో, స్థానికులు సేద తీరటానికి ఇదొక అనుకూలమైన చోటు. ఓస్లో మ్యూజియం ఇక్కడే ఉంది. కానీ నా తిరుగు ప్రయాణం ఆ సాయంత్రమే కావటంతో నేను ఈ మ్యూజియం చూడలేక పోయాను. దీనిని చూసే సాకుతో మరొక సారి ఓస్లో రావచ్చు కూడా!! ఈ పార్కులో వీగెలన్డ్ స్కల్పచర్ పార్క్ ఉంది. నార్వే శిల్పి, గుస్తావ్ వీగెలన్డ్ రూపొందించిన కళాకృతులు ఇక్కడ చాలా ఉన్నాయి. అతను పుట్టి పెరిగిన ఊరు ఇది. 1943లో, 73 ఏళ్ళ వయసులో అతను మరణించాడు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలకు ప్రదానం చేసే మెడల్ కూడా ఇతడు రూపొందించినదే. ఇక్కడ అన్నిటికన్నా నన్ను ఆకట్టుకున్న శిల్పం, 22 మీటర్ల ఏకశిలా శిల్పం. దీనిని మెట్లు మెట్లుగా ఏర్పరచిన ఎత్తైన వేదిక మీద ఉంచారు. ఒకే గ్రానైట్ రాయి ఇది. దాని మీద వందలాది మానవాకృతులు కదబడి, పైకి



రాయల్ ప్యాలెస్, ఓస్లో

ఎగబాకుతున్నట్లు చెక్కబడి ఉన్నాయి. దీనిని ఎన్నో విధాలుగా అర్థం చేసుకోవచ్చు. అక్కడ ఉన్న ఒక స్థానికుడిని దీని గురించి అడిగినప్పుడు, మనుష్యులలో, దివ్యత్వం వైపుకు, స్వర్గానికి.. సాగిపోవాలనే ప్రగాఢ వాంఛకు ఈ శిల్పం రూపు కట్టిందని చెప్పాడు. ఒకే శిల్పి రూపొందించిన శిల్పాలను మాత్రమే ప్రదర్శించే పార్కులలో, వీగెలన్డ్ స్కల్పచర్ పార్క్ అతి పెద్దది. ఇక్కడ, కంచు, పోత ఇనుము, ఇంకా రాతిలో వీగెలన్డ్ మలచిన శిల్పాలు మొత్తం 212 ఉన్నాయి. ఇక్కడ మరొక ఆకర్షణ, ఒక బ్రిడ్జ్. దీని మీద 58 మంది దిగంబరులైన స్త్రీ, పురుషులు, పిల్లలు వివిధ భంగిమలలో కనిపిస్తున్నారు. ఒక చిన్న పిల్లవాడు, కాలితో నేలను తట్టుతూ ఉన్న విగ్రహం ప్రముఖంగా కనపడింది. ఈ పిల్లవాడిని, ముద్దుగా, 'వీగెలన్డ్ మోనా లీసా' అని పిలుస్తారట. బహుశా అతని ముఖంలో ప్రకటితమౌతున్న భావం, మోనాలిసా ముఖంలో భావంలానే ఇదమిత్థంగా లేకపోవటం వలననేమో!! అంతలోనే సాయంత్రం అయిపోయింది. వెంటనే హోటల్‌కు వెళ్ళి సామాను సర్దుకుని, ఎయిర్ పోర్ట్‌కు వెళ్ళకపోతే విమానం తప్పిపోయే ప్రమాదాన్ని గమనించుకుని, హెచ్చరించుకుని, అంతటితో ముగించుకుని హోటల్‌కు వెళ్ళిపోయాను.

హోటల్ నుండి ఎయిర్ పోర్టుకు వెళ్ళాలంటే ఓస్లో సెంట్రల్ స్టేషన్ నుండి ట్రైన్ తీసుకోవాలి. ఓస్లో ఎయిర్ పోర్టు సామాన్యంగా కనిపించినా, అక్కడ నాకొక విశేషం కనిపించింది. సాధారణంగా, ఎయిర్ పోర్టులలాంటి విశాలమైన ఆవరణల పైకప్పు గట్టి స్టీల్ కడ్డీల మీద నిలబెడతారు. కానీ ఇక్కడ స్టీల్ బదులు, కలప వాడారు. మొత్తం మీద కూడా ఎక్కడ వీలైతే అక్కడ కలప వాడటం నేను గమనించాను. ఇక్కడే కాక, సిటీ హాల్‌లో కూడా కలప వాడకం గమనార్హం. ఒపెరా హౌస్ బయటి భాగమంతా, రాయి, స్టీలు, గాజు, కాంక్రీటు మొదలైన వాటితో



ఫ్రోగ్నర్ పార్క్, ఓస్లో

నిర్మితమైనా, లోపల మాత్రం ఎక్కువగా కలప వాడకం కనపడింది. స్థానికంగా దొరికే వనరును వీలైనంత వరకు వినియోగించుకునే పద్ధతిని ఇక్కడ అనుసరిస్తున్నట్లున్నారు.

జేబులో మిగిలిన చిల్లర అంతా పోగేసి, కాఫీ, మంచి నీళ్ళు కొనుక్కున్నాను. ఎయిర్ పోర్టు హడావుడి నన్ను తాక కుండా వెళ్లిపోతోంది. నా చేతిలో కాఫీ కప్పు ప్రభావమేమో. తాపీగా కూర్చుని, అడపా దడపా నా ముందున్న స్క్రీన్ మీద లండన్ గాట్విక్‌కు వెళ్ళే నా విమాన సమాచారాన్ని గమనిస్తూ, నార్వేలో గడిపిన ఈ ఆరు రోజుల అనుభవాన్ని మననం చేసుకోవటం మొదలు పెట్టాను.

ఆరు రోజుల పాటు నా కళ్ళలో, మనసులో నిండిపోయిన ప్రకృతి సౌందర్య హేల రమణీయం, చిరస్మరణీయం. ఇంతకుమించి వర్ణనాతీతం. దీనితో పాటు నా మనసును తాకినది ఇక్కడి ప్రజల మర్యాద, మన్నన. అది అక్కడి మనుషుల మధ్యనే కాదు. నాలాంటి కొత్త వారితోనే కాదు. అక్కడున్న వాతావరణంతో, తాము జీవించే పరిసరాలతో.. అది వారి జీవన విధానంలో ఇంకి పోయిన సంస్కారంలా నాకు కనపడింది. ఇదొక శ్రేయో రాజ్యం. ఇంతటి శాంతి కాముక దేశం, తమ విధానాల వలన అంతర్జాతీయ శాంతి భద్రతల సంరక్షణ దిశగా మిగిలిన దేశాలకు తలమానికంగా నిలుస్తుందనటంలో సందేహం లేదు. నిజంగానే అన్నివిధాలా ఆనందకరమైన జీవితం గడపటానికి ఇంతకు మించిన దేశం మరొకటి ఉండక పోవచ్చు.



22 మీటర్ల ఏకశిలా శిల్పం

నేనిలా నా ఊహల ఉయ్యాలలో ఊగులాడుతుంటే, కర్కశంగా నా వెనుక నుండి, హిందీలో ఒక భారతీయ మహిళ, సుమారు యాభై సంవత్సరాల వయసుంటుందేమో.. పెద్ద గొంతుతో, ఫోన్‌లో మాట్లాడటం వినిపించింది. అవతల ఉన్న వ్యక్తికి ఆమె చెపుతున్నదేమిటంటే, నార్వే ఒక మురికి ప్రదేశమని. ఇది భారతదేశం కంటే కూడా అధ్వానంగా ఉందని. ఆమె సంభాషణ ముగిసేసరికి, నా కప్పు కూడా ఖాళీ అయింది. నా అనుభవానికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వ్యక్తి అనుభవం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో, ఆమెను, 'అంతా ఒకేనా' అంటూ పలకరించాను. ఆమె ముంబై నుండి స్కాట్ల్యాండ్‌లోని ఇన్‌వర్నెస్‌లో ఉన్న ఒక ఫ్రెండ్‌ను చూడటానికి వెళుతోందట. నార్వేలో విమానం మారాలి. ముందు చెప్పిన దాని ప్రకారం ఆమె సామాను, ముంబై నుండి తిన్నగా ఇనవర్నెస్ వెళ్లిపోతుందని. కానీ ఓస్లో విమానాశ్రయంలో, తన సామాను తీసుకుని, మళ్ళీ చెక్-ఇన్ చేయాలని చెప్పారట. ఈ లోపల ఎక్క వలసిన విమానం వెళ్ళిపోయింది. ఆమె ఓస్లోలో దిగబడి పోయింది. ఆమె పరిస్థితిలో నేనున్నా ఇట్లాగే కోపం వచ్చేదని అనుకున్నాను. ప్రపంచం మొత్తంలో ఎక్కడైనా ఎయిర్ పోర్ట్ సిబ్బంది ఇట్లాగే ఇబ్బంది పెడుతుంటారని అనుకున్నాను.

ఆరు రోజులు ఇట్టే అయిపోయాయి. స్టావంగాలో పల్పిట్ రాక్ ఎక్కగలిగినందుకు చాలా సంతృప్తిగా ఉంది. కొత్త మిత్రులు కలిశారు. ఎంతో మంది విలక్షణమైన వ్యక్తులను కలిశాను. స్టావంగా, బర్గెన్, ఓస్లో నగరాలు ఇక ముందు సుపరిచితాలు. ఫ్లామ్ ప్రయాణం మనసులో నిలిచిపోయే అనుభవం. ఫియొర్డ్‌లను దాటుకుంటూ నార్వేలో చేసిన ప్రయాణాలు అపూర్వం, అపురూపం. వీటిలో: లైసె ఫియొర్డ్, ఓస్టర్ ఫియొర్డ్, నారోయ్ ఫియొర్డ్, ఆర్లాండ్స్ఫియొర్డ్, సోంగేఫియొర్డ్‌లు గుర్తుండిపోయేవి. ఫ్లామ్ రైల్వే ప్రయాణం ప్రపంచంలోనే అతి సుందరమైన రైలు ప్రయాణమని చెప్పవచ్చు. ఈ నార్వే ప్రయాణంలో నాతో పాటు ఎవరూ లేరు. కానీ నాకెప్పుడూ ఒంటరిగా ఉన్నానని అనిపించలేదు. ప్రకృతి తల్లిలా ఆదరిస్తూ నా వెంటే ఉంది, మౌనంగా నాతో మాట్లాడుతూనే ఉంది. ఈ మౌనం, నా లోపల దాగున్న భావాలను తేర్చినాకు చూపించింది. నిత్య జీవితపు ఒరవడిలో, నా నిజ స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం నుండి నన్ను నేను కాపాడుకోవటానికి, ప్రకృతితో సహవాసం అత్యవసరం. మళ్ళీ మళ్ళీ రమ్మని చెపుతూ నార్వే నాకు వీడ్కోలు చెప్పింది.

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

# మనకాలపు కాళిదాసు

**కా**ళిదాసు, అమ్మవారి కృపతో కవిగా మారాడన్న గాథలు మనం చదువుతూ వచ్చాం.. అది నిజమే అన్నట్టు నింగిన ధృవతారలా నిలిచిపోయిన లోకకవి అందెశ్రీ జీవితం ఆ కథనే నిజం చేస్తుంది. బడి చదువు లేకపోయినా.. కలానికి బదులు తాపీ చేతబట్టినా బాసర సరస్వతీదేవి దర్శనం ఆయనకు వెలుగు చూపిందని ఆయనే చెప్పేవారు. వాక్కులమ్మ అని తన బిడ్డకు పేరుపెట్టుకున్నారాయన.. ఒక నిశ్చల స్థితిలో.. ఉప్పొంగే ఉద్వేగంలోంచి ఆయన పలుకు ఉప్పెనై, పాటలా ఎగసిపడుతుంటే అక్షరాలుగా ఒడిసిపట్టేది వాక్కులమ్మ.. ఆయన్ని దగ్గరనుండి చూసిన వారెవరికైనా ఆయన ఆవేశంలోంచి వెలువడే పాట, మాట ఒక్కోసారి నిప్పుకణికలవుతుంటాయి.. వెన్నెల పూతలవుతుంటాయి..



జననీ జయకేతనం

అందెశ్రీని గత అయిదేళ్లుగా **మిసిమి** పత్రిక కార్యాలయంలో అనేక పర్యాయాలు కలుసుకోవటం మూలంగా ఆయన ధారణా శక్తి తెలియవచ్చింది. అలాగే మూడు రోజుల ముందు కూడా **మిసిమి**కి వచ్చారు. మామూలు సమయాల్లో తక్కువ మాట్లాడతారు ఆయన..అగ్రజా అని ఎడిటర్ అశ్వినీకుమార్ గారిని సంబోధిస్తూ శరణాగతి అనేవారు. వారిద్దరి అనుబంధం మనకర్థమయ్యేది కాదు.

తెలంగాణ ఉద్యమ కాలంలో ఇంటింటా వినిపించిన వారి రచన జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటానికి పది సంవత్సరాలు పట్టింది.. ఆ సందర్భాన్ని అందరికన్నా ముందుగా తెలుగు విశ్వవిద్యాలయంలో ఉత్సవంగా జరిపింది **మిసిమి** మాసపత్రిక. దిగంబర కవి నగ్నముని, అప్పటి ఆంధ్రజ్యోతి ఎడిటర్ డా. కె.శ్రీనివాస్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, సిపిఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ, ప్రొఫెసర్ కె.హరగోపాల్ వంటి పెద్దలు తెలంగాణ ఉద్యమ కాలంలో ఆ పాట ఎంత ప్రభావాన్ని చూపిందో ఆ చారిత్రక సందర్భాన్ని ఆర్తితో గుర్తుచేసుకున్నారు..

వాక్కులమ్మ ప్రచురణలతో కనీసం వంద పుస్తకాలు ప్రచురించాలని తపించారు అందెశ్రీ..వారి నిప్పులవాగు ఉద్యమగీతాల జ్వలనకోన.. సౌందర్యలహరి వారి ఆరాధన.. ఇటీవలే ప్రచురించిన వారి ఆధ్యాత్మిక గురువు శ్రీరాం గారి హసితభాష్పాలు ఆయన ఎంతో ప్రేమించిన పుస్తకం. ప్రపంచ ప్రఖ్యాత నదుల పుట్టుక నుంచి సంగమం వరకు అధ్యయనం చేయడానికి ఆయన దేశదేశాలు తిరిగారు. వారి అనుభవాలన్నీ ఒక బృహత్ గ్రంథంగా రాసే ప్రయత్నంలో ఉన్నారు. ఇంతలోనే ఈ విషాదం జరిగిపోయింది.. తన చుట్టుప్రక్కల ఏం జరుగుతుందోనన్న స్పృహ ఆయనకు ఏనాడూ లేదు.. కమ్ముకుంటున్న ఆలోచనలను అంతరంగ కొలిమిలో పుటం పెడుతుండేవారు.. అలాంటి వ్యక్తికి తన ఆరోగ్య స్పృహ ఎలా ఉంటుంది? మన దురదృష్టం.. అదే ఆయన్ని మనకు దూరం చేసింది.

అందెశ్రీ ఎప్పుడూ తనదైన ప్రపంచంలో ఉండేవారు.ఒక ఆలోచనల మధనం ఆయనలో నిత్యం జరుగుతూ ఉండేది. ఎవరినైనా పలకరింపుతో సరిపుచ్చేవారు. కానీ ఒక్కసారి స్టేజ్ ఎక్కి మాట్లాడటం మొదలుపెడితే ఆయన ఒక పోటెత్తిన అల..ఎప్పుడు ఆ అల తీరం చేరతుందో మనం చెప్పలేం.. ఇప్పుడు ఆ అల అలాచేరి అమ్మవారిలో ఐక్యమయింది.. అనాధగా పెరిగినా ఆకాశమంత ఎత్తు ఎదిగిన లోకకవిగా అందెశ్రీ ప్రజల గుండెల్లో జయజయహే తెలంగాణ ..జననీ జయకేతనం అంటూ నిత్యం ప్రతిధ్వనిస్తుంటారు..తన గుండె చప్పుడు వినిపిస్తూనే ఉంటారు .. మహాకవి కాళిదాసులా, ఆయన రాబోయే తరాల వారికి ఒక జానపద గాథ ..

**- సి.యస్.రాంబాబు,** *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)*

నాటకమే నిత్యానందం

# లంక సత్యానంద్

– బి.వి. అప్పారావు



లంక సత్యానంద్

**1988** సెప్టెంబర్..... విశాఖలో... ఒకనాటి హొటల్ అప్సర ప్రాంగణం... కిన్నెర ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో... సుప్రసిద్ధ రంగస్థల ప్రయోక్త, నటుడు పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణకు ఘనసన్మానం జరిగింది. విశాఖ నగర తొలి మేయరు ఎస్.ఎస్.ఎన్. రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆనాటి కార్యక్రమంలో నాటకరంగానికి చెందిన ఎందరో అతిరథ మహారథులు, ఎఆర్ కృష్ణ సన్నిహితులు, సహనటులు పాల్గొన్నారు. కృష్ణగారు నాటక రంగానికి సంబంధించి ఎన్నో విషయాలు చెప్పారు. తనకు జరిగిన సత్కారానికి ప్రతిస్పందించిన ఎఆర్ కృష్ణ యిలా బదులిచ్చారు..... "నాగురించి అందరూ ఎన్నో అనుభవాలు ఎంతో గొప్పగా చెప్పారు.... కానీ నేను ఈ సన్మాన సత్కారాలు, అభినందనల గురించి నాటకం వేయలేదు... నాటకం వేయకుండా వుండలేను కాబట్టి నటించాను అంతే... సరిగ్గా అదే అభిప్రాయం తరచూ వెలిబుచ్చుతుంటారు ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు లంక సత్యానంద్ ప్రస్తుతం స్టార్ మేకర్‌గా ప్రసిద్ధుడు. అయినా నాటకం పట్ల ఆయనకున్న కమిట్‌మెంట్ అరుదైనది. స్టార్‌మేకర్‌గా తాను ఎంతమందిని సినీరంగానికి హీరోలను అందించినా, అది వృత్తి.... కానీ శ్వాస, ధ్యాస అంతా నాటకం గురించే.

ఔత్సాహిక నాటకరంగం యవ్వన దశలో నుండగా, బాలనటుడుగా రంగస్థల ప్రవేశం చేశారు. మేనమామ, విశాఖ పోర్టుట్రస్టు ఉద్యోగి వై.యస్. రాజు ప్రోత్సాహంతో నాలుగిళ్ళు చావిడి నాటికలో బాలనటుడిగా నటించారు. డా. అత్తిలి కృష్ణారావు రచించిన యుగ సంధ్య నాటికలో రాముడు పాత్ర కోసం అత్తిలికి పరిచయం అతని నట జీవితాన్ని మేలిమలుపు తిప్పింది. పిన్న వయస్సులోనే రంగ నిష్ణాతులైన అంగర సూర్యారావు, డా. చాట్ల శ్రీరాములు, డా. అత్తిలి కృష్ణారావు, డా. అబ్బూరి గోపాలకృష్ణ (వారంతా ఎ.యు.థియేటర్ ఆర్ట్స్ స్టేజి డైరెక్టర్లుగా వ్యవహరించిన వారు) కొత్తూరి భాస్కరరావు, జె.వి. సోమయాజులు, రుద్రరాజ్ కుమార్‌రాజా వంటి వారి శిష్యరికం, ప్రోత్సాహం లభించాయి.

బాల్యంలో వయసుకు మించిన పరిణితితో నటించి, తన నటభవిష్యత్తును ప్రదర్శించారు. నటరాజ కళాసమితి (శ్రీకాకుళం) బృందంలో నటుడయిన కె.యస్. మాస్టారు, జె.వి. రమణమూర్తికి సత్యానంద్‌ను పరిచయం చేశారు. దాంతో గురజాడ వారి కన్యాశుల్కంలో కరటకశాస్త్రి శిష్యుడు మహేశంగా నటించి, ఉత్తమ బాలనటుడిగా గుర్తింపు పొందారు. నాలుగిళ్ళు చావిడి, యుగసంధ్య, కన్యాశుల్కం వంటి నాటిక నాటకాలలో నటించి, పలు పరిషత్తులలో ఇరవై అయిదుసార్లు ఉత్తమ బాలనటుడిగా బహుమతులు గెల్చుకున్నారు. దాంతో డా. అత్తిలి కృష్ణారావు నాట్యభారతి, అంగర సుబ్బారావు రంగశాల, తోట శ్యామలరావు, కె.యస్. మాస్టారు, రుద్రరాజ్ కుమార్‌రాజా, జె.వి. రమణమూర్తి వంటి దర్శకుల సంస్థలలో బాలనటపాత్రలకు ప్రసిద్ధి చెందారు. అత్తిలి కృష్ణారావు విశాఖ పోర్టు నుండి ఎ.యు. థియేటర్ ఆర్ట్స్ స్టేజి డైరెక్టరుగా నియమితులైనారు. దాంతో సత్యానంద్‌కు రంగస్థల ప్రయోక్త, నాటి ఎయు రంగస్థల విభాగం అధిపతి డా. చాట్ల శ్రీరాములు ఆశీస్సులు, ఆదరణ లభించింది. దాంతో గురజాడ ఆర్ట్స్ (కృష్ణచైతన్యం సంస్థ) సమర్పణలో డా. చాట్ల దర్శకత్వంలో డా. అబ్బూరి

గోపాలకృష్ణ అపూర్వ రచన "త్రిజాకీ యమదర్శనం" నాటకంలో నటించి చాల్ల ప్రశంసలందుకున్నారు.

1975లో 'కళాజ్యోత్స్న' సంస్థను స్థాపించారు. రంగస్థల, సినీ నటుడు కొండవలస లక్ష్మణరావు రచించిన 'స్వార్థం బలితీసుకుంది' నాటికతో దర్శకత్వం ప్రారంభించారు. తొలినాటికతోనే దర్శకునిగా మంచి గుర్తింపు, బహుమతులు పొందడంతో, తనముందు తరం వారితో సమానంగా దూసుకుపోయారు. దర్శకుడినైపోయాను కదా అని నటనను వదులుకోలేదు. రాష్ట్రస్థాయిలో మంచి దర్శకునిగా గుర్తింపు తెచ్చుకున్నా, జె.వి. రమణమూర్తి, జె.వి. సోమయాజుల సారధ్యంలోని 'నటరాజకళా సమితి' సంస్థ ద్వారా పదకొండేళ్ళ పాటు 'కన్యాశుల్కంలో' 'మహేశం'గా నటించారు. అలాగే రుద్రరాజ్ కుమార్‌రాజా దర్శకత్వంలో ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి రచించిన చారిత్రక నాటకం 'పాండవులమెట్ట'లో 'కుమార గజపతి' పాత్ర అనేకసార్లు నటించారు. కొత్తూరి భాస్కరరావు వంటి రంగస్థల తపస్వి సరసన నటించి ప్రశంసలందుకున్నారు. ఉత్తమ నటుడు, దర్శకునిగా దాదాపు రెండువందల సార్లు బహుమతులందుకున్నారు.

దర్శకునిగా, మానవతా నువ్వెక్కడ? 'గారడి', 'నాగులు తిరిగే కోనలో', 'దర్పణం', 'మంచం మీద మనిషి', 'మనిషి నూతిలో పడ్డాడు', మనీ+షి, 'లెట్ ఇట్ బి వేకెంట్'తో పాటు ప్రయోగాత్మక వీధి నాటకాలు 'రైలుబండి', ఊరేగింపు 'శాంతి' వంటివి దర్శకత్వం వహించి నాటక రంగ ప్రయోక్తల దృష్టినాకర్షించారు. విశాఖలోని అన్ని పరిశ్రమల, ప్రభుత్వ రంగసంస్థల, బ్యాంకులలోని కళాకారుల ప్రదర్శనలకు దర్శకత్వం వహించి, పలువురిని మంచి నటులుగా తీర్చిదిద్దారు. నటుడిగా, దర్శకునిగా దాదాపు రెండు దశాబ్దాల పాటు గడించిన అనుభవంతో పరిణితి చెందారు. తమిళ, మళయాళ, మరాఠీ, బెంగాలీ, కన్నడవంటి భాషల నాటకరంగ తీరుతెన్నులను అవగాహన చేసుకున్నారు. ఎంతో శక్తివంతమయిన నాటకం, పరిషత్తుల పరిధికి లోబడి, జన సామాన్యం వద్దకు వెళ్ళడం లేదని స్థిరాభిప్రాయానికి వచ్చారు. అవగాహనతోనే పరిషత్తు పోటీలకు దూరంగా జరిగారు. తెలుగునాట రంగంలో ఏదైనా కొత్తదనం తీసుకురావాలన్న తపన అతనిలో మొదలైంది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (న్యూఢిల్లీ) సంస్థ ఆధ్వర్యంలో తాను పొందిన శిక్షణానుభవం, అప్పటికే నాటక రంగ నిపుణులతో తనకున్న సాన్నిహిత్యం తోడై పెద్ద ప్రయోగానికి పూనుకున్నారు.

దాని ఫలితమే..1985 మార్చి నెలలో... వంగపండు ప్రసాదరావు రచించిన 'అడవి దివిటీలు' నాటకాన్ని, విశాఖ గురజాడ కళామందిరంలో ఏభై ఒక్కరోజుల పాటు వరుసగా ప్రదర్శించారు. టిక్కెట్టు పెట్టి మరీ ఆ నాటకం ప్రదర్శించడం, అదీ ఏభై ఒక రోజులు ప్రదర్శించడం తెలుగు నాటకరంగ చరిత్రలో ఈ నాటికీ ఒక రికార్డు. ఏభైరోజుల తర్వాత ఉత్సవసభను నిర్వహించి, తన ఆత్మస్థైర్యాన్ని, నాటకం పట్ల తన విశ్వాసాన్ని పునరుద్ఘాటించారు. రాష్ట్ర వ్యాప్తంగా నున్న తన సమకాలీనులైన నటులు, దర్శకులు హృదయపూర్వకంగా అభినందించి, ఆశీర్వదించారు. అయితే అదే స్ఫూర్తితో యితర సంస్థలు కూడా ఆ ఒరవడిని కొనసాగిస్తాయని ఆశించానని, అలా జరగకపోవడం తననెంతో నిరుత్సాహపరిచిందని ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. అలాగని ఊరికే కూర్చోలేదు. వరుస నాటక ప్రదర్శన ప్రయోగాలకు స్వస్తి పలకలేదు. తన రికార్డును తానే అధిగమించారు. దక్షిణ భారతదేశంలోనే గొప్ప చరిత్ర కలిగిన 'తొలబొమ్మలాట' కళా ప్రక్రియ ఆధారంగా, ప్రముఖ నాటక రచయిత నడిమింటి నరసింగరావు చేత 'బొమ్మలాట' నాటకం రాయించారు. ఆ నాటకాన్ని అదే గురజాడ కళామందిరంలో నూట రెండు రోజుల పాటు క్రమం తప్పకుండా ప్రవేశ రుసుము వసూలు చేసి ప్రదర్శించారు. అంతేకాదు జాతీయ నాటకోత్సవాలలో తొలిసారి ప్రదర్శించిన తొలి నాటకం 'బొమ్మలాట' కావడం సత్యానంద్ కృషికి, అవగాహనకు నాటకం పట్ల అతనిలోని అంకిత భావానికి నిదర్శనంగా నిలిచింది. 1992లో కాలికట్‌లో సౌత్‌జోన్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన తర్వాత తమిళ, మళయాళీ, కన్నడ నాటక రంగ నిష్ణాతులు, ఏకగ్రీవంగా బొమ్మలాట నాటకాన్ని, జాతీయ నాటకోత్సవాలకు ఎంపిక చేయడం తెలుగు నాటకాభిమానులకు గర్వకారణం. ఆ సందర్భంలో సుప్రసిద్ధ తమిళ రచయిత, కోమల స్వామినాథన్ చేసిన సూచను, విమర్శ తన దర్శక జీవితంలో మేలి మలుపు అంటారు. అప్పటి వరకు విమర్శను తట్టుకోలేని బలహీనత వుండేది కోమల స్వామినాథన్‌తో మాట్లాడిన తర్వాత నుంచి ఖచ్చితంగా నటుడు, దర్శకుడు ఎదగాలంటే తగిన

సద్విమర్శలను స్వీకరించవలసిందే అన్న జ్ఞానోదయం కలిగిందని నిజాయితీగా అంగీకరిస్తారు. 1987లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కుముద్‌బెన్ జోషి కృషితో సాంగ్ అండ్ డ్రామా విజన్ (బెంగుళూరు) నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ యాక్షన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతరత్న ఇందిరమ్మ సాంగ్ అండ్ డ్రామా నాటకానికి దర్శకత్వం వహించారు. విశాఖ రైల్వే స్టేడియంలో జరిగిన ఈ అపురూప ప్రదరశన 42 రోజులపాటు జరిగింది. నాటి ప్రధాని రాజీవ్‌గాంధి ఒకరోజు ప్రదర్శన చూసి సత్యానంద్‌ను, నటినట బృందాన్ని అభినందించారు. 1987 ఫిబ్రవరిలో యుజిసి సహకారంతో ఎ.యు. థియేటర్ ఆర్ట్స్ నిర్వహించిన వర్క్‌షాప్‌లో కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అంగర సూర్యారావు రచన కాలకన్య నాటకానికి దర్శకత్వం వహించారు.

1989 సెప్టెంబరు 3 నుండి 17 వరకు న్యూఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన మేజర్ డ్రామా ఫెస్టివల్ నెహ్రూ శతాబ్ది నాట్య సమారోహ్‌లో ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు. సత్యానంద్ నట దర్శక ప్రస్థానంలో మరో మైలురాయి గంగిరెద్దాట నాటకం. స్వయంగా తానే రచించి ప్రదర్శించారు. అది కూడా సౌత్ జోన్ థియేటర్ ఫెస్టివల్‌లో ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. అడవిదివిటీలు 51 రోజులు, బొమ్మలాట 102 రోజులు ప్రవేశ రుసుం వసూలు చేసి ప్రదర్శించి, చేసిన విశేష కృషికి గాను, మద్రాసు కళాసాగర్ ట్రస్ట్ ఆనాటి తమిళనాడు గవర్నర్ డా. మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా విశిష్ట పురస్కారం-95 ప్రదానం చేసింది. 1991-92, 1992-93 సంవత్సరాలకుగాను టి.వి. ఫిల్మ్ నంది అవార్డుల కమిటీ సభ్యునిగా సత్యానంద్ చూపిన శ్రద్ధాసక్తులను ప్రశంసించిన నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి సూచన మేరకు, ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. ఎం. గోపాలకృష్ణారెడ్డి, ఎ.యు. థియేటర్ ఆర్ట్స్‌లో అధ్యాపకునిగా నియమించారు.

అప్పటికే *మల్లెపందిరి, మంచుపల్లకి, శ్రీమతి కావాలి, చైతన్యం, కళ్ళు, కలికాలం, ఆడది* సినిమాలకు అసోసియేట్ డైరెక్టరుగా పనిచేశారు. మంచుపల్లకి చిత్రం నిర్మాణం సందర్భంగా సినీ హీరో చిరంజీవితో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. సత్యానంద్‌లోనున్న దర్శకత్వ మెళుకువలు, ప్రతిభను గుర్తించిన చిరంజీవి సలహా మేరకు సత్యానంద్ యాక్టింగ్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించారు. అందులో తన సోదరుడయిన పవన్‌కళ్యాణ్ తొలి విద్యార్థిగా ప్రారంభింపచేశారు చిరంజీవి. ఆ విధంగా స్టార్ మేకర్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభం కావడానికి చిరంజీవి కారణమంటారు. 1993లో కేంద్ర సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో నేషనల్ సెంటర్ ఫర్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ నిర్వహించిన దర్శకుల శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. అముల్ పాలేకర్; నజీరుద్దీన్‌షా, నీనాగుప్తా, విజయ్ టెండూల్కర్, కనయ్‌లాల్ వంటి అగ్రశ్రేణి యువరంగస్థల దర్శకులు, ఆ శిబిరంలో పాల్గొన్న సత్యానంద్ సహ దర్శకులు. పదిహేనురోజులపాటు జరిగిన ఆ శిబిరంలో ప్రదర్శించిన పదిహేను నాటకాలు తన జీవితంలో మరువలేనంటారు. యువకళావాహిని (హైదరాబాదు) వారి డా. గరికపాటి రాజారావు బెస్ట్ డైరెక్టర్ అవార్డు, ఇండియన్ జూనియర్ ఛాంబర్ జోన్-12, వాల్తేరు జూనియర్ ఛాంబర్ వారి ఔట్ స్టాండింగ్ యంగ్‌పర్సన్-94, ఎస్ స్వేర్ ఈవెంట్ (విశాఖ) వారి స్వర్ణకంకణ ప్రధానం వంటివి సత్యానంద్ రంగస్థల ప్రతిభకు అందజేసిన కొన్ని ప్రధాన సత్కారాలు.

తెలుగు విశ్వవిద్యాలయం నాటక విభాగం విద్యార్థి గురురాఘవేంద్ర, సత్యానంద్ దర్శకత్వ శైలి - ఒక పరిశీలన అంశంపై పరిశోధన చేసి ఎం.ఫిల్ పొందారు. ఇక స్టార్ మేకర్‌గా సత్యానంద్ సాధించిన విజయాల తెలుగు సినీ ప్రస్థానంలోనే మైలురాళ్ళు. ఎందరినో స్టార్‌లుగా తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు దాదాపు వందమంది హీరోలుగాను, పదిమందిని నాయకలుగాను తయారు చేశారు. ఓ పునా ఫిలిం ఇనిస్టిట్యూట్, ఓ మధు ఫిలిం ఇనిస్టిట్యూట్‌లా తానొక్కడే అన్ని అయి, సత్యాంద్ యాక్టింగ్ ఇనిస్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. స్టార్‌మేకర్‌గా ఎంత ఎదిగినా, తన చేత అక్షరాలు దిద్దించిన నాటకరంగ స్ఫూర్తిని, స్పృహ ఈనాటికీ కోల్పోని నాటకాల మనిషి. నాటక, సినీ రంగాలలో నటునిగా దర్శకునిగా, స్టార్‌మేకర్‌గా విజయాలు సాధించినా, ఈనాటికీ నాటకమే తన ఆరో ప్రాణంగా, నిజాయితీగా ప్రకటించే ఔత్సాహిక నాటకరంగ మణిపూస. అతని నాటకరంగ సేవను ప్రతిభా పాటవాలను గుర్తించి, అప్పాజోస్యుల విష్ణుభట్ల కందాళం ఫౌండేషన్ తన 24వ నాటకోత్సవాల సందర్భంగా సరిలేరు నీకెవ్వరు పేరిట 2917 జనవరి 7వ తేదీన సత్కరించిన సత్యానంద్ గారితో.... మనసులోని మాట...

ప్ర. మామూలుగా అయితే ఒక వీధి స్థాయిలో నాటకరంగ ప్రవేశం చేసిన మీరు అంతమంది నిష్ణాతులతో కలసి ఎలా పయనించగలిగారు? ఇంత అవగాహన ఎలా పెరిగింది?

జ. మా మేనమామ వై.యస్. రాజు, అత్తిలి కృష్ణారావు చాలాకాలం పాటు విశాఖ పోర్టులో సహోద్యోగులు. ఒకసారి విశాఖపోర్టు అంతర్ విభాగ నాటక పోటీల కోసం, అత్తిలి కృష్ణారావు *యుగసంధ్య* నాటక రచించి, దర్శకత్వం వహించారు. ఆ నాటికలో రాముడు అనే బాల పాత్ర కోసం అత్తిలి కోరగా, వై.యస్. రాజు నన్ను అత్తిలికి పరిచయం చేశారు. అది నా నటజీవితాన్ని మలుపు తిప్పింది. ఆ తర్వాత అత్తిలి విశాఖ పోర్టులో ఉద్యోగానికి రాజీనామా చేసి, ఎ.యు. థియేటర్ ఆర్ట్స్‌లో అధ్యాపకునిగా చేరారు. అప్పటి ఎయు థియేటర్ ఆర్ట్స్ విభాగానికి డా. చాట్ల శ్రీరాములు అధిపతి. అత్తిలి గారు నన్ను చాట్ల శ్రీరాములుకు పరిచయం చేశారు. చాట్ల శ్రీరాములు గారితో ఎవరు మాట్లాడినా, ఆ ప్రీతి మాట నాటకం గురించే.... ఆ విధంగా నాటకం గురించి, పాశ్చాత్య నాటక రంగం గురించి అవగాహన కలిగింది. అప్పటికే ప్రముఖ రచయిత అంగర సూర్యారావు, జె.వి. రమణమూర్తి, జె.వి. సోమయాజులు, కె.యస్. మాస్టారు, తోట శ్యామలరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, కొత్తుర్తి భాస్కరారావు వంటి నాటక రంగ ప్రముఖుల దర్శకత్వంలో బాలనట పాత్రలు నటించిన అదృష్టవంతుణ్ణి.

ప్ర. నాటికో, నాటకమో ప్రదర్శన జరిగిన తర్వాత, ఎవరైనా ప్రేక్షకుడు తాను పరిశీలించిన లోటుపాట్లను, నటులు, దర్శకుల దృష్టికి తీసుకు వెళితే సరిగ్గా స్పందించరు. అది వారిలోని అహంకారానికి నిదర్శనమా? సాధారణంగా ఆ పరిస్థితి సాంఘిక నాటకరంగంలోనే వుంది.. ఎందువలనంటారు?

జ. నాటకరంగ ప్రేక్షకులు ఉచితంగా నాటకం చూస్తున్నారు కాబట్టి వాళ్ళకు జవాబుదారీగా ఎందుకుండాలి? అవి చాలామంది నటులు, దర్శకుల అభిప్రాయం. అదీకాక నిజం చెప్పాలంటే విమర్శను స్వీకరించడానికి సహృదయం, అవగాహన వుండాలి. నా వరకు వస్తే ఒకప్పుడు ఎవరైనా విమర్శించినా, ఏమైనా సూచించినా కోపం వచ్చేది. నాకు వీళ్ళు చెప్పేదేమిటి అనిపించేది. అయితే కాలక్రమేణా ప్రేక్షకుడు ముఖ్యం... మంచి విమర్శకుడు చాలా ముఖ్యం అని అర్థమైంది. దానికి వయసు కూడా ఒక కారణం. 1988లో కాలికట్‌లో సౌత్ జోన్ డ్రామా ఫెస్టివ్‌లో నా బొమ్మలాట ప్రదర్శన తర్వాత జరిగిన రివ్యూలో నాకు జ్ఞానదయమైంది. ఆ రివ్యూలో తమిళ, కన్నడ, మళయాళ భాషా నాటిక రంగాలకు చెందిన నిష్ణాతులు ఇద్దరేసి చొప్పున పాల్గొన్నారు. ఎందుకో మరి తెలుగుకు సంబంధించినంత వరకు ఎవరూ పాల్గొనలేదు. మేము ప్రదర్శించిన బొమ్మలాట నాటకం గురించి, వ్యతిరేక ధోరణిలో చర్చ ప్రారంభమైంది. వారి వారి భాషల నాటకాల గురించి, ఎవరికి వారు గొప్పగా చెప్పుకోవడం జరిగింది. అంతిమంగా, జాతీయ నాటకోత్సవాలకు ఏకగ్రీవంగా బొమ్మలాటను ఎంపిక చేశారు. సుప్రసిద్ధ తమిళ రచయిత కోమల స్వామినాథన్ చేసిన సూచనలు, విమర్శ అర్థమై అవి నాటకంలో చొప్పించిన తర్వాత, వచ్చిన స్పందన చూసి నాకు సద్విమర్శ ఎంత ముఖ్యమో అర్థమైంది.

ప్ర. ఏభై ఒక రోజులే ఏకంగా అడవి దివిటీలు, నూట రెండు రోజుల పాటు బొమ్మలాట నాటికలను టిక్కెట్టు పెట్టి ప్రదర్శించి రికార్డు సృష్టించారు కదా, తర్వాత అనుభవాలు ఏమిటి?

జ. నా ప్రయత్నాన్ని, శ్రమను రాష్ట్రవ్యాప్తంగా నన్ను నటులు, దర్శకులు అభినందించి ఆశీర్వదించారు. అయితే నేను అవార్డు కోసం, ప్రశంసల కోసం కాదు. నేను, మా సంస్థ ద్వారా చేసిన ఈ ప్రయత్నాన్ని, ఇతర సంస్థలు, నటదర్శకులు కొనసాగిస్తారని ఎంతో ఆశించాను. దాని వలన ప్రేక్ష టిక్కెట్టు కొని వరుసగా నాటకాలు చూసే అలవాటవుతుందని అనుకున్నాను. కానీ, దురదృష్టవశాత్తూ ఎవరూ అలాంటి ప్రయత్నం చేయకపోవడం నన్నెంతో బాధించింది.

ప్ర. రెండు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలపై మీ అభిప్రాయం?

జ. ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తోన్న నంది నాటకోత్సవాల వలన ప్రయోజనం తక్కువ. భాషా

సాంస్కృతిక వ్యవహారాల శాఖ తక్షణమే చేపట్టవలసిన కార్యక్రమం ఏమిటంటే... మంచి రచయితల్ని ఎంపిక చేసి నాటిక, నాటక రచనలు చేయించాలి. అందుకు తగిన ప్రతిఫలం రచయితలకు అందించాలి. అలా రాయించిన నాటకాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ నగరాలలోను నటీనట బృందాల చేత (అవసరమైతే ఒక నాటికను, నాటకాన్ని కానీ ఎంపిక చేసి) తర్ఫీదునిచ్చి ప్రదర్శింప చేయాలి. అప్పుడే నాటకం బ్రతుకుతుంది. సినిమా, టి.వి. ప్రేక్షకుడి ఇంట్లోకి ప్రవేశించేసింది. నాటకం అలా చేరలేదు. సినిమా ఇచ్చే పోటీని నాటకం తట్టుకోలేకపోయింది. ఎందుకంటే సినిమాలకు నిర్మాతలున్నారు. నాటకానికి లేరు. సినిమా, టి.వి.లు నటీనటులలకు గ్లామర్, ఆదాయం, హోదా ఇస్తున్నాయి. ఆ స్థితి నాటకరంగంలోనున్న నటీనటులకు లేదు. నటీనటులకు నాటకం ద్వారా ప్రధానంగా ఆర్థిక స్వావలంబన ఎప్పుడైతే చేకూర్చగలుగుతామో.. అప్పుడే నాటకం వర్థిల్లుతుంది. నటీ నటులు, నటనను వృత్తిగా స్వీకరించే సాహసం చేస్తారు. కేవలం నంది నాటకోత్సవాలలో తప్ప, మిగిలిన కాలంలో నాటకాలకు ప్రభుత్వ సహకారం లేదు. కనీసం ప్రదర్శించడానికి ప్రభుత్వపరమైన థియేటర్లు కూడా తెలుగునాట లేవు. అదే తమిళ, కన్నడ, బెంగాలీ, మళయాళ, యిప్పుడిప్పుడే ఒడియా వంటి భాషా నాటకాలకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాలు ఆదర్శవంతమైనవి. బెంగాలీలో నాటకం ఒక ఉద్యమంలా ప్రారంభమైంది. బాదల్ సర్కార్, ఉత్పల్‌దత్, కుమార్ రాయ్ వంటి వారు దాన్ని కొనసాగిస్తున్నారు. తెలుగు నాటిక రంగంలో ఆ స్థితి లేదు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకొని తెలుగు నాటకాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఎన్ని మార్పులు తేవలసిన ఆవశ్యకత ఉంది.

ప్ర. నాటకాన్ని ఇంతగా ప్రేమించే మీరు, ఎ.యు. థియేటర్ ఆర్ట్స్ విభాగంలో, అధ్యాపక వుద్యోగాన్ని వదులుకోవడానికి కారణం.

జ. నిజమే నాటకమంటే నాకు ఆరో ప్రాణం. కానీ అనుకోకుండా స్టార్ మేకర్‌గా సక్సెస్ అయిన తర్వాత, స్టార్ మేకింగ్ వృత్తిగా మారిపోయింది. కేవలం ఆర్థిక దృష్టితోనే కాకపోయినా, ఈ వృత్తిలోనూ నటననే కొనసాగిస్తున్నానన్న భావనతో, ఆ వుద్యోగానికి రాజీనామా చేసేశాను.


ప్ర. 2012లో మహాకవి గురజాడ 150వ జయంతి సాక్షిగా, మీరు మళ్ళీ నాటకం తయారు చేస్తానని ప్రేక్షకులకు హామీ ఇచ్చారు. ఆ హామీ బాకీ ఎప్పుడే తీరుస్తారు?

జ. (నవ్వుతూ) నిజమేనండి! నడిమింటి నరసింగరావు చేత ఒక నాటకం రాయిస్తున్నాను. త్వరలోనే అది ప్రదర్శించే పనిలోనే వున్నాను.


**బి.వి. అప్పారావు**
జర్నలిస్టు, రచయిత
విశాఖపట్నం, సెల్ : 93470 39294


## చదవండి

*డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్య వ్యాసాలు చాలా సరళంగా,సుబోధకంగా ఉంటాయి.. ఈ గ్రంథంలో వారు సాహితీ ప్రపంచం మరిచిపోయిన ప్రాచీన, ఆధునిక కవులతో పాటు, అజ్ఞాత కవులను కూడా పరిచయం చేశారు.. దానికి కారణం అక్షరం పట్ల, అక్షరం అందించే విజ్ఞానం పట్ల ఆయనకున్న ప్రేమ.. అదనంగా వారికున్న లోతైన పరిశోధనా దృష్టి, పద్ధతి ఈ వ్యాసాలపై కొత్త చూపును ప్రసరించాయి..ఈ వ్యాసాల కోసం గ్రామగ్రామాన తిరిగి అక్కడి సాహిత్య చరిత్రతో పాటు సాహిత్య విషయాలను కూడా సేకరించటమో విశేషంగా చెప్పుకోవాలి..*



*గ్రామాల్లో ఉన్న అత్యంత ప్రతిభ కలిగినవారి సాహిత్య చరిత్ర కాలగర్భంలో కలిసిపోకూడదని ఆయన చేసిన ప్రయత్నం ఈ పుస్తకంలో పూర్తిస్థాయిలో విప్పారి మనలను విస్మయపరుస్తుంది.. సాహిత్య చరిత్ర పట్ల ఆసక్తి ఉన్నవారు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం ఈ వ్యాస సంపుటి..ముప్పై తొమ్మిది వ్యాసాలు మిమ్మల్ని అలరిస్తాయి.*

*పేజీలు : 279, వెల : 300, ప్రతులకు : కపిలవాయి అశోక్‌బాబు, ఫోన్ : 8790727772*

*- మిసిమి*

# నిశ్శబ్ద మరణం

*– బుక్కే ధనక నాయక్*

**తె**లుగు సాహితీ రంగంలో అత్యాధునిక ప్రక్రియలు ఎన్నో వచ్చినప్పటికీ నాటక ప్రక్రియ ప్రాధాన్యత ప్రత్యేకమైనది. ప్రస్తుత సమాజంలో సినీరంగానికి మూలం నాటక సాహిత్యం. ప్రతి భాషలోనూ రకరకాల మార్పులతో సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తానే ఉంది. సమాజాన్ని ప్రభావితం చేస్తూ, చైతన్యపరిచే విశిష్ట సాహిత్య ప్రక్రియలో నాటకం మొదటి స్థానంలో ఉంటుంది. నాటకసాహిత్యం ప్రజాదరణీయమైనది. ఎంతోమంది కళాకారులకి రంగస్థలంపై జీవితాన్ని ప్రసాదించింది. ప్రసాదిస్తానే ఉంది. రంగస్థలం వేదిక గొప్పగొప్ప కళాకారులని ప్రస్తుత సమాజంలో ఎంతో ఉన్నతస్థాయికి చేర్చింది. సాహితీవేత్తలుగా, రాజకీయ, వ్యాపారవేత్తలుగా ఇతరేతర రంగాలలోనూ పటిష్టమైన గుర్తింపుని తెచ్చిపెట్టింది. ఇప్పటి సమాజంలో నాటక సాహిత్యం ప్రత్యేకత తగ్గినప్పటికీ దానిప్రభావం ఏదో రూపాన ప్రజల్ని చైతన్య పరుస్తూనే ఉంది. తెలుగు సాహితీ ప్రపంచంలో ఆంధ్ర మహాభారతంలో "ఉదాత్త రసాన్విత కావ్య నాటకాలు పెక్కు చూచితి" అని నన్నయ పేర్కొనడంతో నాటకప్రస్తావన ప్రారంభమైంది. తెలుగు ప్రాచీన సాహిత్యంలో యక్షగాన నాటకప్రస్తావన తంజావూరి నాయక రాజుల కాలం నుంచి అభివృద్ధి దిశలో ప్రయాణించింది. దానిని విజయ రాఘవనాయకుడు, శహజి మొదలైన నాయకులు బలపరిచారు. విషాదంతా నాటకాలు, విషాద గంభీర నాటకాలు, మోదాంత నాటకాలు, పౌరాణిక నాటకాలు, చారిత్రక నాటకాలు, హాస్యనాటకాలు, సాంఘిక నాటకాలు, ప్రయోగ నాటకాలు, హేతువాద నాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు, బాలసాహిత్య నాటకాలుగా నాటక సాహిత్య విస్తీర్ణం పెరుగుతూనే వచ్చింది. కోరాడ రామచంద్ర శాస్త్రి, ధర్మవరం రామకృష్ణ చార్యులు, కొక్కొండ వెంకటరత్నం పంతులు, వావిలాల వాసుదేవశాస్త్రి, వేదం వెంకటరాయ శాస్త్రి, చిలకమర్తి, పానుగంటి మొదలగు నాటకకర్తలు గొప్ప నాటకకర్తలుగా తెలుగు సాహితీ ప్రపంచంలో గణనీయ పాత్రను పోషించారు. ఇందులో డాక్టర్ నారిశెట్టి వేంకట కృష్ణారావు గారు నిశ్శబ్దమరణం అనే సాంఘిక నాటకం ద్వారా ప్రస్తుత యువతరం భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తూ యువతను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మంచి సాంఘికనాటకం. గొప్పనాటకం.

**1. నాటకకర్తపరిచయం :** డాక్టర్ నారిశెట్టి వేంకటకృష్ణారావు గారుకవి, కథకులు, నవల, నాటక, గేయ రచయిత, గొప్ప పరిశోధకులు, విమర్శకులు, గాయకులు, తెలుగులో నిషిద్ధ నాటకాలు అనే అంశంపై ఆయన పరిశోధించిన తీరు సమస్త సాహితీ పరిశోధక లోకానికి మార్గదర్శకంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. నారిశెట్టి నాగేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులకు పాతగుంటూరు పట్టణంలో జన్మించారు. ఇప్పటివరకు దాదాపు 80 రచనలు చేశారు. యూ.జీ.సీ. ఢిల్లీ వారిచే యు.జి.సి. రీసెర్చ్ అవార్డ్, ఆంధ్ర సారస్వత సమితి మచిలీపట్నం వారిచే గోల్డెన్ జూబ్లీ లిటరరి ఎక్సలెన్స్ అవార్డు, విశ్వశాంతి అవార్డ్స్ అకాడమీ గుంటూరు వారిచే విశ్వశాంతి హానరరీ అవార్డు, కళా మిత్రమండలి ఒంగోలు వారిచే జాతీయ స్థాయి అవార్డ్, 2024 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వారిచే ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు.

'అసలు జబ్బు' అనే కథతో 13 ఏళ్లకే ఆయన రచనా జీవితం ప్రారంభమైంది. ఈ కథ ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు విజయ బాపినీడు ఆధ్వర్యంలో వెలువడిన ప్రముఖ పిల్లల మాసపత్రిక బొమ్మరిల్లులో ప్రచురితమైంది. దేశభక్తి గురించి 2000 సంవత్సరంలో 'చచ్చిపోండి మరొక్కసారి' అనే నవలను, ఎయిడ్స్ బాధలు, వెతలు, చైతన్యం గురించి 2022లో 'వజ్రకవచం' అనే నవలలను, ప్రస్తుతం రుద్రమదేవి గురించి ఒక అద్భుతమైన చారిత్రక నవలను రాస్తున్నారు. 'తేనె చుక్కలు' అనే ఒక రవ్వల సంపుటిని రచించి గొప్ప కవిగా పేరు గడించారు. *పూజనీయులు, ఆకాశంలో ఆడది, మట్టి కొలువు, నిశ్శబ్ద మరణం, తప్పులేదు, ప్లీజ్ ఒక్కక్షణం ఆగండి* వంటి నాటకాలు రాసి మంచి నాటక రచయితగా పిలవబడ్డారు. వీరు రాసిన కరోనా పాటలు ఎంతో ప్రాచుర్యాన్ని పొంది ప్రస్తుతం యూట్యూబ్ సోషల్ మీడియాలో అందుబాటులో ఉంటూ ప్రజల్ని చైతన్య పరుస్తూ ఉన్నాయి.

**1. నిశ్శబ్దమరణం నాటక ఇతివృత్తం :** ఒక పల్లెటూరిలో రాజేశ్వరరావు అనే ఒక రైతు ఉన్నాడు. అతని భార్య వనజ. వారికి లక్ష్మి, అశోక్ అనే ఇద్దరు పిల్లలు. పల్లెటూరి వాతావరణంలో వారి ఆర్థిక స్థితిగతులకు లోబడి వారి జీవితం చాలా పేదరికంలో ఉంటుంది. అశోక్ పదవ తరగతి పాస్ అయ్యాక తన ఇంటర్మీడియట్ చదువు కోసం పట్టణానికి వెళ్లవలసి వచ్చింది. రాజేశ్వరరావు స్నేహితుడైన ఆర్టీసీ డ్రైవర్ ఏడుకొండలు తన కొడుకు గోపిని కూడా ఇంటర్మీడియట్ చదువుకి పట్టణానికి పంపించవలసి

వచ్చింది. అశోక్ చాలా భయస్తుడు. కానీ గోపి మొదటి నుంచి విపరీతమైన మనస్తత్వధోరణి కలవాడు. అశోక్, గోపిలు ఇరువురు ఒకే కాలేజీలో ఇంటర్మీడియట్ ఎమ్.పి.సి.లో జాయిన్ అయ్యారు. ఇతర విద్యార్థులతో గోపికి కొన్ని చిన్న చిన్న గొడవలు ఉన్నప్పటికీ అశోక్ గోపి ఇరువురు మంచి మార్కులతోనే పాసయ్యారు. అనంతరం రైతైన రాజేశ్వరరావు తన స్తోమతకు మించి అప్పు చేసి మరీ అశోక్‌ని ఇంజనీరింగ్ కొరకు మరోసారి పట్టణానికి పంపించాడు. బస్ డ్రైవర్ ఏడుకొండలు కూడా అశోక్‌తో పాటు గోపిని కూడా అదే కాలేజిలో ఇంజనీరింగ్ చేర్పించాడు. ఆ కళాశాలలో సీనియర్స్ విద్యార్థులు విపరీతమైన మద్య, ధూమపానలతో పాటు డ్రగ్స్ ఉపయోగించేవారు. సీనియర్స్ పట్ల దురుసుగా ప్రవర్తించే గోపిని బలవంతంగా డ్రగ్స్ బారిన పడేలా చేశారు సీనియర్స్ విద్యార్థులు. అశోక్ బుద్ధిగా చదువుతున్నప్పటికీ గోపి అలా అయిపోవడం చూసి చాలా బాధపడుతూ ఉండేవాడు. గోపి క్లాస్‌లకు వెళ్లకుండా హాస్టల్‌రూమ్‌లోనే సీనియర్స్ ఇచ్చే మత్తు పదార్థాలను తీసుకుంటూ డ్రగ్స్‌కి బానిస అయిపోయాడు. డ్రగ్స్ లేనిదే ఊపిరి పీల్చుకోలేని స్థితికి చేరుకున్నాడు. బుద్ధిగా చదువుకుంటున్న అశోక్‌ని కూడా డ్రగ్స్ బారిన పడేలాగా చేస్తారు. గోపితో పాటు అశోక్ కూడా మత్తు పదార్థాలను తీసుకోవడం ప్రారంభించాడు. మరోవైపు పల్లెటూరులో గోపి తండ్రి అయిన రాజేశ్వరరావు తన కొడుక్కి ప్రేమగా రీడింగ్ చైర్ కొని వుంచాడు. వనజ తన కుమారుడిని ఎప్పటికైనా అమెరికా పంపించాలని కోరికతో తన కొడుకు కోసం ఎదురు చూస్తూ ఉంది. గోపి మత్తు పదార్థాల కోసం పుస్తకాలు ఫీజులు అంటూ ఏడుకొండల్ని ప్రతిరోజు డబ్బులు అడగడం ప్రారంభించాడు. తన కొడుకుపై అనుమానం వచ్చిన ఏడుకొండలు ఒకసారి కాలేజీకి వెళ్లి చూశాడు. అతిగా మత్తును తీసుకొని స్పృహ లేక పడివున్న తన కొడుకు గోపిని చూసి కృంగిపోయాడు. తండ్రిచొక్కా కాలర్ పట్టుకుని గంజాయి ఏది అంటూ క్రిందకు తోసి పడేసి కాళ్ళతోకొట్టే సంఘటన ఈ నాటకంలోని విషాదాన్ని తీవ్ర స్థాయిలో చూపిస్తుంది. గోపిని హాస్పిటల్‌కి తీసుకెళ్లగా హాస్పిటల్‌లోనే చనిపోతాడు. దానికి కారణమైన ప్రతి ఒక్కరిని శోధించే ప్రయత్నంలో పోలీసులు ఉంటారు. గోపి మరణ వార్త విని తన స్నేహితుడైన మరో విద్యార్థి సహాయంతోఅశోక్ భయంతో పల్లెటూరిలో తన ఇంటికి వెళ్ళిపోతాడు. హాస్పిటల్లో గోపి శవం దగ్గర జరిగే ప్రతి సంఘటనని మరో విద్యార్థి ద్వారా గోపి ఫోన్ కాల్ ద్వారా తెలుసుకుంటూ మరింత భయపడి గోపి మరణానికి పరోక్షంగా తానూ కారణం అంటూ బాధపడతాడు. పోలీసులు తమ ఇంటికి కూడా వచ్చి అరెస్టు చేస్తే తన తల్లిదండ్రులు చెల్లి పరిస్థితిని ఊహించి ఒక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు అశోక్. అశోక్ ఆత్మహత్యకు ముందు రాసిన ఉత్తరాన్ని చదివి తల్లిదండ్రులు, చెల్లెలు శోకసంద్రంలో మునిగిపోతారు. ప్రభుత్వం దగ్గర అనుమతి తీసుకుని గోపి అశోక్ శవాలను కాలేజీ గ్రౌండ్లో ఉంచి పోలీసులు డాక్టర్లు విద్యార్థులకు చెప్పే హితంతో నాటకం సమాప్తమౌతుంది.

**2. నాటక విశ్లేషణ :** తల్లిదండ్రులు రైతులు. రైతు కూలీలు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. తాము తిని తినక పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే తల్లిదండ్రులు సమాజంలో ఎందరో ఉన్నారు. తల్లిదండ్రుల శ్రమని, బాధని గ్రహించని పిల్లలు విద్యాసంస్థల్లో స్నేహం పేరిట మత్తుపదార్థాలను విపరీతంగా తీసుకుంటూ తల్లితండ్రులకు కన్నీళ్లు మిగిల్చడం చాలా చూస్తున్నాం. అలాంటి తల్లిదండ్రుల కన్నీళ్లను రచయిత నారిశెట్టి వేంకటకృష్ణారావు కాగితంపై అక్షరాలుగా మార్చారు. నిశ్శబ్ద మరణం (సైలెంట్ డెత్) అనే పేరుతో ఒక నాటకాన్ని రాసి విద్యార్థి లోకాన్ని చైతన్యం దిశ వైపు నడిపించే ప్రయత్నం చేశారు. నిశ్శబ్ద మరణం నాటకంలో మత్తు మోజులో యువత తన భవిష్యత్తును ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో కొంతవరకు పరిశీలించి వివరించే ప్రయత్నం చేద్దాం.

**3.1 కుటుంబం :** పదవ తరగతి పాసయ్యాను నాన్న అన్నప్పుడు తండ్రి రాజేశ్వరరావు ఎదురుగా వచ్చిన కొడుకుని హత్తుకొని ఆనందపడుతూ. "నాకు తెలుసురా నువ్వు ఫస్ట్ క్లాస్‌లో పాస్ అవుతావని మీ స్కూల్ ఫస్ట్ కూడా నువ్వేనని. నువ్వేనా స్కూల్ ఫస్ట్ వచ్చింది?" అని అడుగుతాడు. "నాన్న అశోక్! ఎంత సంతోషంగా ఉందో! నాకు నువ్వు పాస్ అయినందుకు. మన నాలుగు వీధుల్లో ఉన్న పదిమంది పిల్లల్లో నువ్వే బాగా చదువుతావు అని అందరూ చెబుతారు. అది నిజం చేశావు రా. నీకు ఇప్పుడే స్వీట్ చేసి పెడతా ముందు పంచదారతో నోరు తీపిచేస్తా" అంటూ కొడుకు నోటి నిండా పంచదార పెట్టిన తల్లి వనజ! వారి వీధిలో ఉన్న నలుగురు పిల్లల కంటే తన కొడుకే బాగా చదువుతాడనే విషయం నలుగురితో పోల్చి తన కొడుకును తాను ఉన్నతమైన స్థాయిలో నడిపించేదిశ. బయట పోటీ ప్రపంచం వారికి తెలియకపోయినా వారికి తెలిసిన నలుగురులోనే తన కొడుకు మంచి మార్కులు తీసుకువచ్చాడు అన్న విషయం వారికి ఒక పండగలా

ఉంది. “అన్నయ్యా! హ్యాపీ రిజల్ట్స్” అంటూ తన చెల్లెలు లక్ష్మి తనకు షేక్ హ్యాండ్ ఇచ్చి పంచదార తీసుకు వచ్చింది. అన్నయ్య తనకు మార్గదర్శకంగా అవుతాడన్న భరోసా ఆమె మాటల్లో, కళ్ళల్లో పుష్కలంగా కనిపిస్తుంది. కొడుకు ఫోన్ చేసి నాకు రీడింగ్ చైర్ కావాలి నాన్న అంటే ఆ కుర్చీ కొనడానికి పంట కోసి అమ్మి వచ్చిన డబ్బుతో కొనాలనీ నాన్న తాపత్రయంలో కొడుకుపై ప్రేమ కనిపిస్తుంది. “అమ్మ లక్ష్మి! అన్నయ్య అడిగిన కుర్చీ ఇదేనా బాగుంది చేతులు పెట్టుకోవడానికి” అంటాడు. దానికి బదులుగా “ చేతులు పెట్టుకోవడానికి కాదు దానిమీద అట్ట పెట్టుకుని రాసుకుంటాడు చదువుకుంటాడు మీకు పూర్తిగా తెలియదు” అంటూ వనజ సమాధానం ఇస్తుంది. ఇక్కడ వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవలా కనిపించినప్పటికీ అది గొడవగా పరిగణించబడదు. ఆ భార్య భర్తలకు తమ కొడుకుపై ఉన్న ప్రేమ, మమకారం, ఇష్టం మాత్రమే స్పష్టమవుతుంది. ఆ కుర్చీపై తన కొడుకు కూర్చుంటే చూడాలని అంతరార్థం వారిద్దరి మాటల్లో బహిర్గత మవుతుంది. కొరివి పెట్టవలసిన కొడుకు తన కళ్ళముందే చనిపోవడం తల్లి తండ్రులు భరించలేకపోయారు. కొడుకు శవాన్ని చూసి తన రెండు చేతులతో కొడుకు ముఖాన్ని పట్టుకొని“ నువ్వడిగింది ఏది నేను టైంకి ఇవ్వలేదని కోపం వచ్చి వెళ్ళిపోయావా? ఇదిగో అయ్యా! నీ కోసమే కొన్న దానిలో కూర్చొని నువ్వు పెద్ద చదువులు చదివి ఉద్యోగం తెచ్చుకుంటావని కొన్నాను రా! దాన్లో ఒక్కసారి కూర్చో నాన్న” అంటూ కొడుకు శవాన్ని కుర్చీపై కూర్చోబెట్టి తల్లి, తండ్రి, చెల్లెలు మనసులో దాచిన బాధనోటి మాట ద్వారా వస్తూ వుంటే ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ మాయలో పడి తల్లిదండ్రులను కన్నీటి పాలు చేస్తున్న విద్యార్థుల ఆనవాళ్ళన్నీ గుర్తుకొస్తున్నాయి. బాధపెడుతున్నాయి.

**3.2 విద్య ఆవశ్యకత :** విద్యావ్యవస్థ ప్రధానంగా పిల్లలు, యువకుల కొరకు స్థాపించబడింది. పిల్లలకు యువకులకు, పాఠ్యాంశాలను నిర్ణయించి భోదించటం, వారి విద్యాఫలితాలను, వారి జీవిత లక్ష్యాల కొరకు ప్రతిపాదింపబడుతాయి. వీటి వలన పిల్లలు, ఏమి నేర్చుకోవాలి?, ఎలా నేర్చుకోవాలి?, ఎందుకు నేర్చుకోవాలి? అనే ప్రశ్నలు సాధించుకొనేలా జాగ్రత్తలు తీసుకొని, వారికి విద్యా బోధన ఇవ్వబడుతుంది. బోధనా వృత్తి, ఇందుకు సర్వదా సహాయపడుతూ, పిల్లలలోని అన్ని రంగాల అభివృద్ధికొరకు సహాయపడుతూ, వారిని మంచి పౌరులుగా తీర్చి దిద్దడానికి ఎల్లవేళలా సిద్ధంగా వుంటుంది. ఒక వ్యక్తి బాల్యంనుంచే విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలోని మంచిని స్వీకరించి చెడును వదిలేయాలన్న ప్రధానమైన అంశంతో ఏర్పాటు చేయబడింది. ప్రస్తుత సమాజంలోని విద్య పౌరుల హృదయంలో విలువ లేని భావంగా మాత్రమే మిగిలిపోయింది. కనుకనే పౌరులు చెడు మార్గం పడుతున్నారు. ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలు స్వీకరించి విద్య ఆవశ్యకత మూలాన్ని వేళ్ళతో సహా పెకిలించి వేస్తున్నారు. విద్యను అభ్యసించి వారి జీవితాన్ని కుటుంబ బాధ్యతల్ని స్వీకరిస్తారని వారిని తల్లిదండ్రులు దూరాలకు పంపిస్తున్న విద్యార్థులు జీవితాలు మత్తుమహమ్మారి ప్రభావంతో విషమయం అవుతుంది. కళాశాల జీవితం తరచుగా కొత్త స్వేచ్ఛలు, బాధ్యతలు మరియు ఒత్తిళ్లను పరిచయం చేస్తుంది. చాలా మంది విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కోవడానికి, సామాజిక ఆందోళనను నిర్వహించడానికి లేదా వారి తోటివారితో సరిపోలడానికి గంజాయి వైపు మొగ్గు చూపుతారు. అప్పుడప్పుడు ఉపయోగించడం సమస్యాత్మకంగా అనిపించకపోవచ్చు, విద్యా మరియు సామాజిక జీవితంలోని ఒత్తిళ్లు తరచుగా వాడటానికి దారితీయవచ్చు. వాటికి వయసురీత్యా కారణాలు ఉండవచ్చు.

**3.3 పల్లెటూరు–పట్నం :** పల్లెటూర్లు పట్టణానికి పట్టుకొమ్మలని సామెత తరచుగా వింటూ ఉంటాం. పల్లెటూర్లలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కళ్ళ ముందే ఉండి చదువుకుంటారు. విద్య స్థాయి పెరిగే కొద్దీ పల్లెటూర్ల నుంచి పట్టణానికి వెళ్లవలసిన అవసరం తప్పకుండా అయింది. కారణం పల్లెటూర్లలో ఉండే విద్యాకేంద్రాల సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. పట్టణాల్లో పెద్ద పాఠశాలలు కళాశాలలు కోకోల్లలు. రకరకాల పల్లెటూర్లలోని విద్యార్థులు వారిలో భిన్న భిన్న కోణాలతో కూడిన మనస్తత్వాలు ఒక చెట్టున చేరుతాయి. భయస్తులు కొందరు, ధైర్యవంతులు మరికొందరు. తెలివైనవారు కొందరు, అమాయకులైన వారు మరికొందరు ఉంటారు. సాధారణంగా అమాయకత్వం ఉన్నవారు మాత్రమే చెడు మార్గం వైపు త్వరగా ప్రయాణించడానికి అవకాశం ఉంది. ఉదాహరణకి పల్లెటూరు నుంచి కొత్తగా పట్టడానికి వచ్చి చదువుకుంటున్న గోపి, అశోక్‌లు చదువు పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ వారిలో ఉన్న భయము అమాయకత్వం వల్ల సీనియర్స్ చెప్పే ప్రతి మాటను విని మత్తుకు బానిస అయ్యారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగాను విద్యకు దూరమయ్యారు. గోపీ గంజాయి పొగత్రాగి, అన్న ఈ పొగకొత్తగా ఉంది. నాకేదో అయిపోతున్నట్టు ఉంది. తల

తిరుగుతున్నట్టు ఉంది అంటే.. ముందు ఇలాగే ఉంటుందిరా తర్వాత ఎంతో హాయిగా రిలీఫ్‌గా ఉంటుంది. సుఖంలో తేలినట్టు ఉంటుంది" అని సీనియర్ మాటలు గోపీకి కొత్తగా అనిపించాయి. ఇదే క్రమంలో మత్తును తీసుకోవడం ప్రారంభించాడు. మంచేదో, చెడేదో ఆలోచించే జ్ఞానం నైపుణ్యం అక్కడ గోపికి లేదు అనిపిస్తుంది. తెలిసి తెలియక చెడుమార్గాల బారిన పడుతున్న విద్యార్థులు ఈ ప్రపంచంలో ఎంతమంది ఉన్నారో పరిగణిస్తే సమాధానం ప్రశ్నగానే ఉంటుంది.

**3.4 యువతకు చైతన్యం :** "చూశారా... అమ్మా-నాన్న, అక్క- చెల్లి, అన్నా-తమ్ముడు, చుట్టాలు-స్నేహితులు ఎంత మంది బంధం, ప్రేమ, ఆత్మీయత, అనురాగం అన్నిటిని నిర్ధాక్షణంగా తెంచేస్తుంది డ్రగ్ అనే మత్తు రాక్షసి.స్టూడెంట్స్! మీ అందరి కళ్ళల్లో కన్నీళ్లు తిరుగుతున్నాయి కదా! గుండెలు బరువెక్కుతున్నాయి కదా! మీ బతుకులు, మీ చదువులు, మీ ఉద్యోగాలే మీకు ముఖ్యం. మీ లక్ష్యం ఉన్నతమైన చదువు, ఉద్యోగం. కానీ పనికిమాలిన చావు కాదు. సైనికుడు దేహం నిండా గుళ్ళు తగులుతూ రక్తం కారుతున్న, దేశం కోసం పోరాడి మరణిస్తాడు. మరి మీరు మీ బాడీ నిండా డ్రగ్స్ నింపుకొని మత్తుకు చిత్తే మనసు మాటవినక, మెదడు పనిచేయక దొంగలవుతారా? దుర్మార్గులు అవుతారా? దేశద్రోహులుగా మిగిలిపోతారా? రాబోయే తరాలకు మీ సమాధుల మీద రాసుకుంటారా? మాది నిశ్శబ్ద మరణం అని" అంటూ గోపి శవాన్ని ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో ఆ కళాశాల ప్రాంగణంలో ఉంచి విద్యార్థులందరిని చైతన్యపరిచే దిశలో ఎస్పీ ఇలా అంటూ ఉన్నారు. ప్రతి మనిషి సమాజాన్ని ముందుకు నడిపించాలి. సరైన దిశ వైపు విద్యావంతులే నడవగలరు. వారే రేపటి తరం వారిని సరైన మార్గం వైపు నడిపించగలరు. అనే నమ్మకాన్ని, ధైర్యాన్ని, సాహసాన్ని అక్కడి డాక్టర్లు, పోలీసులు విద్యార్థులను చైతన్య పరిచే ప్రయత్నం ఈ నాటకంలో అద్భుతమైన ఘట్టంగా తీర్చిదిద్దబడింది.

**"ఈ పాపం ఎవ్వరిది? ఈ లోపం ఎక్కడిది?...**
**బుద్ధులు నేర్వని, హద్దులు మీరిన యువతరానిదా?**
**డబ్బులే చాలని, విలువలు వదిలిన ఈ మనుషులదా?**
**ఈ పాపం ఎవరిది?...... ఈ లోపం ఎక్కడిది?**

అంటూ పాట రూపంలో విద్యార్థులను ప్రశ్నించే ప్రయత్నం చేశారు రచయిత డాక్టర్ నారిశెట్టి వేంకట కృష్ణారావు. జ్ఞానాన్ని మరిచి, బుద్ధులు నేర్చుకోవాలనే బాధ్యతను మరిచి, హద్దులు మీరిన యువతరానిదా? అనే మాటలో విద్యార్థుల్లో బలహీనపడిన వ్యక్తిత్వాన్ని చైతన్యపరిచే దిశగా బలంగా ప్రశ్నించగలిగింది ఈపాట.

ప్రస్తుత సమాజంలో అన్ని భాషల్లో ఎన్నో రకాల రచనలు నాటకాలు వస్తున్నప్పటికీ పౌరులపై, పౌరులపై ప్రభావంచూపే చెడు అలవాట్లను నిషేధించడానికి వచ్చే రచనలు చాలా అరుదుగా ఉన్నాయి. ఆ కోణాన్ని పసిగట్టి 'నిశ్శబ్ద మరణం' అనే శీర్షికతో నాటకాన్ని రచించి ప్రజల్లో చైతన్యపరిచే ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు ఈ నాటక రచయిత.

**ముగింపు :** సమాజంలో వ్యక్తుల వ్యక్తిత్వాలు విభిన్నాలు. సందర్భానుసారం వ్యక్తుల ప్రవర్తనలు వారి అవసరాల కోసమే మారుతూ ఉంటాయి. అది మంచి మార్గమైనా మరొకటి అయిన కావచ్చు. ఇలా తెలిసి తెలియని వయసులో విద్యార్థిలోకం మత్తు బారినపడి వారి జీవితాలను నాశనం చేసుకోవడం ప్రస్తుత సమాజంలో సాధారణమై పోయింది. కొండంత ఆశతో కని, పెంచిన పిల్లల్ని ఉన్నతమైన స్థానంలో చూడాలన్న తల్లిదండ్రుల కోరికలు కేవలం కోరికల్లాగే మిగిలిపోతున్నాయి. అశోక్ అమాయకుడు భయస్తుడు అయినప్పటికీ మొదటిసారి సీనియర్ స్టూడెంట్స్ తన స్నేహితుడైన గోపికి మత్తు పదార్థం అలవాటు చేసిన సమయంలోనే కాలేజీ అధికారులకు తెలియజేసి ఉంటే వారి జీవితాలు ఆగాధంలోకి వెలివేయబడకుండా ఉండేవి. కానీ అతను ఆ పని చేయలేకపోయాడు. గోపి చెడ్డవాడా అంటే కాదు. అక్కడికి వచ్చేంతవరకు అతనికి మత్తు పదార్థం అంటే ఏమిటో తెలియదు. సీనియర్స్ చెప్పారని, వారు ఆ మత్తు పదార్థాన్ని తీసుకుంటూ ఆనందంగా ఉన్నారన్న వారి ఆటిట్యూడ్ అశోక్‌ని ఆకర్షింపచేసింది. మత్తుకు బానిసై మత్తు తన శరీరంలో లేకపోతే ఏ అవయవం పనిచేయని స్థితికి దిగజారడం ఎవరూ కొనితెచ్చుకోరు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్‌ని విద్యార్థులు విపరీతమైన స్థాయిలో వినియోగించడం బాధాకరం. ప్రభుత్వం కొంతమంది అధికారులను నమ్మి విద్యా వ్యవస్థలో ఎలాంటి సమస్యలు, ప్రమాదాలు లేకుండా చూసుకునే బాధ్యతనిస్తోంది. కానీ అధికారులు వాటిపై సరైన దృష్టి పెడుతున్నారా అంటే ప్రశ్నార్థకం. నిజానికి తల్లిదండ్రులు పిల్లల్ని ప్రేమించడం మాత్రమే కాదు. కొన్ని విషయాలకు దూరంగా ఉండమని నిర్మొహమాటంగా చెప్పగలిగే సాంప్రదాయం రావాలి. వీటి కోసమే డాక్టర్ నారిశెట్టి వేంకట కృష్ణారావు నాటక రూపంలో మనసారా కాంక్షించారని అర్థమవుతుంది.

**బుక్కే ధనకనాయక్**
పరిశోధకుడు, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు, ఫోన్ : 6281287083

# మంచి మనుగడకు మార్గమేది?

**– ఆచార్య పి. ఆర్. హరినాథ్**

**ఇం**ట్లో వృద్ధులు ఉంటారు. వారి వయసు పండి ఉంటుంది. అనుభవం నిండి ఉంటుంది. నాయనా ఇలా చేస్తే మంచిది అని చెబుతారు. ఇదంతా ఒకనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నేడు ఎన్నో కారణాలతో మనిషి ఒంటరై పోతున్నాడు. మంచి తెలియదు. మాట తెలియదు. బ్రతుకును తరించే బాట తెలియదు. 'మార్గమేది?' అన్న ప్రశ్న ఎదురవుతుంది. దిక్కు తెలియని దీన దశలో దారి కానని దారుణ స్థితిలో ఎవరిని అడగాలో తెలియని అయోమయంలో నిలిచినప్పుడు పుస్తకాల్లోంచి మహాకవులు మాట్లాడతారు:

**ప్రాణాఘాతాన్నివృత్తిః పరధన హరణే సంయమః సత్యవాక్యం కాలే శక్త్యా ప్రదానం యువతి జన కథామూకభావః పరేషాం తృష్ణాస్రోతో విభంగో గురుషు చ వినయః సర్వభూతానుకంపా సామాన్యం సర్వ శాస్త్రేష్వనుపహతవిధిః శ్రేయసామేష పంథాః**

భర్తృహరి అంటున్నాడు–ఏ ప్రాణినీ హింసించ రాదు. హింస అన్న ఆలోచన నుంచి మరలిపోవాలి.'నేను ఒక మాట అన్నాను అంతే. ఏమైనా కొట్టానా' అని ఎవరైనా అంటూ ఉంటారు. నిజానికి కొట్టిన దెబ్బ మానిపోతుంది. మరక మాసిపోతుంది. కానీ అనిన మాట నిలిచిపోతుంది. మాట మనసును కృంగదీస్తుంది. మనిషిని పడదోస్తుంది. ఇదంతా కూడా హింసలో ఒక భాగమే. అందుకే ఆ ఆలోచన రాకూడదు. మాటతోనైనా సరే ఎవరినీ హింసించకూడదు. మరొకటి–ఇంకొకరి ధనాన్ని ఆశించరాదు. ఇంకొకరి సంపద ఎదురైనప్పుడు దాన్ని సొంతం చేసుకోవాలనే ఆలోచన మనిషిని మోహపెడుతుంది. ఆ ఆరాటంలో మనుషులు చేయరానివెన్నెన్నో చేస్తూ ఉంటారు. అలాంటి అవకాశం వచ్చినప్పటికీ దాని నుంచి నిగ్రహించుకుని బయటపడాలి. ఆ నిగ్రహం అలవర్చుకోవాలి. ఆ మోహం నుంచి దూరం రావాలి. ఇక–మాట ఎలా ఉండాలి? ఎప్పుడూ సత్యమే మాట్లాడాలి. అబద్ధాల ప్రచారాలు ఆపేసేయాలి. అబద్ధాలు చెప్పి అసలు విషయాన్ని మరుగు పరచరాదు. మసిపూసి మాయ చేయరాదు. ఈ విషయం గురించి సత్యం అన్నది ఎంత విలువైనదో ప్రాచీన కవుల నుంచి ఇప్పటిదాకా ఎంతమందో చెబుతూనే ఉన్నారు. అలాగే–ఇతరులకు సహాయం చేస్తున్నప్పుడు శక్తిని అనుసరించి దానం ఇవ్వాలి. మరొకరికి సహాయపడడం అన్నది ఒక మంచి లక్షణం. దాన్ని అలవర్చుకోవాలి. ఇందులో మనకేదో ప్రయోజనం ఉంటుందని ఆశించరాదు. అలా ఆశించి జనం మెప్పు కోసమో, అధికారి ఆశ్రయం కోసమో దానం ఇవ్వడం కాదు–ప్రచారాలకు కక్కుర్తి పడకుండా చేసే దానం–ప్రకృష్టమైన దానం. అందుకే అది 'ప్రదానం'. అలాగే – పర స్త్రీల గురించి ఏవేవో కబుర్లు చెప్పకుండా మౌనంగా ఉండాలి. 'మూక భావం' అంటే మౌనంగా ఉండడం. మౌనంగా ఉండడమంటే ఊరకే మాటలు మాట్లాడకుండా ఉండడం ఒక్కటే కాదు. అది చిత్తానికి కూడా అన్వయించే మాట. మనసులో కూడా మూకత్వం ఉండాలి. అంటే ఇతరుల గురించి అవాకులు చవాకులు మాట్లాడరాదు. ఎదుటి వారు ఒకటి చెబితే దానికి రెండు చేర్చిమాట్లాడటం, వినోద ప్రసంగం చేయడం, ఎగతాళి చేయడం ఇవన్నీ దురలవాట్లు. దీనిని చేయవద్దు అని అంటున్నాడు కవి. ముఖ్యమైనది మరోటి ఉంది. ఆశ–అది ఒక ప్రవాహం లాగా పారుతూనే ఉంటుంది. కనిపించిందంతా కావాలి అని మారాం చేస్తుంది. ఆ ప్రవాహానికి అడ్డు కట్ట వేయాలి. వేయకపోతే అది మొత్తం జీవితాన్ని ముంచుతుంది. అలాగే –గురువుల పట్ల వినయం ఉండాలి. గురువు అంటే 'పెద్దవాళ్ళు'. కొందరు వయసులో, కొందరు జ్ఞానంలో, కొందరు అనుభవంలో పెద్దలైన వారుగా ఉంటారు. వారందరి పట్ల వినయం, వినమ్రత ఉండాలి. మనకు తెలియని అంశాన్ని వారి నుంచి గ్రహించాలి. నమ్రత ఒక మంచి లక్షణం. అలాగే అన్ని ప్రాణుల పట్ల దయ ఉండాలి. ఇవన్నీ మంచికి మార్గాలు. ఏ శాస్త్రాన్ని చూసినా ఈ అంశాలను పాటించమని చెబుతూ ఉన్నాయి. దీనిని అనుష్టానంగా సాగిస్తున్నప్పుడు ఆటంకాలు రావు. ఇలాంటి వారికి జనం జేజేలు పలుకుతారు. జేగంటలు కొడతారు. హారతులు పడతారు. ఇది జీవన విధానం–ఇది మంచికి మార్గం. ఈ అన్నింటినీ మూటగట్టి కవి ఈ శ్లోకాన్ని అందించాడు. దీనిని తెలుగు చేస్తూ ఏనుగు లక్ష్మణ కవి అన్నాడు :

**పరహింసా పరకీయ విత్త హరణాభావంబు సత్యవ్రతా**
**దరముం దాన పరత్వ మన్య వనితోదంతోక్తి మూకత్వమున్**
**బర తృష్ణా ఝురభంజనంబు గురునమ్రత్వంబునున్ ప్రాణ భృ**
**త్కరుణా శాస్త్ర సమత్వ సద్విధులు భద్రప్రాప్తికిన్ మార్గముల్**

ఈ విషయాల గురించి అన్ని మతాలు బోధించాయి. 'అహింసో పరమో ధర్మః' అని ప్రాచీన గ్రంధాలు ఘోషిస్తున్నాయి. బౌద్ధ జైనాలు కూడా ఇదే అంశం గురించి చెప్పాయి. అహింస, అస్తేయం, ప్రజ్ఞ, శీలం, సమాధి, బ్రహ్మచర్యం, అపరిగ్రహం, సత్యం ఇలాంటి విలువలు వాటిలో ఉన్నాయి.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,
మైసూర్, ఫోన్ : 9480443108

# లలితసంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

### 23. మన ప్రేమ మన ప్రేమ

రచన& సంగీతం : బాలాంత్రపు రజనీకాంతరావు
గానం : ఎం.బాలమురళీకృష్ణ, శ్రీరంగం గోపాలరత్నం

తోడి-ఝంప

మన ప్రేమ మన ప్రేమ
సత్యసౌందర్య భూములలో
ప్రభవించి, ప్రభవించి
నమ్ర మరుసీమమగునో
క్రమ సుమధామమగునో ॥మన॥

1. కల్లోలినీ తరంగములన్
పయనించి, పయనించి
శీర్ణ సికతాద్రి యగునో
పూర్ణ కలశాబ్ధి యగునో ॥మన॥

2. కాల గాఢాగ్ని కీలలలో
తపియించి తపియించి
దగ్ధ తరుకాండమగునో
ముగ్ధ మధుభాండమగునో ॥మన॥

తమ ప్రేమభావ భవిష్యత్తును గురించి ఆందోళన పడుతూ ఊహల్లో సాగిపోతున్న ప్రేయసీప్రియుల మనోహరగీతం ఇది. ప్రేమతత్త్వాన్ని మరో కోణం నుండి దర్శిస్తున్న కవి భావనామూర్తిమత్వం ఇందులో ప్రతిఫలిస్తున్నది.

సత్యజగత్తు నుండి పుట్టిన ఈ ప్రేమ శ్మశానంగా పరిణమిస్తుందా, పూలతోటగా మురిపిస్తుందా అని ఆ ఇద్దరూ ఆలోచిస్తున్నారు. ఈ ప్రేమను సమాజం ఏ రూపాన స్వీకరిస్తుందో! చివరకిది ఎలా పరిణమిస్తుందో! ఇలాంటి అనుమానం ఎప్పుడు వస్తుంది? కులాంతరం సంభవించినప్పుడో, పరస్పర బద్ధ వైరగత కుటుంబాల నుంచి కలిసినప్పుడో ఈ అనుమానం వస్తుంది, సమాజం గురించి సందేహించాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి ఏదో ఈ జంటకు ఏర్పడి యుండవచ్చని కవి ధ్వనింపజేస్తున్నట్లు అనిపించకమానదు. దీనికి రుజువుగా చరణాల్లో 'కల్లోలిని, అగ్నికీలలు' లాంటి శబ్దప్రయోగాలు కనిపిస్తున్నాయి. వాటివల్ల ఈ ప్రేమ వట్టి ఇసుకదిబ్బ అవుతుందా, పాల సంద్రమవుతుందా అని; మండిపోయిన చెట్టు అవుతుందా, మధుకలశమవుతుందా అనీ అశుభశుభ పరిణామాలను అంచనా వేస్తున్నారు.

పల్లవి, చరణాల చివరి రెండు పాదాలలో ప్రాస చక్కగా, పొందికగా ఏర్పడింది. 'సీమలలో, ధామము; కాండము, భాండము' వంటి అంత్యప్రాసలు అందంగా వినిపిస్తున్నాయి. 'సీమ' అనేది దేశ్యపదం. దీనికి సంస్కృత పదధోరణిలో 'ము' వర్ణాన్ని కలిపారు కవి. ఇట్లా 'సీమము' అనే క్రొత్త పదాన్ని వ్యవహారంలోకి తేవడం ఒక అపురూపమైన భాషావిశేషంగా చెప్పుకోవచ్చు. రజనీకాంతరావుగారు 'రజని' అనే పేరుతో ఎన్నో రచనలు చేశారు. బాలరాజు, రాజమకుటం మొదలైన సినిమాల కోసం 'నాగరాజు' అనే కలం పేరుతో పాటలు వ్రాశారు.

రజనిగారు (1920-2018) నిడదవోలులో జన్మించారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంలోను, కాకినాడలోని పిఠాపురం రాజావారి ప్రభుత్వ కళాశాలలోనూ విద్యాభ్యాసం చేశారు. కవిగా, గాయకునిగా, స్వరకర్తగా, విమర్శకునిగా, రచయితగా గొప్ప ప్రసిద్ధి వహించారు. 1961లో సాహిత్య అకాడమీ పురస్కారాన్ని, 'కళాప్రపూర్ణ' బిరుదును పొందారు. "ఆంధ్రవాగ్గేయకార చరిత్ర, విశ్వవీణ, శతపత్రసుందరి, క్షేత్రయ్య, రామదాసు, జేజి మామయ్య పాటలు, త్యాగరాజు, ఏటికి ఎదురీత, చతుర్భాని" మొదలైన రచనలు చేశారు. "భలేపెళ్ళి, స్వర్గసీమ, పేరంటాలు, లక్ష్మమ్మకథ, గృహప్రవేశం, మానవతి, బంగారుపాప" మొదలైన సినిమాలకు కూడా పాటలు వ్రాశారు. కొన్నిటికి స్వరకర్తగా పని చేశారు. శ్రీరంగం గోపాలరత్నం గారు (1939-1993) విజయనగరం జిల్లా పుష్పగిరిలో జన్మించారు. తొమ్మిదేండ్ల వయస్సులో పాలకొల్లులో హరికథాగానం చేశారు. కవిరాయని జోగారావు, ద్వారం వెంకటస్వామినాయుడు, శ్రీపాద పినాకపాణి గారల వద్ద సంగీతాన్ని అభ్యసించారు. ఆకాశవాణిలో శాస్త్రీయకృతులు, లలితగీతాలు, సంప్రదాయ

గేయాలు ఎన్నో పాడారు. 1957లో విజయవాడ ఆకాశవాణిలో నిలయవిద్వాంసురాలిగా చేరారు. "మీరాబాయి, భామా కలాపం, నౌకాచరితం" మొదలైన నాటకగీతాలను సుమధురంగా ఆలపించారు. ''బికారిరాముడు, శ్రీవేంకటేశ్వరవైభవం" చిత్రాలలో ఆమె పాటలు పాడారు. 1969లో టిటిడి ఆస్థాన విదుషీమణిగా, 1977లో తెలుగు విశ్వవిద్యాలయ లలితకళాపీఠానికి ప్రత్యేక అధికారిగా పనిచేసి ఎన్నో ప్రశంసలు పొందారు. 'గానకోకిల, సంగీతకళానిధి, సంగీతరత్న' బిరుదులు పొందారు. 1992లో 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

రజనిగారు ఈ పాటను కర్ణాటకసంగీత సంప్రదాయం ప్రకారం పేరున్న 'తోడి' రాగంలో స్వరపరిచారు. పద్యనాటకరంగంలోని కొందరు దీనిని హిందూస్తానీ తోడి అని వ్యవహరిస్తున్నారు. ఖండచాపు తాళంలో ఈ పాట నడక సాగుతుంది. హిందూస్తానీ సంగీతపద్ధతిలో దీన్ని 'ఝంప తాళం' గా పిలుస్తారు.

ప్రారంభంలో క్లారియోనెట్‌తో 7 ఆవర్తాల బిట్టు నిచ్చి షడ్జమంలో వదిలేయగా పల్లవిని షడ్జమం నుండే సమంలో అందుకున్నారు. మొదటిసారి 'మన ప్రేమ' తరువాత 'సనిసగపదపా' అని, రెండోసారికి 'దమగరిగరిసా' అని క్లారియోనెట్‌తో వినిపించడం క్రొత్తగాను, శ్రావ్యంగానూ ఉంది. తరువాత నాలుగు పాదాలను పాడి పల్లవిని అందుకుని మరోసారి ఆలపించి 'ధామమగునో' దగ్గర వదిలేశారు. వెంటనే రెండు ఆవర్తాల బిట్టును వినిపించారు. దీనిలోని 'కద్రుసుమ ధామమగునో' పాదాన్ని రాగం యొక్క జీవస్వరాలతో మనోహరంగా పాడారు. దీనిలో సింధుభైరవి రాగచ్ఛాయలు కొన్ని తొంగిచూస్తాయి. మొదటి చరణానికి ముందు 4 ఆవర్తాల బిట్‌వర్క్ వినిపించాక షడ్జమం దగ్గర వదిలారు. చరణాన్ని దైవతం నుండి ప్రారంభించారు. 'లన్' పైన చిన్న చిరుగాలి వంటి గమకాన్ని కంపింపజేశారు. చివరి రెండు పాదాలను అనుపల్లవి లాగానే అదే బాణీలో వినిపించి 'మన ప్రేమ'ను రెండుసార్లు పాడి చరణం మొత్తాన్ని మరోసారి చక్కగా ఆలపించారు.

రెండవ చరణానికి ముందు కూడా మొదటి చరణంలాగానే బిట్టు సాగి, షడ్జమం మీద ఆగింది. ఈ చరణాన్ని కూడా దైవతంలోనే ప్రారంభించినా, 'తపియించి' పాదాన్ని తారగాంధారాన్ని తాకుతూ క్రొత్తగా పాడారు. తరువాత 'నమ్రమరుసీమ' పాదంలాగా కాక 'తరుకాండ'ను 'దాదదగరీస' అనే బాణీలో స్వరాక్షరమర్యాదతో అందంగా పాడారు. తరువాత 'మన ప్రేమ'ను రెండుసార్లు పాడాక చరణం మొత్తాన్ని మరోసారి పాడారు. వెంటనే 5 ఆవర్తాలలో బిట్టునిచ్చారు. అప్పుడు పల్లవిని నాలుగు సార్లు ఒకే తీరుగా ఆలపించి పాటను ముగించారు.

**24. జై జై భారత జాతీయాభ్యుదయా**

**రచన : ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి**
**సంగీతం : పాలగుమ్మి విశ్వనాథం**
**గానం : బృందం**

**<u>మోహన-ఏక</u>**

**జైజై భారత జాతీయాభ్యుద**
**యానందోత్సవ శుభసమయం**
**ప్రియతమ భారతజనయిత్రీ చిర**
**దాస్య విమోచన నవోదయం ॥జైజై॥**

1. పొద్దుపొడిచె లేవండోయి
నిద్ర విడిచి రారండోయి
దిగ్దిగంతములు దద్దరిల్లగా
నిశ్వాణము చేయండోయి ॥జైజై॥
2. హిందూ,ముస్లిం,క్రైస్తవ,పార్శీ
ఏకవేదికను నిలవండి
జాతులెన్నైన దేశమ్మొకటని
లోకమంతటికి చాటండి ॥జైజై॥

1947లో మన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి ఆనందసందర్భం ఈ పాటలో కనిపిస్తున్నది. అదే, అనుపల్లవి 'భారతజనయిత్రి చిరదాస్యవిమోచన నవోదయం'లో సూచనగా గమనింపవచ్చు. 150 సంవత్సరాలుగా నిద్రించిన భారతజాతిని మేల్కోమని హెచ్చరిస్తున్నారు. ఈ దేశం మాదని, ప్రపంచదేశాలు వినేటట్లుగా నినాదాలు చేయమంటున్నారు. జాతి, మతాతీతంగా ఒకే వేదిక మీదికి వచ్చి 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' చాటిచెప్పమంటున్నారు. పల్లవి, అనుపల్లవులలో దేవులపల్లివారి లాగా సుదీర్ఘసమాసాలు ఉన్నా, బాణీలో ఒదిగిపోయేందుకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. రచయిత యతిప్రాసలమీద అంతగా దృష్టి పెట్టక

స్వేచ్ఛారచనతో సాగిపోయారు. రెండవ చరణం మొదటి భాగంలో అయాచితంగా యతి కుదిరింది. 'సమయం, నవోదయం; లేవండోయి, రారండోయి, నిలవండి, చాటండి' అనే అంత్యప్రాసలు పాటకు చక్కని ఊపునిచ్చాయి. 'పొద్దు, నిద్ర' పదాల వాచికంలోని వత్తిడిని పోలికగా చేయడం లయాత్మకంగా ఉంది. స్వరకర్త ఈ పాటను మోహనరాగంలో, చతురశ్రగతిలో స్వరపరిచారు. బృందంగా పాడడంతో ఈ పాట ఎంతో ఉత్సాహంతో సాగింది. గాంధారంనుండి ప్రారంభమైన బిట్‌వర్క్ రెండు ఆవర్తాలుగా సాగిన తరువాత షడ్జమం మీద వాలుతుంది. పాట పల్లవిని అక్కడినుండే ప్రారంభించారు. ఇదే బిట్టును రెండు చరణాలకు ముందుగా ఏ మార్పూ లేకుండా ఇచ్చారు. రెండు చరణాల బాణీ కూడా ఒకేతీరుగా నిరాడంబరంగా సాగింది. 'రారండోయ్. నిలవండీ' పదాల దగ్గర భావాత్మకవిధానంలో ఎలుగెత్తి పాడడం పాటకు శోభను కలిగించింది. మొదటి ఎత్తుగడలో పల్లవిని, అనుపల్లవిని ఏకబిగిన ఒకసారి పాడినాక 'శుభసమయం' దగ్గర వదిలేయగా బిట్టు ప్రారంభమైంది. మొదటి చరణం అయ్యాక పల్లవి,అనుపల్లవి ఒకసారి పాడి 'శుభసమయం' దగ్గర ఆగారు. బిట్టు ఇచ్చాక రెండో చరణం ఎత్తుకుని పాడాక పల్లవిని,అనుపల్లవిని కలిపి రెండు మార్లు పాడడం విశేషం. 'శుభసమయం' దగ్గర పాట ముగిసింది.


**డా. ఎమ్. పురుషోత్తమాచార్య**
*(జాతీయ పురస్కార గ్రహీత)*
పూర్వ ప్రిన్సిపాల్, సంగీత కళాసాల,
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.


## ఇది నజరేయుని కథ

*ఒక మంచి వ్యాసం రాయడానికి – నాకు తెలిసిన దానిని బట్టి కనీసం నాకు కొన్ని శుభ్రమైన తెల్ల కాగితాలు, కొన్ని పెన్నులు, ఇంక్ సీసా, ఇప్పుడు రిఫిల్స్ అందు బాటులో వున్నాయి కనుక, ఇంక్ సీసాఅవసరంలేదు.. వీటన్నిటిని సమకూర్చుకొని పనిని ఆరంభించడం... ఆపనిని నేను ఈ రోజే చేశాను.నేను కాగితం పెన్నులు కొన్నాను. అంతేకాకుండా, చెదిరిన పేజీలను కట్టడానికి వైర్ క్లిప్స్ కుడా. మొత్తం మాన్యుస్క్రిప్ట్ ని చేర్చడానికి బోర్డు పోల్డర్ కూడా కొన్నాను. గంట క్రితమే నా గదికి వచ్చి, బల్ల పైవున్న సామగ్రిని చక్కగా సర్ది చేతిలో ఉత్తమమైన పెన్ను పట్టుకొని రాయడానికి సిద్ధమయ్యాను. నేను ఇంకా రాయడానికిసిద్ధమవుతూనేవున్నా. ఇప్పటికే అర్ధరాత్రి దాటి పోయింది. వీధుల్లో శబ్దాలు భయంకరమైన నిశబ్దంలో కలసిపోయాయి. అలజడులతో, హడావుడితో వేడెక్కిన నల్లగొండ చివరికి అలసిపోయి నిద్రలోకి జారుకుంది. అయినా నేను ఇంకా వ్యర్థంగా రాయడానికి సిద్ధమవుతూనే ఉన్నాను. ఇప్పటికీ నేను కనీసం మొదటి అధ్యాయం చివరికి చేరుకోవాల్సివుంది. కానినేను ఇంకా ప్రారంభించలేక పోయాను.. ఆశ్చర్యం..!*

*ఒక ధైర్యవంతమైన, అద్భుతమైన అంశాన్ని నేను ఖాళీ పేజిపై ఇలా రాశాను – ఇది నజరేయుని కథ...*

*ఇదినజరేయుని కథ...*

*మరణించని ఆ విచిత్ర మనిషి కథ !*

*20కి పైగా శతాబ్దాలుగా అతడు భూమిపై తిరుగుతూనే ఉన్నాడు...*

*తృణీకరించబడి, త్రోసివేయబడి, గాయపడి, కొట్టబడి, అయినా ఎపుడు ముందుకు సాగుతూనే ఉన్నాడు. అతడు విశాలమైన సామ్రాజ్యాలు పతన మవడం చూశాడు ఈజిప్షియన్, పర్షియన్, గ్రీకు, రోమన్, సారెసన్, అస్సీరియన్, ఖల్దేయన్ వీరంతా అతని మీద బలగర్వంతో నడచినవారే – రాజులు, రారాజులు, నియంతలు, పాలకులు. వీరంతా అతని మీద గర్వంతో దండెత్తిన వారే! కాని అంతా చివరకు మరుభూమిన కూలి సమసిపోయారు.*

*కాని అతడు– ఒక నజరేయుడు ! ఇంకా బ్రతికే ఉన్నాడు. కాలాన్ని, మానవుణ్ణి, సత్యంతో ఎదిరించి తన దారిలో తానే సాగుతున్నాడు. తన సలహా తానే తీసుకుంటూ, తన కలలను కాపాడుకుంటూ, తన జీవితాన్ని తనదైన రీతిలో గడుపుతున్నారు. ఇది ఒక విచిత్రమైన మనిషి కథ! నజరేయుడైన క్రీస్తు కథ !*

*అతని జీవిత కథ కంటె విచిత్రమైన కథను భూమిపై ఎవ్వరు ఎన్నడు చెప్పలేదు.*


**- కన్మూరి అలెగ్జాండర్,** *నల్లగొండ, ఫోన్ : 9182650230*

# ఇద్దరు గొప్పకథకుల కవిత్వం

– ఎస్. హనుమంతరావు

తెలుగు సాహిత్యంలో కథకునిగా బుచ్చిబాబు స్థానం అద్వితీయం. ఇక ఆయన రాసిన ఏకైక నవల 'చివరికి మిగిలేది' తెలుగులో వచ్చిన గొప్ప నవలల్లో ఒకటిగా విమర్శకులు భావిస్తారు. అయితే ఆయన కవిత్వం కూడా రాసారన్న సంగతి కొద్ది మందికే తెలుసు. ఇప్పటి తరానికి ఈ విషయం తెలిసే అవకాశమే లేదు. బుచ్చిబాబు గారు రాసిన కవిత్వం 'అజ్ఞానం' వచన కావ్యంగా 1967 ఫిబ్రవరిలో అచ్చయ్యింది. ఆదర్శ గ్రంథ మండలి, విజయవాడ వారు దీని ప్రకాశకులు. ఇందులో 12 ఖండికలు వున్నాయి.

'మనిషి–మంచుకొండ–ఎర్ర గులాబి' కవిత నెహ్రూ మరణంపై రాసిన ఎలిజీ. "అయ్యో! ఏడతను? / అని గుంపు గోల / అతను లేనిదే మేమెందుకు? / అతను లేనిదే రథచక్రం తిరుగుతుందా? / ఆ పాత సూర్యుడు మళ్లీ లేస్తాడా? / ఆ ముసలి తారక కన్ను మీటుతుందా? / ఈ పిచ్చి సముద్రం ఎగిరి పడుతుందా? / ఏడతను?" ఇలా సాగుతుంది కవిత. నెహ్రూజీ హఠాత్ నిష్క్రమణం ఆనాడు దేశ ప్రజల్లో కలిగించిన తీవ్ర వేదనకు, నిరాశా, నిస్పృహలకు ఈ కవిత ఒక ప్రతిధ్వని, ప్రతిబింబం! నెహ్రూ నిర్యాణం దేశ ప్రజల హృదయాల్లో కలిగించిన ఉద్విగ్నతను, తత్తరపాటును ఈ కవిత బలంగా చిత్రించింది. అయితే కవి దీనిలో కేవలం నిరాశా, నిస్పృహలను నింపి వదిలేయ లేదు. 'సూర్యుడు లేస్తున్నాడు / చంద్రుడు చూస్తున్నాడు / తారకలు తందాన అంటున్నాయి / నదులు కదులుతున్నాయి' అంటూ ఆశావహ స్ఫూర్తిని రగిలించారు. 'అతనే నేను / నేనే అతను' అని ముగించారు కవితను కవి. నాడు ప్రజల హృదయాల్లో నెహ్రూ పట్ల వున్న అభిమానానికి, ఆరాధనా భావానికి నిదర్శనంగా నిలుస్తాయి ఈ వాక్యాలు.

'ప్రపంచ పౌరుడా జోహారు' అన్న కవిత దేశాలకీ, ప్రాంతాలకీ, భాషలకీ, సంస్కృతులకీ అతీతమైన ఒక విశ్వమానవ భావనపై రాసిన కవిత. 'ఐక్యరాజ్య సమితి నీ ఇల్లు / యునెస్కో, యూనిసెఫ్ నీ అమ్మ నాన్న' అంటూ మానవుణ్ణి ఉద్దేశించి చెబుతాడు కవి. 'ప్రపంచ పౌరుడా / నవ ప్రపంచ పిచ్చి పౌరుడా జోహారు! / ఒక మాసం ఒక నాగరికత / ఇరవై యొక్క మాసాల అనంతరం / నిన్ను కన్నదీ లోకం / నైలు నది, ఆండియా తీరప్రాంతం / పచ్చ నది, యూఫ్రటీస్ లోయలో ఆరంభం / హిందూ, హెల్లెనిక్, పాశ్చాత్య నాగరికతలతో అంతం / అది నీ జన్మ చరిత్ర మందగమనం / నీకిదె జోహారు' అంటూ నవ మానవుని ఆవిర్భావం గురించి చెబుతాడు కవి.

మానవాళి ఉనికికే ప్రమాదంగా దాపురించిన ప్రచ్ఛన్న యుద్ధం కాలంనాటి పరిస్థితుల్ని ప్రస్తావిస్తూ కవి, మానవులకు జాగ్రత్తలు చెబుతున్నాడు, జాగృత పరుస్తున్నాడు ఇలా...! 'వారూ వీరూ కూడబలుక్కుని నీకిచ్చిన ఆటవస్తువు ఆటంబాంబు / మిడిసిపడక ఆ పాలపీక పారేసి / జుబ్బా విప్పి ఆటవస్తువు దాచేసి / అమ్మా నాన్నా అంటూ గెంతిన ప్రపంచ పౌరుడా జోహారు' అని మనిషికి సహజంగా అబ్బిన శాంతికాముకతను ప్రశంసిస్తున్నాడు కవి. 'నాకు జబ్బు చేసింది' (బిల్లు చీటి పొందుపరిచాను) అన్న కవిత ఒక రోగి మనఃస్థితిని చైతన్య స్రవంతి పద్ధతిలో చెప్పిన కవిత. 'ఉప్పు కారం విడిచెయ్యి / మూడు పూటలా మాడి చావు / నవ్వి నవారు మంచమెక్కాను / ఆ మంచం నా సామ్రాజ్యం / మంత్ర సానులు నా సామంతులు / ధర్మామీటర్ నా విజయ పతాక / పరామర్శ కొచ్చే పోయేవారు నా ప్రజ / మందు చీట్లు కప్పం కట్టిన చిట్టాలు / ఔన్సు గ్లాసు కోశాగారం / నిద్రమాత్ర ధర్మపత్ని ప్రార్థన / పరమాత్మ దర్శనం / మూలుగుతో ఆహ్వానం' ఇది రోగి మానసిక స్థితికి అక్షరరూపం! కవి కావాలనే క్రమపద్ధతిని కాదని, గందరగోళ ధోరణిని కవితలో ప్రవేశపెట్టినట్టు అనిపిస్తుంది. ఇది రోగి మనసులో రేగే ఆలోచనలను నైరూప్య పద్ధతిలో చెప్పిన కవిత. ఎక్స్‌రే ఫోటోగ్రాఫ్‌లా అందంగా ఉండదు. ఇక ఈసిజి రిపోర్ట్ గజిబిజికి పరాకాష్ఠ! అర్థంతో నిమిత్తం లేకుండా చదువరి కవితతో తాదాత్మ్యం

చెందుతాడు. కవిత మొత్తం రోగి మనసు తాలూకు మోనోలాగ్‌లా సాగుతుంది. ఒక వైచిత్రీ విన్యాసంలా కనిపిస్తుంది.

'చైనా గోడ' ప్రతీకాత్మకంగా రాసిన కవిత. 1962 చైనా యుద్ధ కారణంగా దేశంలో చైనా వ్యతిరేకత తారాస్థాయికి చేరింది. ఆ నేపథ్యంలో వచ్చిన కవితే ఇది. 'వెయ్యి పూలు వికసించనీ / వెయ్యి భావాలు వర్థిల్లనీ / ఆరేండ్ల వెనుక వెలిసిన ఈ గీతి / హిమగిరుల కావల వినబడదీనాడు / పూవు కొక్క ముల్లు / భావానికో తాళం / అది చాలక చుట్టూ చైనా గోడ' అని మొదలువుతుందీ ఖండిక. "బౌద్ధానికి నిచ్చెన బెయోనట్లు / నాదన్న పసికందు ఉయ్యాలతాడు ఉరితాడు / కన్య కళ్లల్లో గూఢచారి క్రీగంటి చూపు / ఊరంతా స్వతంత్ర కాముల గోరీలే / అది చాలక చైనా గోడ'... 'భూమట్టమైన స్వతంత్ర శిఖరాలు / అన్నీ పడిపోగా మిగిలిన చైనా గోడ' ఇదీ ముగింపు వాక్యం... చైనాపై కవి వాఖ్య కూడా! 'దాగిలి మూతలు' వ్యంగ్య కవిత. మనిషిలో ద్వంద్వ ధోరణిని కవి ఎగతాళి చేస్తున్నారు... 'దొరికాడు దొంగ / ప్రపంచ శాంతి స్థాపనమని / పక్కింటి పరంథామయ్యని ఖూనీ / నీటి బోది ముందు నీ పొలానికి సుమీ / దున్నినవాడిదే భూమి / రామాయణాది మహా కావ్యాలు / డిటెక్టివ్ నవల చాలు / నా దేశం నా ప్రజ / నా ఊరు, నా ఇల్లు / తత్త్వమసి శత్రువు నుసి / దొరికాడు దొంగ' దాగుడు మూతల ఆటలో 'దొంగ' కనిపించకుండా దాక్కోవాలి. 'కనిపిస్తే' ఇక 'అవుట్' అయినట్టే! ఆశయాల ముసుగుతో లోకంలో చెలామణి అవుతున్న వారిలోని కుత్సితబుద్ధిని బట్టబయలు చేసి, వారి నిజస్వరూపాన్ని బయటపెట్టడం ఈ కవితావస్తువు.

బుచ్చిబాబు గారు ఆంగ్ల సాహిత్యంపై పట్టు వున్నవారు. అంతేకాదు, అనేక శాస్త్రాలతో పరిచయం వున్నవారు. అందుకే ఆయన కవిత్వంలో తరచు పాండిత్య ప్రకర్ష కనిపిస్తుంది. ఈ కారణంగానే ఒక్కోసారి కవిత చివర ఫుట్‌నోట్లు పెట్టక తప్పలేదు. కవితారచనలో కవిదే పైచేయి కావాలి, పండితునిది కాదు. కవితల రచనాకాలపు ప్రస్తావన లేదు. అలాగే పుస్తకంలో ముందుమాట గాని, రచయిత 'మాట' గాని లేవు. ఇవి వుంటే కవిత్వాన్ని అర్థం చేసుకోవడంలో ఉపకరిస్తాయి. బుచ్చిబాబు కవితా వస్తువులు కొంత భిన్నత్వం కలిగి వున్నాయి. శ్రీశ్రీ, తిలక్‌లలో కనిపించే వివిధ ప్రదేశాల, వ్యక్తుల ఘటనల ప్రస్తావన అనే లక్షణం ఈ కవిలో కూడా కనిపిస్తుంది. అయితే ఈ ధోరణి శృతి మించితే, కవిత్వం చదువుతున్నామా, జాగ్రఫీ పాఠ్యపుస్తకం చదువుతున్నామా అనే సందేహం కలిగే ప్రమాదం వుంది. ఆటంబాబుని 'పాలపీక'తో పోల్చడం గొప్ప ఊహ! ఒకచోట 'నాడి నిలిస్తే గాని వినిపించని 'పెస్టు' వాచీలు' అని అంటారు. బహుశా ఆ రోజుల్లో ఆ బ్రాండ్ రిస్టువాచీలు దొరికేవి కాబోలు. వాచ్ తిరుగుతున్నదీ లేందీ చెవి దగ్గర పెట్టుకుని వినడం అలవాటు మనవాళ్లలో వుండేది. ఈ పెస్టు వాచ్ నాడి శబ్దానికంటె చిన్నగా చప్పుడు చేస్తుందన్నమాట!

ఏది ఏమైనా బుచ్చిబాబు గారి కవితలు మామూలుగా సాగే కవితలు కావు. పాఠకులకు అందీ అందనట్టు ఇబ్బంది పెడతాయి. షాపుల్లో అద్దాల వెనుక వస్తువుల్ని చూస్తూ వెళ్లడాన్ని 'విండో షాపింగ్' అంటారు వాణిజ్యశాస్త్రంలో. స్వీట్ షాపు అద్దాల వెనుక నున్న మిఠాయిల్ని చూస్తూ నోరు చప్పరించినట్టు అన్నమాట. ఈ పుస్తక పఠనం కొందరికి ఒకరకంగా విండో షాపింగ్! అయితే 'మానసికంగా బద్ధకస్తులు మంచి కవిత్వాన్ని ఆస్వాదించ లేరు' అన్న ఆరుద్ర మాటని గుర్తు చేసుకోవాలి. బుచ్చిబాబు మేధావి వర్గ రచయిత. అందుకోగలిగితే, ఆస్వాదించ గలిగితే, ఆయన కవిత పాఠకుని హృదయాన్ని, మేధస్సుని ఏకకాలంలో వెలిగిస్తుంది.

గొప్ప కథకునిగా ప్రసిద్ధి పొందిన 'చాసో' కూడా కవిత్వం రాశారని కొద్ది మందికే తెలుసు. అందుకే 'ఈ తరం పాఠకులకు 'చాసో' కవితల్ని "పరిచయం" చేస్తున్నాను' అంటారు కె.వి. రమణారెడ్డి. విశాలాంధ్ర వారు ప్రచురించిన చాగంటి సోమయాజులు కవితల పుస్తకానికి రాసిన ముందుమాటలో 'కథారచయితగా చాసో ప్రతిభ గురించి నేను చెప్పవలసిన అవసరం లేదు. అనితర సాధ్యమైన రచనాశిల్పి అనీ, శ్రామిక జన పక్షపాతి అనీ, ఉత్తరాంధ్ర మాండలికాన్ని కథా కథనంలో అత్యంత సజీవంగా ప్రయోగించిన అతి కొద్ది మంది కథకుల్లో ఆయనొకరని అందరికీ తెలుసు. అయితే ఆయన కవితలు కూడా రాశారని చాలా కొద్ది మందికి తెలుసు. ఆ కొద్ది మందీ ఆ కవితల్ని చదివి వుండకపోవచ్చు' అని కె.వి.ఆర్. అభిప్రాయపడ్డారు. 'చాసో కవితలు' పుస్తకాన్ని 1996 జనవరిలో విశాలాంధ్ర తెచ్చింది. చాసో కవితలను మొదట్లో ఇంగ్లీషులో రాశారు. అయితే అవి ప్రచురణకు నోచుకోలేదు. తర్వాత తెలుగులో రాయడం మొదలెట్టారు. ఒకవైపు కథల్ని రాస్తూనే సమాంతరంగా కవిత్వాన్ని రాశారు. ఆయన రాసిన కవితలు పది వరకు లభించాయి. ఇంకా

పరిశోధన చేస్తే మరిన్ని దొరికే అవకాశం వుందని చాసో కవిత్వంపై విశేష కృషిచేసిన మానేపల్లి అంటారు.

చాసో కవితలు అలనాటి 'భారతి', 'ఆనందవాణి' 'తెలుగుతల్లి', 'ఢంకా', ప్రతిభ పత్రికల్లో నలభయ్యో దశకంలో అచ్చయ్యాయి. వీటిలో కొన్నింటిని మానేపల్లి తన 'అవగాహన' పత్రికలో పునర్ ముద్రించారు. అంతేకాదు, చాసో కవిత్వాన్ని విశ్లేషిస్తూ మంచి వ్యాసం రాశారు. చాసోతో స్వయంగా చర్చించి కవితల నేపథ్యాన్ని కూడా వివరించారు. 'వాన పడ్డాది వానా / వానంటె వానా? / వరహాల వాన / గొడుగుల్లో ఉడుపుల్లో / గుమ్మసారి గుమ్మనా / అప్పుల్లా పెరిగిపోయి / ఆకాశపు తాళ్ళూ / దెయ్యంలా సింత / దేవులల్లె సెందురుడు / ఎన్నె లెక్కిందెన్నెలా / ఎన్నెలంటెన్నెలా? / ఎన్నెలా సందమామ' ఇలా సాగుతుంది గేయం కళింగాంధ్ర జానపద గీతంలా. వాన చినుకుల్ని 'ఆకాశపు తాళ్ళు' అనడం విన్నూత్న ప్రయోగం. ఈ గేయాన్ని 1945 లో 'ప్రతిభ' పత్రిక ప్రచురించింది. చాసో 1945 సెప్టెంబర్‌లో 'తెలుగుతల్లి' పత్రికల్లో 'కాందశీకుడు' అన్న అద్భుతమైన గేయం రాశారు. 'బతకాలని వెళ్ళావు / బాంబుల్లో పడ్డావు / బతికొచ్చినావా / నా నాయనా!... నిరుడెల్లిపోనావు / నేడొచ్చినావు / నడిసొచ్చినావా / నా నాయనా! కొండలెక్కొచ్చినా / కోనల్లో నడిసినా / కట్టైతో వచ్చావ నా నాయనా! / మారు రైతుకు పోయె / మన సాగుభూమిరో / మారు మనుముకు పోయె / నీ బిడ్డ తల్లిరో / నానేమి సేతురా / నా నాయనా!... బ్రతుకుతెరువు కోసం రెండవ ప్రపంచయుద్ధంలో సైనికుడిగా చేరి తిరిగొచ్చిన ఓ యువకునికి, అతని తల్లి ఇంటి పరిస్థితిని వివరిస్తూ తన మనోవేదనను వ్యక్తంచేసే సందర్భం ఈ కవితగా రూపొందింది. 'పాలకొండ' అన్న కవితలో 'ఏడ్పే పరిగెడుతూంది / ఏరై / నూరుమైళ్ళ ఏడుపు / నాగోరు నుండి / నాగావళిగా. నాగావళి నదిపై రాసిన కవితలో గొప్ప భావచిత్రం కనిపిస్తుంది. 'వివాహమాడిన / వెర్రి జువ్వికి / విడాకులిస్తూ / లతామ తల్లి / లాలిత్యంగా / కౌగిలించుకుంది / కారు తాటిని / కామాంధయై.'

చాసోకి నాలుగు గోడల మధ్య కాకుండా ప్రకృతి ఒడిలో కవిత్వం రాయడం ఇష్టమని రాస్తారు ఆయన కుమార్తె రచయిత్రి చాగంటి తులసి. 'దూరపు / దృశ్యంలో, దృగ్గోచరమైనది / హృద్యంగా / త్యాగరాజు కృ / త్యాది పల్లవిలాగను, ఆకాశాంతపు అందంలో దూరపు కొండ / పాలకొండ' ఆకాశపు అంచున కనిపిస్తున్న కొండను కీర్తన తాలూకు పల్లవిగా భావించడం మనోహరంగా వుంది. 'రాత్రి' అన్న కవితలో 'అక్షయపాత్రలా / గర్ధ చంద్రుడు / బూజెక్కి గూడు కట్టాడు' చంద్రుడి చుట్టూ మబ్బు వలయాన్ని అదే 'వరద గుడి'ని బూజెక్కడం అని పోలిక తేవడం గొప్ప ఊహ! చాసో 'వంతెన పైన' అన్న శీర్షికతో ఒక మంచి కవిత రాశారు. 'సాగర గానము / సన్నని శృతిలో / శ్రమణము సోకింది / నాగావళి / నాదస్వరమూదుతూ రాగము / తీసింది / నురగలతో తరగలు / ఉరగాలై / పడగ తెత్తుతు పరుగులెత్తాయి / గుడిలో గంట / గుండెల్లోనే ఖంగున మ్రోగింది / రింగుమన్నాది / ఎదలో ఏదో / రొద చేయుచు / పదముల కందని / పదమును పాడగ / వంతము పడుతూంది / శ్రీకాకుళము / శివాలయ మెదురుగ / వంతెన పైనా / వర్తకమంత / బస్తాలలో బళ్ళబారుగా / శ్రీకాకుళానికి / చీకట్లన్నీ / చించుకు పోతూంది' ఒక శుభోదయాన చాసోకి నాగావళి వంతెన దగ్గర కనిపించిన దృశ్యమే ఈ కవితగా రూపు దిద్దు కుందనిపిస్తోంది. అందుకే కవి అంతగా దృశ్యీకరించారు. ఈ కవితను రోణంకి అప్పలస్వామి 'పెర్చెడ్ ఆన్ ది రివర్ బ్రిడ్జ్' పేర ఆంగ్లంలోకి అనువదించారు. ఇది 1950లో ఒక సావనీర్‌లో ప్రచురితమైంది. తర్వాత రోణంకి కవితా సంపుటిలో 'The Knoll and other Poems' లో కూడా చేర్చారు. ఈ సంపుటిని విశాఖపట్నం రైటర్స్ అసోసియేషన్ 1986 సంవత్సరంలో ప్రచురించారు.

చాగంటి తులసి తన తండ్రి కవిత్వంపై వ్యాఖ్యానిస్తూ 'చాసో పాడటానికి వీలుగా కవితలు రాశారు. శ్రీశ్రీని గాని, నారాయణ బాబుని గాని అనుసరించక, బహు తక్కువ మాటల్లో ఎక్కువ సాధించాలనే కోరిక చాసోని వెన్నాడుతూ వుంటుంది. విస్తరించి రాయడాన్ని తన బుద్ధి ఆమోదించదు' అంటారు. చాలా కొద్ది కవితలనే రాసినా చాసోకి కవిత్వంపై నిర్దిష్టమైన అభిప్రాయం వుంది. 'కాలానికి స్పందించి కవి రాయాలి' అంటారు ఆయన. 'ఆ కాలంలో జరిగినవి ఏవీ అంటనివాళ్ళు భావకవులు' అని అభిప్రాయపడ్డారు చాసో. నిండు పున్నమి రోజు పండు వెన్నెలలో ఆకాశంలో నక్షత్ర సమూహం కనిపించనట్టు, సాహితీ ప్రపంచంలో కథకులుగా బుచ్చిబాబు, చాసోలకు వున్న అసాధారణ స్థానం, వీరి కవిత్వ ప్రతిభను మరుగుపరిచినట్టు భావించాలి.

**ఎస్. హనుమంతరావు**
హైదరాబాద్, ఫోన్ : 8897815656

# అభ్యుదయ సాహిత్యవిమర్శకుడు
# ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి

**– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

సమకాలీన యువ విమర్శకులు, పరిశోధకులు, అధ్యాపకులలో అభ్యుదయ రచయితల సంఘంలో ఉంటూ ఒక చైతన్యవంతమైన పాత్రను నిర్వహిస్తున్న వారిలో ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి సమాజహితం-సాహిత్యమతం పేరుతో 18 వ్యాసాలతో కూడిన ఒక మంచి పుస్తకాన్ని ప్రచురించారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈశ్వరరెడ్డి గారు ఈ వ్యాసాలలో నేటికీ అవిచ్ఛిన్నంగా అభ్యుదయ సాహిత్యమెలా కొనసాగుతుందో సూచించి నట్లయ్యింది, ఇటువంటి ఆకాంక్షలనూ, కుల-వర్గ సమస్యల విశ్లేషణలనూ గమనిస్తే Subaltern Studies, Postcolonial Criticism, Marxist Literary Criticism సిద్ధాంతాల భూమికతో చర్చించారని స్పష్టమవుతుంది. అంతేకాదు, ఇవి marginalized narratives, resistance, social justice (సామాజికన్యాయం) పై దృష్టిని కేంద్రీకరించేలా స్ఫూర్తి నిస్తాయి. వేమనపై రాసిన రెండు వ్యాసాలలో ఒకదానిలో వ్యాసంలో వస్తుతాత్వికతను మరొక వ్యాసంలో వేమన పద్యాలు సాహిత్యంగా మారడంలో అనుసరించిన నిర్మాణ వైచిత్రిని ఎంతో శాస్త్రీయంగా వివరించారు.

వేమన సాహిత్యంలో భిన్నదృక్పథాలు కనిపిస్తాయి. ఆయన నాస్తికుడా? ఆస్తికుడా? అనే ఆలోచన కూడా వస్తుంది. ఆయన చెప్పిన స్వర్గ, నరకాలను ప్రస్తావించా దనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో వాటిని ఒక కొత్తదృక్పథంతో వ్యాఖ్యానించడం ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి గారి వ్యాసంలో కనిపించే విశేషం. వేమన కవిత్వంలో ముక్తిభావన ఒక ప్రగాఢమైన, భౌతికవాద దృక్పథంతో కూడిన ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. ఆయన పద్యాల్లో ముక్తి అనేది సంసారిక, వ్యక్తిగత, సామాజిక, ధార్మిక భయాల నుంచి మనసును విడిపించడం ద్వారా సాధించే స్థితిగా చిత్రీకరించబడింది. వేమన దృష్టిలో ముక్తిబాహ్య ఆచారాలు, తీర్థయాత్రలు, దేవాలయ సందర్శనలు లేదా స్వర్గ-నరక భావనల ద్వారా సాధించేది కాదు, మనసు యొక్క శుద్ధతమరియు స్వీయ-జ్ఞానం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని వాటికి తగిన పద్యాలను చూపించడం ఈశ్వరరెడ్డిగారిలోని లోతైన పరిశీలన, అధ్యయనాలకు నిదర్శనంగా నిలుస్తుంది. వేమన పద్యాలలో కనిపించే సామెతలు, ప్రాదేశిక భాష గురించి వివరించడం నూతన దృక్పథం. వేమనను పునర్మూల్యాంకనం చేసేవారికి ఈ రెండు వ్యాసాలు కొత్త భావనాలను అందిస్తాయి. సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసే విధానాన్ని కూడా తెలియజేస్తాయి.

గురజాడ అప్పారావుగారి 'లవణరాజుకల' (1911) గురజాడవారి సంస్కరణ దృక్పథాన్ని తెలియజేసే గొప్పకావ్యం. గురజాడ 19వ శతాబ్దంచివరలో మరియు 20వ శతాబ్దారంభంలో జీవించిన సంస్కర్త. ఈ కాలంలో భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమాలు ఊపందుకున్నాయి. రాజారామ్మోహన్‌రాయ్, జ్యోతిరావు పూలే, బి.ఆర్. అంబేద్కర్ వంటి సంస్కర్తలు కుల వివక్షత, అస్పృశ్యత నివారణ వంటి సామాజిక దురాచారాలపై పోరాడారు. ఈ సంస్కరణ ఉద్యమాల ప్రతిఫలనంలో భాగంగా 'లవణరాజుకల'ను చూడవచ్చు. గురజాడ తన

కావ్యం ద్వారా అస్పృశ్యతా నివారణకు సంబంధించిన సందేశాన్ని సాహిత్య రూపంలో అందించాడు.

'లవణరాజుకల'ను గురజాడ వారు ఛందోబద్ధమైన పద్యాల్లో రచించారు. ఆ కావ్యాన్ని పద్యాల్లో చదవలేని వారికి, విద్యార్థులకు ఈ వ్యాసం ఎంతో ఉపయోగ పడుతుంది. వ్యాఖ్యానం, విశ్లేషణల కంటే కథను చెప్పడానికే ఈశ్వరరెడ్డిగారు ప్రయత్నించారు. చివరిలో మాత్రం ఆ కావ్యాన్ని రెండు మూడు మాటల్లో 'వసుధైక కుటుంబం అనే గొప్ప సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భారతదేశం తమతో ఉన్న మనుషుల్ని కులం పేరుతో దూరంపెట్టడం ఎంతవరకు సమంజసం? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. 'కులము హెచ్చుతగ్గులు ఎట్లు ఎరుంగవచ్చు' అన్న వేమన ప్రశ్నకు కొనసాగింపే ఈ లవణరాజుకల. లవణరాజు తన కలలో చూసిన కన్య, అతని తండ్రి గురజాడ ఆత్మకు ప్రతీకలు. వారు అనుభవిస్తున్న విపక్ష అప్పటి సమాజానికి దర్పణం. లవణరాజు ఆమెను వివాహం చేసుకోవడం, ఆమె ద్వారా సంతానం పొందడం అనేది గురజాడ అభ్యుదయ హృదయం. లవణరాజుకల నుండి బయటపడిన తర్వాత కలలో కనిపించిన సుందరి, ఋషి, గుర్రం ప్రత్యక్షమవడం గురజాడ భవిష్యత్ దర్శనానికి నిదర్శనం. తను ఆశించిన ఆశయాలు తప్పక నెరవేరుతాయనే సందేశాన్ని ఈ కావ్యం ద్వారా ఇచ్చాడు' అని అద్భుతంగా మూల్యాంకనం చేశారు.

'ప్రయోగాలకు వాకిలి – శ్రీశ్రీ సిప్రాలి' వ్యాసంలో శిల్పానికీ, ప్రయోగాలకీ, చమత్కారానికీ నిదర్శనంగా నిలిచే రచనలను వివరించి, శ్రీశ్రీ కళకళ కోసం కాదు, ప్రజల కోసమనే దృక్పథానికి చెందిన వాడని విశ్లేషించాడు.

ఆవంత్స సోమసుందర్ గారి 'బృహత్కావ్యాలు', 'గంధమాదనం', 'చేతావనీ', 'రక్తరేఖ', 'హృదయంలో హిరోషిమా', 'ధూపఛాయ', 'జీవనలిపి' అనే దీర్ఘ కావ్యాలను విశ్లేషించిన వ్యాసం ఒక సిద్ధాంత గ్రంథానికి కావలసినంత విస్తృతి ఉంది. దీర్ఘకావ్యాల నిర్వచనాలు, లక్షణాలు, దాని అనువర్తన ఒక క్రమపద్ధతిలో అనుసరించి విశ్లేషించాడు. సోమసుందర్ గారి కవిత్వ తత్త్వంపై రాసిన మరొక లోతైన వ్యాసం రాశారు. కవికి ముఖ్యమైన భావుకతను వీడకుండానే అభ్యుదయ భావాలను తన కవిత్వం ద్వారా అందించవచ్చునని నిరూపించిన భౌతిక వాదిగా సోమసుందర్‌గారిని నిరూపించారు. ఆరుద్రపై రాసిన వ్యాసం ఆయన జీవితాన్ని, రచనల్ని పరిచయం చేస్తుంది. 'పరిశోధకుడుగా ఆరుద్ర' అనే పేరుతో పై పరిశోధన చేసిన నాకు కూడా ఈ వ్యాసం బాగా నచ్చింది. పూర్వ పరిశోధనాలను తన ఆధార గ్రంథాలలో పేర్కొనడం పరిశోధకులు నిజాయితీకి అద్దం పడుతుంది.

శంకరంబాడి సుందరాచారి గారి 'బుద్ధగీత'ను వ్యాఖ్యానిస్తూ బౌద్ధం ధర్మాచరణలోని బద్ధులుగా ఉంటారన్నారు. కులాలుగా, మతాలుగా, ప్రాంతాలుగా చిన్నాభిన్నమైపోతున్న ప్రపంచ మానవ సమాజాన్ని పూలదండలో దారంలాగా కలపడానికి 'బుద్ధిజం' పనికొస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించిన తెలుగు కవులు, రచయితలు, సంస్కర్తలు 'బౌద్ధ' రచనలకు శ్రీకారం చుట్టారని కూడా భావించారు.

దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు' (1919), వానమామలై జగన్నాథాచార్యులు 'రైతురామాయణం' (1980), ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి 'పొలి' (2007), గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి 'రైతురాయలు' (2009) మొదలైన కావ్యాలను, వాటిలోని ముఖ్యాంశాలను ప్రస్తావించి, భైరపురెడ్డి నారాయణరెడ్డి గారు రాసిన 'రాయలసీమరైతు' (1976) కావ్య విశేషాలను వివరించారు. ఇది ప్రధానంగా రాయలసీమలో 1952లో వచ్చిన భయంకర కరువు సృష్టించిన విషయాన్ని అక్షరీకరించిన పద్యకావ్యం. ఒకవైపు రాజకీయంగా జరిగిన అన్యాయాలను మరొకవైపు ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితుల వలన ప్రకృతిపరంగా కలిగిన నష్టాలను హృద్యమైన పద్యాలతో వర్ణించటం ఈ కావ్యంలో కనిపించే విశేషమని వ్యాసకర్త వివరించారు. రాయలసీమలోని ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతాయో ఈ కావ్యంలో చెప్పిన తీరు ఆ భూగోళిక పరిస్థితులను మన కళ్ళముందు ఉంచుతుంది. వాటిని 'వజ్రకరూరులో వజ్రాలతోపాటు పొగాకు, ద్రాక్ష, రాగి, వేరుశెనగ, జొన్న, మధురఫల వృక్షజాతులకు అనంతపురం ఆలవాలంగా నిలిచిందని, వరి, పత్తి, వేరుశెనగ, గట్టిధాన్యం, మధురఫల వృక్షాలు, కాయగూరలు కర్నూలులో బాగాపండుతాయని, అరటి,

నిమ్మ, తమలపాకులు, మామిడి తదితర పంటఫలాలతో కడప, కొబ్బరికాయలు, చెరుకు, మామిడి తదితరాలు చిత్తూరు జిల్లాలో విరివిగా పండుతాయని కవి వర్ణించిన అంశాలను ఈశ్వరరెడ్డిగారు చక్కగా వివరించారు.

ఈ వ్యాసంతోపాటు రైతుల గురించి కవిత్వం రాసిన వారి ఆలోచనలను మరొక వ్యాసంలో విశ్లేషించారు. ఎ.వి. సుబ్బారెడ్డి రాసిన 'హాలికుడు' (1934), శేషశర్మ 'మేఘమా' కవిత (1936), గొట్టిపాటి సుబ్బరాయచౌదరి 'రైతుగానలోలత' (1937), కె.వి. రామకృష్ణారెడ్డి రాసిన 'రైతుమేలుకొలుపు' (1937), కె.వి. కృష్ణారెడ్డి 'రైతుజెండా' (1937) కాలెజగదీష్ 'మహాప్రయాణం', సిద్దగిరి శ్రీనివాస్ 'ఎదురుచూపులు', ఎ.ఎన్. నాగేశ్వరరావు 'కరువు పిడికిళ్ళు' మొదలైన కావ్యాలు కవితలను కనిపించి రాయలసీమ రైతు జీవితాన్నెలా ఆవిష్కరించిన విధానాన్ని చక్కగా విశ్లేషించారు. ఈ రెండు వ్యాసాలు చూసిన తర్వాత రాయలసీమలో పుట్టిన కవి కరువు గురించీ, రైతు గురించీ కవిత్వం రాయకుండా ఉండరేమో అనిపిస్తుంది. అలా రాయడం ప్రాదేశిక చిత్రనకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. తన ప్రాంతంపట్ల ఉన్న ప్రేమ వ్యక్తం అవుతుంది. వీటిని ఈ రెండు వ్యాసాలలోను ఈశ్వరరెడ్డి గారు విశ్లేషిస్తుంటే ఆ ప్రాంతంలోని రైతుల కష్టాలు వ్యవసాయ జీవనవిధానం అన్నీకూడా మన కళ్ళముందు కదులుతాయి. పాఠకుడు కూడా రైతుజీవితంతో మమేకవుతాడు.

ఈ వ్యాసాలతో పాటు '21వ శతాబ్దంలో రాయలసీమ కవిత్వం–వ్యవసాయ సంస్కృతి' అనే వ్యాసం కూడా రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతుల సమస్యలను ఆ జీవన విధానాన్ని వర్ణించిన కవిత్వాన్నే విశ్లేషిస్తుంది. రెండు వ్యాసాలలో రాయలసీమ రైతు జీవితాన్ని విశ్లేషిస్తే, మరొక వ్యాసంలో ఉత్తరాంధ్రలో ఉన్న రైతు జీవితాన్ని ఎలా ఆవిష్కరించిందో విశ్లేషిస్తారు. స్వయంగా వ్యవసాయం తెలిసిన కవి గంటేడ గౌరునాయుడు 'నాగలి' అనే కావ్యం రచించారు. దీన్ని ఆధారంగా చేసుకొని జమీ భూముల చట్టాన్ని రద్దుచేయడానికి అచ్చుపువలస, అడివరం, లక్ష్మీపురం, బెబ్బులి, శ్రీకాకుళం మొదలైన ప్రాంతాల్లోని రైతులుఉద్యమించి విజయం సాధించి ఆత్మగౌరవ పతాకాన్ని తన కావ్యంలో వర్ణించిన తీరు తెన్నులను సోదాహరణంగా వివరించారు. అంతేకాకుండా, రైతులు వివిధ ప్రాంతాలలో చేసిన ఉద్యమాలను గంటెడ గౌరునాయుడు కీర్తించిన విధానాన్నీ, చారిత్రక పరిణామ క్రమంలో రైతుల పోరాటం ఎలా కొనసాగిందో వివరించారు. మలబార్ భూముల కోసం తిరగబడ్డ మోప్లా రైతులు, దోపిడిని ఎదిరిస్తూ నిలబడ్డ మరారీ రైతులు, పలనాడు పుల్లరిపోరులో పాల్గొన్న రైతులు, పెదనందిపాడులో జరిగిన పన్నుల నిరాకరణోద్యమ నినాదాలతో గొంతు కలిపిన రైతులు, మన్నెంలో ఉద్యమించిన రైతులు, మునగాల, మందస, చల్లపల్లి జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన రైతులు, పోరాట చరిత్రలను నాగలికావ్యం చిత్రించింది. నందులు, మౌర్యులు, కనిష్కులు, నగదులు, గాంగులు, గజపతులు, ఫ్రెంచ్‌వాళ్లు, కుతుబ్‌షాహీలు, బ్రిటీష్‌వాళ్ళు, జమీందారులు, ఇనాందార్ల నుండి మొన్నమొన్నటి సంతాలి గిరిజన పోరాటం, శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం, తెలంగాణ రైతాంగ పోరాటం దాకా రైతులు ఉద్యమించిన విషయాన్ని గుర్తు చేస్తాడు. నాగలి బ్రతుకే ఒక నిరంతర యుద్ధం అంటాడని నాగలి కావ్యాన్ని సాధారణీకరించిన తీరు వ్యాసకర్తకున్న విస్తృత అధ్యయనం, అవగాహనలను తెలియజేస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో వ్యవసాయం, రైతుల జీవనవిధానాన్ని చింతా అప్పలనాయుడు. 'అరచేతిలో బువ్వపువ్వు' (2022)లో వర్ణించారు. దీన్నికూడా లోతుగా విశ్లేషించారు వ్యాసకర్త. 'తెలంగాణ గేయకవిత్వం–వృత్తుల ప్రస్తావన' పేరుతో రాసిన వ్యాసంలో తెలంగాణలో ఉన్నంత ప్రతిభావంతమైన గేయ రచయితలు ఇతర ప్రాంతాలలో కనిపించరనీ, వారు సామాజిక ఉద్యమాలలో భాగస్వాములవ్వడం ఒక ప్రత్యేక లక్షణంగా ఈశ్వరరెడ్డి గారు వ్యాఖ్యానించారు.

సుద్దాల అశోక్‌తేజ 'ఆకుపచ్చ చందమామ' (2002), జయరాజు 'వసంతగీతం' (2016) మొదలైన గేయ సంపుటాలను, అందెశ్రీ, గోరటివెంకన్న తదితరుల పాటలు యూట్యూబ్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన పాటలను ఆధారంగా చేసుకుని ఈ వ్యాసాన్ని రాశారు.

మూర్తిశెట్టిగోవింద్ రచించిన 'నానోడిబతుకులు' (2024) నవలలో యానాదుల బతుకుల గురించి

బహుజన సాహిత్యదృక్పథంతో ఒక గొప్ప వ్యాసాన్ని రాశారు. దీనికంటే ముందు "ఎన్నెలనవ్వు" (2011) అనే నవలను యానాది కులానికే చెందిన ఏకుల వెంకటేశ్వర్లు రచించారు. దీన్ని ఈ వ్యాసాల ప్రస్తావించకపోయినా, వి.ఆర్. రాసాని, మూరిశెట్టి గోవింద్., కె.వి. మేఘనాథ్ రెడ్డి, జిల్లెల్ల బాలాజీ తదితరులు సంచార జాతుల బతుకులను గురించి రాస్తున్నారని ఆ రచనల గురించి ప్రస్తావించారు. మరో సంచారజాతి ఎరుకల జీవితాల గురించి అరుణ రాసిన 'ఎల్లి', 'నీలి', శిరంశెట్టి కాంతారావు రాసిన "వాళ్లుగెలవాలి", సలీం రాసిన "లోహముద్ర" మొదలై నవలలు సంచార జాతుల సమకాలీన జీవన పరిస్థితులకు అద్దం పడుతున్నాయని కూడా పేర్కొన్నారు. రచయిత 'నానోడి బతుకులు' నవలను దగ్గరగా పరిశోధించి రాసిన నవలగా రచయితే చెప్పుకున్నాడు. ఈ వ్యాసకర్త ఈ వ్యాసాన్ని ఎంతో శాస్త్రీయంగా రాశారు. ముందుగా అ నవల్లోని కథను పరిచయంచేసి, ఆ తర్వాత యానాదుల సంస్కృతీ సంప్రదాయాలను, వారి భాషా విశేషాలను కూడా అందించడం చాలా బాగుంది. 'స్వాతంత్ర్య భారతదేశంలో మూలవాసులుగా ఉన్న గిరిజనులకు హక్కులు, స్వేచ్ఛ అనేవి లభించడం సంగతి దేవుడెరుగు. మూడుపూటలా భోజనానికే అష్టకష్టాలు పడుతున్న పరిస్థితులు కనిపిస్తాయి. ఆకలి తీర్చుకోవడం కోసం అడవుల వెంట తిరుగుతూ, అధికారుల చేతుల్లో కీలుబొమ్మలవుతూ, తెలియని చట్టాల చేతుల్లో నేరస్తులుగా మిగులుతూ, భూస్వాముల చెప్పుచేతల్లో నలిగిపోతూ ఉండడాన్ని ఈ నవల చాలా ప్రస్ఫుటంగా చిత్రించింది' అని వ్యాఖ్యానించారు.

ఆచార్యఆర్వీఎస్. సుందరంగారి 'ఆధునిక వేమన శతకం', 'సుందరప్రభవ', 'నది-నగరం' రచనలను ఆధారంగా చేసుకుని సంప్రదాయం ఆధునికతల మేళవింపుగా కొనసాగే రచనలను మానవతా కోణంతో విశ్లేషిస్తారు. 'తెలుగుకవిత్వం-సాంస్కృతిక దృక్కోణం'లో ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశారు. 'తెలుగు భాషాభివృద్ధి: అవకాశాలు, సవాళ్ళు' వ్యాసంలో తెలుగు భాషాభివృద్ధి అనేది ప్రభుత్వ విధానాలను బట్టి కూడా ఉంటుంది. భాషను సరళీకరించుకుని సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా భాషను ఉపయోగించుకోవాలి. తెలుగులో మంచి అభివృద్ధి నైపుణ్యాలు ఉంటే అవకాశాలు కూడా ఉన్నాయనేది కూడా ఈ వ్యాసం మనకు సూచిస్తుంది. ఇద్దరు భాషలు ముఖ్యంగా ఇంగ్లీష్ అభ్యసించినా పర్లేదు. కానీ తెలుగు భాషపట్ల నిర్లక్ష్యం మంచిది కాదనేది కూడా ప్రబోధిస్తుంది.'తెలుగులో భావకవిత్వాన్ని గానీ, మానవీయ కవిత్వాన్ని గానీ ప్రారంభించిన మహర్షి గురజాడ అప్పారావే. అలాంటి గురజాడ అప్పారావుగారి ప్రోక్తమైనట్టి ఈ నవ్య మానవ కవిత్వమే అభ్యుదయ కవిత్వానికి మాతృత్వం వహించిందని' మూడు ప్రధానమైన కవిత్వోద్యమాల్ని ఈశ్వరరెడ్డి ఎంతో లోతైన అధ్యయనంతో వ్యాఖ్యానించారు.

ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి గారు తాను రాసే ప్రతి వ్యాసంలోను ఆ రచనను లేదా రచనలను వివరించి వాటిని సైద్ధాంతిక కోణంతో సమన్వయించటం ఈ వ్యాస రచనా విధానంలో కనిపించే మరొక విశేషం. అందువల్ల అనువర్తిత విమర్శకు ఈ వ్యాసాలు నిదర్శనంగా నిలుస్తాయి. వేమన, గురజాడ రచనలలో కుల సమస్యలపై చర్చ ఉన్నా, దానిలో వర్గ స్వభావం ప్రధానం. ఆరుద్ర, ఆవంత్స సోమసుందర్, రాయలసీమ, తెలంగాణ, ఉత్తరాంధ్ర కవుల రైతు సమస్యలను విశ్లేషణ చేయడం లోను, మూరిశెట్టి గోవింద నవలను సబాల్టన్ ఎప్రోచ్‌తో పరిశీలించడంలోను అభ్యుదయ ఆకాంక్షే ప్రధానంగా కనిపిస్తుంది. ఒక పరిశోధన పత్రం, ఒక సాహిత్య విమర్శల వ్యాసం ఎలా రాయాలో తెలియడానికి ఇవన్నీ నమూనాగా కూడా ఉపయోగపడతాయి. మూల రచన చదివించే ప్రేరణనిస్తాయి. అభ్యుదయ సాహిత్యాన్ని బలమైన గొంతుతో వినిపించే సాహిత్య విమర్శ వ్యాసాలతో వస్తున్న ఈ పుస్తకం తెలుగు సాహిత్య విమర్శలో ఒక విశిష్టమైన స్థానాన్ని పొందుతుంది.

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**
పూర్వఅధ్యక్షులు, తెలుగుశాఖ,
మానవీయశాస్త్రాల విభాగం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
(సెంట్రల్ యూనివర్సిటీ), హైదరాబాద్, ఫోన్:9989628049

# దక్షిణాపథాన నాయక రాజుల ప్రస్థానం!



అలనాటి మధుర నగరం

– డా. సగిలి సుధారాణి

ఆదిలో కృష్ణదేవరాయలు కటకం మొదలుకొని కన్యాకుమారి దాక రాజ్యాధికారాన్ని విస్తరించుకొని, విజయనగరం రాజధానిగా ఏలుతుండగా మధురలో చంద్రశేఖర పాండ్యుడు, తంజావూరులో వీరశేఖర చోళుడు రాయలవారి సామంతులుగా వుండేవారు. ఈ తరుణంలో తంజావూరులో వీరశేఖర చోళుడు మధుర చంద్రశేఖర పాండ్యున్ని జయించి దానిని ఆక్రమించాడు. చంద్రశేఖర పాండ్యుడు విజయనగర దర్బారుకు వచ్చి జరిగిన వర్తమానం విన్నవించుకొంటూ "మాకు మీరే దిక్కు" అని మొరపెట్టుకొన్నాడు. దీంతో రాయలవారు ఆగ్రహానికి గురై తమ సేనానాయకుడిని పిలిచి, "దక్షిణ రాజ్యం యావత్తు లోబడి ఉండగా పాండ్యునిరాజ్యం చోళుడు ఆక్రమించడం ఏమిటి? మీరు సేనా సమేతంగా పోయి వీరశేఖర చోళరాజుని తగిన శాస్తి చేయండి! ఈ పాండ్యరాజుకు యధాప్రకారం రాజ్యం అప్పగించండి" అని ఆజ్ఞాపించాడు. రాయలవారి ఆజ్ఞ ప్రకారం పాండ్యరాజుని తీసుకొని నాగమనాయకుడు దళసమేతంగా వెళ్ళి, వీరశేఖర చోళుడిని ఓడించి ఆరాజ్యం తన వశం చేసుకొన్నాడు. తరువాత మధురకు పోయి చోళుడు ఉండివున్న రక్షక స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాడు. కాని, రాయల ఉత్తర్వు ప్రకారం మధురను పాండ్యునికి ఇవ్వక ఆ రాజ్యాన్నీ తన అధీనంలోనే ఉంచుకొని, రెండు రాజ్యాలను (మధుర, తంజావూరు) ఏలుకొన సాగాడు.

పాండ్యరాజు తిరిగి విజయనగరానికి చేరుకొని రాయలవారి దగ్గర "మీరు మధురను యావత్తు కట్టి ఇవ్వమని నాగమ నాయకుని పంపించారు. కానీ ఆయన చోళరాజును జయించి పాండ్యరాజ్యాన్ని, మధురను రెండు తనదగ్గరే కట్టుకొన్నాడ"ని నాగమనాయకునిపై ఫిర్యాదు చేశాడు. రాయలవారు వెంటనే నాగమనాయకునికి "పాండ్యరాజ్యాన్ని స్వాధీనం చేసుకొని పాండ్యునుకి పట్టం కట్టమంటే నువ్వు స్వాధీనం చేసుకొన్నావు! నీకు రాజ్యాన్ని జయించి ఏలుకోమని పంపలేదు! కనుక ఈ ఆజ్ఞను చూసిన వెంటనే చంద్రశేఖర పాండ్యునికి మధుర పట్టంకట్టి తక్షణం ఇక్కడకు రమ్మ"ని హుకుం జారీ చేశాడు. అందుకు బదులుగా నాగమనాయకుడు "నేను ఎంతో ధనాన్ని వెచ్చించి రాజ్యాన్ని అధీనంలోనికి తెచ్చాను. నాకు రావలసిన పైకం రాబట్టుకొని వస్తాను కానీ అంతవరకు వచ్చేది లేదు!" అని జవాబు వ్రాసి పంపగా రాయలవారికి బహుకోపం వచ్చింది. "నాగమనాయకుడు నా ఆజ్ఞను తప్పి నడిచినాడు కనుక అతని తలకొట్టి ఎవరైనా తీసుకొని రాగలరా?" అని అడుగగా, ఆ సమయంలో నాగమనాయకుని కుమారుడు విశ్వనాథ నాయకుడు రాయలవారి సమక్షానికి వచ్చి "నాకు ఉత్తర్వు ఇస్తే తెస్తాన"ని అన్నాడు. "మీ తండ్రిగారిని కలవడానికి నన్ను ఆజ్ఞ అడుగుతున్నావా!" అని అన్నవెంటనే "స్వామి కార్యం ప్రధానంగానీ, తనతండ్రి ఎక్కువ కాదని" విశ్వనాయకుడు అన్నాడు. రాయలు అతనికి గుర్రాలనూ, సైనికులనూ ఇచ్చి మధురసీమకు పంపాడు.


"మీరు రాయలవారి ఆజ్ఞకు తప్పినడిచినారు, కనుక మిమ్మల్ని తలకొట్టి తెమ్మని ఉత్తర్వు అందింది, ఇప్పటికీ మించిపోయింది లేదు! పాండ్యరాజ్యాన్ని పాండ్యరాజునకు ఇస్తే, రాయలవారితో చెప్పి శిక్ష మాఫ్(రద్దు) చేయిస్తాన"ని సమాచారం పంపితే దానికి నాగమనాయకుడు "రాయలవారి పట్టున నువ్వు సమస్త రాజ్యాలు సాధించావు కదా! ఇదిగాక, నేనున్నూ చాలా రాజ్యాలు సాధించాను. రెండు, మూడు మారులు పోయిన సంస్థానాలను మనం నిలువబెట్టినాము! ఆయన్ని ఎంతమహొన్నతుడిని చేసినా ఆ ఘనత నాకు చెందాలి. ఇదినిజం! మరొకటి కాదు! రాయలు విశ్వాసం కలిగినవాడే అయితే, పాండ్యరాజ్యం


విశ్వనాథ నాయకుడు

ఉన్నప్పుడు దాసి కుమారుడు అనుభవిస్తే ఆయనకు వచ్చిందేమి? మనం అనుభవిస్తే రాకపోయిందేమి? నిన్ను బహుతపస్సు చేసి కన్నాం! ఏకపుత్రుడువు! కాబట్టి నిష్కారణంగా నాతో ఎందుకు యుద్ధం చేస్తావు? ఈ రాజ్యం కట్టడం నీ కోసమే గాని వేరే (ఉద్దేశ్యం) లేదు! తనతో ర"మ్మని సమాచారం పంపాడు. విశ్వనాథ నాయకుడు "స్వామి కార్యానికి తప్పు నడిచిన వారు గనుక మీరు తండ్రులు కారు, నేను మీ కుమారుడిని కాను! మీరు సంపాదించిన రాజ్యం నాకు అక్కరలేదు! తిన్నగా వస్తిరా! రాయలవారి సమక్షానికి తీసుకొని పోయి ప్రాణానికి భయం లేకుండా చేస్తాను! అధవా! యుద్ధం చేస్తే గెలిచేపాటి బలం మీకు భగవంతుడు ఇవ్వడు! నా మనస్సులో ప్రతిజ్ఞ ఏ విధంగానైనా మిమ్మల్ని తీసుకొనిపోయి రాయలవారి ఎదుట పెట్టడమే!" అని సమాచారం పంపితే, నాగమ నాయకుడు బహు కష్టపడుతూ అన్న మాటలు "నేను ఈ కుమారుడు కలగవలనని బహువిధాల తపస్సు చేసి, విశ్వనాథస్వామిని ప్రార్థించినందుకు, నామీద కత్తి ఎత్తే కుమారుడు కలిగినాడు! ఈ కుమారుడు బ్రతికినా సరే! చచ్చినా సరే!" రాణువం యావత్తు సమాయాత్తం చేసికొని, కుమారునితో రణానికి సిద్ధమయ్యాడు.

తండ్రికొడుకుల మధ్య పోరు నడిచింది. నాగమనాయని వారు కుమారునికి చాలక, ఓడిపోయి దొరికినాడు. చివరికి విశ్వనాథ నాయకుడే విజయం సాధించాడు. తండ్రి దొరకగానే విశ్వనాథ నాయకుల వారు "ఇంతమాత్రం ప్రాణాలతో చిక్కారు మనం చేసిన తపస్సు బలమ"ని తలచి అంబారిలో నాగమనాయకుని ఎక్కించి బందోబస్తుతో తీసుకొని వస్తూ, ముందుగా తన తండ్రిని ఖైదుచేసిన సమాచారం రాయలవారికి పంపాడు. మరో పది దినాల తరువాత విశ్వనాథవారు తండ్రిని తీసుకొని వచ్చి రాయల ఎదుట నిలువబెట్టాడు. రాయలు "మీ తండ్రిని ఖైదులో తెచ్చిపెట్టి, రవ్వంతైనా తండ్రి అన్న మాట విచారించక, స్వామి కార్యం ప్రధానం చేసుకొని తలకొడుతానని అన్నావు గనుక, నిన్ను చూసి మీ తండ్రి తప్పును క్షమించినామ"ని ఇంటికి పొమ్మని నాగమనాయకుడిని ఖైదు నుండి విడుదల చేసి పంపించాడు.

అప్పుడు నాగమనాయకుడిని విశ్వనాథ నాయకుడు ఇంటికి తీసుకొని వచ్చి "ఇక మీరు తండ్రులు నేను కుమారుడిని!" అని వినయపూర్వకంగా అన్నాడు. తరువాత


మధుర మీనాక్షి గుడి ప్రాకారాలు

రాయలు విశ్వనాథనాయని, పాండ్యుడిని కూడా పిలిపించి ప్రత్యేకంగా పాండ్యుడితో అన్నమాటలు "నీకు తగిన సంతానం లేదుకదా అని విశ్వనాథ నాయని వారికి దేశం ఇవ్వడం బహు సమ్మతి అని ఆయన పేరునే రాసి ఇచ్చినావు!" కదా అని అడిగాడు. దీనికి పాండ్యరాజు "నాకు పగవాళ్ళైనా చోళరాజుకు మాత్రం రాజ్యం ఇవ్వక, విశ్వనాథ నాయనివారు ఏలుకొంటే నాకు పరమ సంతోషం! ఇప్పుడు విశ్వనాథనాయనివారు నాకు తండ్రి వంటివారు!" అని అనగా అప్పుడు రాయల వారు విశ్వనాథనాయని వారిని పిలిచి "పాండ్యరాజ్యానికి పట్టం కట్టుతాము. మాకు సమంగా దక్షిణ సింహాసనానికి అధికారిగా ఉండమ"ని ఆశీర్వచనం చేసి సమాధాన పరిచినారు. అంతట విశ్వనాథ నాయకుడు మధురకు సాధికారికంగా చేరుకొన్నాడు.

విశ్వనాథ నాయకుడు విచ్చేసి అలా మధురసీమను, పాండ్యుని కోటను రాయసంస్థానంతో పోల్చి చూసి, అరియనాయకం మొదలారిని, కేశవప్పనాయణ్ణి ఇద్దరిని పిలిపించి "ఈ కోట మాకు ఉండటానికి అనుకూలం కాదు! మధుర నగరం చుట్టు భైరవుని బురుజులు, ఎనిమిది ద్వారాలు కలిగిన కోట, మీనాక్షి దేవి కోవెల, సుందరేశ్వర దేవాలయం కట్టించమ"ని ఉత్తర్వు చేశాడు. అంతేకాదు "మా తండ్రిగారు సంపాదించిన ధనం ఉంది. తెప్పిస్తాం! ఇందువల్ల పని అవుతుంది" అని చెప్పి ఆధనంతో పనులు పూర్తి చేయించాడు. వెనుకటి పాండ్యరాజును విశ్వనాథ నాయకుడు గౌరవంగా చూశాడు, కొన్నాళ్ళకు పాండ్యరాజు మరణించడంతో విశ్వనాథ నాయకుడే చోళరాజ్యం, పాండ్య రాజ్యం తమ ఏలుబడికింద పెట్టుకొన్నాడు. విజయ నగర రాయలవారికి అనుకూలురై నాయక రాజులు చోళ, పాండ్యరాజుల మార్గాన్ని అనుకరిస్తూ తంజాపుర, మధుర నగరాల గౌరవ ప్రతిష్టలు వృద్ధి చేశారు.

**డా. సగిలి సుధారాణి**
చరిత్ర పరిశోధకులు, రచయిత్రి
హైదరాబాద్, సెల్:94904 28825

# జీవకోటి మనుగడకు మూలాధారం ఆహారం

– ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు

**ఆ**హార సేకరణలో ఆదిమ మానవుడు ప్రకృతి సంపదపైనే ఆధారపడేవాడు–ఆకులు దుంపలు, వేర్లు, కాయలు, పండ్లు, తేనెపట్టు మొదలైనవన్నీ ప్రకృతి ఇచ్చిన ఆహారాలే. భూమిపై సంచరించే జంతువులు, నీటిలో జీవించే చేపలు మొదలైన జలచరాలను మాటు వేసి వేటాడి సాధించడం ఆహార సేకరణలో ఒక భాగమే. ప్రకృతిలో సహజంగా లభించే ఆహారం–వేట కన్నా ముందలి దశ. కాబట్టి, ఆదిమ మానవుడు తొలుత శాకాహారంపైనే ఆధారపడేవాడు అని పురాతత్వ శాస్త్రవేత్తల అంచనా. రాయి, కర్ర, ఇనుప ఆయుధాల తయారీ వచ్చిన తర్వాతే వేటాడే దశ ప్రారంభం అయింది. వేట కోసం ఆయుధాలను తయారు చేసుకోవాలనే ఆలోచన రావడం–తయారు చేయగలగడం–ఆహార సేకరణ తర్వాత కొన్ని వేల సంవత్సరాల మార్పుగానే భావించాలి. ఆహార ఉత్పత్తికి మానవుడు చేరుకోవడం ఒక విప్లవాత్మకమైన మార్పు. మానవుడు పరిసరాలపై సాధించిన తొలి విజయానికి అది సంకేతం. ఆహార ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత–వరి, జొన్న, గోధుమ మొదలైన ఎన్నో ధాన్యాలు పండించడం మొదలైంది. ప్రాంతీయ భేదాన్ని అనుసరించి ఆహారపు అభిరుచులు వ్యాప్తి చెందినా తెలుగు ప్రాంతాలకు సంబంధించినంత వరకు వరి పంటకే ప్రాధాన్యం లభించింది.

**వరి అన్నం :** హనుమకొండలో సిద్దేశ్వరగుట్ట పైన కాకతీయులనాటి అసంపూర్తి కావ్య శ్లోకాలు ఈ విధంగా ప్రారంభమవుతాయి– "ఆంధ్ర స్యంతి గరీయాం సః కాంచనచ్ఛాయ శాలయః:". "కేదార యత్ర శాలీనాం తరంగిత జలాంతరాః" అని, వరిపైరుతోనే ఆంధ్రప్రదేశ ప్రాంతాల వర్ణన ప్రారంభం కావడం గమనార్హం. పూర్వకాలం నుండే తెలుగు జనానికి ఇష్టమైన వరి అన్నాన్ని గూర్చి తెలియజేసే విషయమే ఇది! వరి అన్నపు ప్రాశస్త్యాన్ని ఎందరో ప్రాచీన కవులు తమ కావ్యాల్లో సందర్భానుసారంగా వివరిస్తే శ్రీనాథ కవి సార్వభౌముడు (క్రీ. శ. 1370– 1450) మాత్రం "అంగడి యూరలేదు. వరి అన్నము లేదు". అనీ, "జొన్న కలి జొన్న యంబలి/ జొన్నన్నము జొన్నపిసరు జొన్నలు తప్పన్/ సన్నన్నము సున్న సుమీ" అనీ, తన పల్నాటి సీమ పర్యటనలోని అనుభవాలను చాటు పద్యాల ద్వారా గుర్తు చేసుకుని, వరి అన్నం ప్రాధాన్యాన్ని పరోక్షంగా తెలియజేశాడు. సన్నన్నం అంటే వరి అన్నం. వరి అన్నంలో కూడా కొత్త బియ్యం కన్నా పాతబియ్యానికి జానపదులు ప్రాముఖ్యాన్నిస్తారు. అందుకు సమాధానం–అన్నం రుచిగా ఉంటుంది. ఎదుగు అవుతుంది. సులభంగా జీర్ణం అవుతుంది, అనే కారణాలను తెలుపుతారు. ఇదే విషయాన్ని శాస్త్రీయంగా గృహవిజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా తెలియజేస్తున్నారు. పాత బియ్యం కడగటం వల్ల, వండి గంజి వార్చటం వల్ల పోషక పదార్థాలు తక్కువ శాతంలో పోతాయి. పాత బియ్యం వండితే అన్నం మెతుకు కొత్త బియ్యం గింజ కన్నా పొడవుగా ఉంటుంది. వండిన గింజ విరిగిపోదు. కొత్త బియ్యంలో ఎక్కువ అమిలోజ్ (పిండి పదార్థం) ఉండడం వల్ల వండినప్పుడు గింజ త్వరగా పగులుతుంది. పాత బియ్యం వండటానికి కొత్త బియ్యం కన్నా ఎక్కువ సమయం పడుతుంది, తద్వారా సులభంగా జీర్ణం అవుతుంది,

**ఆహారం – వైవిధ్యం :** ఆహారం కేవలం ధాన్య సంబంధం మాత్రమే కాదు–కూరగాయలు, పండ్లు, పాలు, రసాలు వంటి ఎన్నో రూపాల్లో లభ్యమవుతూ అటు ప్రాచీనుల, ఇటు జానపదుల సాహిత్యంలో చోటు చేసుకుంది.

**శాకాహారం :** "పలుతెఱంగుల పిండి వంటలు, పప్పు కూడును, నేతి కుండలు, గుడంబు, దధి ప్రపూర్ణ ఘటంబులున్" అని, ఏకచక్రపురంలోని బ్రాహ్మణులు భీమునికి పెట్టిన పదార్థాల్లో శాకాహారులకు ప్రీతిపాత్రమైన ఆహార పదార్థాలను ఆదికవి నన్నయ (క్రీ.శ.1023–1063) మహాభారత ఆదిపర్వంలో(6–291) పేర్కొన్నాడు.

**మాంసాహారం :** నన్నయ శాకాహార భోజనాలను చెప్పి ఊర్కుంటే–మహాకవులైన శ్రీనాథుడు, ధూర్జటి తమ కావ్యాల్లో మాంసాహారాన్ని పేర్కోవడంతో పాటు, మాంసాహార వంటకాన్ని తయారు చేసే విధానాన్ని కూడా తెలియ

జేశారు-శ్రీనాథుడు తన హరవిలాసం కావ్యంలో, "మిరియము, ఉల్లియున్, పసుపు, మెంతియు, ఇంగువ, జీరకంబు, శర్కరయును, చింతపండును, కరాంబువు, కమ్మని నేయి, తైలమున్, పెరుగును వేళవించి "(2-121) అని, సిరియాలునికి వంటగా వండిన సందర్భంలో మాంసాహార తయారీలోని ఒక వైవిధ్యాన్ని తెలియజేశాడు. తిన్నడు చెంచు కుమారులతో కలిసి వేటాడిన జంతు మాంసంతో 'కఱకుట్లు'ను తయారు చేసిన పద్ధతి ధూర్జటి కవి (క్రీ.శ. 16వ శతాబ్దం) శ్రీ కాళహస్తి మాహాత్మ్య కావ్యంలో విపులంగా వర్ణించాడు. "క్రొవ్విన మెకలంబులను గొన్నటి గూర్చి కమర్చి పెంచులం చివ్వుచు ఎఱ్ఱమన్నలది చివ్వున నీరివురంగ నేర్చినోళ్లు న్విళ్లార ప్రేల్చి చమురుట్టి పడంగ కఱకుట్లు కాల్చి" (3-50). అంటే-కొవ్వెక్కిన జింకలను చంపి, వాటి మాంసపు ముక్కలను మంటలో కమిరించి పెంక మీద తిప్పి, మాంసపు ముక్కలపై గల ద్రవాన్ని పోగొట్టేందుకు వాటికి ఎఱ్ఱమన్ను అద్ది, కొవ్వు కరగటం వల్ల వచ్చిన చమురు కనిపించే విధంగా 'కఱకుట్లు' కాలుస్తాడు. కఱకుట్లు అంటే-కర్రకు కుట్టిన మాంసపు ముక్కలు. వీటిని జానపదులు 'షీకులు' అనే పేరుతో వ్యవహరిస్తారు. మాంసపు ముక్కలలోని ద్రవం ఇంకిపోయేలా పొడి గుడ్డతో అద్ది-కారం, పసుపు, ఉప్పుతో వాటిని బాగా కలిపి నిప్పు కణికలపై వేడివేడిగా కాల్చి, ఆ తర్వాత ధనియాల పొడిని చల్లి, వాటిని పొడవాటి ఇనుపపుల్లకు కుచ్చి ఉంచుతారు. ఈ ఇనుపపుల్లను షీకు (సన్నని సలాక) అని పిలుస్తారు కాబట్టి వీటికి షీకులు అనే పేరు ప్రసిద్ధమైంది. వీటిని 'కల్లు' సేవించేటప్పుడు నంజుకోవడం జానపదులకు అలవాటు. అందువల్ల నేడు వీటి తయారీ కల్లుపాకలకే పరిమితమైంది. అధునాతనమైన హొటల్లలో ఇవి 'షీక్ కబాబ్' అనే పేరుతో అత్యంత వ్యాప్తిలో ఉన్నాయి.

**ఆహారం-కాలానుగుణం :** శాకాహారమైనా, మాంసాహారమైనా ఋతువును బట్టి, ప్రకృతిలోని మార్పులకు అనుగుణంగా భుజించాలి అని, శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ.1487-1530) ఆముక్తమాల్యద కావ్యంలో ఈ విధంగా వివరించాడు- శాకాహారులైన బ్రాహ్మణులు ఎండాకాలంలో "పరిపక్వ సురభిరంభా ఫలంబుల తోడ తలపెక్కు పనస పెంగొలల తోడ" (2-73). అనగా-పండిన అరటి పళ్ళు, పెద్ద పనసతొనలు, దోస పండ్ల బద్దలు, అనేక విధాలైన మామిడి పండ్లు, ద్రాక్ష గుత్తులు, తీయని దానిమ్మ గింజలు, చెఱకు గడలను తినేవారు. మాంసాహారులు "చూత నూత్న ఫలయుక్తై లాభిఘారస్వనద్ధారా ధూపిత ------- హిమాంతర్నారికేళాంబువుల్"(2-69). అనగా-మామిడి కాయలతో కలిపి తిరగబోత వేసిన చేపలతో, భోజనం చేసిన తర్వాత కలిగే తేన్పులలోని కనరుపోయేందుకు, ఇసుకలో దాచిన కొబ్బరి నీళ్లను తాగేవారు. శాకాహారులు-తినే పండ్లలోని పనస, మామిడి శరీరానికి వేడిని కలిగిస్తే-దోస, చెరుకు రసం శరీరానికి చలువను కలగజేస్తాయి. అలాగే-మాంసాహారుల చేపలు వేడిని చేస్తే, కొబ్బరినీళ్లు చలువను కలిగిస్తాయి. ఈ విధంగా పుష్టిని, రుచిని కలిగించే ఆహారంతో పాటు వాటి విరుగుడు కూడా సూచింపబడింది. "గురుగుం చెంచలి తుమ్మి లేత గిరి సాకుం తింత్రిణీ పల్లవోత్కరముం గూడ పొరంటి నూనియులతో'' (4-134) అనగా-కురకటము, తువిన్నకము, ద్రోణము, తుంటికూర, చింతచిగురు వంటి ఆకుకూరలను వర్షాకాలంలో రెడ్లు భుజించేవారని రాయలు పేర్కొన్నాడు. విష్ణుచిత్తుడు తన ఇంటికి వచ్చే యాత్రికులకు కాలాన్ని అనుసరించి పెట్టే భోజనాన్ని కూడా శ్రీకృష్ణదేవరాయలు విభజించి చూపాడు-''కలమాన్నము ఒల్చిన ప్రప్పు నాలుగేన్భాగపిన కూరలున్ వడియములు వరుగుల్ పెరుగున్ ఘృతప్లుతిన్" (1-80) అనగా-వరియన్నం, ఒల్చిన పప్పు, నాలుగైదు కూరలు, వడియాలు, వరుగులతో చేసిన కూర, పెరుగు, నెయ్యి వర్షాకాలపు వంటకాలుగా తెలుపబడినాయి. ఒల్చిన పప్పు అనే మాటకు జానపదులు నేటికీ వ్యవహారంలో చిక్కుడు, అనుములు మొదలయిన వాటి విషయంలో ప్రయోగిస్తున్నారు. ఎండిపోయిన చిక్కుడు కాయ, అనపకాయల్లోని గింజలను బయటికి తీసి వాటిని ఇంకా బాగా ఎండబెట్టి, వేయించి, తర్వాత గింజను ఒలిస్తే, అది రెండు పప్పు బద్దలుగా విడిపోతుంది. వాటిని బాగా ఉడకబెట్టి పప్పుగా గానీ, పప్పుచారు (సాంబారు)గా గానీ, ఇతర కూరగాయలతో కలిపి గానీ వండుతారు. కంది, పెసర, మినుము, మంచి శనగ మొదలైనవి పప్పు ధాన్యాలు అయితే-చిక్కుడు, అనుములను ఒల్చిన పప్పు అని ప్రత్యేకంగా పేర్కొంటారు. ఈ ఒల్చిన పప్పు ఇతర పప్పుల కంటే పరిమాణంలో పెద్దదిగా ఉంటుంది. ఇక, వేసవికాలంలో-తెల్లని వేడి అన్నం, తీయని చారు, మజ్జిగ పులుసు, పల్చటి అంబలి, చెరుకు రసం, లేత టెంకాయ నీళ్లు, రసాలు, పండ్లు, సువాసనతో కూడిన చల్లని జలం, వడగాలిని పోగొట్టేందుకు ఊరవేసిన లేత మామిడి

పిందెలు, నీరు మజ్జిగ "వెలయగ బెట్టు భోజనము వేసవి చందన చర్చ మున్నుగన్" (1-81) అని, వేసవి కాలపు ఆహార పదార్థాలుగా పేర్కొనబడినాయి. పునుగు కూర వాసనను విరజిమ్మే వేడి వేడి అన్నం, మిరియాల పొడితో తిరగమోత చప్పుడు వీడని కూరలు, ముక్కులలోని జబ్బును మాన్పివేసే చుఱ చుఱ మను ఆవపచ్చళ్లు, ఊరగాయలతో పాటు "చే సుఱుక్కను నేయుం జిఱుపాలు వెల్లువగ నా హారం బిదు సీతునన్ (1-82) అని శీతాకాలపు ఆహారం వర్ణించబడింది.

**చల్ది :** కాలానుగుణంగా తినే ఆహారాన్ని మాత్రమే కాకుండా-నేటికీ పల్లెజనుల ఆహారంగా ప్రత్యేకతను పొందిన 'చల్ది'ని తయారు చేసే పద్ధతిని కూడా- "కాసర దధీ మండ మాసరంబులుగా బిసికి యారం బెట్టిన ---- కల మాన్నపు చల్ది పోక పొత్తులం గుడవ" (4-23) అంటూ-గేదే యొక్క మీగడ పెరుగును దట్టంగా వేసి పిసికి, ఉప్పుతో ఊరబెట్టిన నారింజ మరియు అల్లం ముక్కలతో, శ్రేష్ఠమైన బియ్యంతో వండిన చల్దిని, పోక ఆకులలో పెట్టుకుని తినాలి అని, శ్రీకృష్ణదేవరాయలు వివరించాడు. రాయలు వర్ణించిన చల్దికీ నేడు జానపదులు తయారు చేస్తున్న చల్దికీ దగ్గర సంబంధం కనబడుతుంది- రాత్రి వండిన అన్నాన్ని పెరుగుతో లేదా మజ్జిగతో కలపాలి. దానిలో ఉప్పు రవ్వను వేయాలి. దానిపై ఆవముక్క లేదా ఏదైనా పచ్చడి రేకును ఉంచాలి. ఒక మట్టి పాత్రలో ఈ పదార్థాలను పెట్టి, ఉట్టిపై రాత్రంతా భద్రపరిస్తే చల్ది తయారవుతుంది. దాన్ని జానపదులు తెల్లవారి తిని పొలం పనులకు గానీ, ఇతర వృత్తిపనులకు గానీ వెళతారు. ఆహారంగానే కాకుండా శరీరానికి చలువను కలిగించే గుణం కూడా చల్దిలో ఉంటుంది. అందువల్ల ఎండాకాలంలోనైతే ఎండ దెబ్బ, వడదెబ్బల బారి నుండి కాపాడి ఔషధంగా కూడా ఉపయోగపడి, జానపదులకు 'చల్ది' అభిమాన పాత్రమైంది. రాత్రి ఆహారాన్ని భుజించకుండా "పేరాకలితో రేయెల్లనున్న కతమున నీకుం జలదివలసి" (3-233) అని, తిక్కన కవి (క్రీ.శ. 1210-90) మహాభారతంలోని శాంతి పర్వంలో చల్దిని గురించి పేర్కోవడం వల్ల, ఇది ఆకలిని చల్లార్చే పుష్టికరమైన ఆహారం, అని విదిత మవుతుంది. పోతన కవి (క్రీ.శ. 1400-50) కూడా ఆకలి బారి నుండి త్వరితంగా ఉపశమింపచేసే ఆహారంగానే కాకుండా రుచికరమైన దానిగా కూడా తన భాగవత కావ్యంలో చల్దిని పేర్కొన్నాడు. "ఎండన్ మ్రగ్గితి రాకటంబడితి రింకేలా విలంబింపగ రండో బాలకులార చల్ది గుడువన్ .......... ఆమంద ప్రీతి భక్షింతమే" (దశమస్కంధం-పూర్వభాగం-493) అని, కృష్ణుడు గోపబాలురతో పలుకగా "మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు ఊరుగాయలు తినుచుండు నొక్క డొకాని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి చూడలేదని నోరు సూపునొక్కడేగు ఆర్గురి చల్దు లెలమి పన్నిద మాడి కూర్కొని కూర్కొని కుడుచునొక్క'' (4-94) డు అంటూ- ఈ విధంగా కృష్ణుడు గోప బాలురతో కలిసి చల్దులు ఆరగించిన ఘట్టాన్ని పోతన అత్యంత సునిశితంగా వర్ణించి కనులకు కట్టించాడు. శ్రీకృష్ణుని చల్దులను పోతన కవి భాగవత కావ్యంలో వర్ణిస్తే, జానపదులు ఒక గేయంగా పాడుకొని కృష్ణుడిపై తమకు గల మక్కువను తెలుపుకున్నారు. ఎందుచేతంటే-శిష్టుల దృష్టిలో కృష్ణుడు భాగవత స్వరూపుడైతే, జానపదుల దృష్టిలో మాత్రం అతడు తమలాగే ఒక శ్రమజీవి. పసులు కాయడం వంటి పనికి గౌరవాన్ని (డిగ్నిటీ ఆఫ్ లేబర్) సమకూర్చిన ఒక గొప్ప వ్యక్తి. అందువల్ల శ్రమైకజీవి అయిన కృష్ణునికి వృత్తి వల్ల ఏర్పడే శ్రమను తొలగించేందుకు, తమ మమకారాన్ని కూడా రంగరించి రుచికరమైన చల్దిని ప్రత్యేకంగా తయారు చేశారు, జానపద మాతలు. "దధి చాల శొంఠి వేసి మృదువుగా కలిపెను చల్ది-మృదువైనా పచ్చళ్లన్నీ చల్దీపై నుంచెను తల్లి-వాక్కాయ వద్దీకాయ ఒప్పయినా మామిడికాయ-ఊరీన అల్లంతోను ఉసిరికాయను ఉంచే- చల్లించిన మిరియపు గెలులూ జన్నువుల పెరుగులతోనూ- అల్లమ్ము ఆవకాయ అనేకం వుంచెను తల్లి" (కృష్ణశ్రీ, స్త్రీల పౌరాణికపు పాటలు- శ్రీకృష్ణుని చల్దులు).

**అంబలి :** గ్రామీణులకు మాత్రమే పరిమితమైన ఆహారం 'అంబలి' పొద్దున్నే కూలి పనులకు పోయే పల్లె వాసులు తమ వెంట అంబలిని తీసుకుపోతారు. దాదాపు సూర్యుడు నడి నెత్తి మీదికి వచ్చే 12 గంటల సమయంలో పొలం ఒడ్డునో, చేలూ చెలకల్లోనో, చెట్ల కిందనో కూర్చొని అంబలిని తాగుతారు. అందువల్ల ఆ సమయం 'అంబటాల' (అంబటివేళ)గా జానపదుల్లో సమయ సూచకంగా స్థిరపడింది. జానపదులు దాదాపు ఇదే సమయాన్ని వేరే సందర్భాల్లో కూడా ఇప్పుడు 'అంబటాల అయింది' అని వ్యవహరిస్తుంటారు. ఆధునికుల్లో ఇది మధ్యాహ్న భోజన సమయాన్ని (లంచ్ టైం) సూచిస్తుంది. అంబలి జానపదుల వ్యవహారంలోనే కాకుండా ప్రాచీన

కవుల కావ్యాల్లో కూడా జానపదుల ఆహారంగానే చోటుచేసుకుంది. శ్రీనాథుడు కర్ణాటక రాజధానిలోని తన అనుభవాలను తెలుపుతూ వాటిలో భాగంగా- "చల్లా యంబలి ద్రావితిన్" అంటూ తన చాటువుల్లో ఒకచోట పేర్కొంటాడు. పనిచేసి గంజి అయినను, అంబలైనను ఎద చల్లగా త్రాగి (9-15) అని, ఒక జానపదుని మనోవేదనను తెలిపే సందర్భంలో కొరవి గోపరాజు (క్రీ. శ.1384-1429) సింహాసన ద్వాత్రింశిక కావ్యం 'అంబలి'ని పేర్కొన్నది . "పొలమంబళ్ళోయుచుంబట్టి పెన్ము సురందీగెడు కాపు గుబ్బెతల" (4-133) అంటూ, పొలానికి అంబలి మోసే కాపు స్త్రీల ప్రసక్తిని శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో తెలియజేశాడు. ఈ విధంగా శ్రామికులకు పరిమితమైన అంబలి వారి ఆకలి, దప్పికలను తీర్చి వారిలో సత్తువను పెంపొందింప చేస్తుంది.

**ఆహారం - నాలుగు విధాలు :** ఏదో ఒక ఆహార వైవిధ్యాన్ని కాకుండా-పప్పులు, అప్పడాలు, వడియాలు, తాలింపు కూరలు, పులుసు కూరలు, బజ్జీలు, జున్ను, పిండివంటలు, పాయసాలు "మొదలుగా ఉచిత వృత్తి నారగింప చతుర్విధాహారములను" (3-50) అంటూ- భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలైన తెలుగువారి నాలుగు విధాల ఆహారాలను పిల్లలమర్రి పినవీరభద్రకవి (క్రీ. శ. 15వ శతాబ్దం-ఉత్తరార్థం) జైమినీ భారత కావ్యం అభివర్ణిస్తుంది. ఇందిర, వేంకటేశ్వరునికి వడ్డించిందని తెలుపుతూ తాళ్లపాక అన్నమాచార్య కవి (క్రీ.శ. 1408-1503) కూడా తన కాలపు వంటకాల్లోని ఎన్నో భేదాలను వర్ణించాడు-"అక్కాళ పాశాలు అప్పాలు వడలు పెక్కైన సయిదంపు వేణులును-మీరిన కెళంగు మిరియపు తాళింపు కూరలు కమ్మని కూరలును-సారంపు పచ్చళ్ళు చవులుగా నిట్టే పిండి వంటలును-పెరుగులు పాలు మెండైన పాశాలు మెచ్చి మెచ్చి-కొండల పొడవు కోరి దివ్యాన్నాలు" ఇలా- అన్నమయ్య కీర్తనల్లో పిండివంటలు, తీపి పదార్థాలు, కూరలు, పచ్చళ్ళు, పాలు, పెరుగు, అన్నం అన్నీ ఉండి, ఈ కింది జానపద గేయాన్ని తలపింపచేస్తోంది- "పప్పు కూరలు మెండు పాయసాన్నములు, బూరెలు, ఘృతములు, పొంగళ్లు కూడ-నవరసాన్నంబులు రాజసపు అన్నంబు, అరటి ఫలములు, బొబ్బట్లు, బూరెలు, వలుపు పప్పులును -కందాను చామాది కాయగూరలును గుమ్మడి వరుగులును బుడమరుగులును-అడవి ఉసిరికాయ ఆవమామిళ్లు కమ్మంగ కాచినా, గోవుల నెయ్యి మీగడా పెరుగులే మంచి మజ్జిగలూ" (కృష్ణశ్రీ, స్త్రీల రామాయణపు పాటలు-సేతు మహత్యం) ఇలా- ముఖ్యమైన భోజన పదార్థాలనే కాకుండా జానపదుల ఉపహారాలను కూడా ప్రాచీన కవులు తమకావ్యాల్లో ఉదాహరించారు. "పాసము అడుకులు చక్కిలంబులున్ బెల్లపు అచ్చులున్ సెనగ బేడులు చిమ్మిలి నువ్వుటుండలన్ అని, పల్లీయ చోటు నుండి" సిరియాలుని మేనమామలు అతనికి తెచ్చిన చిరుతిండ్లను శ్రీనాథుని హరవిలాస కావ్యం వివరిస్తుంది. ఇవి నేటికీ ప్రతి ఊరిలో కనిపించే ఉపాహారాలే. శిష్య సమేతుడైన వ్యాసునికి కాశీ విశాలాక్షి వడ్డించిన వంటకాలలో ప్రాచీన కాలం నుండి నేటికీ వ్యవహారంలో ఉన్న "లడ్డుకంబులు, ఇడ్డెనలు, దోసియలు సేవియలు చక్కిలంబులు మణుగు పువులు, అరిసెలు, అప్పడంబులు, రొట్టియ పచ్చడులు" (7-186) మొదలైన ఉపాహారాలు శ్రీనాథుని కాశీఖండం ద్వారా సాక్షాత్కరిస్తాయి. "వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా" అని, కర్ణాటక రాజధానిలో తనకు కలిగిన చేదు అనుభవాన్ని శ్రీనాథుడు తన చాటువుల్లో పేర్కొన్నాడు. ఇప్పటికీ రాయలసీమలో కొన్ని గ్రామాల్లోని బ్రాహ్మణుల ఇళ్లల్లో-వెల్లుల్లి ముక్కలు, నువ్వుల పిండి, మంచి నూనెలను భోజనంలో కూరగా వడ్డించుకుని తినడం వ్యవహారంలో ఉంది. అది వారికి రుచికరమైన పదార్థం కూడా. వేరే ప్రాంతాల నుండి అతిథులుగా పోయినవారు ఎవరికైనా వీటిని వారు ప్రేమతో భోజన సమయంలో వడ్డిస్తారు. ఆహారపు అలవాట్లు ప్రాంతాన్ని బట్టి విభిన్నంగా ఉంటాయనేందుకు దీనిని ఒక ఉదాహరణంగానే భావించాలి.

**తాటి పండు :** నాగరిక లోకానికి దాదాపు అసలే తెలియనిదీ, జానపదుల్లో కూడా అట్టడుగు వర్గాలకే అమిత ప్రీతిపాత్రమైనదీ అయిన 'తాటిపండు' ను కూడా శ్రీనాథ కవి సార్వభౌముడు వర్ణించి తనకు లోక పరిశీలన పట్ల గల నైపుణ్యాన్ని చాటుకున్నాడు. పల్లెల్లో కూడా తాటి పండును తినడం అనేది అనుభవానికీ, అనుభూతికీ సంబంధించిన విషయం-"హస్తములు రెంట నందంద యదిమిపట్టి తాటిపండారగించెదు తమకమునను" (5-81) అంటూ-రెండు చేతుల్లో అదిమిపట్టిన తాటిపండును తమకంతో తినడాన్ని శ్రీనాథుడు తన కాశీఖండంలో వర్ణిస్తాడు. తాటిపండును తినడం పల్లెవాసులకే అనుభవైక వేద్యం. పల్లెల్లో కూడా శ్రామిక జీవులే దీన్ని తినేందుకు

ఇష్టపడతారు. బాగా మగ్గి, చెట్టు పైనుండి దానంతట అదే రాలిన తాటిపండును మంటలో వేసి ఉడికిస్తారు. తర్వాత దానిపై తొక్కను పూర్తిగా ఊడదీసి నారను నములుతూ అందులోని రసాన్ని జుర్రుకుంటారు. రసం ఉన్న మామిడిపండును పూర్తిగా తొక్క తీసేసి గ్రోలే పద్ధతి ఇందులో కనిపిస్తుంది. తీపి ఉప్పు కలగలుపుగా ఉండి, రుచితో పాటు ఆకలిని కూడా తాటిపండు తీరుస్తుందని, అత్యంత నిరుపేదలైన జానపదులు పేర్కొంటూ తాటిపండు తమకు చేసే మేలును గూర్చి సంపూర్ణంగా తమ సంతృప్తిని వ్యక్తపరుస్తారు.

**ఆహారం-ఔన్నత్యం :** ఈ విధంగా ఆహారం - మనిషికి రుచినీ పుష్టినీ కలిగిస్తూ ప్రాణదాత అవుతుంది. ప్రాంతాన్నీ, కాలాన్నీ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులను, అలవాట్లను, అంతస్తులను, భౌగోళిక పరిస్థితులను అనుసరించి ఎన్నెన్నో రూపాలలో సాక్షాత్కరించడంతోపాటు ఆయా సమూహాల సంస్కృతిని కూడా తెలియజేస్తుంది. 'అన్నం పరమ ధర్మం', 'అన్నం పరబ్రహ్మ స్వరూపం', 'అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పది', 'కోటి విద్యలు కూటి కొరకే' వంటి సామెతలూ, సూక్తులు ఆహారం ఔన్నత్యాన్ని అనాదిగా తెలియజేస్తున్న అంశాలే. మానవులకే కాదు-సకల జీవరాసుల మనుగడకూ మూలాధారం- దివ్య శక్తి స్వరూపమైన 'ఆహారం' మాత్రమే !!

**ఆచార్య తంగెడ కిషన్ రావు**

పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్, ఫోన్ : 7702414100

## కమ్మతెమ్మెర

***మిసిమి*** సంపాదక వర్గానికి సమస్కారం! ***మిసిమి*** లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేయడం ద్వారా వారు సమాజానికి అందించిన సేవలకు మురసిపోతూ నమస్కరిస్తున్నాను. శ్రీ పతివాడ సూర్యనారాయణ గారు నాటక రంగానికి విశేషవంతమైన కృషి సాగించిన మహనీయమూర్తి. రాజమహేంద్రవరంలో గోదావరీ జలాలు త్రాగి-ఆనాటి సాహిత్య కళారంగాలలో స్వరాజ్య సాధనా ఉద్యమాలు చూసి స్ఫూర్తిపొందిన రసహృదయులు. ఆంధ్ర నేతాజీగా కీర్తిని మూట కట్టుకున్న మద్దూరి అన్నపూర్ణయ్య గారి కనుసన్నలలో పెరిగిన కార్యశీలి పతివాడవారు. శతవసంతాలు పండించుకోబోతున్న పతివాడ వారు జీవితాన్ని నాటక కళకు అంకితం చేసిన కళాతపస్వి. యిప్పటికి శరీరం సహకరిస్తే నటించడానికి ఉత్సాహం చూపగల కళాకారుడాయన.




కర్ణాటక సంగీతానికి ద్వారంవంటివారు ద్వారం వారు. పద్మశ్రీ నాయుడు గారు నిత్యమూ కొన్ని గంటల పాటు సాధన చేసేవారు. అదొక మహత్తర తపస్సు సుమా! ద్వారం వారి వారసులందరూ వినయ సంపన్నులైన సంగీత విద్వాంసులు. ద్వారం వారందరూ 107 సంవత్సరాల సముజ్వల చరిత్ర కలిగిన మా భీమవరం త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో పాల్గొని తమ నాదమాధుర్యంతో ముగ్ధుల్ని చేసినవారే! ద్వారం వారితో ఇంటర్వ్యూ మహతీనాదంలా సాగింది. ఇలాంటి ప్రతిభామూర్తులను గురించి చదువుతుంటే మనసు మంచిగంధపు తావిలా పరిమళిస్తున్నది. పత్రికా సంపాదకత్వం కత్తిమీద సామువంటిదే. పత్రికలు ప్రభుత్వాలను నిర్మిస్తాయి. అవసరమైన పక్షంలో కూల్చడానికి కూడా వెనుకాడదు. పత్రికలు పేరు చెప్పగానే కాశీనాధుని నాగేశ్వరరావు గారు జ్ఞాపకం వస్తారు. జనాలకు పత్రికలు చదవడం నేర్పారు. సంపాదకులకు స్వాతంత్ర్యం యిచ్చినవారు. ఆనాటి యాజమాన్యం. యాజమాన్యాన్ని ధిక్కరించి ప్రజాపక్షం వహించిన సంపాదకుల్లో ప్రథములు - ప్రముఖులు నార్ల వారి సంపాదకీయాలు ద్వారా విమర్శలు గుప్పించేవారు. ఆచార్య యన్.జి. రంగ, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు వంటి వారిని సహితము, సాహసోపేతంగా కడిగేసేవారు. అలాంటి సంపాదకులున్నారు. యాజమాన్యం ఒత్తిడితో స్వాతంత్ర్యాన్ని చంపుకుంటున్నారా! కథావశేషులు ఆలపాటి రవీంద్రనాథ్ గారు ఏ ముహూర్తాన ఏ సంకల్పంతో ***మిసిమి*** స్థాపించారో కానీ, వారు మనసులో అనుకున్నట్లుగానే ***మిసిమి*** సర్వాంగ సుందరంగా నిజాయితీతో భారతి మాసపత్రిక తరువాత ***మిసిమి*** చింతనాత్మక సారస్వతంతో విజ్ఞానవంతమైన సాహిత్యాన్ని - పరిశోధకులను - ముచ్చటగా సంపాదకీయాన్ని అందిస్తూ మీ అభిమాన పుస్తకాన్ని నడిపిస్తున్న మీ విజ్ఞాన సంపాదక కళాత్మకతకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. అక్టోబర్ సంచికలో రాజకీయాలలో తలమునకలవుతున్న గాంధీతత్త్వాన్ని వదలని నిస్వార్థ సేవాపరాయణుడు వెంకట కృష్ణారావు గారు ఆంధ్ర-తెలంగాణా ఉద్యమాల తీవ్ర సంక్షోభ సమయంలో సమైక్యంగా నిలిచి, తెలుగు జాతిని ప్రపంచ తెలుగు మహాసభలు వైభవంగా నిర్వహించి జాతిని ఏకీకృతం చేసిన ధన్యజీవి, నిరాడంబరమూర్తి మండలి వెంకట కృష్ణారావు. పాల్కురి సోమన వ్యాసం అద్భుతంగా ఉంది. మన సాహిత్యంలో ద్విపద కావ్యసంపదకు సోమనాథుడు. కాశీ కలదైస్సోప్పు కిల్లాడ వారి బెనారస్ పుస్తకం గురించి శ్రీ హర్షవర్ధన్ వ్యాఖ్యానం కమనీయంగా ఉన్నది. నావంటి వారికి ***మిసిమి*** ప్రాణవాయువులా సహకరిస్తుంది.

***- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184***

# సాహిత్యంలో
## మృత్యుఘంటికలు

– ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి

స్వర్గం, నరకం మీద సాహిత్యం తక్కువేమీలేదు. ఇక ప్రకృతి, మనిషి మీద చెప్పనలవికానంత సాహిత్యం ఉంది. మనిషి చివరి మజిలీ మీద కొంత సాహిత్యం ఉన్నా, శ్మశాన సాహిత్యం తక్కువే. మనిషే పోయాడు, ఇక అతనిమీద సాహిత్యం ఎందుకు అనుకోవడానికి వీలులేదు. నోబెల్‌గ్రహీత, ప్రఖ్యాత ఆంగ్ల రచయిత టి.ఎస్.ఎలియట్ 'గ్లోరీ ఆఫ్టర్ డెత్' అన్నాడు.

ఆంగ్లసాహిత్యంలో ఒక గంభీరమైన, నిరాడంబరమైన పద్యం లేదా పాటను 'ఎలిజీ' అంటారు. స్థూలంగా, మరణించిన ఒకవ్యక్తి లేదా వ్యక్తుల గుణగణాలను కీర్తిస్తూ రాసే పద్యం అది. ఈ ఎలిజీలకు ఆంగ్లసాహిత్యంలో ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ నాలుగు గొప్ప నాటకాలని 'హేమ్లెట్,' 'ఒథెల్లో,' 'కింగ్‌లియర్,' 'మెక్‌బెత్' లను ఎలా పిలుస్తారో, ఎలిజీలలో కూడా నాలుగు గొప్ప ఎలిజీలని గుర్తించారు. అవి థామస్ గ్రే 'ఎలిజి రిటన్ ఇన్ ఎ కంట్రీ చర్చ్‌యార్డ్,' టెన్నిసన్ 'ఇన్ మెమోరియం,' షెల్లీ 'ఎడనైజ్,' ఆర్నాల్డ్ 'థర్సీస్'లను పిలుస్తారు. గొప్ప రొమాంటిక్ కవి జాన్‌కీట్స్ గొప్పతనాన్ని అతని మరణం తరువాత రాసిన ఎడనైజ్‌లో షెల్లీలో వర్ణించారు. అమెరికా కవి వాల్ట్‌విట్‌మన్ ఆ దేశ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ మరణంపై రాసిన 'వెన్ లైలాక్స్ లాస్ట్ ఇన్ ద డోర్‌యార్డ్ బ్లూమ్డ్' గొప్పనివాళి. శ్మశానవాటికల వర్ణన చేసిన కొంతమంది కవులను గ్రేవ్‌యార్డ్ (స్మశాన) కవులని పిలుస్తారు. అందులో థామస్ గ్రే, రాబర్ట్‌బ్లయర్, ఎడ్వర్డ్‌యంగ్‌లు గొప్పవారు.

1751లో ప్రచురితం అయిన 'ఎలిజీ రిటన్ ఇన్ ద కంట్రీ చర్చ్‌యార్డ్' అనే ఒక కవిత, గ్రామంలోని శ్మశానవాటికలో కూర్చుని చనిపోయిన సామాన్యుల జీవితాల గురించి రాస్తూ, మరణం అందరిని ఏకత్రాటిపై తెస్తుంది అంటాడు థామస్ గ్రే. మనిషి జననం వెండి చెంచాతో ప్రారంభమైనా, పురిపాకలో ప్రారంభమైనా, కరవాలాలు తిప్పినా, కట్టెలు ఏరుకున్నా, ముగింపు మాత్రం తేడాలేకుండా ఉంటుంది.

ఒక సంధ్యాసమయాన గ్రామీణ స్మశానవాటిక సమాధులను చూస్తూ, ఓ పేదరైతులారా మీరు ఈ భూమి మీదకు ఎంత ప్రశాంతంగా వచ్చారో అంతే ప్రశాంత జీవితం గడిపి తిరిగి వెలిపోయారు. నిజానికి మీకూ సరైన అవకాశాలు ఉండి ఉంటే చక్రవర్తులు అయి ఉండేవారు. అయినా ధనవంతునికి, పరిపాలకునికి ఉన్న ఇబ్బందులు మీరు పడలేదు. అందుకే ధన్యులు. అసలు మీకు సరైన అవకాశాలు వచ్చి ఉంటే గొప్ప పరిపాలకుడు హేమ్టన్ లేదా రచయిత మిల్టన్ అంతటివారు అయుండేవారు అన్నాడు గ్రే.

అయినా మీరెంతో ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటున్నారు అని కవి అంటూ, షేక్స్‌పియర్ 'సింబలిన్' నాటకంలో ఫ్యూనరల్ స్పీచ్‌లో (అంత్యక్రియల ప్రసంగం) మొదటి వాక్యం 'ఫియర్ నో మోర్ ద హీట్ ఆఫ్ ద సన్'ను గుర్తుకుతెచ్చాడు. ఇమోజిన్ చనిపోయిందని భావించి గిల్డిరస్, అర్‌విరగస్‌లు ఆమె పార్థివశరీరాన్ని చూసి మానవజీవితంలో ఉన్న కష్టాలన్నీ నీకుపోయాయి. ఇక మీదట ఎండ, చలి, వాన నీకు ఎంతమాత్రం ఇబ్బంది పెట్టలేవు అంటారు.

గ్రే చేతిలో గ్రామీణులు గాని, షేక్స్‌పియర్ చేతిలో ఇమోజన్‌గాని ఘననివాళి అందుకున్నారు. ఇదేబాటలో బ్రూటస్ చేతిలో వెన్నుపోటుకు గురైన జూలియస్ సీజర్‌ని కూడా మార్క్ ఏంటోని రోమన్ మూకల మనసులను సరిగా అంచనావేస్తూ పొగిడాడు. ఆంగ్ల సాహిత్యంలో అంత్యక్రియల ప్రసంగాలది ఒక ప్రత్యేకతే.

‘చనిపోయిన వాని కళ్ళు చేరెడు’ అనేది తెలుగుసామెత. తెలుగు సాహిత్యంలో మాన్యాల కోసం బతికి ఉన్న ప్రభువులను నాలుగుముక్కలు పొగిడిన వారే ఎక్కువ. మా నాయన పోయాడు అతన్ని కీర్తించి రెండుముక్కలు రాయండి అని అడిగే పాలక కుమారులు దాదాపుగా కనిపించరు. ఇకపోతే మన రచనలలో పోయినవారికి అంకితాలు తక్కువే. వారిపేరున భవనాలు, బొమ్మలు ఎక్కువ, సాహిత్యం తక్కువ. ఆంగ్లకవులు ఏకంగా స్మశానకవులు అని పేరుపెట్టుకుంటే, మనవాళ్ళు అలా పిలిపించుకోవడానికి ఎంతో భయపడిపోతారు. కాని తెలుగు సాహిత్యంలో కూడా శ్మశానాన్ని తమ కవిత్వంలో అద్భుతంగా కీర్తించినవారు లేకపోలేదు. అందులో ముందువరసలో గుర్రం జాఘువా, బలిజేపల్లి లక్ష్మీకాంతం కనిపిస్తారు. హార్మోనియం శబ్దంలో అది ఆడగొంతైనా, మగగొంతైనా ‘ఇచ్చోటనే....’ అనే పద్యం పాడితే తెలుగు ప్రేక్షకులు అటు చెవి వగ్గేస్తారు. ఆ పద్యంలో కవిత్వం, హార్మోనియంలో ట్యూన్, పాటకుని గాత్రం ఇట్టే కట్టిపడేస్తాయి. జాషువా శ్మశానవాటికను వర్ణించినతీరు ముందు ఆంగ్లస్మశానకవిత్వం దిగదుడుపు.

‘ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గరిగిపోయే...’ తెలుగు ప్రాంతాలలో ఒకవ్యక్తి చనిపోతే అతనికి ఇష్టమైన వస్తువును చేతిలో పెట్టి చితిపైన ఉంచుతారు. మరి కవిగారికి కలంకంటె ఎక్కువ ఇష్టమైన వస్తువేమి ఉంటుంది. ఇచ్చోటనే అదే కలం, అతనితో పాటు నిప్పులలో కరిగిపోయిందంటారు జాషువా. ‘ఇచ్చోటనే భూములేలు రాజున్యుని యధికార ముద్రికలంతరించె!’ కవి చమత్కారంగా ప్రజలనేలు రాజు అనకుండా భూములేలు రాజులన్నాడు. భూమికోసం నరమేధం సృష్టిస్తున్న రాజులను చూసి ‘దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్’ అన్నాడు గురజాడ. ఏదైతేనేం నామాటే శాసనం అన్న రాజు కూడా ఈ శ్మశానంలో కూలిపోయాడు అన్నాడు జాషువా.

‘ఇచ్చోటనే లేత ఇల్లాల నల్లపూసల సౌరు గంగలోన గలసిపోయే...’ లేత ఇల్లాలు అనే పదం నాటి వివాహ వ్యవస్థకు అద్దం. నల్లపూసల సౌరు సింబలిక్. ‘ఇచ్చోటనే ‘పేరెన్నికం గనుగొన్న చిత్రలేఖును కుంచెయు నశించిపోయే’. కళాకారుని వదిలేయడం సరికాదన్నది జాషువా ఆలోచన. కవి, రాజు, ఇల్లాలు, కళాకారుడు అంతరించిపోయే స్థలం ఇదే అంటారు కవి. తొలి ఆంగ్లరచనగా భావించే ఛాసర్ రాసిన ‘కాంట్రబరీ టేల్స్’ మన మధిర సుబ్బన్న రాసిన ‘కాశీమజిలీ కథలు’ను పోలి ఉంటాయి. కాంట్రబరీ అన్నది ఇంగ్లండ్ కాశీ. కాశీని వర్ణిస్తూ రాసిన కవిత్వం మనదగ్గర జాస్తిగానే ఉంది. సత్యహరిశ్చంద్ర నాటకం కోసం బలిజేపల్లి లక్ష్మీకాంతం రాసిన పద్యాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలుగురాష్ట్రాలలో సత్యహరిశ్చంద్ర నాటకానిది ఒక ప్రత్యేకత. సత్యాన్ని నిలబెట్టడానికి రాజాహరిశ్చంద్రుడు చివరికి శ్మశానవాటికకు కాపలాదారు అవుతాడు. మార్కండేయ పురాణంలో సత్యహరిశ్చంద్రుడు అయోధ్యకు రాజుగా పరిపాలిస్తుంటాడు. దేవేంద్రుని సభలో వశిష్టుడు మూడులోకాల్లో సత్యం తప్పక పలికేవాడు భూలోకంలో సత్యహరిశ్చంద్రుడు అన్న ప్రభువు ఉన్నాడంటే తను నమ్మనని విశ్వామిత్రుడు అంటాడు. అతడు పెట్టే పరీక్షలో హరిశ్చంద్రుడు చివరికి కాటికాపరి అవుతాడు. కాటి సుంకం చెల్లించనిదే స్వంత కుమారుని దహనాన్ని సైతం అనుమతించనని భార్యతో తెగేసి చెబుతాడు. చివరికి రాజు ఆజ్ఞతో తప్పు చేయలేదని తెలిసినా భార్యను శ్మశానంలో వధించాలని కత్తి ఎత్తుతాడు. సత్యహరిశ్చంద్ర నాటకంలో ‘కాటిసీన్’ ఎంతో ప్రజాదరణ పొందింది. శ్మశానవాటికిన జరిగిన ఆ సంఘటన కవి ఎంతో హృద్యంగా చిత్రీకరించాడు.

అటు ఆంగ్లమైనా, ఇటు ఆంధ్రమైనా శ్మశాన కవిత్వం గమ్మత్తుగానే ఉంటుంది. మతాలను బట్టి శ్మశానాలు మారినా, ఆచార వ్యవహారాలు వేరైనా సాహిత్యంలో విశ్రాంతిపుట రుద్రభూమిదే. మహాత్ముల శ్మశానాలు పవిత్ర దర్శనీయస్థలాలుగా కొలిచే సంస్కృతి ఉంది. అగ్నిమంటలో ఆహుతి అయిపోతున్న ఆ లేత ఇల్లాలిని చూస్తే ఏ మనసు ద్రవించదు! శ్మశాన కవిత్వం అందించే సందేశం అదే. చివరికి మిగిలేది బూడిద అని తలచేవారు, కోరికలు అణుచుకుని ప్రశాంతమైన జీవితాన్ని అనుభవించి, శరీరం నుండి ఆత్మను సులభంగా వదిలేస్తారు.

షెల్లీ, ఎడినోయిస్ అశ్వినీకుమార్ తెలుగు చేసి, డాక్యుమెంటరీ చేసారు.

**ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు,
ఫోన్ : 9849254826

# బిహారీలాల్ విహంగావలోకనం

– కోదూరి పుల్లారెడ్డి

బిహారీలాల్ క్రీ.శ. 1595లో గ్వాలియర్ సంస్థానంలోని 'బసువా గోవిందపురం' గ్రామంలో ఆ ఆ గ్రామవాసుల జన్మజన్మల పుణ్యఫలంగా జననమందాడు. ఆయన బాల్యమంతా 'బుందేల్‌ఖండ్'లో గడిచింది. యౌవనంలో మధురలోని అత్తగారింట్లో గడిపాడు. అక్కడున్నప్పుడే బిహారీలాల్ మొగల్ చక్రవర్తి షాజహాన్ (1592-1666) రాజాస్థానాన్ని సందర్శించటం సంభవించింది. చక్రవర్తి బిహారీలాల్ సాహిత్యౌన్నత్యాన్ని గ్రహించి ఆగ్రాలో స్థిరనివాసమేర్పరచుకొని తన పరిపాలనలో ఉండమని ఆహ్వానించాడు. ఆ ఆదేశాను సారంగా బిహారి ఆగ్రాలో ఉండిపోయాడు. అక్కడే పర్షియా భాష నేర్చుకున్నాడు. మరొక కవి అబ్దుల్ రహీంతో పరిచయమేర్పడింది. క్రీ.శ. 1611 నుండి 1667 వరకు జైపూర్ దగ్గరున్న అంబర్ సంస్థానాన్ని పాలించిన రాజా జయసింహ్ బిహారిని తన ఆస్థానానికి ఆహ్వానించాడు. బిహారీలాల్ ఆ ఆహ్వానానికి అంగీకరించాడు. భార్య గోలోకం చేరాక బిహారి మధురకు వెళ్లి అక్కడే క్రీ.శ. 1663లో గోలోకవాసి అయ్యాడు. జయసింహ్ ద్వితీయ వివాహం చేసుకొని రాచకార్యాలను విడిచి సమయమంతా ముద్దుల చిన్న భార్యతో గడిపేవాడు. మంత్రులు రాజు ప్రవర్తనకు చింతించడం తప్ప ఆయనకు తన తప్పిదాన్ని తెలియజేసే సాహసం చెయ్యలేకపోయారు. అప్పుడు బిహారీ ఆ బాధ్యతను తీసుకొని ఈ క్రింది దోహాను రాజుకు పంపించాడు–

**నహిఁ పరాగు, నహిఁ మధుర్ మధు, నహిఁ బిరోసు ఇవా కాల్**
**అలీ కలీ హి సౌఁ బంధ్యేఁ ఆగై కౌన్ హవాల్ ॥**

**భావం :** అక్కడ పుప్పొడి లేదు, మధుర మధువు లేదు. పుష్పం ఇంకా వికసించలేదు. మొగ్గ దశలోనే ఉంది. మధుపం ఆ కలికనే ఇష్టపడితే ఆ కలిక పూర్తిగా వికసించినప్పుడు ఏమవుతుందో ఎవరికెరుక? ఈ దోహ చదివిన రాజు తన తప్పు గ్రహించి రాచకార్యాలపై తిరిగి శ్రద్ధ వహించాడు. ఆనాటి నుండి రాజు బిహారీని దోహాలు రచించమని ప్రతి దోహాకు ఒక బంగారు నాణెం బహూకరించి ప్రోత్సహించేవాడు. ఈ క్రింద కనబరచిన 10 రచనలు హిందీ సాహిత్యానికి ప్రతినిధులుగా నిలుస్తాయని సాహితీవేత్తలు తీర్మానించారు.

**రచన :** 1. పథ్వీరాజ్ రాసో, 2. సూర్ సాగర్, 3. పద్మావత్, 4.రామ్‌చరిత్ మానస్, 5. బిహారీ సత్ సఈ, 6. ప్రియ ప్రవాస్, 7. సాకేత్, 8. కామాయిని, 9. ఊర్వశి, 10. దీప్‌శిఖ

బిహారీసత్ సఈ కావ్యానికి ఇప్పటివరకు 52 టీకలు వచ్చాయి. హిదీ సాహిత్యంలో ఏ గ్రంథానికీ ఇన్ని టీకలు వెలువడలేదు. 1923లో ప్రచురింపబడిన శ్రీ జగన్నాథ దాస్ రత్నాకర్ టీక ప్రశస్తమైనది అని హిందీ సాహిత్యకా ఇతిహాస్ రచించిన రామచంద్ర శుక్ల్ అన్నారు. ఈయనే హిందీ సాహిత్య కాలాన్ని ఆదికాల్, వీరగాథాకాల్, భక్తికాల్, రీతికాల్, ఆధునిక కాల్ అని కాలవిభజన చేసారు. ఈ విభజనను హిందీ సాహితీ లోకం ఆమోదించింది. ఈ కాల విభజన ప్రకారం బిహారీలాల్ 'రీతికాల్'లో ఇముడుతారు. జగన్నాథ్‌దాస్ రత్నాకర్ బిహారీ సత్‌సఈకి టీక వ్రాసేటప్పటికి 5 టీకలు మాత్రమే బహుళ ప్రచారంలో ఉండేవి. ఒక టీకలోని దోహాలకిచ్చిన అర్థం మరొక టీకలో మరోవిధంగా ఉండేది. మూల దోహాలలో కూడా తేడాలుండేవి. అందువల్ల జగన్నాథ్ దాస్ రత్నాకర్ బిహారీసత్‌సఈకి శుద్ధపాఠం సంతరించాలని 1921లో ప్రారంభించి 1923లో పూర్తి చేసాడు. దోహాలు మొత్తం 713 అని తేల్చి ప్రతి దోహాకు టీకతో వ్యాఖ్య వ్రాసాడు.

బిహారీసత్‌సఈ సంస్కృతంలోకి రెండుసార్లు, ఆంగ్లంలోకి మూడుసార్లు – పెంగ్విన్ ప్రచురణ, డా. శ్యామ్ సుందర్ దు ఆ, దేవీదాస్ ప్రీతమ్ అనువదించారు – సత్‌సఈ దోహాలకు 'రాధవా' అనే చిత్రకారుడు బొమ్మలు గీశాడు. హిందీ సాహిత్యంపై గాఢమైన అవగాహనగల డా. జి.ఎ. గ్రియెర్‌సన్ ఐరోపా దేశభాషల్లో సత్‌సఈతో పోల్చదగిన గ్రంథమే లేదన్నారు. రివె. ఎడ్విన్ సత్‌సఈలోని పదాలను కవి ఎంతో చతురతతో ప్రయోగించారు అన్నాడు.

బిహారీసత్‌సఈ ప్రధానంగా శృంగార కావ్యం, అష్టనాయికాభేదాలు, త్రివిధనాయికల వర్ణనలు ఈ దోహాలలో ఛాయా మాత్రంగా దర్శనమిస్తాయి. రసం, **(रस)** శబ్దశక్తి, ప్రసంగ విధానం, భాష మొదలైనవన్నీ పరిపూర్ణంగా అగుపిస్తాయి. అక్కడక్కడ రాజకీయాల ప్రస్తావన, ప్రకృతి వర్ణనలు చోటుచేసుకున్నాయి. అయితే అవన్నీ లఘు శకలాలు మాత్రమే! సత్‌సఈ చదివినవారు వారందరు సంతుష్టాంతరంగులవుతారన్నది శతాబ్దాల నుండి ప్రచారంలో ఉన్న సత్యం! హిందీ సాహిత్యరంగంలో ప్రముఖ గ్రంథాలుగా పరిగణింపబడే 10 గ్రంథాలలో ఒకటిగా ఎంపిక చేయబడిన *బిహారీసత్‌సఈపైన* విహంగ వీక్షణం చేద్దాం రండి!

1. బిహారీసత్‌సఈలో కనిపించే రసవ్యంజన (భావ వ్యక్తీకరణ) సంపూర్ణ వైభవం బిహారీ అను భావ విధానాలలో అగుపిస్తుంది.

**లలను-చలను సుని చుపురే రహీ, బోల్ ఆపు న ఈఠి।**
**రాఖ్యే గహి గాఢైఁ గరైఁ మనౌ గల్‌గలీ ఉఠి॥**

**నేపథ్యం :** ప్రేమ పరిపూర్ణ మానసంతో నాయకుడు తాను పరదేశ గమనాభిలాషినాడునని ప్రియురాలికి తెలియజేసాడు. అది విని వెంటనే గాఢంగా ప్రేమించిన నాయిక స్థబ్దురాలై కన్నీరు కాల్వలు కట్టగా రోదించింది. అప్పుడామె ఆలోచన ఈవిధంగా ఉంది. "ప్రియుడు కంటతడిపెట్టి ఉన్నాడు. ఆ స్థితిలో తాను సాంత్వన వచనాలు పలకకపోతే అతడికి ఇంకా అమితంగా బాధ కలుగుతుంది" అని నిశ్శబ్దం వహించింది. నాయిక ఈ స్థితిని గమనించిన ఒక సఖి మరొక సఖితో అంటున్నదిలా – "అశ్రుతప్తుడైన నాయకుని చూచిన నాయిక కంఠ మార్గాన్ని నిరోధించటం వల్ల ఆమెకు నోట మాట రావటంలేదు!"

**భావం :** ప్రియుడు పరదేశం వెళ్లవలసి వచ్చిందన్న విషయం నాయిక ప్రియుని ముఖతః విని మ్రాన్పడిపోయి తన సానునయ వాక్యాలు తెలుపలేకపోయింది. బహుశ ప్రియుని అశ్రుపూరిత నయనాలు ఆమె కంఠాన్ని రుద్ధపరచాలు కాబోలు! ఇదంతా గమనిస్తున్న ఒక సఖి మరొక సఖితో అంటున్నదిలా.

2. పరిస్థితిని వివరించటానికి బిహారీ భావ వ్యంజన, రసవ్యంజనలపై ఆధారపడ్డం సర్వసామాన్యం. పోతే వస్తు వ్యంజనపై ఆధారపడటం కొండొకచ్ కద్దు!

**ఛాలే పరిచే హైఁ డరను సకై న హాథ్ చునా ఇ।**
**ఝు ఝు క త్ హియైఁ గులాబ్ కైఁ ఝంవా ఝఁవైయత్ పా ఇ॥**

**నేపథ్యం :** నాయిక పదసౌకుమార్య వైభవాన్ని నాయకునికి ఒక సఖి వర్ణించి చెబుతున్నది.

**భావం :** నాయిక తన సుకుమార పదద్వయాన్ని తన మొరటు చేతులతో తాకితే ఎక్కడ బొబ్బలెక్కుతాయోనని భయపడి సంకోచిస్తూ గులాబీ పొదలలోకి జొనిపింది – అయినా పాదాలు కందిపోయాయి..

**ఒక పాఠకుని సందేహం :** గులాబీ పొదరింటి ముళ్లు గుచ్చుకోవా?

3. వ్యంగ్యార్థం స్పష్టం చేయటానికి బిహారీ చాలా సందర్భాలలో క్లిష్ట కల్పనలపై ఆధారపడటం జరిగింది.

**నయైఁ చిరహ్ బఢతీ బిథా ఖరీ బికల్ జిమ్ బాల్।**
**బిలఖీ దేఖ పరోసిన్యేఁ హరఖ హఁసీ తిహిఁ కాల్॥**

**నేపథ్యం :** నాయికకు క్షణక్షణం విరహం తారాస్థాయి నందుకుంటుంటే వికలమనస్కురాలైంది. అనుభవ రాహిత్యం వల్ల లజ్జ, అజ్ఞానాలకు లోనై నాయకునికి సందేశం పంపిగాని, లేఖనం పంపిగాని తన విరహ ప్రకటనచేసి నాయకునికి చేరువ కావటం తెలియక దుఃఖాన్ని దూరం చేసుకోవటమెలా? అని ఆలోచిస్తూ ఉంది. ఇంతలో ఆమె ప్రక్కింటావిడ తనలాగే విరహానలంలో వేగిపోతూ విలపిస్తూందని తెలుసుకొంది. కానీ ఆ ప్రక్కింటావిడ చతుర అయినందువల్ల తన ప్రియునికి ఏదో ఒక సంకేతం ద్వారా దగ్గరవుతున్నది. తానుసైతం ఆ మార్గాన్నవలంబిస్తే ప్రియసాంగత్యం లభిస్తుందని సంతోషిస్తూ ఉంది.

**భావం :** విరహ వ్యథలో మలగిపోయే నాయిక పొరుగింటావిడ కూడ ఇదే స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉండటం తెలుసుకొని సంతోష పడుతుంది. ప్రియుని కలవానికి సందేశం పంపటం గూడ తెలియని అమాయిక నాయిక. పొరుగింటావిడ ప్రియసమాగమం కోసం ఏ పద్ధతి అవలంబిస్తే తానుకూడా అదే పద్ధతిని అనుసరించ వచ్చునని ఆలోచనలు సాగిస్తూ సాంత్వన పొందుతూ ఉంది.

4, బిహారీ సందర్భోచితంగా ఎంతో నైపుణ్యంతో అలంకారాలు ప్రయోగించగలడు.

**దృగ్ ఉర్‌ఝుత్, టూటత్ కుటుమ్ జురత్ చతుర్-చిత్త ప్రీతి ।**
**పరతి గాఁఠి దుర్‌జన్ - హి హైఁ ద ఈ న ఈ యహ్ రీతి ॥**

**నేపథ్యం :** ఒక పరకీయ తన తర్కవితర్కాలను సఖులతో పంచుకుంటుంది.

**భావం :** తెలిసి తెలిసి ప్రేమ మాయలో చిక్కుకుపోవటం సామాన్యంగా జరుగుతుంటుంది. కాని ఇది తెగిపోని కుటుంబ వ్యవహారం వంటిది. చతురుల మనస్సులు ఏకం కావటానికి అనుకూలంగా ఉంటాయి. జతపడుతూ ఎన్నో హృదయాలకు గట్టి బంధం పడుతుంది. హే భగవాన్! ఇదొక క్రొత్త పద్ధతా? అంటే ఏ వస్తువైతే చిక్కుల్లో పడుతుందో అది మళ్లీ వేరు పడుతుంది, మళ్లీ అతుక్కుంటుంది – గట్టిగా ముడికూడ పడుతుంది. కాని ఈ ప్రక్రియ ప్రేమ వ్యవహారంలో భిన్నం.

5. ఒకటి రెండు సందర్భాలలో బిహారీ చేసిన వ్యంగ్యాలంకార ప్రయోగం హృద్యంగా ఉంది.

**కరె చాహ్ సౌం చులుకి కై ఖరైం దడౌహైం మైంన్ ।**
**లాబ్ నవాఇం తరఫరత్ కరత్ ఖుద్ స్ నైస్ ॥**

**నేపథ్యం :** ఒక మధ్యంతర నాయిక (మధ్యంతర నాయిక అంటే Intermediate Heroine లేక Interim Heroine అని అర్థం. దీనిని సాధారణంగా ఒక సినిమా లేదా నాటకంలో ప్రధాన నాయిక పాత్రకు ముందు లేదా ఆ తర్వాత వచ్చే నాయిక పాత్రకు ఉపయోగిస్తారు. కొన్నిసార్లు ముఖ్యంగా ఒక కథలో ప్రధాన నాయిక పాత్ర లేనప్పుడు లేదా ఆమె స్థానంలో తాత్కాలికంగా ఎవరైనా వచ్చినప్పుడు ఒక తాత్కాలిక నాయిక పాత్రను కూడా సూచిస్తుంది.) ప్రియుని దర్శించాలనే కోరిక ద్విగుణీకృతం కావటంతో బిడియంతో మనస్సును స్వాధీనంలో ఉంచుకోవటానికి నేలచూపులు చూస్తూ ఉంది. ఇది గమనించిన ఒక సఖి ఇంకొక సఖితో నాయిక అవస్థను కదంతొక్కే అశ్వంతో పోల్చుతూ ఉంది.

**భావం :** మరుని వలలో చిక్కుకొన్న నాయిక మనస్సులో అంతులేని కోర్కెలు పరుగులు తీస్తున్నాయి. అప్పుడామె దృక్కులు బిడియంతో క్రిందికి వంగుతూ ఆమె కోర్కెలు అదుపులోకి తెస్తున్నట్లున్నాయి. ఈ ప్రక్రియ అంతా అశ్వం కదను త్రొక్కినట్లున్నది.

6. బిహారీ శృంగార భావనలు మనస్సుకు హత్తుకొనేటట్లు వర్ణించటం సహృదయ పాఠకుల నోట పలుమార్లు వెలువడటం గమనార్హం.

**సఘనకుంజ్ – ఛాయా సుఖిర్ సీతల్ సురభి – సమీర్ ।**
**మను హ్వైం జాతు అజౌం వహైం ఉహి జమునా కే తర ॥**

**నేపథ్యం :** శ్రీకృష్ణుడు గోకులం నుండి మధురకు వెళ్లిపోయిన తర్వాత విరహంలో కొట్టుమిట్టాడుతూ బెంగపడిన కొందరు గోపికల సంభాషణ ఇది.

**భావం :** యమునా నది ఆవలి తీరంపై శ్రీకృష్ణునితో మనోరంజకంగా విహారాలు సలిపాము. ఇప్పుడు గోపికా మానసచోరుడు అందుబాటులో లేనందువల్ల చింతిస్తూ పొదరింటి చిక్కని నీడల్లో, సురభిళాత్తమలయానిలంలో జారుకుంటూ దుఃఖాన్ని శీతలంగా భావిస్తున్నారు.

7. చక్కని కావ్య రచన చేయటమే కాక బిహారి ఎన్నో సూక్తులు కూడా వల్లించాడు. అందులో నీతిదాయకమైనవి ఎక్కువ.

**కనకు కనక్ తై సౌగునే మాదకతా అధికా ఇ ।**
**ఉహి ఖాఇ బేరాఇ ఇహి పాఐ హి బేరాఇ ॥**

**నేపథ్యం :** కవి ప్రస్తావించిన సామెత – స్వర్ణం అంటే ధనం. ఉమ్మెత్తకాయలు తింటే కలిగే మత్తుకంటే ఎక్కువ మత్తు కలగజేస్తుంది.

**భావం :** ఉమ్మెత్తకాయలు తినిన ధనవంతునికి కలిగే ఉన్మాదం కంటే కండబల గలవానికి ఉండే ఉన్మాదం మరింత ఎక్కువ.

8. ఉదాసీనతలో శృంగారం.

**మైం మిసహా సోయౌ సమఝి ముంహు చూమ్యౌం ఢిగ్ జాఇ ।**
**హన్స్యౌం ఖిసాని గల్ గహ్యౌం రహీ గరైం ల ప టా ఇ ॥**

**నేపథ్యం :** ప్రణయ కలహానికి నాయిక అడ్డు చెబితే నాయకుడు కోపగించుకొని కపట నిద్ర నటించాడు. మనసు మార్చుకున్న నాయిక ప్రియుని సమీపించి తన చర్య, దాని విపరిణామం తన సఖికి వివరిస్తుంది.

**భావం :** “సఖీ! రాత్రి నాకు ప్రియునితో ఒక విలక్షణమైన తంతు జరిగింది. నా ప్రియుడు నిద్రపోయాడనుకొని అతడిని ముద్దు పెట్టుకున్నాను. కపటనిద్ర నటిస్తున్న నా ప్రియుడు మేల్కొని నవ్వాడు. నేను సిగ్గు పడినాను. అప్పుడాయన నా మెడ చుట్టూ చెయ్యి వేసి, నన్ను చుట్టేసి నా తత్తరపాటును పోగొట్టినాడు.

బిహారీసత్‌సఈలో అల్పాక్షరాల్లో అనల్పార్థముంది. దీన్నే హిందీలో *గాగర్ మే సాగర్* అంటారు.

**కోడూరి పుల్లారెడ్డి**
బి.ఎ., బి.ఇ., ఎఫ్.ఐ.ఇ., రాష్ట్రభాషాప్రవీణ,
సూపరింటెండింగ్ ఇంజనీరు (ఎలక్ట్రికల్), రిటైర్డు,
హైదరాబాద్, సెల్ : 9963352172

# బోంబే జర్నల్

**బో**స్టన్ నుంచి అనీల్ వచ్చి – బాబాయి – మనం బొంబాయి వెళ్తున్నాం అన్నాడు. అంతే చెరోదారినా విమానాశ్రయానికి చేరాం – అక్కడ తంతు ముగిసిన తర్వాత – దాదాపు కిలోమీటరు స్టార్ షాపులన్నీ చూసుకుంటూ గేట్ 113కి చేరాను. కబుర్లు చెప్పుకుంటూ ఫోటోలు తీసుకుంటూ సమయం గడిచిపోయింది – గేటు తీసి బోర్డింగ్ అన్నారు. అలవాటు ప్రకారం వరుసలో నుంచున్నాను – బాబాయి – అని చేయి పట్టుకుని ముందుకు తీసుకుపోయి బోర్డింగ్ పాస్ చూపించి బస్సెక్కించాడు. నువ్వు ఎస్‌సి – నేను నీ అసిస్టెంటుని అని నవ్వాడు – ముందుగానే – ముందు సీట్లు తీసుకున్నాం – (అన్నింటికీ డబ్బులే). 10 నిమిషాల్లో నిండిపోయింది. మనుషులకంటే పెట్టెలే ఎక్కువుంటాయి. 10.30ని॥లకే బయలుదేరాలి – కాని ఏదో జరుగుతోంది. ఇంతలో ఎయిర్ హోస్టెస్ ఎవ్వరైనా డాక్టర్లున్నారా? అని అడిగితే – ఇద్దరు లేడీ డాక్టర్లు లేచి వచ్చారు. ఇద్దర్నీ వెనక్కు తీసుకువెళ్లి ఒక పాసింజర్ని చూపితే – హి ఈజ్ ఫుల్ డ్రంక్ అని వచ్చేశారు. ప్రొద్దున్నే తాగేవాడు తాగుబోతే! అతన్ని మీరు దిగితే మంచిది అన్నారు – నేను దిగను – అన్నాడు – కెప్టెన్‌తో మాట్లాడి – తీసుకు వెళ్లటానికి నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత నేను ఫ్లై చేయను – దింపేయమన్నాడు. మళ్లీ మొదలు – అతన్ని, హ్యాండ్ లగేజ్ దింపారు – ఎలా? పదిమంది సెక్యూరిటీ వాళ్లు నిలబడితే – భయపడి – బయటకు వెళ్ళాడు – మరి అతని చెకిన్ లగేజి? అది తీయాలంటే చాలా సమయం పడుతుంది – ఆ మాట పైలెట్ చెప్పాడు – ఆప్రాసెస్ జరుగుతుండగా సెక్యూరిటీ వాళ్లు అతనేమైనా బాంబు పెట్టాడేమోనని – తలమీది పెట్టెలన్నీ చూశారు. ఒక పెద్దాయన కాక్‌పిట్‌లోకి, దూసుకు వెళ్లాడు (డోర్ తీసేవుంది) అరవటం మొదలుపెట్టాడు – పైలెట్ నెమ్మదిగా – మీరు దిగిపోతారా? అన్నాడు. అంతే కిక్కురుమనకుండా వెళ్లి కూర్చున్నాడు – ఇలాంటి సీన్లు – నేను నా ప్రయాణాల్లో ఎక్కడా చూడలేదు – మనకు ఎండ ఎక్కువ – ఓర్పు తక్కువ! సరే అప్పటికి తాగుబోతు పెట్టె దించారు. మనం బయల్దేరుతున్నాం అని ప్రకటించారు. ఎటిసి కూడా అనుమతి ఇచ్చినట్లుంది. ఇది ఎయిర్ బస్ 321 నియో – మెల్లగా వెనక్కి తోశారు. ఆ తర్వాత టాక్సీయింగ్ ఎంటర్ 27ఆర్ రన్ వే, స్పీడ్ అప్ టు 200 కి.మీ – టేకాఫ్ – ఇది 1 గం–20 ని॥ల ప్రయాణం – కాని బోంబే 1 గం॥లో చేర్చాడు పైలెట్ – హైదరాబాద్ లేట్ అలా కొంత కవర్ చేశాడు – ప్రయాణంలో అడిగితే డబ్బులడగకుండా, మంచినీళ్లిచ్చారు! ఛత్రపతి శివాజీ విమానాశ్రయం పేరు గొప్ప – అంతే! మాకోసం రోహన్ – కజిన్ పింకీ చూస్తున్నారు. పింకీ భిలాయ్ నుంచి వచ్చింది – మాది హ్యాండ్ లగేజ్ – రోహన్ కారు దగ్గరకు వెళ్లాం – అది బ్లాక్ 4 మాటిక్ మెరిసిడీస్ కొత్తది తళతళలాడుతుంది. శనివారం ట్రాఫిక్ తక్కువగానే వుంది – బే బ్రిడ్జి మీదుగా వోర్లి వచ్చి లోథా వరల్డ్ 1కి చేరాం. అదేదో సెవెన్ స్టార్ హోటల్‌లా వుంది. ఎలివేటర్ 40 సెకెండ్లలో 42వ అంతస్తులో దింపింది. తాళాలు కూడా హైటెక్కే. రోహన్ ఫ్లాట్ ఈ మధ్యనే కొన్నట్టున్నాడు – పద్దెనిమిది కోట్లన్నట్లు గుర్తు – వోర్లి అంటే ప్రైమ్ ఏరియా బోంబేలో. చిన్న బాల్కనీవుంది. చుట్టూ క్రేన్‌లు రకరకాలుగా పనిచేస్తున్నాయి. మేమున్నది 42 – పైన ఇంకా పది వున్నాయి. ప్రక్కనే 75 ఫ్లోర్‌లు. ఎదురుగా – హార్దిక్ పాండ్య 32 ఫ్లోర్ బిల్డింగ్. రెండు భవనాల తర్వాత – రోహిత్ శర్మ ప్రాపర్టీ 40–50 ఫ్లోర్. ఈ వోర్లీ అంతా వి.ఐ.పిలే. ఆరోజు సాయంత్రం మెరైన్ డ్రైవ్‌కి వెళ్లాం – బోంబే – జనాభా 2.21 కోట్లు. అందులో సగం అక్కడే వున్నట్టున్నారు. చాలా సంతోషంగా తిరుగుతున్నారు – వాతావరణం చల్లగా వుంది. ఎప్పుడైనా వర్షం రావచ్చు – అరేబియా సముద్రం చాలా ప్రశాంతంగా వుంది. ఆ రాత్రి ఆ చిన్ని బాల్కనీలో చాలాసేపు కూర్చున్నా – బోంబే చాలాసార్లు వచ్చాను. '64 నుంచి – 94' వరకు – చాలా ఏరియాలో తిరిగాను. ఇప్పుడున్న వర్లీ అపుడూ వుంది కాని – ఇలా ఆకాశాన్నంటే మేడలు లేవు – అప్పుడ అయిదు అంతస్థులే – లిమిట్. ఇప్పుడు ఎన్ని అంతస్తులు లేచినా అవే రోడ్లు, అవే సెంటర్లు! ఇప్పటికీ మెరైన్ డ్రైవ్ అలాగే వుంది. ఒక్క ట్రైడెంట్ హోటల్ తప్ప – అదీ నారిమన్ పాయింట్.!

వోర్లీలో క్రేన్‌లు ఉదయం 7 గం॥లకే తిరగటం మొదలవుతాయి. ఆదివారం కూడా పనిచేస్తున్నారు – అందుకే బోంబేని ఫైనాన్షియల్ క్యాపిటల్ అంటారు. ఆ మర్నాడు – ఒక మాల్‌కి వెళ్లాం (ఫోనిక్స్ పలాడియమ్) – అది పూర్తిగా బ్రాండెడ్ హైఎండ్ – మినిమమ్ – 10వేలు ఏది కొనాలన్నా – ఒక టీ షర్టు – 25 వేలు – ఒక క్రికెట్ హాట్ 13 వేలు – నేను అర్మానికి వెళ్లాను – (ఈయన ఇటాలియన్ – సెటిల్డ్ ఇన్ పారిస్ డిజైనర్ –ఈ మధ్యనే 97వ సం॥లో దేవతలకు దివ్యాంబరాలు మార్చడానికి వెళ్లాడు) అర్మానీలో జాకెట్ – 3 నుంచి 5 లక్షల వరకూ వుంది! మనకు హైదరాబాద్ – 5 వేలకు మంచి బ్లేజర్ వస్తుంది! అయితే రోహన్ అంటాడు – 'తాతగారు – అంబాని మాల్‌కి వెళ్లాలి – అక్కడ అన్ని లక్షతో స్టార్ట్ అవుతాయి! మనకి లోపలకి వెళ్లటానికి బెరుకుగా వుంటుంది' అని – బోంబే – పశ్చిమ దేశాలకి గేట్‌వే – ఇండియా గేట్‌వే! బంద్రాలో మన్నత్‌కి వెళ్లాం (ఆహ్వానం లేదులెండి)



ఎడమ నుంచి : వార్లీలో ఆకాశ హర్మ్యలు, ఫినిక్స్ పెలోడియమ్, మెరైన్ డ్రైవ్, ట్రైడెంట్ హోటల్, ఎయిర్‌పోర్ట్ బస్సులో మాతోపాటు, దాదర్‌లో ట్రైన్ రెస్టారెంట్, స్వాతిలో చాట్, అరిటాకు అట్టు, బోంబే ఎరైవల్‌లో నేను, అనీల్, రోహన్, పింకి, బే బ్రిడ్జిమీద బెంజ్.లో మేము.

యజమాని లండన్‌లో వుంటాడు - అభిమానులు రోడ్డుమీద వున్నారు - ఆ దగ్గర్లోనే మహబూబ్‌ఖాన్ స్టూడియో వుంది. అదో పాత జ్ఞాపకం. రాజ్‌కపూర్ స్టూడియోని చెంబూరులో - వారసులు - డెవలెప్‌మెంటుకిచ్చారు - గేటు-లోగో అలాగే వుంచమని వేడుకున్నారు. మరో ఇద్దరు వి.ఐ.పిల ఇళ్ళు అక్కడే వున్నాయి (సల్మాన్ ఖాన్, సచిన్ టెండూల్కర్) - ఇళ్లంటే ఇళ్లు కాదు - మల్టీ స్టోరీడు! అక్కడ నుంచి దాదర్ స్టేషన్ వచ్చాం - అసలు సిసలయిన పాత బొంబాయి ఇది - 64లో వచ్చాను. ఇదే - ఏ మార్పు లేదు. అదే జనాభా - అప్పుడు ఆటోలు లేవు. ఇప్పుడు ఆటోలే వున్నాయి. అక్కడ రైల్వే కేఫ్‌లో టీ తాగాం! ఎంత తిరిగినా తనివితీరదు - వూరు తరగదు - పొద్దున్నుంచి భోజనం లేకుండానే తిరుగుతున్నాం. ఆ రాత్రి ఏడు గంటలకు గాలిమేడ - బాల్కనీలో కృష్ణా - రామా అనుకున్నాం! నాలాంటి వానికి ఎక్కడున్నా ఒక్కటే - మన్‌హట్టన్ మేడలు - ట్రావ్‌స్టాక్ పార్కులు - ఫ్రిస్కో హైయత్‌లూ - హాంగ్‌కాంగ్ ఫ్యూరమాలు - షాంగై హైయత్ ఆనబండ్‌లు - బీజింగ్ గ్రీన్ టీ హొటల్, లావోస్ - కంబోడియా ఆత్మీయ అతిధ్యాలు - ఏది ఏదయినా - మనసు నిండదు - తనివి తీరదు - అందుకేనేమో ఎప్పుడూ - ఎడతెగక తిరుగుతుంటాం!! మనల్ని మనమే వెతుక్కుంటూ! మూడోరోజు - సిద్ధి వినాయకుని గుడికెళ్దాం అన్నారు - ఒక్క క్షణం నాకొక జ్ఞాపకం! అంబానీ వెళ్లి వినాయకుణ్ణి - 'ఆప్ కుచ్ చాహియే' అని అడగడం ఓ బొమ్మ చూసిన జ్ఞాపకం! నేను వుండిపోయాను. నాకు డోర్ లాక్ ఎలా తీయాలో పాఠం చెప్పి - ప్రాక్టీస్ చేయించి పింకీ - అనీల్ క్యాబ్‌లో వెళ్లారు. వంటమ్మాయి వచ్చింది - ఈమె అస్సామీ - మరాఠీ వీరుణ్ణి చేసుకుంది. ఏమీ చదవకపోయినా నాలుగు భాషలొచ్చు. మూడురోజులూ రుచిగా వండిపెట్టింది - బట్టలు వుతికి - ఇల్లు శుభ్రం చేసి - అన్నీ సర్ది - వెళ్లేప్పుడు వచ్చి నాకు పాదాభివందనం చేసింది! ఆశీర్వచనం - ఆర్థికం ఇచ్చి పంపాను! ఏదయినా నగరాన్ని బట్టే నాగరకత వుంటుంది! అనీల్ వచ్చి - బాబాయ్ పింకీకి 'స్వాతి'లో చోలే బటూరి, పావ్‌బజీ తినాలని నిన్నటి నుంచే అంటోంది - వెళ్దామా - అన్నాడు - అది - ఎయిర్‌పోర్ట్‌కి - ఆపోజిట్ రూట్‌లో వుంది. టైమ్ సరిపోతే అలాగే అన్నా - ఓ అరగంట ముందె బయలుదేరాం - కాబ్ డ్రైవర్‌కి ముందే రూట్ చెప్పాం - ఎయిర్ పోర్ట్ టైమ్ చెప్పాం - తీసుకెళ్తానని - "స్వాతికి" చేర్చాడు - అప్పుడు పింకీ - ముఖం చూడాలి! అసలే పింకీ - సంతోషంతో బీట్‌రూట్‌లా అయిపోయింది! ఇంక లోపల - 'స్ట్రీట్ ఫుడ్ రెస్టారెంటు" అని వుంది! కొంతమంది తెల్ల టూరిస్టుల్లా వున్నారు. అంటే ఇది ఒక లాండ్‌మార్క్! అక్కడ మనకి తెలియనివి ఎన్నో వున్నాయి. అయితే పింకీకి అన్నీ తెలుసు - కాని అరిటాకుల్లో పెట్టడం నాకు ఆశ్చర్యం - ఇదే సాంప్రదాయం అంటే! ఫోటోలుతీసాను - మీకు చూపాలి కదా!

ఎయిర్‌పోర్ట్‌కి రావటానికి కదలని కార్లతో గంట పైగా పట్టింది - మమ్మల్ని టర్మినల్ 1లో దింపి, పింకి టర్మినల్ 2కి వెళ్లింది - భిలాయి విమానం కోసం - డిపార్చర్ - బెజవాడ బస్‌స్టాండ్‌లా వుంది - ఈసారి సమస్యలేవీ లేవు సమయానికే బయల్దేరి గంటలో వచ్చేశాము - భాగ్యనగరానికి! అదండీ బొంబాయి జర్నల్!

ఇంటికొచ్చిన తరువాత ఒక టవల్, ఒక సాక్స్ మర్చిపోయావు అని మా ఆడిటర్ అంది.

**- అశ్వినీకుమార్**

## అహింస

**– దాదా హయత్**

'అహింస' కథ ప్రచురణ జరిగేవరకూ దాదా హయత్ పేరు కొద్దిమందికే తెలుసు. అహింస అచ్చుకాగానే అతని పేరు కథాలోకం గుర్తుపెట్టుకుంది. ఒక్క కథతో అంతటిగుర్తింపు సాధించటం విశేషం. చాలామంది దృష్టికి రాని ఓ జీవిత శకలం అహింస. కుటుంబం, పిల్లల అనుబంధం విశ్వవ్యాప్త విషయం. పెద్దా చిన్నల ఆ అనుబంధం, మనోరీతుల ప్రతిబింబమే అహింస. అంతకు ముందురోజు ఆదివారం. ఆరేళ్ళ చంటి స్కూల్లో చేరి అప్పటి రెండు నెలలే అయింది. ముందురోజు ఆదివారం, స్కూలుకి శెలవేమో, ఒళ్ళు తెలియకుండా ఆటలాడాడు. తెల్లారేటప్పటికి అలసట, బద్ధకం. స్కూలుకి వెళ్ళాలనిపించలేదు. బద్ధకంగానే కాస్సేపు గడిపాడు.


నెమ్మదిగా వంటింట్లో ఉన్న తల్లి దగ్గరకి వెళ్ళి, గారాలు పోతూ స్కూలుకి వెళ్ళనని తల్లికి చెప్పాడు. ఏం? అంది. చంటి జవాబు చెప్పలేదు. ఆ రోజుకి స్కూలు మానేయాలని బలంగా ఉంది. నాన్నని అడుగు అంది. చంటి గుండెల్లో రాయి పడింది. తండ్రి దగ్గర జరిగే పనికాదు. అలాగే తల్లివెనకే గారాలుపోయాడు. అలాగేలే, ఇంట్లో కూచుని చదువుకో అంది, చివరికి. చంటికి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. పెద్ద ఇబ్బంది తొలగిపోయి, తేలికైనట్టుంది. సంతోషంతో గంతులేశాడు. సాయంత్రం దాకా రకరకాలుగా గడిచింది. అక్క స్కూలుకి, తండ్రి ఆఫీస్‌కి వెళ్ళిపోయారు. వాళ్ళకి శెలవ రోజైతే అది వేరు. అక్కతో రకరకాల ఆటలాడచ్చు. తండ్రి మంచి మంచి కథలు చెపుతాడు. ఆరోజు అవిలేవు. ఒంటరితనం విసుగెత్తింది చంటికి. ఇంట్లోంచి వీధిలోకి, మళ్ళీ ఇంట్లోకి, అక్కడ నుంచి పెరట్లోకి తిరిగాడు. రకరకాల ప్రయత్నా చేశాడు. ఆదివారంలా లేదు. సాయంత్రం దాకా అలాగే గడిచింది. స్కూలు, స్కూలు టీచర్, ముచ్చట్లు, ఆటలు గుర్తొచ్చాయి. అవన్నీ మిస్ అయిన బాధ కలిగింది.

తండ్రి, అక్క ఇంటికొచ్చాక కొంతనయం. ఎంతైనా ఆదివారపు పాత హుషారు మాత్రం లేదు. పడుకునే ముందు తల్లితో "అమ్మా రేపు తొందరగా లేపు. తయారై స్కూలుకెళ్ళాలి అన్నాడు. ఓ మానసిక క్లిష్టయాత్ర పూర్తయింది. ఓ చిన్న విషయం ఓ పసివాడి మనసుని ఎంతగా అతలాకుతలం చేస్తుందో చూపించిన కథ అహింస. పసి మనసుల బాధే హింస, వాళ్ళు ఊరట చెందటమే అహింస. మామూలు కథలకి భిన్నమైన కథ. చిన్న కథ, నూతన శిల్పం, కొత్త దృక్కోణం వెరసి అహింస కథ నిత్యనూతనం.

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్, ఫోన్ : 9394738805

## దాశరథి కవితాపయోనిధీ

*ప్రజాకవి దాశరథి శతజయంతి సంవత్సరమిది. ఈ సందర్భంగా ఆయన నిష్కళంక దేశభక్తిని, కష్టజీవి పై ఆయనకున్న ప్రేమను, నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న ఆయన స్వచ్ఛమైన అభిమానాన్ని ఎవరూ మరచిపోరు. దాశరథి నూరేళ్ళ పండగ ముగింపు సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం వారు వారి సమస్త రచనలనుంచి ఎంపిక చేసిన నూరు ఆణిముత్యాల్లాంటి కవితా ఖండికలను దాశరథి కవిత శీర్షికన ప్రచురించారు.*




***గతాన్ని కాదనలేను / వర్తమానాన్ని వద్దనబోను / భవిష్యత్తు వదులుకోను***


*కాలం నా కంఠమాల అని నినదించిన కవి దాశరథి తన జీవితాన్ని, కవిత్వాన్ని దేశంకోసం ధారపోశారు..రచన, వ్యక్తిత్వం వేర్వేరు కాని అరుదైన వ్యక్తి ఆయన.. పద్యం, గేయమే కాకుండా వచన కవిత, అనువాదం, సినిమా, కథ, నవల, పాట వంటి అనేక ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసిన వాడు దాశరథి. గజల్ ప్రక్రియను తెలుగు వారికి తొలిసారిగా పరిచయం చేసిందీ దాశరథే.. నిజానికి దాశరథి రచనలన్నీ సమగ్ర సాహిత్యంగా వెలువడాల్సిన సమయమిది.. అది ఒక భాషా నిలయపు శక్తికి మించిన పని.. కానీ ప్రతిఏటా ఆయన పేరున ఒక కవికి పురస్కారం ప్రకటించే ప్రభుత్వం ఆ పనికి పూనుకుంటే తెలుగు పాఠకలోకానికి అంతకు మించిన ఆనందమేముంటుంది.. అయితే ప్రభుత్వం ఆ పనికి పూనుకునేందుకు శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం పెద్దలు నడుం బిగిస్తే అదేమంత పెద్ద పనికాదు.*

***- మిసిమి***

# పంచభూతాలపై పద్యగంధం

కొన్ని పుస్తకాలు చదవటానికి చాలా కష్టంగా ఉంటాయి.కొంచెం క్లిష్టంగా కూడా ఉంటాయి.. ఇంచుమించుగా ఒక ప్రహేళికలా , అర్థం కాని ప్రియురాలి ఆలోచనలా ఉప్పెనై చుట్టేస్తాయి..నిప్పులా కాల్చేస్తాయి.. ఎక్కడో ఒక చిన్న ఆధారం దారమై దొరుకుతుంది.. అది సావకాశతను కల్పించి తలపై ఆశీర్వాక్షతలు చల్లి సాగమంటుంది..

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారి సాంద్రమైన ఒండ్రు మట్టి లాంటి పంచవటి (పంచభూత తారావళులు) పద్యకృతి అలాంటిదే..ఈ పద్యకృతి ఆకృతి తెలుసుకోవటానికి ఏల్చూరి మురళీధరరావు గారి పంచవటీ పంచామృతం తోడ్పడింది.. తోడుగా నిలిచింది.. ఇంతకీ తారావళి ప్రక్రియ ఆంధ్రులు సంస్కృత కావ్యక్రియా కల్పంలోనికి ప్రవేశపెట్టిన ప్రక్రియని తెలిసి ఆశ్చర్యపోయాను. తారావళి అంటే ఇరవైఏడు పద్యాల లఘుప్రబంధం అనుకోవచ్చు. విద్యానాధుని ప్రతాపరుద్రీయం దీనిని పరిచయం చేసింది.. తారావళి భారతీయుల ఖగోళ విజ్ఞానాన్ని ప్రతిబింబించే ఒకే ఒక్క సాహిత్య ప్రక్రియ.. ఇరవై ఏడు నక్షత్రాలకు 27పద్యాలను కూర్చి ఒక సమాపక శ్లోకం కూడా చేర్చటం ఆచారమైంది. నిజానికి తారలు ఇరవై ఎనిమిది. ఉత్తరాషాఢ, శ్రవణనక్షత్రాల నడుమనున్న అభిజిత్ తొలగించి ఇరవై ఏడు చేశారు. అలా సమాపక పద్యాన్ని చేర్చటం ఆచారమైంది. అదే సత్యనారాయణ గారు పాటించారు.. రాసుల ఉనికిని మొదటిసారి  అన్నమయ్య ప్రస్తావించారు.. 'ఇన్ని రాశుల ఉనికి...' అని అలివేలు మంగమ్మను స్తుతించారు కదా! సత్యనారాయణ గారు స్వతహాగా గణిత, భౌతిక, తర్కశాస్త్ర ఆచార్యులవటం, ఈ ఖగోళ విజ్ఞాన ప్రక్రియనెంచుకోవటం కాకతాళీయంగా జరిగి ఉండవచ్చేమో కానీ పంచభూతాలపై సాగిన వారి సృజన పావక వృత్త తారావళి (అగ్ని), సుజలవృత్త తారావళి (నీరు), వసుంధరా వృత్త తారావళి (నేల), అంతరిక్ష వృత్త తారావళి (ఆకాశం), సమీర వృత్త తారావాళి (వాయువు)లతో కలిసి పంచవటీయ తారావళీ సంపుటంగా ప్రకటింపబడింది..



నిజానికి పంచవటి అంటే మర్రి, రావి, మేడి, మారేడు, ఉసిరిక చెట్లున్న ఆరోగ్యవటి.. ఈ వృక్ష సంపద మహిమను వారు సుజల వృత్త తారావళిలో ఎలా వర్ణించారో చూడండి..

**జీవోత్పత్తివివృద్ధి–వ్యాపక మహాక్షేత్రంబు సర్వంసహా / వైవిధ్యాద్భుత సృష్టిసంభృతము భాస్వత్ సుప్రభాకల్పిత**
**శ్రీ వల్లీ ఫలవృక్ష పర్వత నదీ సింధూజ్వలంబైన యీ / శీవిన్ పృథ్వికి సాటి లేదు గ్రహకోటిన్ సౌరలోకంబునన్**

నిజానికి ఈ పద్యాలన్నీ విజ్ఞానాన్ని, ఆర్షజ్ఞాన దీప్తిని అనుసంధానిస్తూ సాగుతాయి.. నిలుస్తాయి.. మత్తేభ, శార్దూలాలై తెలుగు పద్య ప్రౌఢిమను వెల్లడి చేస్తాయి ఈ పద్యాలు.. పంచభూతాలను పరిచయం చేసే క్రమంలో ఒక క్రమపద్ధతిని పాటిస్తారాయన. వసుంధరా వృత్త తారావళి లో చివరి పద్యం ఆ విషయాన్ని విశదపరుస్తుంది..

**ఘన సూర్యగ్రహమండలంబున నవర్ఘం, బేకమున్, సత్వ జీ/వన సంభావ్యము, సర్వతోముఖ సరస్వంతంబు, సస్యాశ్రయం**
**బును, శీతోష్ణసమిశ్రమ స్థితిసమాపూర్ణస్వతస్స్వాదువున్/జననిన్ దివ్య వసుంధరన్ తలచెదన్ సద్భక్తి విశ్వంభరన్(27)**

ఈ ఒక్క పద్యంతో సౌరమండలాల ఆవిర్భావం నుంచి, భూమి అమ్మతనం వరకు ఉన్న అంశాలను ప్రతిఫలిస్తారు సత్యనారాయణ గారు.ఇది వారి కావ్యనిర్మాణ శైలిని సూచిస్తుంది. అంతరిక్ష వృత్త తారావళిలో వారేమంటారో పరిశీలిస్తే ఖగోళ సంబంధిత అంశాల క్రమగతిని, పరిణామాలను వివరిస్తారు..సంశయాలున్నచోట నివృత్తి చేస్తారు..

**ధరణిన్ విశ్వపు కేంద్రబిందువుగ మేధావుల్ సహస్రాది వి/త్సరముల్ నమ్మిరి కానిబీ మధ్యయుగ తత్వజ్ఞుండు కోపర్నికస్**
**పరమాశ్చర్యకరంబుగా పృధివియే భాస్వంతు తా చుట్టుచున్ /తిరుగున్ నిక్క మటంచు తేల్చె,నటుపై దీపించె నవ్యద్యుతుల్**


అటు సంప్రదాయాన్ని కాదనక,ఇటు విజ్ఞానదీప్తులను ఆహ్వానించే హృదయం పద్యకవులకుంటుందని నిరూపిస్తారు వారు..పద్యంలో శబ్దశక్తి, అర్థయుక్తి కలిసి పఠితకు రసరమ్యతను పంచుతాయి.. తద్వారా ఆసక్తిని పెంచుతాయి..పద్యకవులు ఛాందసంలో మునిగి ఉంటారని తెలుగు సాహిత్యంలో ఆధునిక విమర్శకులు ఘోషిస్తుంటారు.. అది అర్థరహితమని అప్పాజోస్యుల వారి తమ "పంచవటి" తో పలికిస్తారు..తమ తారావళులను పరికించమంటారు.. దాదాపు మూడువందల పేజీలున్న ఈ రంగుల గ్రంథం పద్యాన్ని విస్మరించటం కూడదంటుంది.. ఈనాటి ఆధునికులు కాస్త శ్రమ చేస్తే తెలుగు సాహిత్యంలోని పద్య సౌరభాన్ని ఆఘ్రాణించటం నేర్చుకోవచ్చన్న సూచన అంతర్లీనంగా ధ్వనింపచేస్తుంది.. ప్రతి పద్యానికి ఏల్చూరి మురళీధరరావు గారు ఎంపిక చేసిన వర్ణ చిత్రాలు అన్నీ కాకపోయినా కొన్ని అలరిస్తాయి.. పంచభూతాలపై ఈ పద్య తారావళి శాస్త్రం,తర్కాలతో కూడి కొత్తగా పద్యాన్ని నైవేద్యం చేయటం పాఠకుడికో అనుభూతి సేద్యం. *రచన: ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రచురణ: అజో–విభో–కందాళం ఫౌండేషన్, 290*పేజీలు, వెల 400రు., కాపీలకు 040–40179673.

***- సి.యస్.రాంబాబు,*** *(అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్), ఫోన్ : 8374818961*

# చదవండి...

**– మిసిమి**


**నువ్వే ఒక సమూహం - డా. మహమ్మద్ హసేన :** ఇది ఒక కవితా సంపుటి. అన్ని కవితలు పత్రికలలో ప్రచురింపబడినవే. హసేన గారి కవితలన్నీ




సమాజపరంగా, సమాజంలోని ఎగుడు దిగుడుల గురించిన బాధే. అయితే వీరు కొత్తగా చెప్పినవేవీ కనపడట్లేదు. అవే పదాలు, అవే భావాలు. కేవలం పునరావృతమే. అయితే అంతమాత్రం చేత హసేన గారి కవిత్వాన్ని పక్కన పెట్టేయలేం. నువ్వు ఒక్కడివే ఒంటరిననే దిగులు ఒద్దంటారు. సూర్యుడు కూడా ఒంటరివాడే అంటారు. ఎన్నో సమూహాలు నీ ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నా యంటారు. ఇక ఓట్లకై పోట్లాటలు, సమాజంలో లేని రక్షణ చట్ట సభల్లో దొరుకుతుందా? అంటారు. ఒకసారి చదవండి. మీకే తెలుస్తుంది.

*పేజీలు : 82, వెల :150/–, ప్రతులకు : డా. ఎమ్.డి. హసేన, ఫోన్ : 99080 59234 & పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 9848787284.*


**జీవితంపట్ల ప్రేమ - మునిమడుగుల రాజారావు :** ఇది




తాత్త్విక వ్యాసాలని వారే చెప్పారు. వీటిలో చాలావరకు ఈనాడులో వచ్చినవే. ఒక్క ధ్యానం మీదే 14 పైగా వ్యాసాలున్నాయి. దీన్నిబట్టి మనకు అర్థం అవుతుంది ఈ వ్యాస పరంపర అంతరార్థం. వీరు ఇరవై సంవత్సరాల నుంచి తాత్త్విక వ్యాసంగం కొత్తతరం పాఠకులకు అందించాలని ప్రయత్నిస్తున్నారు. అందులో వ్యక్తిత్వ వికాసం ఒక భాగం. మనోవికాసం అంతర్లీనం. జీవితాన్ని ప్రేమించాలంటారు. ప్రేమనే జీవితం చేసుకోవాలంటారు. మంచిదే కదా!

*పేజీలు : 160, వెల :200/–, ప్రతులకు : మునిమడుగుల రాజారావు, ఫోన్ : 9493430130 & పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 9848787284.*


**మనోవిహారి - కస్తూరి రాజశేఖర్ :** ఈ అనువాద కవితలు కస్తూరి పరిమళంగా వర్ణిస్తున్నారు డా.




వత్తిపాక మోహన్. వార్ధక్యం అనివార్యం. మరలా రాని యవ్వనం, మధురానుభూతుల ఘనకార్యం. వీటికి మూలం 'ఎఖోస్ ఆఫ్ లైఫ్' ఆంగ్ల కవితలు. ఇవి అనువాదాలుగా అనిపించవు. మనసుకు హత్తుకునే విధంగా ఉంటాయంటారు మద్దాళి రఘురామ్. ఇవి మానవుడి జీవనయానంలో అనుభవించే పంచపార్శ్వాలకు భావరూపం అంటారు కస్తూరి రాజశేఖర్.

*పేజీలు : 127, వెల :100/–, ప్రతులకు : కస్తూరి నాగేశ్వర రావు, ఫోన్ : 9849330930, 9848378034.*


**ఓమారు వెనక్కి వెళ్లి రావాలి - డా. కె. దివాకరాచారి :** కాలం ఓసారి ఆగిపోతే ఎంతబాగుండునో! జీవితాన్ని గడిపిన మధురానుభూతుల్ని మరోసారి మనసారా




ఆస్వాదించాలి. పాపం, పుణ్యం ఎరుగని బాల్యంలోకి వెళ్లగలమా? అన్నింటికంటే ముఖ్యం బ్రతుకుని ప్రేమించటం. దివాకరాచారి మేల్కొనే ఉన్నారు. ఖడ్గం ధరించే ఉన్నారు. అందుకు వారిని అభినందిస్తున్నాను అంటారు కె. శివారెడ్డి. కవిత్వమంతా జ్ఞాపకమే. పురాస్మృతే అన్నారెవరో. నిజమే ప్రతి ఒక్క అనుభూతి గతంలో ఎవరో అనుభవించిందే. అదే వ్యక్తీకరణంగా, కవిత్వంగా మారుతుంది అంటారు ఎన్. వేణుగోపాల్. డా. కె. దివాకరాచారి పరిణిత మానవుడు. జీవితాన్ని ఏడు దశాబ్దాలు చూసొచ్చినవాడు. తన వ్యాపకాలు,


ఉద్యమాలు, బంధాలు, తిరుగాడిన నేల ఇవన్నీ వీరి కవితలో ప్రతిబింబిస్తాయి. అంటారు కవి యాకూబ్.
*పేజీలు : 168, వెల :150/-, ప్రతులకు : డా. కె. దివాకరాచారి, ఫోన్ : 9391018972 & పాలపిట్ట బుక్స్, హైదరాబాద్, 9848787284.*

**గరం గరం చాయ్ - పొట్టి కథలు - ఆర్.సి. కృష్ణస్వామి రాజు :** ఇది కమ్మని కథల కార్ఖానా. ముడుచుకున్న గుండెల్ని తట్టిలేపి, విప్పారిన నేత్రాలతో చదివించి, విశాల హృదయంతో మసలుకొనేలా చేస్తాయి ఈ కథలు. వీరి రచనలపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. చిన్న కథను ఎంత ఉన్నతంగా చెప్పాలో కృష్ణస్వామికి తెలుసు. చదువరిని కథలో ఉన్న సందర్భంలోకి తీసుకుపోయే శక్తి వీరి శైలికుంది.





*పేజీలు : 168, వెల :100/-, ప్రతులకు : ఆర్.సి. కృష్ణస్వామి రాజు, ఫోన్ : 9393662821.*

**శ్రీవారి పాద పునీత తొండవాడ - గోపీకృష్ణ :** తొండమాన్ చక్రవర్తి పరిపాలించిన రాజ్యాన్ని తొండవాడ అంటారు. గ్రామస్థుల పేర్లు కూడా తొండమాన్ గానే ఎక్కువ ఉంటాయి. ఈ తొండవాడ గ్రామంలో తెలుగు వారి వలసలతో మళ్లీ నిర్మించారు. తిరుపతి, తిరుమల దేవస్థానానికి, అన్నమయ్య పదాలకి తొండమాన్ పేరుతో చాలా సంబంధం ఉంది. రచయిత పేరు సారకాయల కృష్ణారెడ్డి. కలంపేరు గోపీకృష్ణ. ఈయన తొండవాడ నివాసి. తొండవాడ గురించి, వారి వంశం గురించి, వారి ఇరుగుపొరుగు గురించి సుదీర్ఘంగా ఈ పుస్తకంలో వివరించారు. చదివితే చక్కని చరిత్ర తెలుస్తుంది.





*పేజీలు : 104, వెల :100/-, ప్రతులకు : శ్రీ శ్రీనివాస ఆఫ్‌సెట్, తిరుపతి, ఫోన్ : 9849046190.*

**దొరకునా ఇటువంటి సేవ - గోపీకృష్ణ :** ఇది గోపీకృష్ణ చెప్పిన తిరుమల ఇతిహాసం. అలనాటి తిరుమల చరిత్ర గోపీకృష్ణ చెప్తుంటే మనం విస్తుబోయి చూస్తుండవలసిందే. ఆయన వర్ణించే బ్రహ్మోత్సవాలు, ఆయన ఉపాధ్యాయు శిక్షణ, కళ్యాణ వేంకటేశ్వరుని సాంగత్యం, శ్రీనివాస మంగాపురం, మన ఆలయాల చరిత్ర ఇవన్నీ రాయటం ఆయన చేసుకున్న పుణ్యఫలం. గోపీకృష్ణ ఆయా సందర్భాలకి సంబంధించి చారిత్రక మూలాలు అక్కడికక్కడే చెబుతారు. పుస్తకం చదవండి, శ్రీవారి లీలలు చూడండి, తిరుమల సంగతులు తెలియండి, ఆనందించండి.




*పేజీలు : 240, వెల :299/-, ప్రతులకు : ఎస్. కృష్ణారెడ్డి, ఫోన్ : 9849448101.*

**అయిదుగురు గురువుల అపురూప పత్రాలు - గోపీకృష్ణ :** గోపీకృష్ణ గారికి అయిదుగురు గురువులు. మనకు చదువుచెప్పే గురువులు ఎందరో ఉంటారు. జీవిత పాఠాలు చెప్పే గురువులు మరికొందరుంటారు. కాని గోపీకృష్ణ గారికి ఈ అయిదుగురు గురువులు ప్రత్యేకమైనవారు. వారి గురించి క్లుప్తంగా పది పది పేజీలు వారి అనుభవాలు వ్రాసారు. ఆ గురువుల పేర్లు సర్వశ్రీ గురురామదాస్ మహరాజ్, సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, స్వామి ప్రణవానంద, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, ఓమ్ నారాయణ్ మహరాజ్. ఇందులో గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు తప్ప మిగతా నలుగురు ఆధ్యాత్మిక గురువులే అనుకోవాలి. వారు నేర్పిన పాఠాలేవో, వారు రాసిన పత్రాలేవో ఇందులో ఉటంకించారు. అప్పటి కాలంలో వారు రాసిన కార్డు ముక్కలను జాగ్రత్తగా ఏరి, గొలుసుకట్టు వ్రాతలను టి.డి.పి. చేయించి, కొన్ని కనపడీ, కనపడని కార్డు ముక్కలను కూడా పెన్సిల్‌తో వ్రాసిన పత్రాలను కూడా మనతో చదివించాలనే తాపత్రయం గోపీకృష్ణ గారిది. చదివి ధన్యులుకండి.




*పేజీలు : 60, వెల :200/-, ప్రతులకు : గోపీకృష్ణ, ఫోన్ : 9849448101.*

# మిసిమి

**మీరు చందాదారులుగా చేరండి**　　**బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : తపాలా ఖర్చులు పెరిగిన మూలంగా పత్రిక వెల **జనవరి 2026 నుంచి రూ. 60/-** చేయవలసి వస్తున్నది. పాఠకులు సహకరించగలరని ఆశిస్తున్నాం.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),


**Scan QR to Pay**

Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు




నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం




పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు




షెల్లీ జీవిత కథ | కళా కడలిలో కొత్త కెరటాలు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి | ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. **ఫోన్: 994 951 6567.**


Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**